ఈనాడు

విజయవాడ 2-5-2025 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 262

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఈనాడు

విజయవాడ 2-5-2025 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 262

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అమరావతి నిర్మాణానికి పునఃసంకల్పం



నేడు రాజధాని పనులను ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ

ప్రజల ఆకాంక్షల ప్రతిరూపం.. అభివృద్ధి పనులకు శ్రీకారం



రాజధాని పునర్నిర్మాణ వేడుకకు సిద్ధమైన సభా ప్రాంగణం

ఈనాడు - అమరావతి

రాష్ట్ర చరిత్రలో మరో మహోన్నత ఘట్టం శుక్రవారం ఆవిష్కృతమవుతోంది. ఆంధ్రుల ఆశలకు, ఆకాంక్షలకు కేంద్రమైన రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేసింది. పదేళ్ల క్రితం 2015 అక్టోబరు 22న అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగానే అమరావతి పునర్నిర్మాణం మొదలు కానుంది. ఇది రాష్ట్ర చరిత్రలో నవశకం.

రాజధాని అమరావతి విధ్వంసమే లక్ష్యంగా, మూడు రాజధానుల పేరుతో వైకాపా పాలకులు చేసిన కుట్రలకు ఎదురొడ్డి, అమరావతి పరిరక్షణకు 1,631 రోజులపాటు ఎత్తిన జెండా దించకుండా రైతులు చేసిన అలుపెరగని పోరాటానికి ఫలితం ఇది..! కర్ణాటకకు బెంగళూరులా, తమిళనాడుకు చెన్నైలా, తెలంగాణకు హైదరాబాద్‌లా.. సంపద సృష్టికి, ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు కేంద్రంగా రాష్ట్రానికి ఒక ఆధునిక మహానగరం రాజధానిగా ఉండాలన్న ఐదు కోట్ల ఆంధ్రుల కలలు సాకారం కాబోతున్న రోజు ఇది.

పది నెలల్లోనే పట్టాలెక్కిన ప్రగతి..

■ జగన్ ప్రభుత్వం రాజధాని పనుల్ని నిలిపేసి భౌతికంగా చేసిన నష్టం కంటే, అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ను, పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని, విశ్వాసాన్ని దెబ్బతీయడం ద్వారా చేసిన నష్టం చాలా తీవ్రమైంది.

■ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధాని పునర్నిర్మాణానికి నడుంకట్టింది. అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ను, పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించింది.

■ రాజధాని నిర్మాణానికి సంబంధించి అన్ని పనులూ ఏకకాలంలో చేపట్టేలా రూ.77,250 కోట్లతో అంచనాలు సిద్ధం చేసింది. రూ.49,000 కోట్ల పనులకు ఇప్పటికే టెండర్లు ఖరారు చేసింది.

■ కేంద్ర ప్రభుత్వంలో తెదేపా కీలక భాగస్వామిగా ఉండటంతో.. అమరావతి నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తామని కేంద్రం భరోసా ఇచ్చింది. ప్రపంచబ్యాంకు, ఏడీబీలను ఒప్పించి ఆఘమేఘాలపై రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం వచ్చేలా చేసింది. హడ్కో మరో రూ.11 వేల కోట్ల రుణం మంజూరు చేసింది.

■ రాజధాని అమరావతికి రైలు సౌకర్యం కల్పించడానికి ఎర్రుపాలెం-నంబూరు మధ్య 56.53 కి.మీ. మేర రైల్వే లైన్ నిర్మాణానికి రైల్వే బోర్డు రూ.2,047 కోట్లు మంజూరు చేసింది.

■ 189.4 కి.మీ. పొడవున అమరావతి అవుటర్ రింగ్ రోడ్డును రూ.16,310 కోట్లతో చేపట్టేందుకు కేంద్రం ఆమోదించింది. భూసేకరణ ఖర్చును కేంద్రమే భరిస్తుంది.

(మిగతా 6లో)

ఆలోచనతో వస్తే చాలు... పరిశ్రమ పెట్టుకోవచ్చు

- ప్లగ్ అండ్ ప్లే విధానంలో మౌలిక సదుపాయాల కల్పన
- ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యం
- 175 నియోజకవర్గాల్లో పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా ఎంఎస్‌ఎంఈలు
- శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నారంపేటలో సీఎం చంద్రబాబు



నారంపేట సమీపంలో కల్యాణ మండప నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, నెల్లూరు: 'ఎవరైనా పరిశ్రమ పెట్టాలంటే ముందు షెడ్డు నిర్మించాలి. విద్యుత్తు సౌకర్యం ఉండాలి. యంత్రాలు కొని తెచ్చుకోవాలి. ఇదంతా జరిగే సరికి రెండేళ్ల సమయం పడుతుంది. దీనికి స్వస్తి పలికేందుకు ప్లగ్ అండ్ ప్లే విధానం అమలు చేస్తున్నాం. కావాల్సిన షెడ్లు, మౌలిక సదుపాయాలు, విద్యుత్తు సౌకర్యం అన్నీ ఎంఎస్‌ఎంఈ పార్కులో సిద్ధంగా ఉంటాయి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆలోచనతో వస్తే చాలు.. వెంటనే పరిశ్రమలను ప్రారంభించుకోవచ్చు. రుణాలు, రాయితీలను సింగిల్ విండో విధానంలో అందిస్తాం. రాష్ట్రంలో (మిగతా 2లో)

కార్మికులకు మేలు చేయడమే లక్ష్యం

నాలా చట్టం రద్దు, ఉచిత ఇసుకతో లక్షల మందికి భద్రత 2లో

మేడే శుభాకాంక్షలు తెలిపిన సీఎం

క్రైస్తవంలోకి మారిన రోజే.. ఎస్సీ హోదా కోల్పోతారు

- ఎస్సీ, ఎస్టీ చట్టం కింద వారు రక్షణ పొందలేరు
- హైకోర్టు కీలక తీర్పు
- ఓ పాస్టర్ ఫిర్యాదుతో నమోదైన కేసు కొట్టివేత

ఈనాడు, అమరావతి: షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వ్యక్తులు క్రైస్తవంలోకి మారిన రోజే ఎస్సీ హోదాను కోల్పోతారని హైకోర్టు తేల్చిచెప్పింది. వారు ఎస్సీ, ఎస్టీ చట్టం నుంచి రక్షణ పొందలేరని స్పష్టంచేసింది. చర్చి పాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా.. ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టం కింద పలువురిపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని తప్పుపట్టింది. చట్టాన్ని దుర్వినియోగం చేసి తప్పుడు ఫిర్యాదు ఇచ్చారని ఆక్షేపించింది. పోలీసులు ఛార్జిషీట్ వేయకుండా ఉండాల్సిందని అభిప్రాయపడింది. కేసును కొట్టేసింది. న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఈ మేరకు ఇటీవల తీర్పు ఇచ్చారు.



■ తనను కులం పేరుతో దూషించి, దాడి చేసి గాయపరిచారని ఉమ్మడి గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన పాస్టర్ చింతాడ ఆనంద్ 2021లో చందోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఎ.రామిరెడ్డి మరో ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ చట్టంతో పాటు ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ గుంటూరు ఎస్సీ, ఎస్టీ కోర్టులో పెండింగ్‌లో ఉంది. కేసును కొట్టేయాలంటూ నిందితులు 2022లో హైకోర్టులో పిటిషన్ వేశారు. (మిగతా 6లో)

రేపటి నుంచి గ్రూప్-1 ప్రధాన పరీక్షలు

ట్యాబ్‌ల ద్వారా ప్రశ్నపత్రాల అందజేత

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గ్రూప్-1 (2023) ప్రధాన పరీక్షలను శనివారం నుంచి నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) తెలిపింది. విశాఖ, విజయవాడ, తిరుపతి, అనంతపురంలోని 13 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 4,496 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాయబోతున్నారని పేర్కొంది. విశాఖలో 1,190 (మిగతా 6లో)

'ఉపాధి' శ్రామికులకు ప్రమాద పరిహారం పెంపు



మృతి చెందినా, తీవ్ర అంగవైకల్యానికి గురైనా రూ.2 లక్షల సాయం

మృతుల కుటుంబాలకు కేంద్ర బీమా పథకాల కింద మరో రూ.2 లక్షలు

'ఉపాధి శ్రామికుల ఆత్మీయ కలయిక' సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటన 12లో



అదృష్టం అంటే.. వాటన్నింటి కలయిక

అదృష్టం అంటే మిమ్మల్ని యాదృచ్ఛికంగా వరించేది కాదు! మీరేం పని చేస్తున్నారు.. ఎంతకాలం పట్టుదలతో దాన్ని కొనసాగిస్తున్నారు.. ఎలా చేస్తున్నారు.. ఎందుకోసం చేస్తున్నారు.. వీటన్నింటి కలయికే అదృష్టం! అవన్నీ బాగుంటే మిమ్మల్ని అదృష్ట లక్ష్మి తప్పకుండా వరిస్తుంది.

- వాలెస్ మిల్లర్, కంటెంట్ క్రియేటర్







శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నారంపేట ఎంఎస్‌ఎంఈ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ◆ హాజరైన ప్రజలు ◆ పార్కు పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆలోచనతో వస్తే చాలు... పరిశ్రమ పెట్టుకోవచ్చు

(మొదటి పేజీ తరువాయి)

ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని నారంపేటలో పైలాన్‌ను ఆవిష్కరించి ఎంఎస్‌ఎంఈ పార్కును ముఖ్యమంత్రి ప్రారంభించారు. అక్కడి నుంచే మరో పది నియోజకవర్గాల్లోని ఎంఎస్‌ఎంఈలకు, 39 ఎంఎస్‌ఎంఈ పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేశారు. అక్కడే ఏర్పాటు చేసిన ప్రజావేదికపై నుంచి ప్రజలతో మాట్లాడారు. 'నెల్లూరులో పరిశ్రమల ఏర్పాటుకు మంచి వాతావరణం ఉంది. పరిశ్రమలతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయి. నారంపేట ఎంఎస్‌ఎంఈలోని 173 ఎకరాల్లో రూ.37 కోట్లు ఖర్చు చేస్తే 388 పరిశ్రమలు వస్తాయి. రూ.250 కోట్ల పెట్టుబడులతో పాటు.. 2,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. వ్యవసాయం, సేవారంగం తర్వాత ఆదాయం తెచ్చేది పారిశ్రామిక రంగం. అందుకే రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం' అని చెప్పారు. జాతీయ రహదారి పక్కన భూములున్న రైతులు పారిశ్రామికవేత్తలుగా మారొచ్చని, వారు పార్కులు ఏర్పాటు చేస్తే అన్ని సదుపాయాలనూ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. 2027-28 నాటికి 15 వేల ఎంఎస్‌ఎంఈ యూనిట్లు నెలకొల్పేలా చూడటంతో పాటు 2 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

కార్మికులకు న్యాయం చేసేందుకు పునరంకితం

'వచ్చేదారిలో కల్యాణ మండపం నిర్మాణమవుతున్న చోట భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడాం. వారి ఇబ్బందులను తెలుసుకున్నాం. కార్మికుల హక్కులు, భవిష్యత్తును కాపాడతాం. మే డే రోజు సంఘీభావం తెలపడంతో పాటు వారికి న్యాయం చేసేందుకు పునరంకితమవుతాం. తెదేపాను ప్రకటించినప్పుడు... జెండాలో నాగలి, చక్రం, గుడిసె చిహ్నాలు ఎన్టీఆర్ చేర్చారు. అందులో చక్రం కార్మికులకు గుర్తు. ఇలా ఏర్పాటు చేసిన ఏకైక పార్టీ తెలుగుదేశమే' అని చంద్రబాబు తెలిపారు. కార్మికుల వైద్య సేవల కోసం గుంటూరు, శ్రీసిటీల్లో 100 పడకల ఆసుపత్రులు, కర్నూలులో 30 పడకల ఆసుపత్రులు నిర్మిస్తున్నామన్నారు.

నా రాజధాని అమరావతి అని చెప్పుకొనేలా చేస్తాం

'ప్రస్తుతం అమరావతికి కళాశాలలు, కేంద్ర కార్యాలయాలు, పార్కులు వచ్చాయి. రాజధానిలో భూముల ధరలు పెరిగాయి. రాబోయే రోజుల్లో నా రాజధాని అమరావతి... అని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకొనేలా తీర్చిదిద్దుతాం. అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కింద పెద్ద కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. దీంతోపాటు ఉత్తరాంధ్ర మూడు జిల్లాలకు విశాఖపట్నం, గోదావరి జిల్లాలకు రాజమహేంద్రవరం, గుంటూరు, కృష్ణాలకు విజయవాడ, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరులకు తిరుపతి, అనంతపురం, కర్నూలు, కడపలకు అనంతపురంలో రీజినల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా పారిశ్రామికవేత్తలను అకడమిక్ కళాశాలలకు అనుసంధానిస్తున్నాం. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత ఉద్యోగాలు సాధించడం కాదు.. ఇచ్చే స్థాయికి ఎదగాలి' అని చంద్రబాబు ఆకాంక్షించారు. 'చాలా మంది దంపతులు... పిల్లల్ని కనడం మానేస్తున్నారు. దీంతో జనాభా తగ్గిపోతోంది. చాలాదేశాలు ఈ ఇబ్బందిని ఎదుర్కొంటున్నాయి. పిల్లలు ఎక్కువగా ఉన్న కుటుంబాలను గౌరవిస్తాం. వారికి అండగా ఉంటాం. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే.. వారందరికీ తల్లికి వందనం కింద రూ.15 వేల చొప్పున ఇచ్చే కార్యక్రమాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తున్నాం' అని సీఎం చెప్పారు.

పేదరికం లేని సమాజం కోసం..

'బీదల బాగు కోసం బంగారు కుటుంబం.. మార్గదర్శి.. కార్యక్రమం తీసుకొచ్చాం. రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలను గుర్తించాం. 5 నుంచి 10 లక్షల మంది మార్గదర్శులను గుర్తించి, పేదలను దత్తత తీసుకోవాలని కోరుతున్నాం. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మొదటిసారి కుల గణన చేయబోతున్నారు. ఆ లెక్కలను పేదరికం వివరాలను జోడించి.. ప్రణాళికలు రూపొందిస్తాం. 'పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేస్తాం' అని చంద్రబాబు చెప్పారు.

◆ అంతకు ముందు సీఎం చంద్రబాబు ఆత్మకూరు మండలం నెల్లూరుపాళెం ఎస్టీ కాలనీలో చలంచర్ల సునీతకు వితంతు పింఛను అందించారు. ఆమెకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇప్పిస్తామని, ఆమె పెద్ద కుమార్తె చైతన్యను గురుకుల పాఠశాలల్లో చేర్పించి చదువు చెప్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.



నెల్లూరుపాళెం ఎస్టీ కాలనీలో చలంచర్ల సునీత కుటుంబసభ్యులతో సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

కార్మికులకు మేలు చేయడమే లక్ష్యం

కార్మికులకు మేలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నాలా చట్టం రద్దు, ఉచిత ఇసుక విధానం, భవన నిర్మాణాలు, లేఅవుట్లకు అనుమతుల్ని సరళతరం చేయడం వంటి నిర్ణయాలతో ఇప్పటికే నిర్మాణ రంగాన్ని నిలబెట్టి, లక్షలాది జీవితాలకు భద్రత కల్పించామని తెలిపారు. కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక, కర్షకులకు గురువారం ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలిపారు. ఎంఎస్‌ఎంఈ పార్కులు, పరిశ్రమల ఏర్పాటుతో పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని పునరుద్ఘాటించారు. 'శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఎందరో మహానుభావులు చేసిన పోరాటాల ఫలితంగా కార్మిక లోకంలో చైతన్యం వెల్లివిరిసింది. కార్మికులు తమ హక్కుల్ని సాధించుకున్న రోజు మేడే' అని వివరించారు.

జస్టిస్ మన్మథరావు బదిలీకి రాష్ట్రపతి ఆమోదం

నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర న్యాయశాఖ

ఈనాడు, దిల్లీ: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావును కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయాలని గత నెల 19న సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 222(1)కింద ఉన్న అధికారాలను అనుసరించి రాష్ట్రపతి ఈ అంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించాక.. జస్టిస్ మన్మథరావును కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయడానికి ఆమోదం తెలిపినట్లు నోటిఫికేషన్‌లో న్యాయశాఖ పేర్కొంది.

సీఎంను కలవలేకపోయిన దివ్యాంగుడు



కాళ్లు ఈడ్చుకుంటూ వస్తున్న సుధాకర్



సుధాకర్‌ను పక్కకు తీసుకెళ్తున్న పోలీసు

నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం ఉప్పు పల్లికి చెందిన వెన్నపూస సుధాకర్(34) దివ్యాంగుడు. సరిగా నడవలేడు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో దివ్యాంగ పింఛను మంజూరైంది. వైకాపా ప్రభుత్వ హయాంలో 2021 సెప్టెంబరులో పింఛన్ నిలిపేశారు. గురువారం ఆత్మకూరు వచ్చిన సీఎం చంద్రబాబును కలిసి సమస్య చెప్పుకొందామని, అవస్థలు పడుతూ ఎంఎస్‌ఎంఈ పార్కు వద్దకు సుధాకర్ చేరుకున్నారు. సీఎం రాకముందే ఆయనను పోలీసులు పక్కకు తీసుకెళ్లారు. సీఎం ప్రసంగం ముగిసేవరకు రోడ్డు పక్కన కూర్చోబెట్టారు. సీఎం వెళ్లిపోయాక సుధాకర్ నిరాశతో ఇంటిబాట పట్టారు.

– ఈనాడు, నెల్లూరు

ఇంటిని నిర్మించి ఇస్తాం

- నలుగురు పిల్లలను చదివించే బాధ్యత సాహో ఫౌండేషన్‌ది
- బంగారు కుటుంబానికి సీఎం చంద్రబాబు హామీ



ముఖ్యమంత్రి చంద్రబాబుతో జ్ఞానమ్మ కుటుంబసభ్యులు, మార్గదర్శి నాగేశ్వరరావు. చిత్రంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, ఎన్ఎండీ ఫరూక్ తదితరులు

ఈనాడు, నెల్లూరు-ఆత్మకూరు, న్యూస్‌టుడే: నారంపేట వేదికపై బంగారు కుటుంబం ప్రాముఖ్యతను సీఎం చంద్రబాబు వివరించారు. అందులో భాగంగా ఎంపికైన ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన జ్ఞానమ్మ కుటుంబం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జ్ఞానమ్మ మాట్లాడుతూ... యానాది సామాజికవర్గానికి చెందిన తనకు భర్త సుబ్రహ్మణ్యం, నలుగురు పిల్లలున్నారన్నారు. భర్త కూలికి వెళ్లి డబ్బు తెస్తేనే ఇల్లు గడుస్తుందని చెప్పారు. లేదంటే పస్తులుండాల్సిందేనని, అడుక్కొచ్చి పిల్లలకు అన్నం పెట్టాల్సి వస్తోందన్నారు. పిల్లలను చదివించుకోవాలని ఉందని చెప్పారు. సాయం చేయాలని కోరారు. చంద్రబాబు స్పందిస్తూ... జ్ఞానమ్మ నలుగురి పిల్లలకూ ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.4 లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేస్తామని, స్థలం మంజూరు చేయడంతో పాటు ఇల్లు కట్టించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. పిల్లలకు విద్యనందించే బాధ్యతను మర్రిపాడుకు చెందిన సాహో ఫౌండేషన్ నిర్వాహకులు నాగేశ్వరరావుకు అప్పగించారు.

కొన్ని జిల్లాలకు భారీ వర్ష సూచన

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో కొద్దిరోజులుగా భిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల తీవ్ర ఎండలు కాస్తుంటే, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ప్రకాశం, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. విశాఖపట్నం, అనకాపల్లి, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, కర్నూలు, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 42.5 డిగ్రీల మధ్యలో నమోదయ్యే అవకాశముంది. గురువారం ప్రకాశం జిల్లా దరిమడుగులో 42.4, ఖాజీపేట (వైఎస్సార్ కడప)లో 42.1, పూతనవారిపల్లె (అన్నమయ్య)లో 41.3, రుద్రవరం (నంద్యాల)లో 41.2, సత్యవేడు (తిరుపతి)లో 40.9, పొదలకూరు (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు)లో 40.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రకాశం, వైఎస్సార్ కడప, చిత్తూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా సాయంత్రం 6 గంటల వరకు ప్రకాశం జిల్లా గిద్దలూరులో 54 మి.మీ. వర్షపాతం నమోదైంది.

అమరావతి రైల్వేలైన్‌కు 12 గ్రామాల్లో పెగ్ మార్కింగ్ పూర్తి

- 8 మండలాల్లోని 22 గ్రామాల్లో భూసేకరణ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి మీదుగా నిర్మిస్తున్న ఎర్రుపాలెం-నంబూరు రైల్వే లైన్‌కు సంబంధించి భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయనున్నారు. ఇప్పటికే 12 గ్రామాల పరిధిలో క్షేత్రస్థాయిలో పెగ్ మార్కింగ్ (రైల్వే లైన్ వెంబడి వేసే మార్కింగ్)ను పూర్తిచేశారు. తొలుత ఎన్టీఆర్ జిల్లా పరిధితోపాటు తెలంగాణలోని ఎర్రుపాలెం మండల పరిధిలో భూసేకరణ పూర్తిచేసి ఎర్రుపాలెం నుంచి అమరావతి వరకు 27 కి.మీ. మేర మొదటి దశ పనులు చేపట్టనున్నారు. మొత్తం 56.53 కి.మీ. మేర ఉన్న ఈ రైల్వే లైన్ కోసం 8 మండలాల్లోని 22 గ్రామాల పరిధిలో భూమిని సేకరిస్తున్నారు.

ఎన్టీఆర్, పల్నాడుల్లో ఎక్కువ భూములు

తెలంగాణలోని ఖమ్మం పరిధి ఎర్రుపాలెం మండలంలో 24.24 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో 334.62 ఎకరాలు, పల్నాడు జిల్లాలో 333.95 ఎకరాలు, గుంటూరు జిల్లాల్లో 199.43 ఎకరాలు సేకరిస్తున్నారు.

- ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూమిలో ప్రైవేటు భూములు 741.8 ఎకరాలు, ప్రభుత్వ భూములు 98.2 ఎకరాలు, ఇనాం భూములు 52.01 ఎకరాలు ఉన్నాయి.
- ఏయే మండలాల్లో భూసేకరణ కొలిక్కి వస్తుందో, వాటికి సంబంధించి త్వరలో రైల్వే శాఖ డబ్బులు డిపాజిట్ చేయనుంది.
- అమరావతి, తుళ్లూరు, తాడికొండ, పెదకాకాని మండలాల్లోని కొన్ని గ్రామాల్లో రైతుల నుంచి అభ్యంతరాలు ఉండటంతో పెగ్ మార్కింగ్ జరగలేదు. రెవెన్యూ అధికారుల చర్చలు కొలిక్కి వచ్చాక అక్కడా పెగ్ మార్కింగ్ పూర్తిచేయనున్నారు.
- మొత్తంగా ఈ ప్రాజెక్టుకు కేంద్రం రూ.2,047 కోట్లు వెచ్చిస్తోంది.


రైల్వే లైన్ వెళ్లే మండలాలు.. అందులోని గ్రామాలివి

- ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని ఎర్రుపాలెం, కేసిరెడ్డిపల్లి
- ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలంలోని గూడెం మాధవరం, పెద్దాపురం, అల్లూరు, చెన్నారావుపాలెం, జుజ్జూరు, నరసింహారావుపాలెం.
- కంచికచర్ల మండలంలోని గొట్టుముక్కల, పరిటాల
- ఇబ్రహీంపట్నం మండలంలోని చిలుకూరు, దాములూరు
- పల్నాడు జిల్లాలోని అమరావతి మండలంలో వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి
- తుళ్లూరు మండలంలోని వడ్డమాను, మోతడక
- తాడికొండ మండలంలోని పెదపరిమి, తాడికొండ, కంతేరు
- పెదకాకాని మండలంలోని కొప్పురావూరు, పెదకాకాని గ్రామాలు

'కులగణన చేపట్టడం హర్షణీయం'

ఈనాడు, అమరావతి: త్వరలో జనాభా లెక్కలతో పాటు కులగణననూ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నూకానమ్మ అన్నారు. ఇది ప్రజల సమ్మిళిత అభివృద్ధికి నాంది పలుకుతుందని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కులగణన వల్ల అణగారిన వర్గాలకు మేలు జరుగుతుందని, రాజ్యాంగ ఫలాలు, హక్కులు అన్ని వర్గాలకు దక్కుతాయని వెల్లడించారు. అందుకు ప్రధాని మోదీకి జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరఫున ధన్యవాదాలు చెబుతున్నట్లు పేర్కొన్నారు.

ఇదీ సంగతి!




గ్రహం అనుగ్రహం

2-5-2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం;
వసంత రుతువు, వైశాఖ మాసం, శుక్లపక్షం
పంచమి: మ. 2-41 తదుపరి షష్ఠి; ఆర్ద్ర: సా. 6-22 తదుపరి పునర్వసు
వర్జ్యం: లేదు, అమృత ఘడియలు: ఉ. 8-44 నుంచి 10-16 వరకు
దుర్ముహూర్తం: ఉ.8-09 నుంచి 8-59 వరకు, తిరిగి మ.12-21 నుంచి 1-12 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5.38; సూర్యాస్తమయం: సా.6.15
జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య జయంతి

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కడప	45.0	28.0
రాజమహేంద్రవరం	41.0	26.0
కర్నూలు	40.6	28.2
గుంటూరు	40.0	28.0
అనంతపురం	39.7	27.2
తిరుపతి	39.2	29.0
తాడేపల్లిగూడెం	38.8	27.6
నెల్లూరు	38.5	28.8
విజయవాడ	37.4	25.4
ఒంగోలు	36.4	29.1
విజయనగరం	36.0	24.0
విశాఖపట్నం	33.2	24.2
శ్రీకాకుళం	33.0	25.0



సిట్ కస్టడీకి రాజ్ కెసిరెడ్డి

• నేటి నుంచి వారం రోజులపాటు విచారణ

• ఆదేశాలిచ్చిన ఏసీబీ న్యాయస్థానం

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో నాటి ప్రభుత్వ పెద్దల తరఫున అన్నీ తానై వ్యవహరించిన ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డిని వారం రోజులపాటు సిట్ కస్టడీకి ఇస్తూ విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఆయన్ను శుక్రవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకూ సిట్ కస్టడీకి అప్పగించింది. రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య విచారించాలని పేర్కొంది. మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి కెసిరెడ్డి ప్రతినెలా రూ.50-60 కోట్ల మేర ముడుపులు వసూలు చేసి, ఆ సొమ్మంతా నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చేర్చేవారని సిట్ దర్యాప్తులో గుర్తించింది. జగన్ సోదరుడు వైఎస్ అనిల్‌రెడ్డి (జగన్ పెదనాన్న వైఎస్ జార్జిరెడ్డి రెండో కుమారుడు), భారతి సిమెంట్స్‌లో పూర్తికాలపు డైరెక్టర్, జగన్ సతీమణి భారతి తరఫున ఆర్థిక వ్యవహారాలు చూసే గోవిందప్ప బాలాజీ, వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డిల ద్వారా ఈ ముడుపుల సొత్తు మొత్తం జగన్‌కు అందజేసేవారని నిర్ధారించింది. ముడుపులు కొల్లగొట్టేందుకు వీలుగా వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి, ఆ పార్టీ అప్పటి నేత విజయసాయిరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ నాటి ఎండీ వాసుదేవరెడ్డి, ప్రత్యేకాధికారి సత్యప్రసాద్ తదితరులతో కలిసి నూతన మద్యం విధానం రూపకల్పన దగ్గర నుంచి ముడుపుల వసూలు వరకూ ప్రతి దశలోనూ రాజ్ కెసిరెడ్డే కీలకంగా వ్యవహరించినట్లు ఇప్పటికే సిట్ తేల్చింది.

★ మద్యం కుంభకోణం కేసులో అరెస్టైన సజ్జల శ్రీధర్‌రెడ్డి (ఏ6), రాజ్ కెసిరెడ్డి ప్రధాన అనుచరుడు బూనేటి చాణక్య (ఏ8)లను కస్టడీకి ఇవ్వాలంటూ ఇప్పటికే సిట్ పిటిషన్లు దాఖలు చేసింది. వాటిపై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. వారిని కూడా కస్టడీకి ఇస్తే ముగ్గుర్నీ కలిపి విచారించాలని సిట్ భావిస్తోంది.

30 ప్రశ్నలు.. 7 గంటలు

విచారణకు సహకరించని విడదల రజిని మరిది గోపి

ఈనాడు, అమరావతి: పల్నాడు జిల్లా యడ్లపాడులోని శ్రీలక్ష్మి బాలాజీ స్టోన్ క్రషర్ యాజమాన్యాన్ని బెదిరించి డబ్బులు వసూలు చేసిన కేసులో అరెస్టైన మాజీ మంత్రి, వైకాపా నేత విడదల రజిని మరిది విడదల గోపి (ఏ3) ఏసీబీ విచారణకు ఏ మాత్రం సహకరించలేదు. దర్యాప్తు అధికారులు అడిగిన ప్రశ్నలకు బుకాయించేలా సమాధానాలిచ్చారు. రెండు రోజుల పాటు గోపిని కస్టడీకి తీసుకున్న ఏసీబీ అధికారులు.. విజయవాడ గొల్లపూడిలోని ఏసీబీ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విచారించారు. దాదాపు 7 గంటల పాటు 30కి పైగా ప్రశ్నలు సంధించారు. వీటిల్లో ఏ ఒక్క దానికీ గోపి సరైన సమాధానాలివ్వలేదు. ఏ ప్రశ్న అడిగినా అప్పట్లో ఏం జరిగిందో తనకు గుర్తులేదంటూ జవాబులిచ్చారు.

★ 'శ్రీలక్ష్మి బాలాజీ స్టోన్ క్రషర్ యాజమాన్య ప్రతినిధులు 2021 ఏప్రిల్ 4వ తేదీ రాత్రి పురుషోత్తపట్నంలోని మీ నివాసంలో కలిసి రూ.2 కోట్లు మీకు ఇచ్చారు కదా' అని ఏసీబీ అధికారులు ప్రశ్నించగా.. ఆ రోజే కాదు.. ఏనాడూ వారు తనను కలవలేదని, డబ్బు ఇవ్వలేదని చెప్పారు.

★ 'రూ.2 కోట్లు మీకు ఇచ్చిన తర్వాత మీ ఫోన్ నుంచే శ్రీలక్ష్మి బాలాజీ స్టోన్ క్రషర్ యాజమాన్యం.. విడదల రజినితో మాట్లాడి డబ్బులిచ్చిన విషయం చెప్పారట కదా' అని అడగ్గా.. అలాంటిదేమీ లేదంటూ దాటవేశారు.

★ సాక్షులిచ్చిన వాంగ్మూలాలు, తమ దగ్గరున్న కాల్ డేటా రికార్డుల్ని చూపిస్తూ గోపిని ప్రశ్నించగా ఆయన నీళ్లు నమిలినట్లు తెలిసింది. తొలి రోజు విచారణలో సరైన సమాధానాలు చెప్పకపోవడంతో శుక్రవారం ఆయన్ను మరింత లోతుగా విచారించాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.

ఏప్రిల్‌లో జీఎస్టీ నికర వసూళ్లలో వృద్ధి

రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ వెల్లడి

ఈనాడు, అమరావతి: గతేడాది ఏప్రిల్‌తో పోల్చితే ఈ ఏప్రిల్‌లో జీఎస్టీ నికర వసూళ్లలో వృద్ధి కనిపించింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో రూ.3,560 కోట్లు నికర వసూళ్ల కింద ప్రభుత్వ ఖజానాకు చేరాయి. గతేడాది అదే నెలతో పోల్చితే వృద్ధి నమోదైనట్లు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు.ఎ వెల్లడించారు. వసూళ్లు పెంచేందుకు, చెల్లింపులకు వ్యాపారస్థులకు సౌలభ్యంగా ఉండేందుకు చేపట్టిన విధానాలతో నికర వసూళ్లు పెరిగినట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

సెలవుల్లో సరదాగా!

చెప్పగలరా?

ఎరుపు రంగు ఉన్నంతసేపు ముందుకెళ్లి, పచ్చరంగు రాగానే ఆగిపోతాం. ఎప్పుడో తెలుసా?



నా ఫ్రెండ్ బుజ్జికి ప్రేమతో..

బుజ్జి.. నా బెస్ట్ ఫ్రెండ్... రోజంతా నాతోనే ఉండేది... ఎన్ని కబుర్లు చెప్పేదో తెలుసా... ఇప్పుడేమో సెలవులు కదా... జైపుర్‌లో వాళ్ల మామయ్య వాళ్లింటికెళ్లింది. అప్పుడప్పుడూ ఫోన్ చేసి మాట్లాడుతున్నా, తనని చాలా మిస్ అవుతున్నా.

బుజ్జి కోసం ఏదైనా స్పెషల్‌గా చేయాలనిపించింది. అందుకు నాకు తట్టిన ఉపాయమేంటో తెలుసా...

నోట్ రైటింగ్...

బుజ్జికి ఇష్టమైన రోజ్ కలర్ షీట్ తీసుకుని తనపై నాకున్న ఇష్టమంతా చక్కటి తెలుగులో రాసేశాను. వాళ్ల ఫ్యామిలీతో కలిసి ఆ మధ్య నేను శ్రీశైలం వెళ్లానులే... అప్పుడు ఎలా ఎంజాయ్ చేశామో కూడా రాసి ఉంచాను. మేం దిగిన ఫొటోలు కూడా అతికించి ఆ షీట్‌ను అందంగా అలంకరించాను. అమ్మ, నాన్నకు చూపిస్తే... భలే ఉందని మెచ్చుకున్నారు. బుజ్జి వస్తే దీన్ని చూసి ఎంత ఆనందపడుతుందో కదా... హలో ఫ్రెండ్స్.. మరి మీకూ బుజ్జిలాంటి మంచి స్నేహితులు ఉంటారు కదా... వారికోసం నాలాగే ప్రయత్నిస్తారా.!

ఇలాగే కార్డుపైనో, పేపర్‌పైనో రాసి దాన్ని వారికి ఇష్టమైన చాక్లెట్లు, స్వీట్‌బాక్స్‌తో పాటు ఇచ్చి సర్‌ప్రైజ్ చేయొచ్చు.

- మీ చిన్ని

ఈ మొక్క నాది!

ఆ రూమ్ నాది..
ఈ బ్యాగ్ నాది...
ఈ సైకిల్ నాది...
అంటాం కదా.
ఈసారి 'ఈ మొక్క నాది' అనుకుందామా!

ఎందుకంటే మొక్కలు పెంచడం చాలా మంచి పని. విత్తు నాటిన దగ్గర నుంచి మొలక వచ్చి, మొక్క పెరిగి, పువ్వులు పూసి, కాయలు కాస్తుంటే ఎంత సంతోషంగా ఉంటుందో. పాదు తీయడం, ఎరువు వేయడం, నీళ్లు పోయడం, ఎండ తగిలేలా చూడటం, ఇలా చాలా పనులుంటాయి. ఇవన్నీ చేశాక.. ఆ మొక్క పెరిగి, పెద్దదై పూలో.. పళ్లో ఇస్తుంటే భలేగా ఉంటుంది. అన్నట్టు ఈ పనిలో అమ్మ, నాన్న సాయం కూడా తీసుకోండేం..



అతుక్కోకండి!

సెలవుల్లో ఇంతకంటే ఏం చేస్తాం అంటూ గంటల తరబడి ఫోన్, ల్యాప్‌టాప్, టీవీలకు అతుక్కుపోతున్నారా? ఇది అస్సలు మంచిది కాదనే విషయం మీకు తెలుసు. అయినా చేయడమంటే మన మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పణంగా పెట్టడమే!

ఒక్కసారి ఈ పక్కనున్న ప్రశ్నలు చూడండి. వీటిలో మూడింటికంటే ఎక్కువ వాటికి 'అవును' అనే సమాధానం వస్తే మనం వెంటనే పద్ధతి మార్చుకోవాలని అర్థం.

1. ఇవాళ ఏం చూడాలి, ఏం పోస్ట్ చేయాలి, వాళ్లెందుకు అలా రియాక్ట్ అయ్యారు.. ఇలా ఆలోచిస్తున్నారా?
2. ఎంతసేపు చూసినా బోర్ కొట్టడం లేదా?
3. అమ్మ, నాన్న కోప్పడితే మర్చిపోవడానికి మొబైల్ చూస్తున్నారా?
4. వాడకం తగ్గించాలి అనుకున్నా సాధ్యం కావడం లేదా?
5. చాలాసేపు చూడకుండా ఉండాల్సి వస్తే ఉండలేకపోతున్నారా?
6. వాటిలో చూసిన అంశాలు మీపై నెగెటివ్ ప్రభావాన్ని చూపిస్తున్నాయని గుర్తించారా?

ఈ ప్రశ్నలకు జవాబులు తెలుసుకుని.. వెంటనే అవసరమైన చర్యలు తీసుకోండి. ఇది మీ వల్ల సాధ్యమవుతుంది!



ఐస్‌క్రీమ్ అడవిలో..

ఇది ఒక ఐస్‌క్రీమ్ అడవి. ఇందులోకి నాలుగు పిల్లులు, రెండు టెడ్డీలు, ఒక డాగీ పిక్నిక్‌కి వచ్చాయి. డాగీ కుకీలు మాత్రమే తింటుంది. టెడ్డీలు ఐస్‌క్రీమ్ తినవు కానీ కుకీలు, చాక్లెట్లు తింటాయి. పిల్లులకి చాక్లెట్ ఇష్టం కానీ లాలీపాప్ నచ్చదు.

ఇప్పుడు వీటికి సమాధానాలు చెప్పండి.

1. డాగీ కోసం ఎన్ని కుకీలు ఉన్నాయి?
2. ఐస్‌క్రీమ్ ఎవరు తింటారు?
3. లాలీపాప్ ఎవరు తినే వీలుంది?
4. వీరికి తెలియకుండా ఒక గుంటనక్క వచ్చేసింది. ఎక్కడుంది అది?



చిన్నారుల కోసం ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఈనెల 5 నుంచి 8 వరకు, తిరిగి 12 నుంచి 15 వరకు రెండు దశల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. 0-6 ఏళ్లలోపు చిన్నారుల కోసం ప్రత్యేకంగా వీటిని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. చిన్నారుల జనన ధ్రువీకరణ ఒరిజినల్ పత్రాలను తల్లిదండ్రులు ప్రత్యేక శిబిరాల్లో చూపించి ఆధార్ నమోదు చేయించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా జనన ధ్రువీకరణ పత్రం పొందిన 1,07,358 మంది చిన్నారులు ఆధార్ నమోదు చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. ఆధార్ ఇప్పటికే నమోదు చేయించుకొంటే అదే విషయాన్ని తెలియజేసి గ్రామ, వార్డు సచివాలయాల్లోని రికార్డుల్లో నమోదు చేయించుకోవాలని అధికారులు సూచించారు.



ఒక్కోసారి ఒక్కో అంశంపై దృష్టిపెట్టండి

అన్ని అంశాల్లో అన్ని వేళలా పురోగమించడం ఎవరికీ సాధ్యం కాదు! ప్రతి వారం, ప్రతి నెలా ఒక్కో అంశాన్ని ఎంచుకొని.. అందులో మెరుగవడంపై దృష్టి పెట్టండి. అందుకోసం బాగా శ్రమించండి. ఏడాదిపాటు ఇదే విధానాన్ని అనుసరించి.. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోండి. పురోగమన బాటలో మీరెంతో దూరం వెళ్లి ఉంటారు.

– లింకన్, లైఫ్ కోచ్

ఈనాడు

యావద్దేశానికీ శుభసూచకం

విశ్వమానవాళి ప్రగతి ప్రస్థానంలో 21వ శతాబ్దపు ప్రత్యేకతను నిర్వచించే ప్రధానాంశాల్లో పట్టణీకరణ అతిముఖ్యమైనది. పలు వ్యాపారాలు, పరిశ్రమలు, సేవారంగ సంస్థలకు నెలవులైన నగరాలు- నిరంతర ఆర్థిక కార్యకలాపాలకు ఆటపట్టులై అసంఖ్యాకులకు జీవనోపాధి కల్పిస్తున్నాయి. ప్రపంచ జీడీపీలో ఎనభై శాతం సంపదను సమకూరుస్తున్న నగరాలే విశ్వవ్యాప్తంగా 88శాతం ప్రైవేట్ ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి. అందుకే పట్టణ ప్రాంతాలకు నానాటికీ వలసలు పోటెత్తుతున్నాయి. 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా ప్రతి పదిమందిలో ఏడుగురు నగరాల్లోనే నివసిస్తారని అంచనా. ఈ క్రమంలోనే పేదరిక నిర్మూలనకు, ప్రజల సమష్టి శ్రేయస్సుకు దోహదపడే నవీన నగరాల నిర్మాణం మీద ప్రపంచ బ్యాంకు ఏడాదికి సగటున 500 కోట్ల డాలర్ల మేర పెట్టుబడులు పెడుతోంది. దేశీయ ప్రగతికోసం నగరాలూ వాటి శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలంటున్న 'నీతిఆయోగ్'- ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణతోనే 'వికసిత భారత్' లక్ష్యాన్ని చేరుకోగలమని ఉద్ఘాటిస్తోంది. అందువల్ల స్వాతంత్ర్యానంతరం దక్షిణాదిన తొలి నవ నగరంగా అమరావతి నిర్మాణ పనులు నేడు ప్రధాని మోదీ చేతుల మీదుగా మళ్ళీ మొదలవుతుండటం ఆంధ్రప్రదేశ్‌కే కాదు, యావద్దేశానికీ శుభసూచకమే!

ముంబయి, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలు ఆయా రాష్ట్రాల ప్రగతికే కాదు- భారతదేశ ఆర్థికాభివృద్ధికీ చోదకశక్తులవుతున్నాయి. తెలంగాణకు మణిహారం వంటి హైదరాబాద్- ప్రపంచంలోనే అత్యంత వేగంగా పురోగమిస్తున్న నగరాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ మేరకు నిరుడు సీబీఆర్ఈ కలిసి నివేదించిన నైట్‌ఫ్రాంక్ ఇండియా సంస్థ- 2035 నాటికి హైదరాబాద్ జీడీపీ 201.4 బిలియన్ డాలర్లకు చేరుతుందని లెక్కగట్టింది. ఇంతటి సంపదను సృష్టించగలిగే మహానగరమేదీ ఏపీలో లేదనే రాష్ట్ర ప్రజల చింతను అమరావతి నగర నిర్మాణంతో తీర్చడానికి పదేళ్ల కిందట చంద్రబాబు ప్రభుత్వం నడుంకట్టింది. 2019 నాటికి కోటి చదరపు అడుగుల(ఎస్ఎఫ్‌టీల)కు పైగా విస్తీర్ణంలో పనులు ప్రారంభించి, 58 లక్షల ఎస్ఎఫ్‌టీల్లో వివిధ నిర్మాణాలను పూర్తిచేసింది. అమరావతికి వ్యతిరేకిని కానంటూ నమ్మబలికి సీఎం అయిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి- అప్పటి అయిదేళ్లలో రాజధాని పనులను పాడుబెట్టించి అయిదు కోట్ల ఆంధ్రుల ఆశలపై గొడ్డలివేటు వేశారు. జగన్ నయవంచకత్వానికి బలైన అమరావతికి జీవకళను సంతరింపజేసే గురుతర బాధ్యతను కూటమి ప్రభుత్వం భుజాలకెత్తుకుంది. ఆ బృహత్కార్యం వీలైనంత వేగంగా దిగ్విజయం కావాలని సమస్త రాష్ట్ర ప్రజానీకం మనసారా ఆకాంక్షిస్తోంది!

దాదాపు 30వేల మంది రైతులు అమరావతికోసం తమ భూములను ధారపోశారు. వారిలో 97శాతం మంది చిన్న, సన్నకారు సాగుదారులే. వారిలోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన అన్నదాతల సంఖ్యే ఎక్కువ. వాళ్లందరినీ భూస్వాములుగా చిత్రీకరించిన జగన్ సర్కారు- అమరావతి నిర్మాణ ప్రణాళికలను చిందరవందర చేయడానికి తెగబడింది. వైకాపా చేతిలో విధ్వంసమైన రాజధానిని తిరిగి నిలబెట్టడానికి శ్రమిస్తున్న కూటమి సర్కారుకు కేంద్రమూ అండదండలు అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే నేడు అమరావతిలో రూ.49వేల కోట్ల విలువైన పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. రాజధాని నిర్మాణ క్రతువును ప్రస్తుత ప్రభుత్వ పాలనా కాలంలోనే పరిపూర్ణం చేసేందుకు కూటమి సారథులు ఇక కంకణబద్ధులు కావాలి. ప్రతి పనికీ గడువును నిర్దేశించుకుని, నిర్దేశిత సమయంలోగా అత్యున్నత నాణ్యతతో అన్నింటినీ పూర్తిచేయాలి. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిఫై చేస్తూ పార్లమెంటు ద్వారా చట్టబద్ధత కల్పిస్తేనే- అమరావతికి భద్రత, తద్వారా రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు శాశ్వత భరోసా లభిస్తాయి.



ఎన్ని గంటలు పనిచేశామన్నది కాదు, ఎంత సమర్థతతో చేశామన్న దానిమీద ఉత్పాదకత ఆధారపడి ఉంటుంది. అదే సమయంలో శరీరాన్ని గమనించుకోవాలి. ఇవ్వాల్సినప్పుడు దానికి విశ్రాంతి ఇవ్వకపోతే పనిలో సామర్థ్యం తగ్గిపోతుంది.

– సౌమ్య స్వామినాథన్, మాజీ డీజీ, ఐసీఎంఆర్

అందరిలో గుడి ఉంది!

'అడుగడుగున గుడి ఉంది. అందరిలో గుడి ఉంది' అన్నాడో కవి. అడుగడుగున ఉన్నా, లేకున్నా అందరిలో మాత్రం తప్పక ఉంటుంది. 'అహం బ్రహ్మాస్మి' అన్నారందుకే. పంచభూతాత్మకమైన ఈ యావత్ సృష్టిలో పరమాత్మ కొలువై ఉన్నాడు. సమస్త ప్రాణకోటిలోనూ సర్వేశ్వరుడున్నాడు. అది గ్రహించే శక్తి ఉన్నవాడికి దైవం కనబడతాడు. గులాబీని తోటలోనే చూడగలం. మబ్బును నింగిలోనే కాంచగలం. పంచమ స్వరాన్ని కోయిల నుంచే వినగలం. ప్రాణవాయువును గాలి నుంచే పొందగలం. అలాగే దైవాన్ని అంతర నేత్రాల ద్వారానే దర్శించగలం. అందుకు ఆత్మజ్ఞానం అవసరం. 'నాలో నేను' 'నీలో నీవు' చూడగలగాలి. దీన్నే 'లోచూపు' అంటారు.



అంతర్యామి

అరిషడ్వర్గాలను దూరంగా ఉంచగల వారికి, సత్సాంగత్యమూ సాధన కలవారికి.. లోచూపు సాధ్యం. ఏకాగ్రమైన భావనతో మనసును కేంద్రీకరించినప్పుడు జ్ఞాననేత్రాలు తెరుచుకుంటాయి. అసలైన అన్వేషణ మొదలవుతుంది. అప్పుడు ధ్యాన ప్రక్రియ సహకరిస్తుంది. జ్ఞాన-అజ్ఞాన విచక్షణ ఉదయిస్తుంది. ఫలితంగా కోరికలు తగ్గుతుంటాయి. నిరాశా నిస్పృహలు, దుఃఖం దూరమైపోతుంటాయి. జ్ఞానసోపానాలు అధిరోహించే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మోక్షసాధానికి చేర్చే మెట్లు చాలా ఉంటాయి. ఎన్నెన్నో పరీక్షలుంటాయి. ఆ పరీక్షల్లో సాఫల్యం పొందినవారిలో అన్నమయ్య, కబీరు, మీరా, తులసీ, రామదాసు, త్యాగరాజు- ఇలా చాలామంది ఉన్నారు.

భౌతికజీవన ప్రస్థానం చేస్తూనే భగవంతుణ్ని దర్శించిన వారున్నారు. తల్లిదండ్రులు, గురువు, అతిథి, ప్రవచనకర్తల్లో మనం దైవదర్శనం చేసుకుంటున్నాం. చెట్టు, పుట్ట, గట్టు, నది- ఇలా అన్నింటినీ పూజించే సంప్రదాయం మనది. అన్నింటిలోనూ దైవం ఉన్నాడన్న ప్రగాఢ విశ్వాసమే లోకకల్యాణ భావనకు నాంది పలుకుతుంది. దేవుణ్ని అంతటా చూడగలిగే విజ్ఞత పొందగలిగితే, మనం చేసే ప్రతి పనీ ఓ ప్రార్థన అవుతుంది. పనిలో నిజాయతీ, ప్రార్థనలో ఏకాగ్రత, అభ్యర్థనలో ఆర్తి, సేవలో ప్రేమ, పూజలో శ్రద్ధ, అర్చనలో సమర్పణ భావం ఉండాలి. మౌనమే మాధవుడితో చేసే నిజమైన సంభాషణ అవుతుంది. మౌనమే ధ్యానం చేసే పావన స్నానం. జీవితానికి దొరికే అసలైన సమాధానం.

'నేను' అన్నమాటకు అర్థం, పరమార్థం తెలుసుకోకుండా 'నాది' అనుకోవడంతోనే మనోవ్యాధి పెరుగుతుంది. జీవితమంటే- ఇతరుల నుంచి ఆశించడమో, తీసుకోవడమో కాదు... ఇవ్వడం. అందులో కష్టసుఖాలూ జయాపజయాలూ ఉంటాయి. విజయాలను మనకన్నా చిన్నవారితో పంచుకోవాలి. పరాజయాలను మనకన్నా పెద్దవారితో చెప్పుకోవాలి. ఒకరికి స్ఫూర్తిగానూ నిలువగలుగుతాం. వేరొకరి నుంచి ప్రేరణనూ పొందగలుగుతాం. ఎంతో పెద్దది జీవితం. దాన్ని మనలోకి ఇముడ్చుకోవాలి. ఎంతో చిన్నది జీవితం. అందులో మనం ఇమిడిపోవాలి. మనల్ని మనం ఎంత ప్రేమించుకుంటామో, అలాగే ఇతరుల్నీ ప్రేమించాలి. ఆ ప్రేమలోనే పరమాత్ముడు కనిపిస్తాడు. అందరిలోనూ గుడి ఉంది. ఆ గుడిలోకి చేర్చే నుడిని.. పట్టుకోవడంలోనే జన్మకి సార్థకత్వం ఉంది.

– చిమ్మపూడి శ్రీరామమూర్తి

సంఘర్షణ పథం నుంచి...
సహకార పంథాకు...

భారత్, చైనాలు ప్రపంచ జనాభాలో మూడోవంతుకు నిలయాలైన ఇరుగుపొరుగు దేశాలు. ప్రాచీనకాలం నుంచి సుదృఢ సాంస్కృతిక బంధంతో ముడిపడిన రాజ్యాలు. 1962 యుద్ధానికి ముందు వరకు 'హిందీ చీనీ భాయీ భాయీ' అనేంత దోస్తీ ఉండేది. ఆ యుద్ధం తరవాతే పరిస్థితి మారిపోయింది. సరిహద్దు సంఘర్షణలు, పరస్పర అపనమ్మకం, పోటీతో దూరం పెరిగింది. తాజాగా పరిస్థితులు మారే సూచనలు కనిపిస్తున్నాయా అన్నది ఆసక్తికరం.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అనిశ్చిత విధానాలు భారత్, చైనాలకు సవాలు విసురుతున్నాయి. ముఖ్యంగా ట్రంప్ టారిఫ్ విధానం ప్రపంచార్థికాన్ని అతలాకుతలం చేస్తోంది. మిత్రులూ శత్రువులనే తేడా లేకుండా అందర్నీ టారిఫ్ దుడ్డుకర్రతో బాదుతున్నారని ప్రపంచ దేశాలు ఆగ్రహిస్తున్నాయి. టారిఫ్‌ల దెబ్బకు ఒక్క వారంలోనే స్టాక్ మార్కెట్లు అడుగుకు పడ్డాయి. టారిఫ్‌ల అమలుకు విరామం ఇవ్వడంతో కోలుకున్నాయి. ఇలాంటి చపలచిత్త ధోరణులతో అమెరికా ఆధారపడదగిన మిత్ర రాజ్యం కాదని ఐరోపా దేశాలే భావిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ట్రంప్ విధానాలతో నష్టపోతున్న భారత్, చైనాలు పరస్పర ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఒక్కటవుతాయా, అమెరికా దెబ్బను కాచుకుంటాయా అన్నది కీలక ప్రశ్న.



వాణిజ్యానికి అడ్డుకావు

మనదేశానికి చైనాతో యుద్ధంతో పాటు డోక్లాం, గల్వాన్ సంఘర్షణలు మాయని గాయాల్లా మిగిలిపోయాయి. దీనికి తోడు చైనా నిరంతరం పాకిస్థాన్ కొమ్ముకాయడం, ఇండో-పసిఫిక్‌లో దాని దూకుడు వైఖరి భారత వ్యూహాత్మక ప్రయోజనాలకు పూర్తిగా ప్రతికూలం. అయినా భారత్, చైనా వాణిజ్యం వర్ధిల్లుతూనే ఉంది. డ్రాగన్ నేడు అమెరికాను తోసిరాజని భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా మారింది. 2024 ఆర్థిక సంవత్సరంలో భారత్-చైనా వాణిజ్యం 11,840 కోట్ల డాలర్లకు చేరింది. ఇరుదేశాల మధ్య ప్రాదేశిక వైరాలున్నా, ఆర్థిక బంధాన్ని తెంచుకోవడం సాధ్యం కాదు. అభిలషణీయమూ కాదు. ట్రంప్ సృష్టించిన కల్లోలం వెనుక పకడ్బందీ వ్యూహం ఉందని ఆయన సలహాదారులు చెప్పుకొస్తున్నారు. ప్రపంచానికి ఆర్థిక, సైనిక భద్రత కల్పిస్తున్నందుకు అమెరికాకు అంతర్జాతీయ సమాజం చెల్లించే పరిహారమే అధిక సుంకాలని ఆర్థిక సలహాదారుల మండలి అధ్యక్షుడు స్టీఫెన్ మీరన్ వివరణ ఇచ్చారు. చవక కార్మిక శక్తిని వెతుక్కుంటూ అమెరికా నుంచి చైనా తదితర దేశాలకు తరలిపోయిన పరిశ్రమలను మళ్ళీ సొంత గడ్డకు రప్పించే వ్యూహమే అధిక సుంకాల విధింపు అని ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. కొవిడ్ విరుచుకుపడినప్పుడు అమెరికా వెంటనే సొంత టీకాలు, మందులను తయారు చేసుకోలేపోయింది. సెమీకండక్టర్లు కూడా తైవాన్ తదితర దేశాల నుంచి రావాల్సిందేననీ, చివరికి యుద్ధ నౌకలను కూడా పూర్తిగా స్వదేశంలో తయారు చేసుకోలేకపోతున్నామని అమెరికా గ్రహించింది. పరిశ్రమలను మళ్ళీ అమెరికాకు రప్పించకపోతే కష్టమేననే భయం పట్టుకుంది. అందుకే సుంకాల అస్త్రం ప్రయోగించినట్లు అమెరికా నేతలు సమర్థనలకు దిగారు. కానీ, దీనికి వారు అనుసరించిన విధానమే సక్రమంగా లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇటీవలి వరకు దేశదేశాలు అమెరికాకు మిత్రులుగా ఉంటూ వచ్చాయి. దాన్ని ట్రంప్ చెడగొట్టుకుంటున్నా, అమెరికా స్థానాన్ని వెంటనే భర్తీ చేసే స్థితిలో చైనా లేదు. ప్రపంచంలో డ్రాగన్‌కు అండగా వచ్చే దేశాలు అతి స్వల్పమే. ముఖ్యంగా తాను కోల్పోయే అమెరికా మార్కెట్‌ను భర్తీ చేసుకోవడం బీజింగ్‌కు కష్టమే. సరిగ్గా ఇక్కడే భారత్ అక్కరకొస్తోంది. ప్రపంచంలో అయిదో పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన ఇండియా సువిశాల మార్కెట్‌గా నిలుస్తోంది. భారత్, రష్యా, చైనా చేతులు కలిపితే ఆర్థికంగా, సైనికంగా, దౌత్యపరంగా తిరుగులేని కూటమి ఏర్పడుతుంది. అందుకే చైనా ఇటీవల భారత్‌కు స్నేహ సందేశాలు పంపుతోంది. అయితే, భారతదేశం అలీనోద్యమ కాలం నుంచి ఏ కూటమిలోనూ చేరకుండా అన్ని దేశాలతో స్నేహ సంబంధాలు సాగిస్తోంది. వ్యూహపరంగా స్వతంత్ర కార్యాచరణను నిలబెట్టుకుంటోంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలం నుంచి నేటి ఉక్రెయిన్ యుద్ధం వరకు ఎవరి పక్షమూ వహించకుండా నిష్పాక్షికంగా శాంతి సామరస్యాల కోసం పిలుపు ఇస్తూ వచ్చింది. అయితే ట్రంప్ దెబ్బకు అంతర్జాతీయ సమీకరణలు మారిపోనున్నాయి. అలీన వైఖరి నుంచి బహుళపక్ష సహకార పంథాకు భారత్ మారడం ఆవశ్యకమవుతుంది. ఈ పరిస్థితిలో డ్రాగన్ కోసం ఇండియా ఒక తలుపు కొద్దిగా తెరిచి ఉంచడం మంచిదే. ఇప్పటికే భారత్, చైనా బ్రిక్స్‌లో, షాంఘై సహకార సంస్థలో, జీ20లో సహ సభ్యులుగా ఉన్నాయి. ఇలాంటి వేదికల ద్వారా పొరపొచ్చాలను తొలగించుకునే పనినీ మొదలుపెట్టాయి. రష్యాలో బ్రిక్స్ సభ జరిగినప్పుడు ప్రధాని మోదీ, జిన్‌పింగ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ తరవాత లద్దాఖ్ సరిహద్దులో సైనికపరమైన ఉద్రిక్తతలు తగ్గాయి. భారత్‌లో చైనా ప్రత్యక్ష పెట్టుబడుల ప్రతిపాదనల్లో అర్హమైనవాటికి దిల్లీ ఆమోద ముద్ర వేస్తోంది. భారత్‌ను తమ వ్యూహపరమైన భాగస్వామిగా కాకుండా ఆయుధాలు అమ్ముకోవడానికి, ఇంధనం, టెక్నాలజీల ఎగుమతికి పనికొచ్చే మార్కెట్‌గా మాత్రమే ట్రంప్ పరిగణిస్తున్నారు. అందుకని, భారత్ తన జాగ్రత్తలో తానుండక తప్పదు.

ఉభయులకూ శ్రేయస్కరం

చైనా ఎగుమతుల కేంద్రిత ఆర్థిక వ్యవస్థ నుంచి స్వదేశీ వినియోగంపై ఆధారపడే వ్యవస్థగా మారాలనుకుంటోంది. భారత్ సర్వీసుల రంగంపై అతిగా ఆధారపడే స్థితి నుంచి పారిశ్రామిక దేశంగా ఎదగాలనుకుంటోంది. అందుకు పెట్టుబడులు, అధునాతన సాంకేతికతలు కావాలి. ఎలక్ట్రిక్ వాహనాలు, సౌరశక్తి, ఫార్మా, సెమీకండక్టర్ల తయారీకి కావాల్సిన విడిభాగాలను చైనా సరఫరా చేయగలదు. భారత్‌లోని సువిశాల మార్కెట్ చైనాకు ఆకర్షణీయంగా ఉంది. కాబట్టి ద్వైపాక్షిక వాణిజ్యం ఉభయ తారకంగా ఉంటుంది. చైనాతో భారత్ బంధం పెరిగిన కొద్దీ అది పాకిస్థాన్‌కు నష్టదాయకంగా మారుతుంది. అలాగని పాక్‌తో చైనా తెగతెంపులు చేసుకోకపోవచ్చు. అలాగే, అమెరికానే నమ్ముకుని ఇండియా వ్యూహపరంగా, ఆర్థికంగా సాహసమూ చేయలేదు. అది ఉపయుక్తం కూడా కాదు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్, చైనాలు సంఘర్షణల పథం నుంచి సహకార పంథాకు మారడం ఉభయులకూ శ్రేయస్కరమే!



రాకేశ్ భాటియా
విశ్రాంత బ్రిగేడియర్



స్నేహ మాంద్యం

'ఆర్థిక మాంద్యం', 'బుద్ధి మాంద్యం' లాంటి పదాలు అందరికీ తెలిసినవే. వాటిపై విస్తృత అధ్యయనాలు జరిగాయి, సమగ్ర గ్రంథాలూ వెలువడ్డాయి. కానీ 'స్నేహ మాంద్యం' (ఫ్రెండ్‌షిప్ రిసెషన్) గురించి ఎప్పుడైనా విన్నారా? ఈ కొత్త పదబంధం హార్వర్డ్ బిజినెస్ రివ్యూ పత్రిక ద్వారా ఈమధ్యే వెలుగులోకి వచ్చింది.

అమెరికన్ పర్‌స్పెక్టివ్స్ సంస్థ జరిపిన ఒక అధ్యయనం ప్రకారం 'నాకు ఒక్క క్లోజ్ ఫ్రెండ్ కూడా లేడు' అనే వాళ్ల శాతం 1990తో పోల్చితే నాలుగు రెట్లు పెరిగిపోయింది. అలాగే, పదిమంది అంతకన్నా ఎక్కువ స్నేహితులు ఉన్న వారి సంఖ్య మూడు రెట్లు పడిపోయింది. ఒంటరిగా భోజనం చేసేవాళ్లు గత రెండేళ్లలోనే 29 శాతం పెరిగారట. ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి సర్వే ప్రపంచంలో ఎక్కడ చేసినా ఫలితాలు ఇలాగే ఉండొచ్చు.

మనుషుల మధ్య సంబంధాలన్నవి 'యథాలాప పరిచయాలు'గా మిగిలిపోతున్నాయే తప్ప సంపూర్ణమైన 'స్నేహ బంధాలు'గా ఎదగకపోవడం బాధాకరమైన పరిణామం. మనిషికి ఏకాంతం కొంతమేర అవసరం. సృజనాత్మక ప్రక్రియలకు అది ఉపయోగపడుతుంది. కానీ ఒంటరితనం వేరు. అది వేధిస్తుంది. నలుగురితో కలవకుండా ఒంటరిగా ఉండటానికి ఇష్టపడే ఏకాకి జీవితంతో హృద్రోగాలు, మతిమరుపు, మరణం ముప్పు గణనీయంగా పెరుగుతాయన్నది అధ్యయనాలు చెబుతున్న వాస్తవం. శారీరక శ్రమ లేకుండా ఎక్కువసేపు కూర్చుని ఉండటం, ధూమపానం లాంటివి ఆరోగ్యానికి ఎంత ప్రమాదమో ఈ ఏకాకితనం కూడా అంతే హానికరం. పెరుగుతున్న సాంకేతికత 'స్నేహ మాంద్యా'నికి ఒక ప్రధాన కారణమని చెప్పొచ్చు. సామాజిక మాధ్యమాల వర్చువల్ స్నేహాల్లో మునిగి రియల్ స్నేహాలను విస్మరిస్తున్నారు. చాలామంది నిత్యజీవితంలో తమ అవసరాలన్నీ తీరాక, కంఫర్ట్ జోన్‌లో ఉన్నప్పుడే తీరిగ్గా స్నేహితుల గురించి ఆలోచిస్తారు. మనం తలచుకుంటామని వాళ్లు తీరిగ్గా కూర్చోరు కదా! స్నేహమే కాదు ఏ బంధమైనా శాశ్వతంగా నిలవాలంటే దానికోసం కొంత కృషి చేయాలి. సమయం వెచ్చించాలి. అవసరమైన సందర్భాల్లో అండగా నిలవాలి. స్నేహానుబంధాల వల్ల ఆనందం, ఆరోగ్యం, ఆయుష్షు.. పెరుగుతాయి. వెల కట్టలేని ఆ లాభాలకోసం ఆ మాత్రం పెట్టుబడి పెట్టలేమా!

రచయిత ఫిల్ క్లార్క్ ఏకాంతాన్ని ఆస్వాదించేవారు. తన రచనా వ్యాసంగానికి అది ఉపయోగపడేది. డెబ్భై ఏళ్ల వృద్ధాప్యంలో ఆయనొక విషయాన్ని ప్రస్తావిస్తూ 'వయసు పైబడే కొద్దీ మనకు సన్నిహిత మిత్రులు తగ్గిపోతూ ఉంటారు. కొందరు దూరం జరుగుతారు. మరికొందరు అప్పటికే ఈ లోకం నుంచి వెళ్లిపోయి ఉంటారు. కోల్పోయినవారి స్థానంలో కొత్త స్నేహితుల్ని పొందడం సులభం కాదు. కానీ అలా పొందగలిగితే... లాభమే! ముఖ్యంగా అంతిమయాత్రకు హాజరయ్యే వారి సంఖ్య పెరుగుతుంది కదా!' అని నవ్వుతూ సరదాగా చెప్పారాయన. హాస్యంగా అన్నా అది నిజమే కదా!

– గుమ్మడి రవీంద్రనాథ్



లాభార్జనకు ఏఐ

సంస్థలు మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి, ఉద్యోగుల సామర్థ్యాన్నీ ఉత్పాదకతనూ పెంచడానికి సమర్థ పర్యవేక్షణకు కృత్రిమ మేధ (ఏఐ) తోడ్పడుతుంది. వ్యాపార కార్యకలాపాల్లో వేగం పెంచడానికి, సృజనాత్మక ఆలోచనలకు, బిజినెస్‌ను విస్తరించడానికి, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వస్తు సేవలు అందించడానికి ఏఐ అక్కరకొస్తుంది. తద్వారా సంస్థలు మెరుగైన లాభాలు సాధించడంలో ఏఐ కీలకంగా నిలుస్తుంది. ఈ క్రమంలోనే ప్రపంచ వ్యాప్తంగా సంస్థల్లో ఏఐ వినియోగం పెరుగుతోంది. 2023లో విశ్వవ్యాప్తంగా 65శాతం సంస్థలు కృత్రిమ మేధను వినియోగిస్తుంటే, 2024లో అది 78శాతానికి చేరింది. ఆయా ప్రదేశాల వారీగా ఏఐని వాడుతున్న సంస్థల సంఖ్య... (శాతాల్లో)

ప్రాంతం	2023	2024
ఆసియా-పసిఫిక్	58	72
ఐరోపా	57	80
ఉత్తర అమెరికా	61	82
చైనా, హాంకాంగ్, తైవాన్, మకావు	48	75
ఇండియా, మధ్య/దక్షిణ అమెరికా, పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికా వంటి వర్ధమాన మార్కెట్లు	49	77

(ఆధారం: ఏఐ ఇండెక్స్ రిపోర్ట్ - 2025)

రైతుబజార్లలో సమస్యల కుప్పలు!

అన్నదాతలు తమ వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించుకోవడానికి రైతుబజార్లు వీలు కల్పిస్తాయి. మధ్యవర్తులెవరూ ఉండకపోవడంతో అటు రైతుకూ గిట్టుబాటు అవుతుంది, ఇటు వినియోగదారులకూ తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు అందివస్తాయని భావించారు. కానీ, వాస్తవంలో అది కనిపించట్లేదు. అక్కడి దళారీ వ్యవస్థ రైతుల ఆరుగాలం శ్రమకు కుచ్చుటోపీ పెట్టి లాభాలు దండుకోవడం పరిపాటిగా మారింది. మరోవైపు సామాన్యులు కూరగాయల ఊసెత్తితేనే ఉలిక్కిపడాల్సిన పరిస్థితి నెలకొంది. వంద రూపాయల నోటు తీసుకెళ్తే ఒక్క పూట కూరలతో సర్దుకోవాల్సి వస్తోంది. సరసమైన ధరలకు కూరగాయలు, ఆకుకూరలు ఇతర నిత్యావసరాలు దొరుకుతాయన్న ఆశతో రైతుబజార్లకు వెళ్లినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. నిర్దేశిత ధరలు అమలు కాకపోవడం, బేరసారాలకు తావులేకపోవడంతో సామాన్యులపై ధరాభారం తప్పడంలేదు. దళారులను నియంత్రించలేక రైతుబజార్లలో పనిచేసే అధికారులు, సిబ్బంది ఎప్పుడో చేతులెత్తేశారు.



సాగుదారులు, వినియోగదారులకూ మధ్య దళారులు లేని వ్యవస్థే లక్ష్యంగా పురుడుపోసుకున్న రైతుబజార్లు నేడు పుట్టెడు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. వినియోగదారులు కొనబోతే కొరివి, రైతులు అమ్మబోతే అడవిలా అక్కడి పరిస్థితులు ఉన్నాయి. దళారులు రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ధరల దందా నడిపిస్తుండటంతో రైతుబజార్ల ఉద్దేశం నెరవేరట్లేదు.

నాడు విప్లవం సృష్టించి...

కూరగాయల సాగులో చైనా తరవాతి స్థానం ఇండియాదే. కానీ, ప్రజల తలసరి కూరగాయల వినియోగం మాత్రం తీసికట్టుగా ఉంటోంది. భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) సిఫార్సు ప్రకారం, ఒక వ్యక్తి రోజువారీ సగటు కూరగాయల వినియోగం 300గ్రాములు ఉండాలి. కానీ, మన దేశంలో అది దాదాపు 94గ్రాములే ఉంటోందని యూఎన్ఎఫ్ఏఓ విశ్లేషించింది. అధిక శాతం కుటుంబాలు రోజూ పప్పుఉప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, టొమాటోలతో సరిపెడుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కూరగాయల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు గగ్గోలు పెడుతున్నప్పుడు, ప్రభుత్వాలు స్పందించి ఒకట్రెండు రోజులు వాటిని రాయితీ ధరలకు విక్రయిస్తున్నాయి. తరవాత పరిస్థితి షరామామూలే అవుతోంది.

ఏ వస్తువునైనా నిమిషాల్లో వినియోగదారుడి గడపలోకి తీసుకొస్తున్న ఈ-కామర్స్ సంస్థలు పోటీపడి తగ్గింపు ధరలకు వెజిటబుల్ బాస్కెట్ల పేరుతో సేవలు అందిస్తున్నాయి. అయినాసరే సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకు కూరగాయలు అంటే గుర్తొచ్చేది రైతుబజార్లే. చంద్రబాబునాయుడి మానస పుత్రికగా ఉమ్మడి రాష్ట్రంలో పురుడుపోసుకున్న ఈ వ్యవస్థ ఒకప్పుడు దేశానికే ఆదర్శంగా నిలిచింది. పంజాబ్‌లో అప్నామండీ స్ఫూర్తితో మన దగ్గర ఏర్పాటైన రైతుబజార్ వ్యవస్థ భారీ విప్లవాన్నే సృష్టించింది. భాగ్యనగరంతో మొదలుపెట్టి ఉమ్మడి రాష్ట్రమంతటా వాటిని విస్తరించి మెప్పించారు. అప్పటి అవసరాలకు అవెంతో ఉపయోగపడ్డాయి. ధరల నియంత్రణకూ దోహదపడ్డాయి. కానీ, ఆ తరవాత తెలుగు రాష్ట్రాల్లో వాటి సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగలేదు సరికదా, కేవలం పదుల సంఖ్యలో రైతుబజార్లు మాత్రమే వినియోగదారుల మన్ననలు అందుకున్నాయి. తెరాస హయాంలో తెలంగాణలో సమీకృత మార్కెట్ల ఏర్పాటుకు మొగ్గతొడిగినా వాటి ఫలాలు కొన్ని ప్రాంతాలకే పరిమితం. ఏపీలో కొత్తగా 50 రైతుబజార్లు ఏర్పాటు చేస్తున్నట్లు వైకాపా ప్రభుత్వం గొప్పలకుపోయి చివరికి చేతులెత్తేసింది. ఆ ప్రభుత్వ అసమర్థ విధానాలు, ఓటుబ్యాంకు రాజకీయాలు రైతుబజార్ వ్యవస్థకు మరింత చేటుచేశాయి. పట్టణ జనాభా అంతకంతకు విస్తరిస్తుండగా, అనేక కారణాలతో నేడు కూరగాయల అంగళ్లు రోడ్లపైకి చేరాయి. వీధుల్లోనే విక్రయిస్తుండటంతో పారిశుద్ధ్య, ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ పారబోసిన మాంసాహార వ్యర్థాలు, కుళ్లిపోయిన కూరగాయలు ప్రజారోగ్యానికి తూట్లు పొడుస్తున్నాయి. ఒకే ప్రాంగణంలో క్రమపద్ధతిలో నెలకొల్పిన దుకాణాల్లో ప్రశాంతంగా విక్రయాలు చేపట్టడం విక్రేతలతో పాటు వినియోగదారులకూ వెసులుబాటుగా ఉంటుంది.

సమీకృత మార్కెట్లుగా...

రైతుబజార్లలో అన్నిరకాల కూరగాయలు లభ్యం కాకపోవడం, కొత్త నిర్మాణాలను పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం వంటి సమస్యలను ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి. తెలుగు రాష్ట్రాల్లోని పట్టణ ప్రాంతాల్లో మరిన్ని రైతుబజార్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా రైతుబజార్లను నెలకొల్పి, సమీకృత మార్కెట్లుగా విస్తరించాలి. అక్కడి నుంచి కాలనీలకు కూరగాయలను సరఫరా చేయాలి. ఇందులో రైతులు, పొదుపు సంఘాల మహిళలను భాగస్వామ్యం చేయడం, వారికి తగిన్ని రాయితీలు ఇవ్వడం ముఖ్యం. మరోవైపు నిర్ణీత ధరలకే నాణ్యమైన కూరగాయలు విక్రయించేలా అధికారుల పర్యవేక్షణను పటిష్ఠం చేయాలి. అప్పుడే దళారుల్లేని రైతుబజార్లు మరింతగా ప్రజాదరణను చూరగొంటాయి.

– పడిపాటి వెంకటనారాయణ

హాయ్! బుజ్జీ!!

పిల్లకుందేలు ప్రత్యేకత


ఒక అడవిలో చిట్టి కుందేలు వాళ్లమ్మతో కలిసి ఉండేది. పాపం దానికి కళ్లు కనిపించవు. 'నీకేమీ కనపడదు. నువ్వేం చేయలేవు' అంటూ హేళన చేసేవి అడవిలోకి కొత్తగా వచ్చిన జంతువులు. దాంతో అది చాలా బాధపడేది. ఒకరోజు వాళ్లమ్మ దగ్గరికి వెళ్లి.. 'అమ్మా! నన్ను చూసి ఆ జంతువులన్నీ నవ్వుతున్నాయి. కళ్లు కనిపించకపోవడం నా తప్పు కాదు కదా!' అంటూ ఏడవసాగింది. పిల్లకుందేలు ఏమీ చూడలేకపోయినా చాలా తెలివైంది.




దూరంగా ఏవైనా జీవులు వస్తుంటే.. వాసనతోనే పసిగట్టి అది ఏ జంతువో చెప్పేది. సింహం, పులి వంటి క్రూర మృగాలైతే.. చుట్టుపక్కల జంతువులను హెచ్చరించి, వాటి ప్రాణాలు రక్షించేది.

పిల్లకుందేలు మాటలు విన్న తల్లి.. 'వాళ్లంతా ఏదో అంటున్నారని నువ్వేం బాధపడకు చిట్టీ. అందరిలా చూడలేకపోయినా.. నీకంటూ ఒక ప్రత్యేక లక్షణం ఉంది కదా! ప్రతిఒక్కరిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. దాన్ని ఇంకా మెరుగుపరచుకుంటూ ధైర్యంగా ఉండాలి కానీ.. మనలోని బలహీనతల్ని తలుచుకుంటూ బాధపడకూడదు' అంది. అదే రోజు సాయంత్రం.. జంతువులన్నీ కలిసి ఒక చోట సరదాగా కూర్చున్నాయి. అటువైపుగా సింహం వస్తోందని గమనించిన పిల్లకుందేలు.. అక్కడున్న జంతువులకు విషయం చెప్పింది. వెంటనే అవి.. ఎక్కడివక్కడ పారిపోయి చెట్ల పొదల్లో దాక్కున్నాయి. సింహం వెళ్లిపోయాక బయటికి వచ్చి.. 'మమ్మల్ని క్షమించు మిత్రమా! నువ్వు లేకపోయి ఉంటే ఈరోజు మా ప్రాణాలు పోయేవి.. మమ్మల్ని కాపాడినందుకు కృతజ్ఞతలు' అన్నాయా జంతువులు.

– ఎం.లక్ష్మి





అమరావతి నిర్మాణానికి పునఃసంకల్పం

(మొదటి పేజీ తరువాయి)

■ ఎల్‌అండ్‌టీ సంస్థ ఐటీ టవర్ నిర్మించబోతోంది.
■ ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థల భాగస్వామ్యంతో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీని ఏర్పాటు చేయబోతున్నారు.
■ ప్రభుత్వం సీఐఐతో కలసి గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది.
■ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నెలకొల్పనుంది.
■ కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐడీ త్వరలో పూర్తి స్థాయిలో తరగతులు ప్రారంభించనుంది.

రైతులకు రాజధాని అభివృద్ధి ఫలాలు

గత తెదేపా ప్రభుత్వ హయాంలో కేవలం 58 రోజుల వ్యవధిలో రైతులు 34 వేలకు పైగా ఎకరాల్ని భూసమీకరణలో ఇవ్వడం ఒక చరిత్ర. రైతులకు ప్రభుత్వం పరిహారం కాకుండా, అభివృద్ధి చేసిన స్థలాలను కేటాయించడం ద్వారా రాజధాని అభివృద్ధి ఫలాలను వారికీ అందేలా చేసింది.

రైతుల మహత్తర పోరాటం..

రాష్ట్రానికి మూడు రాజధానుల్ని ప్రకటిస్తూ 2019 డిసెంబరు 17న అప్పటి సీఎం జగన్ శాసనసభలో ప్రకటన చేసి, విష పన్నాగానికి తెరతీశారు. దానికి నిరసనగా ఆ మర్నాటి నుంచే రాజధాని రైతులు ఉవ్వెత్తున ఉద్యమించారు. వైకాపా తప్ప అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలతో పాటు, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ వారి పోరాటానికి అండగా నిలిచారు. ప్రభుత్వ దాష్టీకాన్ని, దమనకాండను, పోలీసుల్ని ప్రయోగించి సృష్టించిన బీభత్సాన్ని, అణచివేతల్ని తట్టుకుని పిల్లాపాపలతో కలసి ఏకంగా 1,631 రోజులు నిర్విరామంగా పోరాటం చేశారు. కొవిడ్ మహమ్మారిని, తుపానుల్ని, ప్రకృతి విపత్తుల్ని కూడా లెక్క చేయకుండా ఉద్యమించారు. పాదయాత్రలు చేశారు. దేశ చరిత్రలో సుదీర్ఘకాలం జరిగిన ఉద్యమాల్లో ఇదీ ఒకటి. ఒకపక్క ఉద్యమం కొనసాగిస్తూనే, కోర్టుల్లో న్యాయపోరాటం కూడా చేశారు. అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని, నిర్దిష్ట గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని హైకోర్టు 2022 మార్చి 3న చారిత్రక తీర్పు చెప్పింది.

అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా..

■ రాష్ట్రానికి నడిబొడ్డున, అన్ని ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండేలా రాజధాని అమరావతిని నిర్మిస్తూనే, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్ని ఏకకాలంలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు అమలు చేస్తోంది. విద్యా సంస్థలు, పరిశ్రమల్ని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తోంది.
■ అమరావతితో పాటు, విశాఖ, తిరుపతిలను మెగాసిటీలుగా అభివృద్ధి చేయనుంది. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తోంది. భోగాపురం విమానాశ్రయ నిర్మాణాన్ని శరవేగంగా పరుగులు పెట్టిస్తోంది.
■ రాయలసీమను ఆటోమొబైల్ జోన్‌గా ప్రకటించింది.


ప్రధాని సభ నేపథ్యంలో సీడ్ యాక్సెస్ రోడ్డులో వెంకటపాలెం కూడలిలో పోలీసు తనిఖీలు


భారత్‌లో సృష్టిద్దాం.. జగతికి అందిద్దాం

ప్రపంచ వినోద కేంద్రంగా మన దేశం

తొలి 'వేవ్స్' సదస్సులో ప్రధాని మోదీ

హాజరైన సినీ, వాణిజ్యరంగ ప్రముఖులు

"మనుషుల జీవితాల్లో సాంకేతికత రాను రాను మరింత కీలకపాత్ర పోషిస్తుంది. సృజనాత్మక రంగంలో ఉన్నవారు కరుణామయమైన భవిష్యత్తు నిర్మాణం దిశగా కృషి చేయాలి. సంగీతం, నృత్యం, కథాకథనం వంటి కళారూపాలు ఇందుకు దోహదపడాలి. మనిషి రోబోలా మారకూడదు. మానవసమాజ సున్నితత్వాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది."
- ప్రధాని నరేంద్ర మోదీ



ముంబయి: సంగీతం, సినిమా, గేమింగ్ రంగాల్లో భారత్ ప్రపంచ కేంద్రంగా ఉదయిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత్‌లో 'ఆరెంజ్ ఎకానమీ' (సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ) వికసిల్లుతోందని తెలిపారు. ప్రపంచం కొత్తదనం కోరుకొంటున్న ఈ తరుణంలో "భారత్‌లో సృష్టిద్దాం, జగతికి అందిద్దాం" నినాదంతో ముందుకు వెళ్లడానికి ఇదే సరైన తరుణమని చెప్పారు. దేశంలో మొట్టమొదటిసారి ముంబయిలో గురువారం ప్రారంభమైన నాలుగు రోజుల 'వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్' (వేవ్స్ 2025)ను ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. నగర శివారులోని బాంద్రా - కుర్లా కాంప్లెక్సులో గల జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఈ సదస్సులో ప్రధాని ప్రసంగిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సృజనశీలురు, స్టార్టప్స్ - పరిశ్రమల అధినేతలు, విధాన రూపకర్తలను వేవ్స్ ఒక వేదిక మీదకు తెచ్చిందన్నారు. ఈ వేదిక భారతీయ మీడియా, వినోదం, డిజిటల్ ఆవిష్కరణల్లో ప్రపంచ కేంద్రంగా నిలబెడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. భారత దేశం అంతర్జాతీయ చలనచిత్ర నిర్మాణకేంద్రంగా అవతరిస్తున్న నేపథ్యంలో ప్రపంచ ప్రతిభకు వేదికగా మారే సామర్థ్యం వేవ్స్ సంతరించుకుంటుందన్నారు. ఇండియన్ 'ఆస్కార్' మాదిరిగానే 'గానా' కూడా ప్రపంచ ప్రసిద్ధం అవుతున్నాయన్నారు. తెర పరిమాణం చిన్నదైనా మారుతున్నప్పటికీ, పరిధి అనంతమని వ్యాఖ్యానించారు. విధ్వంసకరమైన భావజాలాల నుంచి యువతను రక్షించాల్సిన అవసరం ఉందని.. మన సాంస్కృతిక సమగ్రతను నిలబెడుతూ సానుకూల విలువలను పెంపొందించడానికి 'వేవ్స్' ఒక ముఖ్యమైన వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. సదస్సులో భారత్ పెవిలియన్‌ను ప్రధాని ప్రారంభించారు. దేశం సాధించిన ముఖ్యమైన ఆవిష్కరణలకు ఇది ప్రతిబింబమని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రదర్శనలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మహారాష్ట్ర పెవిలియన్‌ను సైతం ప్రధాని సందర్శించారు.

ప్రత్యేక ఆకర్షణగా 'రామోజీ' స్టాల్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన వేవ్స్ సదస్సులో రామోజీ ఫిల్మ్‌సిటీ (ఆర్ఎఫ్‌సీ) స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా అందరినీ ఆకట్టుకుంటోంది. వ్యవస్థాపక ఛైర్మన్ రామోజీరావు ప్రారంభించిన రామోజీ గ్రూపు సంస్థల ప్రగతి ఇలు ప్రస్తుత సీఎండీ సీహెచ్.కిరణ్ సారథ్యంలో దేశంలో విశ్వసనీయ మీడియాగా ప్రగతిపథంలో సాగుతున్నాయి. రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రపంచంలో అతిపెద్ద ఫిల్మ్‌సిటీగా గుర్తింపు పొందింది. ఇప్పటివరకు 3,500కు పైగా చిత్ర నిర్మాణాలు ఇక్కడ జరిగాయి. పాన్ ఇండియా చిత్రాలుగా ఆదరణ పొందిన బాహుబలి, పుష్ప, కల్కి, ఆర్ఆర్ఆర్ వంటివి ఇక్కడే రూపొందినవే. వేవ్స్ సదస్సులో ఫిల్మ్‌సిటీ స్టాలుకు వస్తున్న ప్రతినిధులు, సందర్శకులతో సీఎండీ సీహెచ్.కిరణ్ స్వయంగా మాట్లాడి వివరాలు చెబుతున్నారు. ఈటీవీ సీఈవో కె.బాపినీడు, ఉషాకిరణ్ మూవీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఉపాధ్యక్షులు ఎ.వి.రావు, కె.రవీంద్రరావు ఆయనతో పాటు ఉన్నారు.



వేవ్స్ సదస్సులో రామోజీ గ్రూపు ఏర్పాటుచేసిన స్టాల్

కీరవాణి స్వరాలతో ప్రారంభం

సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి స్వరపరచిన రుగ్వేదంలోని ఉత్తేజపరిచే శ్లోకం ప్రార్థనగీతంగా 'వేవ్స్' సదస్సు ప్రారంభమైంది. ప్రముఖ గాయని శ్రేయాఘోషల్ బృందం దీనిని ఆలపించింది. బాలీవుడ్ నటుడు షారుఖ్‌ఖాన్ అతిథులకు స్వాగతం పలికారు. చిరంజీవి, ఎస్.ఎస్.రాజమౌళి, రజనీకాంత్, మోహన్‌లాల్, హేమామాలిని, అనుపమ్‌ఖేర్ తదితర సినీరంగ ప్రముఖులు భారతీయ ప్రతిభకు ఒక వేదిక కల్పించిన ప్రధాని దార్శనికతను అభినందిస్తూ ప్రసంగించారు. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ సహా పలువురు వాణిజ్యరంగ ప్రముఖులూ సదస్సుకు హాజరై ప్రసంగించారు.

పహల్గాం దాడి క్రూరం : రజనీకాంత్

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తన ప్రసంగంలో పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావించారు. ఆ దాడి అతి క్రూరమైనదని, యోధుడైన ప్రధాని మోదీ జమ్మూకశ్మీర్‌లో శాంతిని పునరుద్ధరిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కొంతమంది ప్రముఖులతో ఏర్పాటు చేయదలచిన ప్రధాని విందు కార్యక్రమం పహల్గాం విషాదం కారణంగా రద్దయింది. సంగీత కళాకారులతో సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమానికి సైతం మోదీ హాజరు కాలేదు.


భారత్ పెవిలియన్ పరిశీలిస్తున్న ప్రధాని

జగన్ రద్దు చేసిన కార్మిక పథకాల పునరుద్ధరణ!

● కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: కార్మికుల సంక్షేమం కోసం ఉద్దేశించిన 12 పథకాలను గత వైకాపా ప్రభుత్వం రద్దు చేసిందని, వాటిన్నింటినీ పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, భవన నిర్మాణ కార్మికుల సలహా కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం రాత్రి మేడే వేడుకలు నిర్వహించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఐదేళ్ల వైకాపా పాలనలో ఇసుకను బంగారంలా అమ్మి కార్మికులకు ఉపాధి లేకుండా చేశారన్నారు. రాష్ట్రంలోని 86 లక్షల మంది కార్మికుల ఆగ్రహం వల్లే జగన్ 11 సీట్లకు పరిమితమయ్యారని పేర్కొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ చేతివృత్తిదారులు, కార్మికులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలనే లక్ష్యంతోనే చంద్రబాబు నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, మాజీ ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, డి.రామారావు, పి.అశోక్‌బాబు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్, వేదికపై గొట్టుముక్కల రఘురామరాజు, కొమ్మారెడ్డి పట్టాభి, నాగుల్‌మీరా, కేశినేని చిన్ని, పల్లా శ్రీనివాస్, దువ్వారపు రామారావు, నెట్టెం రఘురాం, గద్దె రామ్మోహన్, అశోక్‌బాబు తదితరులు

క్రైస్తవంలోకి మారిన రోజే.. ఎస్సీ హోదా కోల్పోతారు

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదులోనే పేర్కొన్నారు.. తాజాగా జరిగిన విచారణలో పిటిషనర్ల తరఫు న్యాయవాది జేవీ ఫణిదత్ వాదనలు వినిపించారు. 'ఫిర్యాదుదారు పదేళ్లుగా పాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ విషయాన్ని ఫిర్యాదులోనే పేర్కొన్నారు. క్రైస్తవంలోకి మారిన వ్యక్తికి ఎస్సీ, ఎస్టీ చట్టం వర్తించదు. రాజ్యాంగం (షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్-1950 ప్రకారం హిందూమతాన్ని కాకుండా ఇతర మతాలను స్వీకరించినవారు ఎస్సీ హోదాను కోల్పోతారు. కులవ్యవస్థను క్రైస్తవం గుర్తించదని, ఆ మతాన్ని స్వీకరించిన వారికి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ ఉండదని సుప్రీంకోర్టు తీర్పులు ఇచ్చింది. వీటిని పరిగణనలోకి తీసుకుని కేసును కొట్టేయండి' అని కోరారు. పాస్టర్ ఆనంద్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఫిర్యాదిదారుడు ఎస్సీ అని తహసీల్దార్ ధ్రువపత్రం ఇచ్చారని గుర్తుచేశారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి.. 'ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఫిర్యాదుదారుడు రక్షణ పొందలేరు. నిందితులపై ఐపీసీ కింద నమోదు చేసిన సెక్షన్లు చెల్లుబాటు కావు' అని తీర్పులో పేర్కొన్నారు.

పిల్లర్లు లేకుండా గోడ నిలబడిపోతుందా?

● సింహాచలం ఘటనపై ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారును ప్రశ్నించిన త్రిసభ్య కమిటీ

ఈనాడు- విశాఖపట్నం, న్యూస్‌టుడే- సింహాచలం: సింహాచలం చందనోత్సవంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందిన ఘటనపై విచారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిషన్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు, గుత్తేదారుపై ప్రశ్నల వర్షం కురిపించింది. ఎవరు చెబితే హడావుడిగా, పిల్లర్లు కూడా లేకుండానే గోడ కట్టేశారని నిలదీసింది. కమిషన్ సభ్యులైన పట్టణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్, ఈగల్ విభాగాధిపతి, ఐజీ ఆకే రవికృష్ణ, జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు గురువారం సింహగిరిపై విచారణ ప్రారంభించారు. విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ప్రమాద ఘటనను వారికి వివరించారు. అనంతరం కమిషన్ సభ్యులు పర్యాటకశాఖ, ఆలయ ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారును ప్రశ్నించి, వారి వివరణను వీడియో రికార్డింగ్ చేయించారు.


ప్రమాదం జరిగిన తీరును కమిషన్ సభ్యులకు వివరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విచారణ సాగింది ఇలా.. తొలుత పర్యాటక శాఖ ఈఈ రమణ, డీఈ స్వామి, ఏఈ మదన్‌మోహన్‌లను కమిషన్ సభ్యుడు సురేశ్‌కుమార్ ప్రశ్నించారు. 'దేవస్థానం అధికారులు కోరిన మేరకు రిటెయినింగ్ వాల్, రెండువైపులా మెట్లు వచ్చేలా నిర్మాణం చేయడంపై ఆలయ వైదికులు అభ్యంతరం తెలిపారు. దేవాదాయ శాఖ విశ్రాంత ఈఎన్‌సీ క్షేత్రస్థాయిలో పరిశీలించి తాత్కాలిక రిటెయినింగ్ వాల్, అప్రోచ్ ఇవ్వాలని సూచించారు. ఆ మేరకు డిజైన్ రూపొందించాలని కన్సల్టెంట్‌ను కోరగా జాప్యమైంది. చందనోత్సవానికి క్యూలైన్లు నడపాలని, తాత్కాలిక నిర్మాణాలను తర్వాత మార్చుకోవచ్చని దేవస్థానం ఈఈ, ఈవో పట్టుబట్టారు. ప్లాన్‌లో ఈ పనులు లేకపోయినా గుత్తేదారు చేయడానికి అంగీకరించడంతో ముందుకెళ్లాం' అని పర్యాటక శాఖ ఈఈ రమణ వివరణ ఇచ్చారు. గోడ పని జరుగుతున్నప్పుడు మీరు ఉన్నారా? అని కమిటీ ప్రశ్నించగా తాము పర్యవేక్షించలేదని పర్యాటకశాఖ ఈఈ రమణ, జేఈ జవాబిచ్చారు. తాను పర్యవేక్షించానని, అంతా బాగానే జరిగిందని డీఈ స్వామి కితాబిచ్చారు. 'అన్నీ సక్రమంగా జరిగాయని మీరు ధ్రువీకరిస్తారా? పనికి మీరు బాధ్యత తీసుకుంటారా? అంతా బాగుంటే గోడ ఎందుకు కూలింది' అంటూ కమిటీ నిలదీసింది. దానికి డీఈ ధ్రువీకరిస్తానన్నట్లుగా 'ఊ' కొట్టడం గమనార్హం. ఏప్రిల్ 26న పని జరిగిందని, డ్రాయింగ్ లేదని, తాత్కాలికంగా చేపట్టామని, పునాది 0.4 మీటర్ల లోతులో వేశామని డీఈ వివరించారు. మరి పిల్లర్లు లేకుండా ఈ గోడ ఎలా నిర్మించారని ప్రశ్నించగా.. చందనోత్సవం ఉందని పిల్లర్లు లేకుండా గోడ కట్టామని జవాబిచ్చారు. చందనోత్సవం అయితే పిల్లర్లు లేకుండా గోడ నిలబడిపోతుందా? అని కమిటీ సభ్యుడు సురేశ్‌కుమార్ డీఈపై అసహనం వ్యక్తం చేశారు. దేవస్థానంలో జరుగుతున్న సివిల్ పనులను మీరు పర్యవేక్షించరా? పిల్లర్లు లేకుండా నిర్మిస్తుంటే పట్టించుకోరా? అని మరో సభ్యుడు వెంకటేశ్వరరావు దేవాదాయశాఖ సీఈ శేఖర్‌ను నిలదీశారు.

డ్రాయింగ్ లేకుండానే కట్టేశామన్న గుత్తేదారు: చందనోత్సవం సందర్భంగా గోడ, మెట్లు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులు చెప్పారని గుత్తేదారు లక్ష్మణరావు వెల్లడించారు. ఏ అధికారి చెప్పారంటూ కమిషన్ సభ్యుడు సురేశ్‌కుమార్ గట్టిగా ప్రశ్నించడంతో తడబడ్డారు. నీళ్లు నములుతూ.. దేవస్థానం, పర్యాటక శాఖ అధికారులని సమాధానమిచ్చారు. దేవుడి కార్యక్రమం అని డ్రాయింగ్స్ లేకపోయినా పనులు చేసినట్లు ఒప్పుకున్నారు.

రేపటి నుంచి గ్రూప్-I ప్రధాన పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడలో 1,801, తిరుపతిలో 911, అనంతపురంలో 594 మంది చొప్పున అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారని వెల్లడించింది. ఏర్పాట్లపై ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజబాబు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. "ఈ నెల 3 నుంచి 9 వరకు ప్రధాన పరీక్షలు జరుగుతాయి. రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇవి ఉంటాయి. పరీక్ష నిర్వహణ సమయం ముగిసే వరకు అభ్యర్థులను బయటకు పంపించం. నాలుగు జిల్లాల కలెక్టర్లు వీటిని పర్యవేక్షిస్తారు" అని పేర్కొన్నారు.

అభ్యర్థులకు మార్గదర్శకాలు.. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల్లోగా నిర్దేశించిన పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులు వెళ్లాలి. ఆలస్యమైతే సహేతుక కారణాలు చూపితే 9.45 వరకూ అనుమతిస్తారు. ఆ తర్వాత వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలి.
■ ట్యాబ్‌ల ద్వారా ప్రశ్నపత్రాలు ఇస్తారు. ఇన్విజిలేటర్లు అందజేసిన బుక్‌లెట్‌లలోనే అభ్యర్థులు జవాబులు రాయాలి. అందుకు బ్లాక్ లేదా బ్లూ బాల్‌పాయింట్ పెన్నునే వాడాలి. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను కేంద్రాల్లోకి అనుమతించరు.

రాజ్ కెసిరెడ్డి ప్రధాన అనుచరుడు దిలీప్ అరెస్ట్

● విదేశాలకు పారిపోతుండగా చెన్నై విమానాశ్రయంలో పట్టివేత
● డిస్టిలరీలు, మద్యం సరఫరా కంపెనీల నుంచి ముడుపుల వసూళ్లలో కీలకం

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణం కేసులో సిట్ మరొకరిని అరెస్టు చేసింది. అత్యధికంగా ఆర్డర్లు దక్కించుకున్న మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల ప్రతినిధుల నుంచి ఎప్పటికప్పుడు ముడుపులు వసూలు చేసి.. ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డికి అప్పగించే హవాలా నెట్‌వర్క్‌లో కీలకంగా వ్యవహరించిన పి.దిలీప్‌ను చెన్నై విమానాశ్రయంలో సిట్ అధికారులు గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. మద్యం కుంభకోణంపై సిట్ దర్యాప్తు వేగవంతమైనప్పటి నుంచి దిలీప్ పరారీలో ఉన్నారు. ఆయన విదేశాలకు పారిపోకుండా గతంలోనే లుకౌట్ సర్క్యులర్ జారీ చేశారు. విచారణకు హాజరుకావాలని సిట్ అధికారులు పలుమార్లు నోటీసులిచ్చినా దిలీప్ గైర్హాజరయ్యారు. రాజ్ కెసిరెడ్డి (ఏ1), బూనేటి చాణక్య (ఏ8)లను సిట్ అధికారులు అరెస్టు చేయటం, వారి రిమాండు రిపోర్టుల్లో తన ప్రస్తావన ఉండటంతో... తననూ అరెస్టు చేస్తారని భావించిన ఆయన చెన్నై నుంచి విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నించారు. అక్కడి విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుని.. సిట్ అధికారులకు సమాచారమిచ్చారు. అప్పటికే దిలీప్ కదలికలపై నిఘా పెట్టిన సిట్ అధికారులు చెన్నైలోనే మకాం వేసి ఉండటంతో.. వెంటనే విమానాశ్రయానికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి విజయవాడకు తీసుకొస్తున్నారు. శుక్రవారం సాయంత్రం విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో దిలీప్‌ను హాజరుపరచనున్నారు. దిలీప్‌తో కలిపితే మద్యం కుంభకోణం కేసులో ఇప్పటి వరకూ అరెస్టైన వారి సంఖ్య 4కు చేరింది.

ముడుపుల వసూళ్ల కోసం..: మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి ముడుపుల వసూలుకు రాజ్ కెసిరెడ్డి ఏడంచెల హవాలా నెట్‌వర్క్‌ను రూపొందించారు. రాజ్ తోడల్లుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి, ప్రధాన అనుచరుడు బూనేటి చాణక్య అలియాస్ ప్రకాశ్‌లు ఈ ముడుపుల వసూళ్ల బాధ్యతలు చూసేవారు. వారి ఆధ్వర్యంలో ఖురేషీ, సైఫ్, దిలీప్, సందీప్, చిష్టీలు పనిచేసేవారు. డిస్టిలరీలు, సరఫరా కంపెనీల ప్రతినిధులు తీసుకొచ్చే ముడుపుల సొమ్మును హైదరాబాద్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో కలెక్ట్ చేసుకుని.. దాన్ని రాజ్ కెసిరెడ్డికి అప్పగించే బాధ్యతలు చూసిన అయిదారుగురు క్యాష్ హ్యాండ్లర్లలో దిలీప్ ఒకరు.
■ ఏపీఎస్‌బీసీఎల్ నుంచి డిస్టిలరీల ఖాతాల్లో సొమ్ము జమైన వెంటనే.. 5 రోజులకోసారి ముడుపులు వసూలు చేసేవారు. డిస్టిలరీల ప్రతినిధుల్ని దిలీప్.. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడ, జూబ్లీహిల్స్, ఎమ్మెల్యే కాలనీ, బంజారాహిల్స్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో ముడుపులు తీసుకునేవారు. ఆ మొత్తాన్ని రాజ్ కెసిరెడ్డికి అప్పగించేవారు.
■ తమ ఉనికి దొరక్కుండా వీపీఎన్/ఇంటర్నేషనల్ నంబర్లు, సిగ్నల్ వంటి యాప్స్ ద్వారా మాట్లాడేవారు. తరచూ నంబర్లు మార్చేవారు. ఈ నేపథ్యంలో దిలీప్‌ను ప్రశ్నించి మరిన్ని వివరాలు రాబట్టేందుకు సిట్ ప్రయత్నిస్తోంది.

సన్నాలు సాగు చేద్దాం



మార్టేరు వరి పరిశోధన స్థానంలో వినూత్న ప్రయోగం

ఎకరంలో 15 సన్న రకాల సాగు


మార్టేరు వరి పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న సన్నాలు

ఈనాడు - ఏలూరు

సన్న బియ్యానికి గిరాకీ బాగా ఉండటంతో రైతులు కూడా వాటిని పండించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. సాధారణ రకాలతో పోలిస్తే క్వింటాలుకు రూ.250 వరకు అధిక ధర లభిస్తుంది. అయితే అన్ని రకాలూ అన్ని ప్రాంతాల్లో సాగుకు అనుకూలం కాకపోవడంతో.. సరైన దిగుబడులు రావడం లేదు. తమ ప్రాంతానికి ఏ రకం అనుకూలమైనదో గుర్తించి సాగు చేస్తే పంట లాభదాయకం అవుతుంది. పశ్చిమగోదావరి జిల్లా మార్టేరు వరి పరిశోధన స్థానంలో ఎకరం భూమిలో 15 సన్న రకాల వరిని సాగు చేసి అక్కడి శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో భూముల తీరుకు అనుగుణంగా అనువైన రకాల ఎంపిక, నారు నుంచి కోత వరకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై మార్టేరు వరి పరిశోధనా స్థానానికి చెందిన గోదావరి మండలం సహ పరిశోధన సంచాలకుడు టి.శ్రీనివాస్, విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త కృష్ణాజీ వివరాలు తెలియజేశారు.

సాగు విధానం ఇలా: విత్తనం ద్వారా వ్యాపించే తెగుళ్ల నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్‌లో విత్తన శుద్ధి చేసుకోవాలి. నానబెట్టి మడి కట్టి (విత్తనాలపై గడ్డి కప్పి) 24 గంటల తర్వాత నారుమడిలో చల్లితే బాగా మొలకలు వస్తాయి. నారు బాగా రావడానికి సెంటు మడికి నత్రజని, భాస్వరం, పొటాష్ కిలో చొప్పున వేయాలి. ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ., కాలిబాట ఉండేలా నాట్లు వేయాలి. దీంతో తెగుళ్ల ఉనికి గమనించవచ్చు. కలుపు నివారణకు ఎకరాకు 1.25 లీటర్ల బుటాక్లోర్ వాడాలి. ఉల్లికోడు తెగులుకు ఎకరానికి 10 కిలోల కార్బో ఫ్యూరాన్ చల్లాలి. వ్యాధులు, తెగుళ్లకు అనుగుణంగా వ్యవసాయాధికారుల సలహా మేరకు మందులు చల్లాలి.

లాభాలు మెండు.. 1000 సన్న గింజల బరువు 13 నుంచి 15 గ్రాములు ఉండాలి.. బియ్యం పొడవు వెడల్పు నిష్పత్తి 2:5 కన్నా ఎక్కువగా ఉంటుంది. అన్నం ముద్ద కాకుండా మెతుకుపై నిలువు గీత లేకుండా ఉంటుంది. ఈ లక్షణాల వల్ల సాధారణ రకాల కంటే బస్తాకు రూ.250 ఎక్కువ ధర ఉంటుంది.

ఎకరాకు 35 బస్తాలు.. రూ.9వేల అదనపు ఆదాయం: నారు నుంచి కోత వరకు శాస్త్రవేత్తలు చెబుతున్న యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎకరానికి 35 బస్తాల (బస్తా 75 కిలోలు) వరకు దిగుబడి సాధించవచ్చని అంచనా వేశారు. ప్రస్తుతం సన్నాలకు ఉన్న డిమాండ్ ప్రకారం ఆదాయం కూడా పెంచుకోవచ్చు. సాధారణ రకాల కంటే బస్తాకు రూ.250 వరకు అదనంగా బయట మార్కెట్‌లో ధర వస్తుంది. అంటే ఎకరానికి దాదాపు రూ.9 వేల వరకు అధిక ఆదాయం పొందవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

సాగుకు అనుకూల రకాలివే..

రాయలసీమ, తెలంగాణలో అన్ని ప్రాంతాలకు: ఎన్ఎల్ఆర్ 34449, ఎన్ఎల్ఆర్ 3354, ఎన్ఎల్ఆర్ 3648, ఎన్‌డీఎల్ఆర్ 7, ఎంటీయూ 1282, ఎంటీయూ 1426, ఎంటీయూ 1224

ఏలూరు, కృష్ణా, బాపట్ల, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, నెల్లూరు, ప్రకాశం: బీపీటీ 5204, ఎంసీఎం 103

నెల్లూరు, చిత్తూరు, తిరుపతి: ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638, కేఎన్ఎం 733

పల్నాడు జిల్లా : జేజీఎల్ 348

అన్ని ప్రాంతాల్లో సేంద్రియ సాగుకు: జైశ్రీరామ్, హెచ్ఎంటీ సోనా

జనగణనలో కులగణన చాలా అవసరం

● సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ ఎన్వీ రమణ




ఈనాడు, హైదరాబాద్: జనగణనలో భాగంగా కులగణన చేయడం చాలా అవసరమని, ఇప్పటికే చాలా ఆలస్యమైందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. "మన సమాజంలో కులం, కులం ఆధారిత వివక్ష కఠోరమైన వాస్తవం. కానీ ఆ కఠోర వాస్తవాన్ని విస్మరిస్తూ జీవించేందుకు అలవాటు పడ్డాం. ఇప్పుడు మనం మేల్కోవాల్సిన సమయం ఆసన్నమైంది. భారతదేశం లాంటి విశాలమైన, విభిన్నమైన దేశానికి సరైన ప్రామాణిక డేటా సేకరించకపోతే దేశ ప్రజల, దేశ సమగ్ర అభివృద్ధి కోసం శాస్త్రీయమైన వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదు. ఈ నిర్ణయం ప్రజల్లోని సామాజిక, ఆర్థిక అంతరాలను తగ్గించి, అన్ని వర్గాలకు అధికారం, సంపదలో అర్థవంతమైన వాటా, హక్కు కల్పించేందుకు దోహదం చేస్తుందన్న నమ్మకం ఉంది. ఈ నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి, దేశవ్యాప్తంగా జనాభా లెక్కల కోసం పోరాడుతున్న వారందరికీ అభినందనలు" అని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.


పనులు పరిశీలిస్తున్న మంత్రులు కేశవ్, నారాయణ, రవీంద్ర, మనోహర్


సభా ప్రాంగణంలో అతిథులు కూర్చొనేందుకు వేసిన సోఫాలు

మహోజ్వల ఘట్టం నేడే



రాజధాని పనుల పునఃప్రారంభోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు



హాజరు కానున్న ప్రధాన మంత్రి మోదీ, కేంద్ర మంత్రులు



ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, తుళ్లూరు

మహోదయానికి ముహూర్తం నేడే..
నవ్యనగరి అమరావతి ప్రగతి పయనానికి అడుగు పడేది నేడే...
ఐదేళ్ల చీకటి తెరను చీల్చుకుని.. కొత్త వెలుగుల్లోకి కొంగొత్త ఆశలతో పైకెగసేది నేడే..

గత ప్రభుత్వ విధ్వంసకర పాలనతో చిట్టడవిలా మారిపోయిన రాజధాని అమరావతి పునరుజ్జీవం దిశగా అడుగులేస్తోంది. కూటమి ప్రభుత్వ సంకల్ప దీక్షతో పక్కా కార్యాచరణ ప్రణాళికతో కొత్త ఊపిరి పీల్చుకుంటోంది. రాజధాని పనుల పునఃప్రారంభోత్సవానికి శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. రాజధానిలో పనులు పరుగులు పెడితే ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాలు ప్రగతి బాట పట్టనున్నాయి. మౌలిక వసతుల కల్పన పనుల్లో రెండు జిల్లాలవారు పెద్దఎత్తున భాగస్వాములు కాబోతున్నారు. అపారమైన ఉపాధి అవకాశాలతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోనున్నాయి. పనుల పునఃప్రారంభోత్సవ వేళ రాజధాని ప్రాంతం సరికొత్త కాంతులతో వెలుగులీనుతోంది. భారీ యంత్రాలు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వృత్తినిపుణులు, కార్మికులతో సందడి మొదలైంది.

ఎదురుచూపులు ఫలించిన వేళ....

గత వైకాపా పాలనలో రాజధాని ప్రాంతంలో కన్నీరు పెట్టని వ్యక్తి లేరు. నిత్యం రైతుల ఆందోళనలు.. కర్షకుల కన్నీళ్లు.. కూలీల ఆకలి బాధలు.. వ్యాపారుల నిట్టూర్పులే కనిపించేవి. ఈ కష్టాలు ఎప్పుడు తీరతాయా అని కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురుచూసిన వారి ఆశలు ఫలించాయి. కూటమి ప్రభుత్వం రాకతో వారికి ఉపశమనం లభించింది. ఇప్పుడు రూ. వేల కోట్లతో పనులు చేపడుతుండడంతో భవిష్యత్తుపై భరోసా దక్కింది. ఆ ధీమాతోనే పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాజధాని గ్రామాల ప్రజలు పండగలా భావిస్తున్నారు. అందులో భాగస్వాములవుతున్నారు. అమరావతిని ఆకుపచ్చ నగరంగా తీర్చిదిద్దుతామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించడం, అందుకు అనుగుణంగా మౌలిక వసతుల పనులు చేపట్టడంతో ప్రణాళికాయుత నగరంగా అభివృద్ధి చెందనుంది. ఒకప్పుడు పల్లెలుగా ఉన్న ఈ ప్రాంతం మహానగరంగా నిర్మితమవుతుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సర్వం సిద్ధం

అమరావతి పనుల పునఃప్రారంభోత్సవ మహోత్సవానికి సభా వేదిక సర్వం సిద్ధం చేశారు. గుంటూరు జిల్లా యంత్రాంగంతోపాటు సీఆర్‌డీఏ, సాధారణ పరిపాలనశాఖ సమన్వయంతో గత పది రోజులుగా శ్రమించి పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి తరలివస్తున్న లక్షలాది మందికి ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేశారు. సభ పరిసరాల్లోనే వాహనాల పార్కింగ్, రాపోకలకు ప్రత్యేక మార్గాలు, ఆహ్వానితులు వారు సులువుగా సభా ప్రాంగణానికి చేరుకునేలా ఎక్కడికక్కడ క్యూలైన్ కోర్టులలో సూచికలు ఏర్పాటు చేశారు.


తుది దశలో పైలాన్ పనులు..


ప్రధాని హెలీప్యాడ్ దిగి వెళ్లే దారిలో మోహరించిన భద్రతా బలగాలు

ఉపాధి, ఉద్యోగ అవకాశాలొస్తాయి



అమరావతిని అభివృద్ధి చేస్తే దేశ, విదేశాలకు చెందిన అనేక కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెడతాయి. కొత్త సంస్థలు వస్తాయి. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలెన్నో దక్కుతాయి. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.
– టి.రవి, దళిత రైతు, దొండపాడు

పేదల జీవితాల్లో వెలుగు



రాజధాని అమరావతి ప్రాంతంలో అత్యధికులు బడుగు బలహీనవర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీలే. రాష్ట్ర విశాల ప్రయోజనాల కోసం భూముల త్యాగం చేశారు. రాజధాని అభివృద్ధి చెందితే పేదలూ వృద్ధిలోకి వస్తారు.
– చిలకా బసవయ్య, అమరావతి దళిత బహుజన జేఏసీ అధ్యక్షుడు, రాయపూడి


కార్యక్రమాన్ని వీక్షించేందుకు నిర్మించిన గ్యాలరీ



సీడ్‌యాక్సెస్ రోడ్డు నుంచి సభా వేదికకు వెళ్లే మార్గంలో అందమైన మొక్కలు..


పర్యవేక్షిస్తున్న సీఎస్ విజయానంద్, చిత్రంలో వీరపాండియన్, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, ముకేష్‌కుమార్ మీనా


పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీజీ అధికారి

అమరావతికి 96 మెట్రిక్ టన్నుల అరటి రవాణా

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అమరావతి పనుల పునః ప్రారంభోత్సవానికి జనం భారీ సంఖ్యలో తరలిరానున్నారు. మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో అనంతపురం నుంచి 96 మెట్రిక్ టన్నులు అరటికాయలు కొనుగోలు చేసి అమరావతికి పంపారు. ముందుగా వ్యాపారులు అరటి కొనుగోలు చేశారు. రైపెనింగ్ ఛాంబర్లలో సహజ సిద్ధంగా అరటికాయలు మాగబెట్టారు. ప్యాకింగ్ చేసి 9 లారీల్లో పంపారు. గుంటూరు, మంగళగిరి, బాపట్ల, పల్నాడుల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో అరటికాయలు అన్‌లోడ్ చేశారు. అమరావతిలో భోజన ఏర్పాట్లన్నీ మార్కెటింగ్‌శాఖకు అప్పగించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా మార్కెటింగ్ శాఖలో పనిచేసే ఉద్యోగులను అమరావతికి పంపినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి తెలిపారు.



మూడు పూటలా ఆహారం

ఈనాడు – అమరావతి

అమరావతి పనుల పునఃప్రారంభోత్సవ సభకు వస్తున్న ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లతోపాటు పండ్లు కూడా పంపిణీ చేయనుంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి ఆహారం ఇవ్వనున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల నుంచి వస్తున్నవారికి బస్సుల్లోనే ఆహారం అందిస్తారు. ఒక్కో ఆహార కేంద్రం వద్ద ఒక్కో అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు.

కృష్ణా జిల్లా వారికి...

850 బస్సుల్లో 51 వేల మంది రానున్నారు. వీరికి పెనమలూరు వికాస్ పాఠశాల, దావులూరు టోల్ ప్లాజా, గుడివాడ డిమార్ట్ ప్రాంతం, దావులూరు టోల్ ప్లాజా-2 వద్ద భోజనం అందిస్తారు.

ఎన్టీఆర్ జిల్లావారికి

1,100 బస్సుల్లో 66 వేల మంది రానున్నారు. వీరికి మైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఇబ్రహీంపట్నం కూడలి, విజయవాడలోని విద్యాధరపురం షాదీఖానా కూడలిలో ఆహారం అందిస్తారు.

ఉదయం అల్పాహారంలో...

- పులిహోర, రెండు అరటి పండ్లు, రెండు అరలీటరు నీటి సీసాలు, ఓఆర్ఎస్ టెట్రా ప్యాకెట్, మజ్జిగ ప్యాకెట్.

మధ్యాహ్న భోజనం..

- వెజిటబుల్ బిర్యానీ, రెండు అరటిపండ్లు, ఓఆర్ఎస్ టెట్రా ప్యాకెట్, మజ్జిగ, రెండు తాగునీటి సీసాలు.

వేదిక వద్ద..

- రెండు బిస్కెట్ ప్యాకెట్లు, రెండు నారింజ పండ్లు, ఓఆర్ఎస్ టెట్రాప్యాకెట్, మజ్జిగ, రెండు తాగునీటి సీసాలు.

రాత్రి డిన్నర్..

- కిచిడి, గోంగూర చట్నీ, రెండు తాగునీటి సీసాలు, మజ్జిగ.



నిరంతర వెలుగుల్లో...

ఈనాడు, అమరావతి: అమరావతి నగర నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవం సందర్భంగా ప్రాంగణమంతటా విద్యుద్దీపాలు అమర్చారు. సాంకేతిక కారణాలతో సరఫరాకు అంతరాయం కలగకుండా జనరేటర్లను అందుబాటులో ఉంచారు. ప్రధాన వేదిక సహా.. పరిసర ప్రాంగణాలు విద్యుత్తు వెలుగుల్లో కాంతులీనుతున్నాయి. మొత్తం 1,595 కేవీఏ విద్యుత్తు లోడ్ ఉంటుందని అంచనా. ఈ మేరకు 3,185 కేవీఏ విద్యుత్తు లోడు సామర్థ్యంతో విద్యుత్తు నియంత్రికలు ఏర్పాటు చేశారు. 315 కేవీఏ సామర్థ్యం ఉన్న నియంత్రికలు 3, 160 కేవీఏ సామర్థ్యం ఉన్న నియంత్రికలు 14 ఏర్పాటు చేశారు. ప్రధాన వేదికపై దీపాలతో పాటు శీతల యంత్రాలు, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక, ఎల్ఈడీ తెర, గ్యాలరీ, కూలర్లు అమర్చారు.


ప్రధాని కోసం నిర్మించిన గ్రీన్ హౌస్


పార్కింగ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సామూహిక మరుగుదొడ్లు


ప్రధాన వేదిక వద్దకు చేరే వారి కోసం కంపార్ట్‌మెంట్ల తరహాలో బారికేడ్లు

విజయవాడ-ఖాజీపేట మూడోలైన్‌లో ముందడుగు

- కీలకమైన ఐదు కిలోమీటర్ల ట్రాక్ పనులు పూర్తి
- నేడు ప్రధాని చేతులమీదుగా జాతికి అంకితం

ఈనాడు, అమరావతి

విజయవాడ-ఖాజీపేట మూడో రైల్వేలైన్‌లో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో మిగిలిపోయిన ఐదు కిలోమీటర్లను ప్రధాని మోదీ నేడు ఆవిష్కరించి జాతికి అంకితం ఇవ్వనున్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి రాయనపాడు వద్ద ఉన్న న్యూవెస్ట్‌బ్లాక్ హట్ క్యాబిన్ వరకు ఈ ఐదు కిలోమీటర్ల లైన్ నిర్మాణం ఇటీవలే పూర్తయింది. ఈ నూతన లైన్‌తో విజయవాడ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే రైళ్లకు ఇకనుంచి మూడో లైన్ అందుబాటులో ఉంటుంది. రెండు ట్రాక్‌లపై ప్యాసింజర్ రైళ్లు, ఒకదానిపై గూడ్స్‌ను నడిపేందుకు వీలుంటుంది. ప్రస్తుతం సరకు రవాణా చేసే గూడ్స్ బళ్లు వచ్చే సమయంలో ప్యాసింజర్ రైళ్లను ఆపాల్సి వస్తోంది. ఇకనుంచి మూడో లైన్‌ను ప్రత్యేకంగా సరకు రవాణాకు వినియోగించే వీలుంటుందని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.

ఖాజీపేట నుంచి విజయవాడ మధ్య 219 కి.మీ. మూడో లైన్ నిర్మాణాన్ని 2012-13లో రూ.1952కోట్లతో ఆరంభించారు. 184కి.మీ. తెలంగాణ, 35కి.మీ. ఏపీలో ఉంది. ఎన్టీఆర్ జిల్లా గంగినేని నుంచి విజయవాడ మధ్యలో ఈ 35 కి.మీ. మూడో ట్రాక్ నిర్మాణం జరిగింది. ఇప్పటికే 30 కి.మీ పూర్తయ్యాయి. తాజాగా మిగిలిన ఐదు కి.మీ లైన్ పనులు రూ.70కోట్లతో పూర్తి చేసి ప్రధాని చేతులమీదుగా ఆరంభించేందుకు సిద్ధం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో గంగినేని దాటిన తర్వాత వచ్చే ఎర్రుపాలెం స్టేషన్ ఖమ్మం జిల్లాలో ఉంది.

2025 చివరికి పూర్తి చేయాలని..

ఖాజీపేట-విజయవాడ మధ్యలో నిర్మిస్తున్న 219 కి.మీ. మూడోలైన్ పనులు మొత్తం 2025 చివరికి పూర్తి చేయాలనేది లక్ష్యం. తెలంగాణలోని 184 కి.మీ.లో 114 కి.మీ. లైన్ పూర్తయింది. దీనిలో ఖాజీపేట నుంచి నెక్కొండ వరకు 42 కి.మీ., మరోవైపు ఏపీలోని గంగినేని దాటిన తర్వాత ఖమ్మం వరకు 72 కి.మీ. పూర్తయింది. మధ్యలో 70కి.మీ. లైన్ పనులు ప్రస్తుతం చేపడుతున్నారు. ఈ మూడోలైన్ పూర్తయితే ఖాజీపేట-విజయవాడ మధ్యలో రైళ్ల రాకపోకల్లో జాప్యం చాలా వరకూ తగ్గుతుంది. ప్రయాణికుల రైళ్లు మరిన్ని నడిపేందుకు అవకాశం కలుగుతుందని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.



గుల్లలమోద క్షిపణి పరీక్ష కేంద్రం అడ్డంకులకు తెర

రూ.1500 కోట్ల పనులకు వర్చువల్‌గా నేడు ప్రధాని శంకుస్థాపన

ఈనాడు డిజిటల్– మచిలీపట్నం

రాష్ట్రానికి మరో ప్రఖ్యాత రక్షణ రంగ ప్రాజెక్టు సాకారం కానుంది. కృష్ణా జిల్లాకు మణిహారం లాంటి గుల్లలమోద క్షిపణి పరీక్ష కేంద్రంలో రూ.1500కోట్ల పనులకు ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. దీంతో 14 ఏళ్ల నిరీక్షణకు తెరపడనుంది. ఒడిశాలోని బాలాసోర్‌లో క్షిపణి పరీక్ష కేంద్రంలో దూర ప్రాంత క్షిపణుల సామర్థ్యాలను పరీక్షిస్తారు. పెరుగుతున్న రక్షణ అవసరాల దృష్ట్యా కొత్త కేంద్రం ఏర్పాటుకు నాగాయలంక మండలం గుల్లలమోద ప్రాంతం క్షిపణి పరీక్షలకు ఎంతో అనుకూలం కావడంతో డీఆర్‌డీవో ఈ ప్రాజెక్టు కోసం వచ్చే ఐదేళ్లలో రూ.20వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మూలన విసిరేసినట్లు ఉండే ఈ ప్రాంతం ఈ ప్రాజెక్టుతో అభివృద్ధి కానుంది. దీంతో రోడ్లు, విద్యుత్తు, నీరు, పచ్చదనం తదితర మౌలిక వసతులు మెరుగుపడనున్నాయి. ఈ కేంద్రంలో రక్షణ రంగ పరికరాల తయారీకి పరిశ్రమ.. దాని అనుబంధంగా మరికొన్ని పరిశ్రమలు రానుండడంతో జిల్లాలోని యువతకు ఉపాధి.. ఉద్యోగ అవకాశాలకు దోహదపడనుంది. సుమారు 300 మంది శాస్త్రవేత్తలు, సిబ్బంది నివాసం ఉండనున్నారు. దీంతో ఈ ప్రాంతం ఆర్థిక పరిపుష్టికి కీలకంగా మారనుంది.


డీఆర్‌డీవో పరిపాలన భవనం



కట్టుతప్పిన బంధం.. బతుకు ఛిన్నాభిన్నం..

☛ **పామర్రు మండలం కొండిపర్రుకు చెందిన ఆటోడ్రైవర్ మట్టా అశోక్** భార్యపై కొంత కాలం నుంచి అనుమానం పెంచుకున్నాడు. తరచూ మద్యం తాగొచ్చి ఆమెను వేధించేవాడు. ఇటీవల మళ్లీ వారిద్దరూ గొడవ పడగా పుట్టింటికి వెళ్లింది. దుస్తులు తెచ్చుకుందామని ఇంటికి వచ్చిన భార్యపై అశోక్ కత్తితో తీవ్రంగా దాడి చేశాడు. మొఖంపైనా, పొట్టలో పొడిచాడు. అడ్డుకున్న మరదలిపైనా విచక్షణా రహితంగా కత్తిదూశాడు.

☛ **కొన్నాళ్ల కిందట పశ్చిమ ఇబ్రహీంపట్నం ఖిల్లాకు సమీపంలోని ఓ ఇంట్లో** అన్న కుటుంబంతో, చెల్లెలు వేరే గదిలో ఒంటరిగా ఉంటున్నారు. ఆ ఇల్లు పిత్రార్జితంగా వచ్చింది. మద్యానికి బానిసైన అన్న చెల్లెలితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో విచక్షణ మరిచిన వెంకటరావు చెల్లెలిపై గొడ్డలితో దాడి చేశాడు. స్థానికులు ఆమెను ఆసుపత్రికి తీరలించారు.

☛ **జగ్గయ్యపేట తిరుమలగిరికి చెందిన పసుపులేటి మురళీకృష్ణకు,** సమీప గ్రామానికి చెందిన మంగమ్మకు 12 ఏళ్ల కిందట వివాహమైంది. కొంతకాలంగా మురళీకృష్ణ భార్య మంగమ్మపై అనుమానం పెంచుకుని తరచూ తగాదా పడుతున్నాడు. ఇటీవల మద్యం తాగొచ్చి రోకలి బండతో భార్యపై దాడి చేశాడు. తలపై బలంగా మోదడంతో మంగమ్మ అక్కడికక్కడే మృతి చెందింది.

ఈనాడు డిజిటల్, అమరావతి

సమాజంలో బలహీనమవుతున్న కుటుంబ బంధాలకు పై ఉదంతాలు మచ్చుతునకలు.. తల్లిదండ్రులు, బిడ్డల మధ్య అంతరాలు పెరిగిపోయి.. భార్యాభర్తల మధ్య అనుమానాలు రేగి చివరికి చంపుకొనే వరకూ వెళ్తున్నారు. ప్రధానంగా వీటికి మద్యం, కుటుంబ కలహాలు, ఆర్థిక విషయాలు, వివాహేతర బంధాలే కారణమని మానసిక వైద్య నిపుణులు, పోలీసులు పేర్కొంటున్నారు.

చెడు వ్యసనాల వల్లే..

తల్లిదండ్రుల నుంచి సరైన పర్యవేక్షణ లేని పిల్లలు మద్యం, గంజాయి తదితర మత్తుపదార్థాలకు బానిసలవుతున్నారు. తీరా చేయిదాటి పోయాక తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వకుండా కట్టడి చేయబోతే వారిపై కక్ష పెంచుకుని దాడులకూ దిగుతున్నారు.

వివాహేతర సంబంధాలూ కారణమే..

కుటుంబాల్లో వివాహేతర సంబంధాలు కూడా హత్యలకు దారితీస్తున్నాయి. తాజాగా విజయవాడ శివారు ప్రాంతానికి చెందిన మహిళ భర్తను వదిలేసింది. పాపతో ఒంటరిగా ఉంటోంది. కొన్నేళ్ల కిందట చిట్టినగర్‌లోని గంజాయి బ్యాచ్‌కు చెందిన శ్రీరామ్‌తో పరిచయం ఏర్పడింది. వీరిద్దరి మధ్య పాప అడ్డంగా మారిందని తరచూ ఆ పాపని కొట్టే వారు. ఇటీవల ఒంటిపై తీవ్రంగా వాతలు పెట్టడం కలకలం రేపింది.



ఇటీవల భర్త చేతిలో దాడికి గురైన గుడివాడ మహిళ

తల్లిదండ్రులే జాగ్రత్త పడాలి

ప్రస్తుతం కుటుంబ బంధాలు బలహీనం అవ్వడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుని పిల్లలను పట్టించుకోవడం లేదు. ప్రధానంగా చెడు సహవాసాలు, వ్యసనాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు వారిని పర్యవేక్షిస్తూ ఉండాలి. పిల్లలతో తరచూ మాట్లాడాలి. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకునే స్వభావం తల్లిదండ్రుల్లో ఎవరికి ఉన్నా దానిని వీలైనంత త్వరగా తగ్గించుకునేందుకు ప్రయత్నం చేయాలి. ఒక్క తప్పుతో మొత్తం కుటుంబం ఛిన్నాభిన్నం అవుతుంది. **- ఫణిప్రసాద్ ముక్తేవి, వ్యక్తిత్వ వికాస నిపుణులు**

పోలీసు వలయంలో విమానాశ్రయం

ప్రధాని పర్యటనకు భారీ బందోబస్తు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం అమరావతి రాజధానికి వస్తున్న నేపథ్యంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కేంద్రం, రాష్ట్ర భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. విమానాశ్రయ పరిసరాలను గురువారం క్షుణ్ణంగా తనిఖీ చేపట్టాయి. రన్‌వే, చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి, విమానాశ్రయ పరిసరాల్లో ముందస్తు గస్తీ నిర్వహించారు. 15 సెక్టార్లుగా బందోబస్తును విభజించిన అధికారులు.. ప్రతి సెక్టార్‌కు ఒక అదనపు ఎస్పీ/ఎస్పీని పర్యవేక్షణాధికారిగా కేటాయించారు. పర్యటనపై ఉన్నతాధికారులతో కలిసి ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. భద్రతా చర్యల్లో పాల్గొనే వైద్య, పోలీసు, ఇతర విభాగాలకు చెందిన సిబ్బంది ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్‌హెచ్ఏఐ, ఇతర శాఖల సమన్వయంతో ముందస్తు ట్రైల్ రన్ నిర్వహించారు. ప్రధాని పర్యటనలో ఏలూరు, తూర్పు, పశ్చిమగోదావరి, కాకినాడ జిల్లాల నుంచి సుమారు వెయ్యి మంది అధికారులు, ఇతర పోలీసు భద్రతా సిబ్బందితో పటిష్ఠ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశారు.



విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్త, పక్కన ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ గంగాధరరావు

ఏర్పాట్లు పూర్తి చేశాం

గన్నవరం గ్రామీణం: భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధరరావు తెలిపారు. విమానాశ్రయ ఆవరణలో ప్రధానికి ఘన స్వాగతం పలికేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పర్యటనపై విమానాశ్రయ ఉద్యోగులు, వివిధ శాఖలతో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించిన అధికారులు పలు సూచనలు చేసింది. ప్రధాని పర్యటనలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికీ ఫొటోలతో కూడిన గుర్తింపు కార్డులు జారీ చేసినట్లు వెల్లడించారు. విమానాశ్రయ పరిసరాల్లో అపరిశుభ్రత చర్యలకు తావులేకుండా సర్వం సుందరంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు తిరువనంతపురం నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకోనున్న ప్రధాని నరేంద్రమోదీ.. విమానాశ్రయం నుంచి ప్రత్యేక వాయుసేన హెలికాప్టర్‌లో అమరావతిలో ఏర్పాటు చేసిన సభ వద్దకు తరలి వెళతారు. తిరిగి 5.15 గంటలకు విమానాశ్రయం చేరుకొని ప్రత్యేక విమానంలో దిల్లీ బయలుదేరి వెళతారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలిశర్మ, ఎస్పీ గంగాధరరావు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు వాయిదా

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఈనెల 2న (శుక్రవారం) జరగాల్సిన పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ తెలిపారు.

రాజధాని సభకు చేరుకోవాల్సిన మార్గాలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే

ఎంపీ, వీవీఐపీ, వీఐపీ వాహనాలు ప్రకాశం బ్యారేజ్ మీదగా లోటస్‌పాయింట్, కరకట్ట, సీడ్ యాక్సెస్ రోడ్ (ఈ3), ఎ.ఏ9 జంక్షన్ నుంచి సభా ప్రాంగణానికి చేరుకుని వీ8, వీ9 సెక్టార్లలో పార్కింగ్ చేసుకోవాలని అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు.

ఆకస్మిక మార్గం: సభా ప్రాంగణం, ఈ8 రోడ్డు, కరకట్ట రోడ్డు, ప్రకాశం బ్యారేజ్ ద్వారా విజయవాడ వెళ్లవచ్చు.

☛ వీఐపీ, ఎ పాస్ వాహనదారులు ప్రకాశం బ్యారేజ్ మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఉండవల్లి సెంటర్, ఉండవల్లి గుహల రోడ్డు నుంచి కుడివైపు తిరిగి ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న రోడ్డు (కరకట్ట పక్కన) ద్వారా సీడ్ యాక్సెస్ రోడ్డు (ఈ3) చేరుకుని ఎన్ 10 జంక్షన్ ద్వారా సభా ప్రాంగణానికి చేరుకోవాలి. వారి వాహనాలు సభా ప్రాంగణం వెనక ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో నిలుపుకోవాలి.



సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన పార్కింగ్

రూట్ 1: కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చే వాహనదారులు రూట్ నంబర్ 1 రహదారిలో గొల్లపూడి గ్రామం నుంచి పశ్చిమ బైపాస్ నవయుగ బ్రిడ్జి మీదగా వెంకటపాలెం గ్రామం వద్ద సర్వీసు రోడ్డులోకి వెళ్లాలి. అక్కడ నుంచి మందడం ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి ఎన్ 7 జంక్షన్ (మందడం పోలీస్ బూత్ సమీపంలో) ద్వారా కుడివైపునకు తిరిగి పార్కింగ్ నంబర్ 6లో వాహనాలు నిలపాలి.

రూట్ 2: కృష్ణా జిల్లా నుంచి రూట్ 2 ద్వారా వచ్చే వాహనదారులు వారధి, తాడేపల్లి హైవే, మయూరి టెక్‌పార్కు డౌన్, ఎన్నారై అండర్‌పాస్, నేతన్న సర్కిల్, డాన్ బాస్కో స్కూల్, ఎర్రబాలెం, కృష్ణయ్యపాలెం, జడ్ జంక్షన్ ఈ8 రోడ్డు నుంచి పార్కింగ్ స్లాట్ నంబర్ 1 వద్దకు చేరుకోవాలి.

రూట్ 3: గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి రూట్ 3 ద్వారా వచ్చే వాహనదారులు కాజా టోల్ గేట్ సర్వీసు రోడ్డు నుంచి మంగళగిరి హోటల్ ఎదురుగా తిరిగి వెస్ట్ బైపాస్ మీదుగా ఎన్6, ఈ11 జంక్షన్, ఎ.ఏ9 జంక్షన్, ఈ8, ఎన్ 9 జంక్షన్ ద్వారా పార్కింగ్ స్లాట్ 13కి చేరుకోవచ్చు.

రూట్ 4: గుంటూరు నుంచి రూట్ నంబర్ 4 ద్వారా వచ్చే వాహనదారులు గుంటూరు, తాడికొండ అడ్డరోడ్డు, తాడికొండ, పెదపరిమి, ఈ6 రోడ్డు ప్రారంభం (తుళ్లూరు అయ్యప్పస్వామి ఆలయం), ఎన్11, ఈ7 జంక్షన్, ఎన్ 10 రోడ్డు నుంచి పార్కింగ్ స్లాట్ 16 చేరుకోవాలి.

రూట్ 5: పల్నాడు జిల్లా నుంచి రూట్ నంబర్ 5 ద్వారా వచ్చే వాహనదారులు అమరావతి, పెద్ద మద్దూరు, వైకుంఠపురం, బోయపాలెం, దొండపాడు, రాయపూడి వై జంక్షన్, ఎమ్మెల్యే క్వార్టర్స్, న్యూపాటిస్, ఈ6, ఎన్ 11 జంక్షన్, ఎన్ 11, ఈ7 జంక్షన్, ఎన్ 10 రోడ్డు ద్వారా పార్కింగ్ స్లాట్ 18 చేరుకోవాలి.

అత్యవసర సేవల మార్గం: అత్యవసర సేవలకు సంబంధించిన వాహనదారులు సభా ప్రాంగణం ఎ.ఏ9 జంక్షన్, కురగల్లు, నిడమర్రు, మంగళగిరి నుంచి వెళ్లవచ్చు.

క్రీడల నగరంలో చెస్ అకాడమీ ఏర్పాటుకు కృషి : ఎంపీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: అమరావతి రాజధాని ప్రాంతంలో నిర్మించనున్న అమరావతి స్పోర్ట్స్ సిటీలో చెస్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. సిడ్నీలో గత నెల 23 నుంచి 27 వరకు జరిగిన సిడ్నీ ఇంటర్నేషనల్ చెస్ ఛాలెంజెస్ టోర్నీలో విజయం సాధించిన ఉమెన్ గ్రాండ్ మాస్టర్ పొట్లూరి సుప్రీతను గురువారం ఆయన కార్యాలయంలో సత్కరించడంతో పాటు జ్ఞాపిక అందజేసి అభినందించారు. ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీ చీఫ్ కోచ్ వీఆర్ బొబ్బాతో కలిసి సుప్రీత మర్యాదపూర్వకంగా ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ త్వరలో చెస్ క్రీడాకారులతో మాట్లాడి వారికి కావాల్సిన వనరులు సమకూర్చడానికి సహకారం అందిస్తానన్నారు. సీఎం చంద్రబాబు కృషితో రాజధాని ప్రాంతంలో అమరావతి స్పోర్ట్స్ సిటీతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు కానుందన్నారు. కోచ్ వీఆర్ బొబ్బా మాట్లాడుతూ. . సిడ్నీ ఛాలెంజెస్ చెస్ టోర్నీలో మొత్తం తొమ్మిది రౌండ్లకు ఏడింట్లో గెలిచి, ఒక రౌండ్‌ను డ్రా చేసుకోవడం ద్వారా 7.5 పాయింట్లతో పసిడి పతకాన్ని, వెయ్యి డాలర్ల నగదు బహుమతిని గెలుచుకుందన్నారు. ఈ టోర్నీలో సాధించిన ఫిడే పాయింట్ల ద్వారా ప్రస్తుతం 1949 పాయింట్లకు ఎగబాకిందన్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లా చెస్ అండర్-11, అండర్-13 బాలుర చెస్ ఛాంపియన్‌షిప్‌లో విజేతలుగా నిలిచిన ఉప్పలపాటి హర్షిత్‌సాయి, కె.శౌర్యలకు ఎంపీ బహుమతులు అందజేశారు. చిన్నారులు హీర శేషసాయి, ఈషా శేషసాయి పదో తరగతిలో 566 మార్కులు సాధించిన చెస్ క్రీడాకారిణి భానుశ్రీ చెన్నూరికి నగదు పారితోషకాలు అందించారు.



సుప్రీతకు జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ శివనాథ్, చిత్రంలో వీఆర్ బొబ్బా

కులగణన నిర్ణయం బలహీన వర్గాల అభ్యున్నతికి దోహదం

పటమట: కులగణన చేపట్టడం బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి దోహదం చేస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. వచ్చే జనగణనలో కులగణన అంశాన్ని చేర్చాలని కేంద్ర మంత్రివర్గం ఆమోదించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. కులగణనను కొన్ని పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్నాయని, ఎన్డీఏ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన మాటకు కట్టుబడి ఆచరణలో చూపిందని వెల్లడించారు. కులగణన నిర్ణయం సామాజిక అసమానతలను చెరిపివేస్తుందన్నారు.

వివాహిత దారుణ హత్య

కత్తితో 20 చోట్ల విచక్షణారహితంగా దాడి

నందిగామ: నందిగామలో వివాహిత మల్లెల దుర్గాస్రవంతి (38)పై వ్యక్తి కత్తితో విచక్షణరహితంగా దాడి చేసి హతమార్చాడు. స్థానిక రైతుపేట ఎస్సీ కాలనీ కట్ట వద్ద ఆమె అద్దెకు ఉంటోంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కుమారుడు ఆస్తితో కలిసి ఆమె కోదాడ వెళ్లి గురువారం రాత్రి తిరిగి ఇంటికి వచ్చి ఇంటి ముందు ఆసీ బయటికి వెళ్లారు. అదే సమయంలో ఆమెకు తెలిసిన స్థానిక టీసీకాలనీకి చెందిన అచ్చి పెద్దబాబు వచ్చి ఆమెతో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆమె వెంటనే కుమారుడికి ఫోన్ చేసి పెద్దబాబు అంకుల్ వచ్చి గొడవ చేస్తున్నాడని, అత్యవసరంగా రావాలని కోరింది. ఇంతలో ఆమెను ఇంట్లో నుంచి బయటికి తీసుకొచ్చి పెద్దబాబు కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. కుమారుడు వచ్చి దగ్గరికి వెళ్లేందుకు ప్రయత్నించగా కత్తి చూపించి బెదిరించి నిందితుడు పరారయ్యాడు. అనంతరం తీవ్రగాయాలైన దుర్గాస్రవంతిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. ఆమె శరీరంపై 20 చోట్ల కత్తి పోటు గాయాలున్నాయని వైద్యులు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. అక్కడ ఓ ప్రైవేటు ఆసుపత్రి సమీపంలో మృతి చెందినట్లు ఎస్సై అభిమన్యు తెలిపారు. ఎస్సై సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు కారణాలు ఇంకా తెలియరాలేదు. సంఘటనా స్థలంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.



అంబులెన్స్‌లో దుర్గాస్రవంతి

చరవాణుల దొంగతనం కేసులో రిమాండ్

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రైళ్లలో ప్రయాణికుల వద్ద చరవాణులను చోరీ చేసే దొంగను రైల్వే పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కేరళ రాష్ట్రానికి చెందిన ఎం.ఎస్.దీపేష్ పాత నేరస్థుడు. ఈ క్రమంలో అతడు విజయవాడ రైల్వేస్టేషన్‌లోని 10వ నంబరు ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా సంచరిస్తుండగా జీఆర్పీ సీఐ జేవీ రమణ తనిఖీ చేశారు. అతని వద్ద రూ.1,10,00 విలువ చేసే రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండు విధించారు.

5 నుంచి డీఎస్ఏ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఈ నెల ఒకటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు ప్రకటించినప్పటికీ ప్రధాని మోదీ రాజధాని అమరావతి పర్యటన సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడంతో ఈ నెల 5 నుంచి వచ్చే నెల 4 వరకు శిక్షణ శిబిరాలు కొనసాగనున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో 50 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఒక్కో కేంద్రానికి రూ.7వేలు చొప్పున శాప్ నగదు అందజేస్తుంది.

అథ్లెటిక్స్.. ఐజీఎంసీ, రైల్వే స్టేడియం, ఎంబీపీ స్టేడియం, ఆంధ్రా లయోలా కళాశాల **బాస్కెట్ బాల్..** ఐజీఎంసీ, కేబీసీ జడ్పీహెచ్ స్కూల్ (పటమట) ఆర్చరీ.. ఓల్గా ఆర్చరీ అకాడమీ **బ్యాడ్మింటన్..** సీహెచ్ఆర్కే, డీఆర్ఆర్ఎంసీ ఇండోర్ స్టేడియం, బాక్సింగ్.. ఐజీఎంసీ, కేవీకే (కృష్ణలంక), స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ క్లబ్ (భవానీపురం), ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ (కొత్తపేట), ఫుట్‌బాల్.. ఐజీఎంసీ, ఎంబీపీ, జడ్పీహెచ్ స్కూల్ (నిడమానూరు), రైల్వే గ్రౌండ్స్ (రాయనపాడు), **హ్యాండ్‌బాల్..** జడ్పీహెచ్ స్కూల్ (నున్న), హాకీ.. జడ్పీహెచ్ స్కూల్ (నున్న), ఎంబీపీ స్టేడియం, **జూడో..** ఐజీఎంసీ, వైఎస్సార్ కాలనీ (జక్కంపూడి), శుభోదయ హైస్కూల్, కేఆర్‌వీఆర్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ క్లబ్, **కబడ్డీ..** ఐజీఎంసీ, సత్యనారాయణపురం రైల్వే కాలనీ, రైల్వే స్టేడియం, జడ్పీహెచ్‌స్కూల్ (అంబాపురం), జడ్పీహెచ్ (తిరువూరు), **నెట్‌బాల్..** ఐజీఎంసీ, జడ్పీహెచ్ స్కూల్ (పటమట), **పవర్ లిఫ్టింగ్..** కేవీకే (జగ్గయ్యపేట), **సాఫ్ట్‌బాల్..** పాయికాపురం, ప్రభుత్వ జూనియర్ కళాశాల (రాధానగర్), సాఫ్ట్ టెన్నిస్.. ఐజీఎంసీ, **టేబుల్ టెన్నిస్..** డీఆర్ఆర్ఎంసీ, **తైక్వాండో..** ఐజీఎంసీ **టెన్నిస్..** ఐజీఎంసీ **వాలీబాల్..** ఐజీఎంసీ, జడ్పీహెచ్ స్కూల్ (అల్లూరు, జి.కొండూరు, కొండపల్లి, వీరులపాడు) **వాటర్ స్పోర్ట్స్..** పున్నమి ఘాట్ **వెయిట్ లిఫ్టింగ్..** ఐజీఎంసీ, తిరువూరు, **రెజ్లింగ్..** జడ్పీహెచ్ స్కూల్ (నున్న), ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ (కొత్తపేట) **ఉషు..** చిట్టినగర్ **యోగా..** కేవీకే (కృష్ణలంక)లో జరుగుతాయని డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ తెలిపారు.

ఎన్నికల హామీలు నెరవేరుస్తున్నాం: మంత్రి సవిత

గొల్లపూడి, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రతా పింఛన్లను గొల్లపూడిలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా ఎక్కువ మొత్తంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వృద్ధుల ఆర్థిక అవసరాలకు పింఛను డబ్బులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభానికి రావాలని కోరారు. మైలవరం నియోజకవర్గం అమరావతిలో భాగమని..భవిష్యత్తులో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు బొమ్మసాని సుబ్బారావు, అక్కల గాంధీ, బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గొల్లపూడిలో లబ్ధిదారుడితో మాట్లాడుతున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

గురు విశ్వస్ఫూర్తి బోధనలు స్ఫూర్తిదాయకం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు నిత్యం యోగా సాధన, ప్రాణాయామం చేయాలన్నదే విశ్వస్ఫూర్తి గురుదేవుల ఆకాంక్ష అని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. గురు విశ్వస్ఫూర్తి జయంతిని పెనుగంచిప్రోలులోని దివ్యక్షేత్రం స్ఫూర్తి యూనివర్స్‌లో గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో తెలుగు రాష్ట్రాల్లోని స్ఫూర్తి కుటుంబ సభ్యులు, ప్రముఖులు పాల్గొని విశ్వస్ఫూర్తి బోధనలు, ఆయనతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. మానవత్వంతో కూడిన ఆత్మీయ సమాజ నిర్మాణానికి స్ఫూర్తి కుటుంబ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా యోగా గురువు ప్రతాప్ రాసిన యోగా స్ఫూర్తి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ సేవకుడు పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్, దూరదర్శన్ మాజీ డైరెక్టర్ ఓలేటి పార్వతీశం, శతావధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, పెద్దఎత్తున సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు గురుదేవుల చిత్రపటంతో పెనుగంచిప్రోలులో భారీ ఊరేగింపు నిర్వహించారు.



గురువు ప్రతాప్ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ఐక్య పోరాటాలతోనే హక్కుల రక్షణ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: కార్మిక హక్కులను కాలరాయాలని చూస్తున్న భాజపా విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని ఆయన కోరారు. గవర్నర్‌పేట ఆలీబేగ్ వీధిలో సీఐటీయూ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఎ.వి.నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతున్నాయని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, చిత్రంలో సిహెచ్.బాబూరావు తదితరులు

4న తెనాలి మార్గంలో రైళ్ల రద్దు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : విజయవాడ డివిజన్ పరిధిలోని తెనాలి రైల్వేస్టేషన్ యార్డులో ట్రాఫిక్ బ్లాక్ పనుల దృష్ట్యా ఈ నెల 4న పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 67249/67250 గుంటూరు- రేపల్లె, 67223/67224 రేపల్లె- తెనాలి, 67231/67232 రేపల్లె- తెనాలి, 67233 తెనాలి- రేపల్లె, 67234 రేపల్లె- గుంటూరు, 67221 విజయవాడ- తెనాలి రైళ్లను ఆపివేస్తున్నామని చెప్పారు.

భవనం పైనుంచి దూకి వివాహిత మృతి

భర్త వేధింపులే కారణమంటున్న మృతురాలి కుటుంబ సభ్యులు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: భర్త వేధింపులతో మనస్తాపం చెందిన వివాహిత భవనం పైనుంచి దూకి మరణించిన ఘటన కామారెడ్డి జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలానికి చెందిన పసుపులేటి సాయితో బండి అలియాస్ పూజితకు గత ఏడాది ఆగస్టులో వివాహమైంది. వీరిద్దరూ కామారెడ్డి జిల్లా అశోక్‌నగర్ కాలనీలో నివాసముంటున్నారు. కొన్నాళ్లుగా సాయి వేరొక మహిళతో చరవాణిలో మాట్లాడుతున్నాడనే విషయమై పూజిత ప్రశ్నించగా.. భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. వివాహ సమయంలో ఒప్పుకొన్న అర ఎకరం భూమి రిజిస్ట్రేషన్ చేసే విషయంలో వీరిద్దరి మధ్య బుధవారం(ఏప్రిల్ 30) రాత్రి 10:30 గంటల ప్రాంతంలో గొడవ జరిగింది. వీటన్నింటినీ మనసులో పెట్టుకున్న పూజిత తనను భర్త ప్రతి విషయంలో ఇబ్బంది పెడుతున్నాడని మనస్తాపం చెందింది. వారు అద్దెకు ఉండే రెండంతస్తుల భవనం పైనుంచి కిందకు దూకింది. తీవ్రగాయాలపాలైన ఆమె పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయింది. మృతురాలి తండ్రి కృష్ణారావు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.



పూజిత (పాత చిత్రం)

బ్రాయిలర్ ధరలు

(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -127 రిటైల్ ధర 149 చికెన్ విత్ స్కిన్ - 216, చికెన్ స్కిన్‌లెస్ - 246. **అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 144, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 460 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.77/-.

నేల బావిలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్..

యువకుడి దుర్మరణం

రామచంద్రాపురం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని రామచంద్రాపురంలో గురువారం రాత్రి ఒక రైతుకు చెందిన పొలంలో దుక్కి దున్నుతున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు నేల బావిలో పడిపోయింది. సంఘటనలో డ్రైవర్ సీహెచ్.హరీష్(20) దుర్మరణం చెందాడు. సమాచారం అందగానే స్థానికులు బావి వద్దకు వెళ్లి డ్రైవర్‌ను బయటకు తీశారు. సంఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



హరీష్ (పాత చిత్రం)

విజయవాడ రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ప్రధాని మోదీ అమరావతి పర్యటన నేపథ్యంలో రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఆదేశాల మేరకు గురువారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. డాగ్‌స్క్వాడ్, బాంబు డిటెక్టివ్ బృందాలు సర్క్యులేటింగ్ ఏరియా, తారాపేట, రైల్వే యార్డు, జనరల్, రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్లు, వెయిటింగ్ హాళ్లు, పార్శిల్ కార్యాలయం, క్లోక్ రూమ్‌లు, క్యాంటీన్లు, స్టాళ్లతో పాటు అన్ని ప్లాట్‌ఫారాలను జల్లెడ పట్టారు. ప్రయాణికుల బ్యాగులు, లగేజీని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 24 గంటలు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే డీఎస్పీ రత్నరాజు తెలిపారు. అనుమానిత వ్యక్తులు కన్పిస్తే వెంటనే 139లో సమాచారం అందించాలని జీఆర్పీ సీఐ జేవీ రమణ కోరారు. ఈ తనిఖీల్లో ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.





విరిగి రోడ్డుపై పడిన సిగ్నల్ స్తంభం

అడ్డుగా ఉన్నా అలుసే..!

ప్రధాన కూడలిలో వాహనాల రాకపోకల సమయంలో సూచికలు పనిచేస్తున్న సిగ్నల్ స్తంభం విరిగి రోడ్డుపై పడినా ఎవరికీ పట్టడం లేదు. స్థానిక ఎల్‌హెచ్‌ఆర్ పాఠశాల సర్కిల్‌లో గతంలో సోలార్‌తో వెలిగే, పసుపు సిగ్నల్‌తో కూడిన స్తంభాన్ని పాతగా, రెండ్రోజుల కిందట ధ్వంసమై రహదారిపై అడ్డుగా పడిపోయింది. ఆదమరిస్తే వాహనాలు దానిని ఢీకొని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిసినా, పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవడంలేదు. - న్యూస్‌టుడే, మైలవరం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడిలోని చెట్ల బజారులో విద్యుత్తు స్తంభాలను పక్కకు మార్చుతున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పిరిందేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయిపురకాలనీ, వెంకయ్యస్వామి ఆలయం, చెట్లబజారు, దేవాదాయ శాఖ కార్యాలయం, ల్యాంకోకాలనీ, టింబర్ డిపో ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

షిర్డీసాయి సేవాశ్రమానికి విరాళం

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని మునుకళ్ల రోడ్డులో నిర్మాణంలో ఉన్న శ్రీ షిర్డీ సాయి సేవాశ్రమానికి తిరువూరుకు చెందిన కమ్మినేని రాజశేఖరావు, సుజాత దంపతులు గురువారం రూ.20వేలు విరాళం అందజేశారు. సేవాశ్రమం అభివృద్ధికి దాతలు తమ వంతు సహకారం అందించాలని ట్రస్టు అధ్యక్షుడు డీఎస్‌ఎస్.ప్రసాద్ అంజనేయులు కోరారు. సాయి సేవకులు అంజయ్య, పొట్లూరి అంజనేయులు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

మైలవరం: మైలవరంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీలకు మే డే సందర్భంగా తెదేపా నాయకులు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. వారందరికీ మే డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లిఖిత్, రాధాకృష్ణ, బాలకృష్ణ, వెంకట్రావు, ప్రేమ్, జెస్సీ తదితరులు పాల్గొన్నారు. వెల్వడం పైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో కుదుముల తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం, అనిల్‌కుమార్‌రెడ్డి వితరణతో మే డే సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు.


పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి విద్యార్థులు, శ్రీ సాయిబాబా సేవ కమిటీ సభ్యులు నివాళులర్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



స్పందన వందనం

- కొటికలపూడిలో మురుగు కాలువల్లో పూడికలు మేటలు వేసి మురుగు నీరు పారుదల నిలిచి దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా కు ఫిర్యాదు చేశారు. సమస్యను గ్రామ కార్యదర్శి ఎస్‌కే బాషా దృష్టికి తీసుకెళ్లగా స్పందించి ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బందితో పూడికలు తొలగించి సమస్యను పరిష్కరించారు. - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం
- గొల్లపూడి గ్రామంలోని పలు ప్రాంతాల్లో పందుల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా ఫిర్యాదు చేయగా పంచాయతీ అధికారులు స్పందించారు. పందులను పట్టుకుని వారితో పట్టించి శివారు ప్రాంతాల్లో వదిలిపెట్టారు.
- కరకట్ట ప్రాంతంలో వీధిదీపాలు వెలగడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా ఫిర్యాదు చేయగా అధికారులు స్పందించారు. ఆ ప్రాంతంలో కొత్తవాటిని ఏర్పాటు చేయించారు.
- స్థానిక ప్రసాద్‌నగర్, జాకీర్‌హుస్సేన్ కాలాల రోడ్డు కాలువల్లో మురుగు నిలిచిందని మేమున్నాం..మీకు తోడుగా ద్వారా స్థానికులు తెలిపిన సమస్యపై పురపాలక సిబ్బంది స్పందించారు. గురువారం రోజున ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ ప్రాంతమంతా సున్నం చల్లి శుభ్రపరిచారు. - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం
- స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట చెత్త పేరుకుని దుర్గంధంతో ఇబ్బందులు కలుగుతున్న



ఇబ్బందులను పలువురు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా, విషయాన్ని పంచాయతీ అధికారులకు తెలపడంతో వారు స్పందించారు. గురువారం కార్యదర్శి రఫి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావులు, పంచాయతీ కార్మికులతో చెత్తను తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. - న్యూస్‌టుడే, మైలవరం

తిరువూరు

• తిరువూరు • మైలవరం

వైభవంగా ముత్యాలమ్మ గుడి వార్షికోత్సవం

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గ్రామ దేవత ముత్యాలమ్మ గుడి 10వ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణ, మల్లెపూలతో సహస్రనామ పూజలు చేశారు. గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.



పూజల్లో పాల్గొన్న మహిళలు



ఎల్వోసీ పత్రం అందజేస్తున్న ఎంపీ చిన్ని, జిల్లా అధ్యక్షుడు రఘురామ్, పార్టీ నాయకులు

సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.3లక్షల సాయం

తిరువూరు, న్యూస్‌టుడే: అనారోగ్యానికి గురైన పట్టణానికి చెందిన వేములు హేమల తకు చికిత్స నిమిత్తం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) చొరవతో సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.3లక్షలు మంజూరయ్యాయి. బాలిక తండ్రి, తిరువూరు 5వ వార్డు తెదేపా అధ్యక్షుడు వేములు ఏడుకొండలుకు సంబంధిత ఎల్వోసీ పత్రాన్ని గురువారం విజయవాడలో ఎంపీతో పాటు తెదేపా జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అందజేశారు. తెదేపా పట్టణ నాయకులు ఎం.హరిశరత్, ఎం.శ్రీనివాసరావు, ఎస్‌కే బాషా పాల్గొన్నారు.

కేంద్రం సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని భాజపా స్టేట్ కౌన్సిల్ మెంబర్ కృష్ణమోహన్ అన్నారు. భాజపా ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలపై ఇబ్రహీంపట్నంలో గురువారం ఆయన మాట్లాడారు. రైల్వే ప్రాజెక్టు శంకుస్థాపన, నేషనల్ హైవేల నిర్మాణం, రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, గ్యాస్ ఆధారిత విద్యుత్తు ప్లాంట్లతో రాష్ట్రంలో అతికొద్ది సంవత్సరాల్లోనే అభివృద్ధి కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చూడరులే కట్టేయ్.. అడగరులే దోచేయ్

- బస్టాండ్ ఆవరణాన్ని ఆక్రమించి దుకాణాలు
- వాణిజ్య సముదాయ నిర్మాణం ఊసెత్తని అధికారులు

మైలవరం, న్యూస్‌టుడే

విశాలమైన రహదారి ఇరుకుగా మారింది. విలువైన స్థలం వృథాగా మిగిలింది. కన్ను దృష్టి పెడితే ఆదాయాన్ని సమకూర్చే అవకాశాలపై అధికారులు శీతకన్నేశారు. రహదారి మార్జిన్ల ఆక్రమణల పరంపరతో ఏకంగా బస్టాండే కనబడకుండా చేస్తున్నారు. లోపలకు, బయటకు వెళ్లి వచ్చే మార్గం మినహా ఎటు చూసినా ఆక్రమణలు, అమ్మకాలతో కొనసాగుతున్నా ఎవరికీ పట్టడం లేదు.



భారీగా వెలిసిన పాకలతో కనిపించని బస్టాండ్

తూతూ మంత్రంగా నిర్వహణ

దాదాపు నాలుగు దశాబ్దాల కిందట మైలవరంలో సుమారు ఎకరం విస్తీర్ణంలో విశాలమైన బస్టాండ్‌ను నిర్మించారు. జాతీయ రహదారి 30ని ఆనుకుని ఉన్న బస్టాండ్ మీదుగా నిత్యం రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణలోని భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం తదితర ప్రాంతాలకు వెళ్లే వందలాది బస్సులకు కేంద్రంగా ఉంది. మైలవరం మధ్య పట్టిల నుంచి నిత్యం వేలాది మంది విద్యార్థులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. తిరువూరు ఆర్టీసీ డిపోనకు బస్టాండ్ నిర్వహణ బాధ్యతలు అప్పగించగా, తొలి రోజుల్లో లోపల క్యాంటీను సైతం నిర్వహించారు. క్రమేపీ నిర్వహణ లోపంతో బస్టాండ్ కళ కోల్పోతుండగా, అధికారుల పర్యవేక్షణ తూతూ మంత్రంగా మారతోంది.

పర్యవేక్షణ కొరవడి

పర్యవేక్షణ కొరవడడంతో బస్టాండ్ గోడలకు ఆనుకుని బయట, ఎదుట, దక్షిణం వైపు ఆక్రమణల పరంపర మొదలైంది. పేదల పేరిట ఒకరిద్దరు దుకాణాలతో మొదలైన ఆక్రమణలు నేడు బస్టాండ్ భవనం బయట కనిపించని విధంగా పెరిగిపోయింది. రేకులతో దుకాణాలుగా తయారు చేసుకున్న కొందరు వాటి ద్వారా రూ.లక్షల్లో చేతులు మారుతున్నాయన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.



లోపలకు వెళ్లేందుకు మిగిలిన దారి

ఇలా చేస్తే బాగు

మైలవరంలో వాణిజ్య దుకాణాల అద్దెలు ఆకాశాన్నంటుతున్నాయి. అద్దెలు భరించలేక నెలల వ్యవధిలోనే మూతపడిన వ్యాపారాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న బస్టాండ్ ప్రాంగణం ముందు, పక్కన వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తే తక్కువ అద్దెకు ఇచ్చినా, ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆక్రమించి, దుకాణాలను నిర్వహిస్తున్న వారంతా పేదలేనని చెబుతున్నందున, నిర్మించే సముదాయంలో వారికే అద్దెకివ్వొచ్చు. ఆదాయంతో పాటు, నిత్యం ఇబ్బందికరంగా మారిన ట్రాఫిక్ చిక్కులు తీరతాయని స్థానికులు చెబుతున్నారు.

టెండర్లు పూర్తయ్యాయి

బస్టాండ్ లోపల దక్షిణం వైపు ఇన్‌గేట్ ప్రాంగణం లోపల బీవోటీ పద్ధతిలో వాణిజ్య దుకాణ సముదాయ నిర్మాణానికి టెండర్లు కూడా పూర్తయ్యాయి. తెలంగాణకు చెందిన వ్యక్తులకు టెండర్ దక్కింది. బస్టాండ్ ఎదుట దుకాణాల విషయంలో పంచాయతీ ట్యాక్సులు కట్టించుకుంటున్నారని చెబుతున్నారు. కొన్ని సమస్యలు ఉన్నాయి పరిశీలిస్తాం.

- సుబ్రహ్మణ్యం, డిపో మేనేజరు, తిరువూరు

పారిశ్రామిక ప్రగతిని ప్రోత్సహిస్తే ఉద్యోగావకాశాలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని ప్రోత్సహించి సాధించడమే ప్రభుత్వ ధ్యేయమని, అవకాశాలు కల్పించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఎన్టీటీపీఎస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. థర్మల్ కేంద్రం ప్రైవేటు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఇబ్రహీంపట్నంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశ్రామికరణ ద్వారా రాష్ట్ర అనుకూల వాతావరణం పెంపొందిస్తామని అన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో విధాలుగా పెట్టుబడిదారులను పిలుస్తోందన్నారు. గడిచిన పది నెలల కాలంలోనే అనేక మంది ముందుకు వచ్చారన్నారు. అనంతరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్టీటీపీఎస్‌లో పని చేస్తున్న అనేక మంది కార్మికులు క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్నారని



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

మంత్రికి తెలియజేశారు. వారిని స్కిల్డ్, అన్‌స్కిల్డ్‌గా విభజించి వేతన సవరణ చేయించాలని కోరారు. అనంతరం మంత్రిని సత్కరించారు. అంతకుముందు జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు జంపాల సీతారామయ్య, కౌన్సిలర్లు చిట్టిబాబు, శ్రీను, జనసేన నాయకులు అక్కల రామ్మోహనరావు, యూనియన్ నాయకులు స్వతంత్రకుమార్, రత్నశేఖర్, దుర్గారావు, షేక్ జానీ, షరీఫ్ పాల్గొన్నారు.

ప్రధాని సభకు తరలివెళ్దాం

గంపలగూడెం, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి నిర్మాణ పనులు పునఃప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్రమోదీ వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు తరలి వెళ్లేందుకు నియోజకవర్గం నుంచి భారీగా జన సమీకరణ చేస్తున్నారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల నుంచి ప్రజలను సభకు తరలించేందుకు 150 వరకు బస్సులు కేటాయించారని ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఉదయం బస్సుల్లో బయల్దేరే వారికి మండల కేంద్రాల నుంచి అల్పాహారం అందిస్తారు. మార్గ మధ్యలో భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేస్తున్నారు. గురువారం రాత్రికే కొన్ని గ్రామాలకు బస్సులు చేరుకుంటాయని అధికారులు వివరించారు. భారీగా తరలిరావాలని కోరారు.



గంపలగూడెంలో జన సమీకరణపై సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో నాగేశ్వరరావు

బస్సులు సిద్ధం..

మైలవరం, జి.కొండూరు, న్యూస్‌టుడే: ఈ నెల 2న రాజధాని అమరావతిలో జరగనున్న అభివృద్ధి పనుల పునఃప్రారంభ సభకు మైలవరం జి.కొండూరు మండలాల నుంచి 59 చొప్పున బస్సుల్లో ప్రజలను తరలించనున్నట్లు ఎంపీడీవోలు పి.అనురాధ, రామకృష్ణ నాయక్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి బస్సులు మండల కేంద్రాల నుంచి బయలుదేరుతాయని వివరించారు.

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మండలం నుంచి 44 బస్సులను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సునీతాశర్మ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఆయా గ్రామాల్లో బస్సులు సిద్ధమై ఉంటాయన్నారు. బస్సుల్లోనే అల్పాహారం, భోజనం ఏర్పాట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

కట్టుబడిపాలెంలో భోజన ఏర్పాట్లు

మైలవరం, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభ సభకు తరలి వెళ్తున్న ప్రజలకు జి.కొండూరు మండలం కట్టుబడిపాలెంలోని గ్యాస్ కంపెనీ వద్ద భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీవోలు తెలిపారు. తిరువూరు, మైలవరం వైపు నుంచి సభకు వెళ్లే వారికి మధ్యాహ్నం భోజనం, సభ నుంచి తిరిగి వచ్చే సమయంలో రాత్రి భోజనాలు అక్కడే ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల నుంచి బయలుదేరే బస్సులకు ఎక్కడికి అక్కడ గ్రామాల్లోనే ఆహార పదార్థాలను సివిల్ సప్లైస్ అధికారుల ద్వారా అందజేస్తున్నారని వివరించారు.

ప్రకటన

నా క్లయింట్లు అయిన 1. శ్రీ వల్లభనేని లీలాజీబాబు, తండ్రి వెంకటరావు 2. గొడితి సాయిరామ్ సత్య, తండ్రి రామారావు, 3. గారపాటి సుంద్వారాణి తండ్రి సూర్యనారాయణ 4. శ్రీ వేమూరి శ్రీకిరణ్, తండ్రి సుబ్రహ్మణ్యేశ్వరరావు గార్ల సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా...

నా క్లయింట్లు M/s. అమరావతి అపార్ట్‌మెంట్స్ & విల్లాస్ ఇండియా (ప్రై) లిమిటెడ్, హైదరాబాద్ (CIN: 045500TG2017PTC125476)నందు డైరక్టర్లుగాను మరియు షేర్ హోల్డర్లుగాను వుండియున్నారు. సదరు కంపెనీ NTR జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, తుమ్మలపాలెం గ్రామంలో గల R.S.No 15/2లోని 21,218.59 చ॥గ స్థలమును శ్రీ లాకా వెంగళరావు యాదవ్ మరియు ఒబిలినేని బాలాజీ మరియు 109 మందితో డెవలప్‌మెంటు అగ్రిమెంటు మరియు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీని ది. 5-3-2018న నెం. 1100/2018 గాను మరియు ది. 5-10-2017న నెం. 4838/2017 గాను ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రారు వారి కార్యాలయంలో రిజిష్టరు చేయించుకొనియున్నారు. సదరు స్థలము అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్ మొ॥వి నిర్మాణము చేయుటకు ఎ.పి.సి.ఆర్.డి.ఎ. వారినుండి ప్లాన్ నెం.1168/4545/B/IBPTM/TMPLM/2018గా ది. 23-03-2018న అనుమతి పొందియున్నారు. సదరు భవన నిర్మాణము జరుగుచున్నది. పై డెవలప్‌మెంటు అగ్రిమెంటు ద్వారా కొంత భాగము పర్టీసకు చెందును. పై నిర్మాణము గంగ, యమున సంగమం, కృష్ణా, గోదావరి, తుంగభద్ర మరియు వల్లభనేని బ్రైడ్ పేర్లతో గల బ్లాకులను నిర్మించవలెనని నిర్ణయము.

ఇట్టి స్థితిలో నా క్లయింట్లలో ఒకరైన శ్రీ గొడితి సాయిరామ్ సత్యగారు కంపెనీలో జరిగిన లావాదేవీల విషయమై NCLT హైదరాబాద్ ట్రిబ్యునల్ కోర్టు నందు CP No./42/241/HYD/2023గా కేసును వేసి డిక్రీ పొందియున్నారు. తదుపరి జరిగిన ఒప్పందం ప్రకారం నా క్లయింట్లు వారియొక్క డైరక్టరు పదవులకు రాజీనామా చేయగా సదరు రాజీనామాలను ది. 21-3-2025న జరిగిన కంపెనీ బోర్డు మీటింగులో ఆమోదించినట్లుగా నా క్లయింట్లకు వ్రాతపూర్వకంగా తెలియజేయుట జరిగినది. అదేవిధంగా కంపెనీలో షేర్లు కలిగినవారు వారి షేర్లను శ్రీ మీనవల్లి నారాయణమూర్తి శ్రీమతి మీనవల్లి పద్మజ గార్లకు ట్రాన్స్‌ఫరు చేసియున్నారు. కాబట్టి ఆరోజునుండి నా క్లయింట్లకు, కంపెనీకి ఎటువంటి సంబంధము లేదని తెలియజేయుచున్నారు. అదేవిధంగా కంపెనీలో జరిగిన/ జరుగుచున్న/ జరిగే/ ఎటువంటి ఆర్థిక లావాదేవీలకు నా క్లయింట్లకు సంబంధము లేదు. ప్రభుత్వంవారు తీసుకొనే చర్యలు కంపెనీకి లోబడి యుండును గాన సదరు నా క్లయింట్లకు ఎటువంటి సంబంధము లేదు. కంపెనీ తరఫున డైరక్టర్లుగా వున్న మీనవల్లి నారాయణమూర్తిగారు మరియు మీనవల్లి పద్మజ గారలు బాధ్యతలు తీసుకొని నిర్ణయాత్మకమైన విషయాలు మొ॥వాటిపై నిర్ణయములు తీసుకొనుచున్నారు. ఇందులో ఎటువంటి సందేహములు వున్నా వారిని సంప్రదించవలెను. కంపెనీ తరఫున ఏ లావాదేవీలకైననూ వారే బాధ్యత వహించినందున ఈ ప్రకటన యిచ్చుట జరిగినది. కావున యావన్మందీ ఈ విషయములు గ్రహించగలరని ప్రార్థిస్తున్నాము.

ఇట్లు **V.V.P. DHARMA RAYUDU**, Advocate
Lotus Land Mark, Sector-1, Road No:6, House No: 38,
Ayodhya Nagar, Vijayawada-520 003, Cell No: 98499 64983



మైలవరం మండలం గణపవరం విద్యుత్తు ఉపకేంద్రంలో



రాయనపాడులోని వేర్ హౌస్ కార్యాలయం వద్ద



గుంటుపల్లి వ్యాగన్‌వర్క్సుషాపు దగ్గర



గంపలగూడెంలో సీపీఎం నాయకులు, కార్మికులు

వాడవాడలా మేడే సంబరాలు

న్యూస్‌టుడే బృందం : తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో కార్మికులు, కర్షకులు, శ్రామికులు గురువారం మే డేను వాడవాడలా ఘనంగా నిర్వహించుకున్నారు. పలు కార్మిక సంఘాలు తమ తమ కార్యాలయాల్లో ఎర్ర జెండాలను ఎగురవేసి శ్రామిక శక్తి వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు.



తిరువూరు ప్రధాన రహదారిలో ప్రదర్శన



విస్సన్నపేటలో మోటర్ వర్కర్స్ ఆధ్వర్యంలో



కొండపల్లిలో జెండా ఆవిష్కరణ...

యువతి అనుమానాస్పద మృతి

విస్సన్నపేట : మండలంలోని తెల్లదేవరపల్లిలో వేంపాటి మధుమిత(24) అనే యువతి గురువారం అనుమానాస్పదంగా మృతి చెందిందని కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు..ఎ.కొండూరుకు చెందిన వేంపాటి పాపారావు, లావణ్య దంపతులు పదేళ్ల నుంచి జీవనోపాధి కోసం తిరువూరు శాంతినగర్‌లో నివసిస్తున్నారు. తమ కుమార్తె మధుమిత హైదరాబాద్‌లో చిరుద్యోగం చేస్తుంటుంది. ఇటీవల ఆమె హైదరాబాద్ నుంచి తిరువూరు వచ్చిందని తెలుసుకుని బుధవారం తెల్లదేవరపల్లికి చెందిన ప్రతాప్ తన కుమార్తెతో మాట్లాడే ప్రయత్నం చేయగా మందలించామన్నారు. తదుపరి హైదరాబాద్ వెళుతున్నానని చెప్పిన తమ కుమార్తె గురువారం తెల్లదేవరపల్లిలో చనిపోయినట్లు అక్కడి కుటుంబ సభ్యుల ద్వారా తెలిసిందన్నారు. తన కుమార్తెను ప్రతాప్ కుటుంబ సభ్యులే చంపారని, వారిపై చర్యలు తీసుకోవాలని తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



మధుమిత (పాత చిత్రం)

మరో వ్యక్తి..

పెనుగొలను, గాదెవారిగూడెం(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో పి.యాలాద్రి(40) గురువారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతుడిది మండలంలోని గాదెవారిగూడెం..భార్య తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ ఆర్లగడ్డ రాజశేఖర్ తెలిపారు. యాలాద్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తా.. డ్రైవర్ దుర్మరణం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణారావుపాలెం శివారు దీప్లానగర్ తండా సమీపంలో ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం ఆటో బోల్తా పడిన సంఘటనలో చోదకుడు సగ్గురి గోపాలరావు(50) దుర్మరణం చెందాడు. పోలీసుల సమాచారం మేరకు మైలవరం మండలం పుల్లూరుకు చెందిన గోపాలరావు తిరువూరు నుంచి పుల్లూరు వెళుతుండగా ఆటో ప్రమాదానికి గురై మరణించాడు. స్థానికుల సమాచారం మేరకు ఎ.కొండూరు పోలీసులు మృతదేహాన్ని తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

తరచూ ఇంతే.. సమస్య తీరదంతే


❖ రక్షిత తాగునీటి పథకంలో కలుస్తున్న బూడిద నీరు ❖ మళ్లీ తాగునీటి సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

ఇబ్రహీంపట్నం సమగ్ర రక్షిత నీటి పథకం జలాశయంలో ఎన్టీటీపీఎస్ బూడిదనీరు కలవడంతో గురువారం తాగునీటి సరఫరా నిలిపేశారు. ఈ పథకం నుంచి నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతుంది. ఎన్టీటీపీఎస్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తరుచుగా రక్షిత పథకం జలాశయంలో బూడిద నీరు కలుస్తుండడంతో జలాశయంలోని ఫిల్డరు బెడ్లు బూడిదతో నిండిపోతున్నాయి. దీంతో నీటి వడపోతలో ఇబ్బందులు వస్తున్న కారణంగా తాగునీటి సరఫరా నిలిపేయాల్సి వస్తోందని అధికారులు పేర్కొంటున్నారు.

తాత్కాలిక చర్యలతో సరి..

పథకం ప్రారంభంలో ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్ దిగువన రక్షిత పథకం ఇన్‌టెక్ వెల్‌ను ఏర్పాటు చేశారు. ఎన్టీటీపీఎస్‌లో బూడిదనీటి జలాశయంలో నీటి మట్టం ఎక్కువైన సమయంలో బూడిద నీటిని శుద్ధి చేయకుండా సరాసరి కూలింగు కెనాల్‌లోకి మళ్లిస్తున్నందున తరుచుగా సమస్యలు వస్తున్నట్లు పథకం సిబ్బంది చెబుతున్నారు. ఇబ్రహీంపట్నం గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు సమస్యను ఎన్టీటీపీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారని శాశ్వత పరిష్కారం తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.



ఈ విధంగా కలుస్తూ...

స్పందన కరవు

ఈ విషయాలపై రక్షిత నీటి పథకం ఇంజినీర్ల వద్ద ప్రస్తావించగా సమస్యను థర్మల్ కేంద్రం అధికారులకు వివరించినా స్పందన లేదన్నారు. పథకం ఇన్‌టెక్ వెల్‌ను కూలింగు కెనాల్ ఎగువన ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారని వివరించారు. ప్రస్తుతం ఇన్‌టెక్ వెల్‌ను ఎగువన ఏర్పాటు చేయాలంటే ప్రస్తుతం ఉన్న మోటార్లను వినియోగించుకుంటూ నూతన కట్టడాలు పైపులైన్ల మార్పు చేయడానికి దాదాపు రూ.కోటి వరకు వ్యయం చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఇంత భారీ వ్యయం చేయడం కన్నా థర్మల్ కేంద్రం అధికారులు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

ప్రకటన

మా క్లయింటు - **రంగారెడ్డి జిల్లా, కొండాపూర్ వాస్తవ్యులు,** ప్రస్తుత అమెరికా నివాసి మరియు లేట్ **ముప్వ పుల్లయ్యచౌదరి గారి కుమారుడు అయిన ముప్వ రవికుమార్** గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా - మా క్లయింటు దిగువ 'A' షెడ్యూలు దాఖలా జాయింటు ఆస్తిలోని తన వాటా గూర్చి తన అన్న గారైన ముప్వ రమేష్ గారి పేర జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ వ్రాయించి, అమెరికాలోని నోటరీ పబ్లిక్ ఎదుట నోటరీ చేయించి ఇవ్వగా, సదరు **జనరల్ పవర్ ఆఫ్ అటార్నీలు విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ వారి కార్యాలయంనందు ది.08.04.2021న** ఎండార్స్ చేయడమైనది. అలాగే దిగువ 'B' షెడ్యూలు దాఖలా జాయింటు ఆస్తిలోని తన వాటా ఆస్తిని తన అన్నగారైన ముప్వ రమేష్ గారి పేర జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ వ్రాయించి, అమెరికాలోని నోటరీ పబ్లిక్ ఎదుట నోటరీ చేయించి ఇవ్వగా, సదరు **జనరల్ పవర్ ఆఫ్ అటార్నీలు గుంటూరు జిల్లా రిజిస్ట్రార్ వారి కార్యాలయం నందు ది.08.04.2021న** ఎండార్స్ చేయడమైనది. సదరు తన అన్నగారి పేరిట వ్రాయబడిన రెండు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీలను మా క్లయింట్ తన వ్యక్తిగత కారణాల రీత్యా రద్దు చేసుకోవడమైనది. కావున సదరు రెండు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీల ఆధారంగా ఎవరూ ఎట్టి లావాదేవీలూ చేయరాదనియూ, అట్టి లావాదేవీలు చెల్లనేరవనియూ, మా క్లయింటును బైండు చేయజాలవనియూ ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు : 'A' షెడ్యూలు - NTR జిల్లా, విస్సన్నపేట మండలం, చంద్రుపట్ల గ్రామంలో, విస్సన్నపేట సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయ పరిధిలోని **R.S.Nos.127 - 2 & 127/3A** దాఖలా **య.4-55**ట్ల భూమికి హద్దులు- తూర్పు:డొంక రోడ్డు, దక్షిణం: ముప్వ వినోద్ కుమార్ గారి ఆస్తి, పడమర: గోడ సత్యనారాయణ గారి ఆస్తి, ఉత్తరం : R&B రోడ్డు.

'B' షెడ్యూలు - గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, చినకాకాని గ్రామంలో, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయ పరిధిలోని **D.No. 35** నందలి ప్లాట్ నెం.99 నుండి 101 దాఖలా **739**చ॥గ॥ల ఆస్తికి హద్దులు - తూర్పు: ఇతరుల ప్లాట్, దక్షిణం : ప్లాట్ నెం.98, పడమర : 33 అడుగుల జాయింటు దారి, ఉత్తరం : సర్కారు డొంక.

ఇట్లు,
B. కోటి రెడ్డి, B.S. భాస్కర్ రెడ్డి, అడ్వకేట్స్
అమ్మన ఎస్టేట్స్, ఆంధ్రా హాస్పిటల్ ఎదురుగా,
ప్రకాశం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 520002

వ్యవసాయ సామగ్రి అందజేత

జి.కొండూరు, న్యూస్‌టుడే: యాంత్రీకరణ పథకంలో భాగంగా మండలంలోని వెల్లటూరుకు చెందిన పలువురు రైతులకు కావాల్సిన వ్యవసాయ సామగ్రి(వాహనాలు)ని గురువారం మండల వ్యవసాయాధికారి జి.రామ్‌కుమార్ అందజేశారు. మండలంలో 88 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, 50 శాతం రాయితీతో ఇప్పటి వరకు 63 మందికి బ్యాటరీ స్ప్రేయర్లు, రోటావీడర్లు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టరు సామగ్రి పంపిణీ చేసినట్లు ఏవో తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పి.బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



సాగు పరికరాలతో రైతులు, ఏవో రామ్‌కుమార్

ఐపీఎల్‌లో ఈనాడు
గుజరాత్ × హైదరాబాద్
వేదిక: అహ్మదాబాద్, రా. 7.30

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
ముంబయి	11	7	4	0	14	1.274
బెంగళూరు	10	7	3	0	14	0.521
పంజాబ్	10	6	3	1	13	0.199
గుజరాత్	9	6	3	0	12	0.748
దిల్లీ	10	6	4	0	12	0.362
లఖ్‌నవూ	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	10	4	5	1	9	0.271
రాజస్థాన్	11	3	8	0	6	-0.780
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
చెన్నై	10	2	8	0	4	-1.211

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

ఆరెంజ్ క్యాప్




సూర్యకుమార్ (ముంబయి)
475 పరుగులు
ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌కు ఇచ్చే టోపీ

పర్పుల్ క్యాప్



హేజిల్‌వుడ్ (బెంగళూరు)
18 వికెట్లు
ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌కు ఇచ్చే టోపీ

విఘ్నేశ్ స్థానంలో రఘు



రఘు

దిల్లీ: పంజాబ్ లెగ్ స్పిన్నర్ రఘు శర్మను ముంబయి ఇండియన్స్ తమ జట్టులోకి తీసుకుంది. కేరళ ఎడమచేతి వాటం స్పిన్నర్ విఘ్నేశ్ పుతూర్ గాయ పడటంతో అతని స్థానంలో రఘును ఎంపిక చేసుకుంది. మిగతా సీజన్‌లో రఘు సేవలు ముంబయికి అందుబాటులో ఉండనున్నాయి. 32 ఏళ్ల రఘు ఇప్పటికే ముంబయి బౌలింగ్ బృందంలో సహాయక పాత్ర పోషిస్తున్నాడు. తాజా నిర్ణయంతో అతను ప్రధాన జట్టులోకి వచ్చాడు. దేశవాళీ క్రికెట్లో పంజాబ్, పుదుచ్చేరి తరఫున రఘు బరిలో దిగాడు. 11 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 19.58 సగటుతో 57 వికెట్లు తీశాడు.

సందీప్ ఔట్: రాజస్థాన్ పేసర్ సందీప్ శర్మ కూడా ఐపీఎల్‌కు దూరమయ్యాడు. చేతి వేలు విరిగిన కారణంగా సందీప్ ఐపీఎల్‌లో కొనసాగే పరిస్థితి లేదని, అతడి స్థానంలో మరొకరిని తీసుకుంటామని రాజస్థాన్ రాయల్స్ ఓ ప్రకటనలో తెలిపింది.

మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్ లార్డ్స్‌లో

దుబాయ్: 2026 మహిళల టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌కు ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ వేదికగా నిలవనుంది. ఈ టోర్నీలో తుది పోరు జులై 5న జరగనుంది. 12 జట్లు తలపడుతున్న ఈ మెగా ఈవెంట్ జూన్ 12న ఆరంభం కానుంది. 33 మ్యాచ్‌లు జరిగే ఈ టోర్నీలో పన్నెండు జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోయి ఆడతాయి. ఆతిథ్య ఇంగ్లాండ్‌తో పాటు భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, శ్రీలంక, పాకిస్థాన్ ఇప్పటికే ఈ టోర్నీకి అర్హత సాధించాయి. ఈ ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్ క్వాలిఫయర్ ద్వారా మిగతా నాలుగు బెర్తులు దక్కించుకునే జట్లేవో తేలనున్నాయి. 2017 మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు కూడా లార్డ్స్ ఆతిథ్యం ఇచ్చింది. 2026 టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లకు లార్డ్స్‌తో పాటు ఓల్డ్ ట్రాఫోర్డ్, హెడింగ్లే, ఎడ్జ్‌బాస్టన్, ఓవల్, హాంప్‌షైర్ బౌల్, బ్రిస్టల్ వేదికలుగా నిలవనున్నాయి.

ఛాంపియన్



రోహిత్ 53
రికిల్‌టన్ 61

అయిదుసార్లు విజేత ముంబయి ఇండియన్స్‌కు ఎదురేలేకుండా పోయింది. తొలి అయిదు మ్యాచ్‌ల్లో నాలుగు ఓటములతో ఏమాత్రం పోటీలో లేని ఆ జట్టు ఇప్పుడు దుర్భేద్యంగా మారిపోయింది. ప్రత్యర్థులకు చిన్న అవకాశమైనా ఇవ్వకుండా ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ.. ప్లేఆఫ్స్‌కు అతి చేరువలోకి వచ్చేసింది. వరుసగా ఆరో విజయాన్ని ఖాతాలో వేసుకున్న ముంబయి.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా సత్తా చాటడంతో ఆ జట్టు గురువారం రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. పేలవ ప్రదర్శనతో ఎనిమిదో ఓటమిని చవిచూసిన రాజస్థాన్ ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది.

ముంబయి సిక్సర్

వరుసగా ఆరో విజయంతో అగ్రస్థానానికి

- మెరిసిన రికిల్‌టన్, రోహిత్
- విజృంభించిన బుమ్రా, బౌల్ట్
- వంద పరుగుల తేడాతో రాజస్థాన్ చిత్తు



బుమ్రా 2/15

జైపుర్

ఐపీఎల్-18లో ముంబయి ఇండియన్స్ జోరు కొనసాగుతోంది. అన్ని విభాగాల్లోనూ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన ఆ జట్టు 100 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌పై ఘనవిజయం సాధించింది. రికిల్‌టన్ (61; 38 బంతుల్లో 7×4, 3×6), రోహిత్ (53; 36 బంతుల్లో 9×4), సూర్యకుమార్ యాదవ్ (48 నాటౌట్; 23 బంతుల్లో 4×4, 3×6), హార్దిక్ పాండ్య (48 నాటౌట్; 23 బంతుల్లో 6×4, 1×6) మెరవడంతో మొదట ముంబయి 2 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. ఛేదనలో రాజస్థాన్ తేలిపోయింది. బౌల్ట్ (3/28), కర్ణ్ శర్మ (3/23), బుమ్రా (2/15) ధాటికి 117 పరుగులకే కుప్పకూలింది. ఆర్చర్ (30) టాప్ స్కోరర్. ఈ గెలుపుతో ముంబయి రన్‌రేట్ కూడా చాలా మెరుగైంది. ఈ మ్యాచ్‌కు ముందు వరకు సాంకేతికంగానైనా రేసులో ఉన్న రాయల్స్.. ఈ ఓటమితో అధికారికంగా ఆ పోటీకి దూరమైంది.

తేలిపోయిన రాయల్స్: గత మ్యాచ్‌లో వైభవ్ వీర విధ్వంసం, జైస్వాల్ మెరుపులతో 200పై లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన రాజస్థాన్.. ఈ పోరులో అందుకు పూర్తి భిన్నంగా ఆడింది. ఛేదనలో పూర్తిగా తేలిపోయి ఘోర పరాజయాన్ని చవిచూసింది. భారీ లక్ష్య ఛేదనలో రాజస్థాన్‌కు బలమైన ఆరంభం అవసరం కాగా.. ప్రారంభంలోనే ఆ జట్టుకు పెద్ద షాక్ తగిలింది. టైటాన్స్‌పై సిక్సర్ల మోతతో మెరుపు శతకం బాదిన 14 ఏళ్ల వైభవ్ ఈసారి ఖాతా కూడా తెరవకుండానే వెనుదిరిగాడు. తొలి ఓవర్లో చాహర్ అతణ్ని ఔట్ చేయగా.. రెండో ఓవర్లో జైస్వాల్‌ను బౌల్ట్ బౌల్డ్ చేశాడు. 18 పరుగులకే ఫామ్‌లో ఉన్న ఓపెనర్లిద్దరినీ కోల్పోయిన రాజస్థాన్.. మళ్లీ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. స్కోరు దెబ్బతిన్న ఆ జట్టు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోతూ చాలా వేగంగా ఓటమి దిశగా సాగింది. పవర్‌ప్లే అయినా పూర్తి కాక ముందే ఆ జట్టు ఓటమి ఖాయమైపోయింది. ముంబయి బౌలర్లు విజృంభించడంతో వచ్చిన బ్యాటర్ వచ్చినట్లే పెవిలియన్ బాట పట్టారు. నితీశ్ రాణా (9)ను కూడా బౌల్ట్ వెనక్కి పంపాడు. అయిదో ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన బుమ్రా.. వరుస బంతుల్లో పరాగ్ (16), హెట్‌మయర్ (0)లను ఔట్ చేయడం ద్వారా రాజస్థాన్ వెన్నువిరిచాడు. ఎనిమిదో ఓవర్లో శుభమ్ దూబె (15)ను హార్దిక్ ఔట్ చేయడంతో 64/6తో ఆ జట్టు కథ ముగిసింది. ఆ తర్వాత పరాజయం లాంఛనమే. మిగతా ఆట ఓటమి అంతరాన్ని తగ్గించడానికి మాత్రమే. కర్ణ్ శర్మ విజృంభించడంతో మిగతా వికెట్లను రాజస్థాన్ చకచకా కోల్పోయింది. ఆర్చర్, మధ్వాల్ (4 నాటౌట్) ముంబయి విజయాన్ని కాస్త ఆలస్యం చేశారు.

రికిల్‌టన్, రోహిత్ ధనాధన్: మరోసారి బ్యాటుతో అదరగొట్టిన ముంబయి మొదట భారీ స్కోరు సాధించింది. అదిరే ఆటతో రికిల్‌టన్, రోహిత్ బలమైన పునాది వేస్తే.. ఆ తర్వాత సూర్యకుమార్, హార్దిక్ రెచ్చిపోయారు. ముంబయి టాస్ ఓడి బ్యాటింగ్ దిగగా.. తొలి మూడు ఓవర్లలో 16 పరుగులే వచ్చాయి. రెండో ఓవర్లోనే ఫారూఖీ బౌలింగ్‌లో రోహిత్‌ను అంపైర్ ఎల్బీగా ప్రకటించినా.. అతడు సమీక్షతో బతికిపోయాడు. నాలుగో ఓవర్ నుంచి బాదుడు మొదలైంది. ఫారూఖీ బౌలింగ్‌లో వరుసగా 6, 4తో జోరందుకున్న రికిల్‌టన్.. వెంటనే ఆర్చర్ బౌలింగ్‌లో 4, 6 దంచేశాడు. తన తర్వాతి ఓవర్లో రెండే పరుగులు ఇచ్చిన ఆర్చర్.. రెండో ఓవర్లో 18 పరుగులు సమర్పించుకున్నాడు. తీక్షణ బౌలింగ్‌లో రోహిత్ వరుసగా రెండు బౌండరీలు కొట్టాడు. బ్యాటర్లిద్దరూ చకచకా ఫోర్లు కొడుతూ సాగడంతో పది ఓవర్లు ముగిసేసరికి ముంబయి 99/0తో నిలిచింది. రికిల్‌టన్ 29 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. 12వ ఓవర్లో తీక్షణ బౌలింగ్‌లో ఫోర్‌తో అర్ధసెంచరీ సాధించాడు. కానీ అదే ఓవర్లో రికిల్‌టన్ నిష్క్రమించడంతో 116 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాతి ఓవర్లోనే రోహిత్‌ను పరాగ్ వెనక్కి పంపాడు. అయినా.. రాజస్థాన్‌కు పెద్దగా సంతోషించదగిందేమీ లేకపోయింది. స్కోరు బోర్డును పరుగులెత్తించే బాధ్యతను హార్దిక్, సూర్యకుమార్ తీసుకున్నారు. ఇద్దరూ అలవోకగా షాట్లు ఆడారు. ఫారూఖీ బౌలింగ్‌లో రెండు ఫోర్లు కొట్టిన సూర్య.. తీక్షణ, ఆర్చర్ ఓవర్లలో సిక్స్‌లతో అలరించాడు. హార్దిక్ మూడు ఫోర్లు, ఓ సిక్స్ బాదడంతో ఇన్నింగ్స్ 18వ ఓవర్లో ఫారూఖీ ఏకంగా 21 పరుగులు సమర్పించుకున్నాడు. మధ్వాల్ బౌలింగ్‌లో లాంగాన్‌లో సిక్స్‌తో ముంబయి ఇన్నింగ్స్‌ను సూర్య ఘనంగా ముగించాడు. సూర్య-హార్దిక్ జంట అభేద్యమైన మూడో వికెట్‌కు 44 బంతుల్లోనే 94 పరుగులు జోడించింది.



బౌల్ట్ 3/28

ముంబయి ఇన్నింగ్స్: రికిల్‌టన్ (బి) తీక్షణ 61; రోహిత్ (సి) జైస్వాల్ (బి) పరాగ్ 53; సూర్యకుమార్ నాటౌట్ 48; హార్దిక్ నాటౌట్ 48; ఎక్స్‌ట్రాలు 7 **మొత్తం:** (20 ఓవర్లలో 2 వికెట్లకు) **217**; **వికెట్ల పతనం:** 1-116, 2-123; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-42-0; ఫారూఖీ 4-0-54-0; తీక్షణ 4-0-47-1; కార్తికేయ 2-0-22-0; ఆకాశ్ మధ్వాల్ 4-0-39-0; రియాన్ పరాగ్ 2-0-12-1

రాజస్థాన్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (బి) బౌల్ట్ 13; వైభవ్ సూర్యవంశీ (సి) జాక్స్ (బి) దీపక్ చాహర్ 0; నితీశ్ రాణా (సి) తిలక్ (బి) బౌల్ట్ 9; రియాన్ పరాగ్ (సి) రోహిత్ (బి) బుమ్రా 16; ధ్రువ్ జురెల్ (సి) అండ్ (బి) కర్ణ్ శర్మ 11; హెట్‌మయర్ (సి) సూర్యకుమార్ (బి) బుమ్రా 0; శుభమ్ దూబె (సి) బౌల్ట్ (బి) హార్దిక్ 15; ఆర్చర్ (సి) బుమ్రా (బి) బౌల్ట్ 30; తీక్షణ (సి) సూర్యకుమార్ (బి) కర్ణ్ శర్మ 2; కార్తికేయ (సి) దీపక్ చాహర్ (బి) కర్ణ్ శర్మ 2; మధ్వాల్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 15 **మొత్తం:** (16.1 ఓవర్లలో ఆలౌట్) **117; వికెట్ల పతనం:** 1-1, 2-18, 3-41, 4-47, 5-47, 6-64, 7-76, 8-87, 9-91; **బౌలింగ్:** దీపక్ చాహర్ 2-0-13-1; బౌల్ట్ 2.1-0-28-3; బుమ్రా 4-0-15-2; బోష్ 3-0-29-0; హార్దిక్ 1-0-2-1; కర్ణ్ శర్మ 4-0-23-3

రాజస్థాన్.. అందుకే ఆ జెర్సీ

ముంబయి ఇండియన్స్‌తో మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ పూర్తిగా గులాబి రంగు జెర్సీని ధరించింది. దీనికి ఓ ప్రత్యేక కారణం ఉంది. ఈ మ్యాచ్‌కు అమ్ముడుపోయిన ప్రతి టికెట్ నుంచి వంద రూపాయలను రాజస్థాన్ గ్రామీణ మహిళల స్వయం సంవృద్ధికి ఉపయోగించనున్నారు. అంతేకాకుండా 'పింక్ ప్రామిస్ డే' పేరుతో రాజస్థాన్ రాయల్స్ జట్టు ధరించిన గులాబి రంగు జెర్సీలను అమ్మడం ద్వారా వచ్చే డబ్బులు కూడా సేవ కార్యక్రమాలకే ఉపయోగించనున్నారు. ఈ మొత్తం నేరుగా రాజస్థాన్ రాయల్స్ ఫౌండేషన్‌కు వెళ్లనుంది. రాజస్థాన్‌లోని సాంబార్ ప్రాంతంలో సౌరశక్తి ద్వారా కొన్ని ఇళ్లకు విద్యుత్ ఇవ్వడం కూడా ఈ మ్యాచ్ లక్ష్యాల్లో ఒకటి. రాజస్థాన్-ముంబయి మధ్య పోరు ఐపీఎల్-18లో 50వ మ్యాచ్ కావడం విశేషం.



క్రీడల మంత్రి మాండవీయతో చిరాగ్, సాత్విక్

ఖేల్‌రత్న అందుకున్న సాత్విక్, చిరాగ్

దిల్లీ: దేశ అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు (2023)ను భారత స్టార్ డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి అందుకున్నారు. చాలాకాలంగా వాయిదా పడుతున్న ప్రదానోత్సవ కార్యక్రమాన్ని గురువారం కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ పూర్తిచేశారు. నిరుడు ఖేల్‌రత్న పురస్కారానికి ఎంపికైన సాత్విక్, చిరాగ్‌లు విదేశాల్లో టోర్నీలు ఉండటంతో రాష్ట్రపతి భవన్‌లో అవార్డులు అందుకోలేకపోయారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మాండవీయ నుంచి అవార్డు అందుకోవాల్సి ఉన్నా.. సరిగ్గా ఒకరోజు ముందు సాత్విక్ తండ్రి కాశీ విశ్వనాథ్ గుండెపోటుతో హఠాన్మరణం చెందడం వల్ల కార్యక్రమం వాయిదా పడింది. గురువారం దిల్లీలోని భారత క్రీడాప్రాధికార సంస్థ (సాయ్) కేంద్ర కార్యాలయంలో అవార్డును మంత్రి అందజేశారు. 2022 ఆసియా, కామన్వెల్త్ క్రీడలలో సాత్విక్- చిరాగ్ జోడీ స్వర్ణ పతకాలు కైవసం చేసుకుంది. 2023 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా, ప్రపంచ టూర్ సూపర్ 1000 టైటిల్ గెలిచిన ఏకైక భారత జోడీగా రికార్డు సృష్టించింది.

భారత లిఫ్టర్లకు రెండు కాంస్యాలు

ప్రపంచ యూత్ వెయిట్‌లిఫ్టింగ్



జోత్స్న



హర్షవర్దన్


లిమా (పెరూ): ప్రపంచ జూనియర్, యూత్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో రెండు కాంస్య పతకాలు చేరాయి. యూత్ బాలికల 40 కేజీల విభాగంలో జోత్స్న సబార్ కాంస్యం నెగ్గింది. స్నాచ్‌లో 56 కేజీలు.. క్లీన్ అండ్ జెర్క్‌లో 72 కేజీలు ఎత్తిన ఆమె.. మొత్తం 129 కేజీలతో మూడో స్థానంలో నిలిచింది. క్లీన్ అండ్ జెర్క్‌లో రజతం కూడా జోత్స్న సొంతమైంది. యూత్ బాలుర 49 కేజీల విభాగంలో హర్షవర్దన్ సాహు కూడా కంచు సొంతం చేసుకున్నాడు. స్నాచ్‌లో 87 కేజీలు.. క్లీన్ అండ్ జెర్క్‌లో 110 కేజీలు ఎత్తిన అతడు.. మొత్తంగా 197 కేజీలు లిఫ్ట్ చేశాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో టోటల్ లిఫ్ట్‌తో పాటు స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్‌లోనూ విడిగా పతకాలు ఇస్తారు.

ఆసియా బాక్సింగ్‌లో మరో 4 స్వర్ణాలు

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా అండర్-15, అండర్-17 ఛాంపియన్‌షిప్‌ను భారత్ రెండో స్థానంతో ముగించింది. చివరిరోజు మరో నాలుగు స్వర్ణాలు ఖాతాలో చేరాయి. అండర్-17 బాలికల్లో ఖుషీచంద్ (46 కేజీ), అహానాశర్మ (50 కేజీ), జన్నత (54 కేజీ), అన్షిక (80 కేజీలపైన) స్వర్ణాలు గెలిచారు. సిమర్‌జీత్ కౌర్ (60 కేజీ), హర్షిక (63 కేజీ) రజతాలతో సరిపెట్టుకున్నారు. అండర్-17 బాలుర విభాగంలో దేశాంశ్ (80 కేజీ) రజతంతో సరిపెట్టుకున్నాడు. ఫైనల్లో అతడు 0-5తో రసెమ్ బెక్ (కజకిస్థాన్) చేతిలో ఓడాడు. ఈ టోర్నీలో 15 స్వర్ణాలు, 6 రజతాలు, 22 కాంస్యాలతో భారత్ రెండో స్థానంలో నిలిచింది.

సుదిర్మన్ కప్‌లో ఓ విజయం

ఇంగ్లాండ్‌పై భారత్ గెలుపు



సతీశ్

షియామెన్ (చైనా): సుదిర్మన్ కప్ ఫైనల్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఇప్పటికే నాకౌట్‌కు దూరమైన భారత్‌కు ఊరట విజయం దక్కింది. గురువారం అప్రాధాన్య గ్రూప్-డి చివరి పోరులో 3-2తో ఇంగ్లాండ్‌ను ఓడించింది. తొలి సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయ 21-12, 21-16తో మి లిన్‌పై నెగ్గగా.. పురుషుల సింగిల్స్‌లో సతీశ్ కుమార్ 18-21, 22-20, 21-13తో హువాంగ్‌ను ఓడించాడు. మహిళల డబుల్స్‌లో శ్రుతి మిశ్ర-తనీషా క్రాస్టో జంట 21-17, 21-17తో లీజీ టోల్‌మన్-ఎస్టిల్ జోడీపై పైచేయి సాధించి భారత్‌కు విజయాన్ని ఖాయం చేసింది. పురుషుల డబుల్స్‌లో హరిహరన్-రుబన్‌కుమార్ జంట 14-21, 21-11, 13-21తో రాయ్ ఇస్టన్-అలెక్స్ గ్రీన్ ద్వయం చేతిలో ఓడగా.. మిక్స్‌డ్ డబుల్స్‌లో కరుణాకరన్-తనీషా జోడీ 21-11, 13-21, 22-24తో హెమింగ్-లీవెన్ ద్వయం చేతిలో పరాజయం చవిచూసింది.




సూర్యకుమార్

అది తీవ్రంగా బాధించింది

ముంబయి: 2020-21 ఆస్ట్రేలియా పరిమిత ఓవర్ల పర్యటనకు తనను ఎంపిక చేయకపోవడం తీవ్రంగా బాధించిందని భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. ఈ వ్యవహారం ఐపీఎల్‌లో అత్యంత చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడేందుకు ప్రేరణగా నిలిచిందని తెలిపాడు. అబు ధాబిలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో 43 బంతుల్లో 79 పరుగులు సాధించిన సూర్య.. ముంబయి ఇండియన్స్‌కు అద్భుతమైన విజయాన్ని అందించాడు. సూర్య క్రీజులో ఉన్నంతసేపు విరాట్ కోహ్లి బంతికి బంతికి మధ్యలో అతని దగ్గరగా వెళ్లడం అప్పట్లో ఆసక్తి రేకెత్తించింది. "అది భావోద్వేగ ఇన్నింగ్స్. మ్యాచ్‌కు కొన్ని రోజుల ముందే ఆసీస్ పర్యటనకు జట్టును ప్రకటించారు. ఈ పర్యటన కోసం కొన్నేళ్లుగా సిద్ధమవుతున్నా. దేశవాళీ సీజన్, ఐపీఎల్ కూడా అద్భుతంగా ఆడా. కొవిడ్ విరామంలో ఫిట్‌నెస్, మానసిక ఆరోగ్యంపై తీవ్రంగా శ్రమించా. భారత టీ20 జట్టులో కచ్చితంగా చోటు దక్కుతుందని భావించా. నా చుట్టూ ఉన్న తోటి ఆటగాళ్లు, విదేశీ క్రికెటర్లు కూడా నేను ఆసీస్ పర్యటనకు వెళ్తాననే అనుకున్నారు. మానసికంగా విమానంలో ఉన్నట్లే అనిపించింది. అయితే జట్టుకు ఎంపిక కాకపోవడం తీవ్రంగా బాధించింది. ఎక్కడ తప్పు జరిగిందో నాకు అర్థం కాలేదు. 2-3 రోజులు అదే ఆలోచించా. ఎవరితోనూ మాట్లాడలేదు. కొన్ని రోజులు విరామం తీసుకుని సాధన కూడా చేయలేదు. మళ్లీ మైదానంలో అడుగుపెట్టినప్పుడు మహేల జయవర్దనె, జహీర్ ఖాన్, పొలార్డ్ నా పరిస్థితిని గమనించారు. బెంగళూరుతో మ్యాచ్‌కు ముందు పొలార్డ్ నా దగ్గరికి వచ్చి 'ఇదే సరైన వేదిక. భారత్ కెప్టెన్ కూడా ప్రత్యర్థి జట్టులో ఉన్నాడు. నీ స్థానం ఎక్కడో చెప్పేందుకు మంచి సమయం' అని అన్నాడు. ఫలితమే ఆ ఇన్నింగ్స్" అని సూర్య వివరించాడు.

బాల్ ట్యాంపరింగ్, భద్రత అతిపెద్ద సవాళ్లు



డేవిడ్ బూన్

దుబాయ్: ఐసీసీ మ్యాచ్ రిఫరీగా బాల్ ట్యాంపరింగ్, భద్రత సమస్యలు తాను ఎదుర్కొన్న అతిపెద్ద సవాళ్లని డేవిడ్ బూన్ అన్నాడు. 14 ఏళ్లు రిఫరీగా సేవలందించిన 64 ఏళ్ల బూన్ ఐసీసీ బాధ్యతలకు వీడ్కోలు పలికాడు. 87 టెస్టులు, 183 వన్డేలు, 119 టీ20ల్లో అతను రిఫరీగా వ్యవహరించాడు. మ్యాచ్ రిఫరీ పదవికి రిటైర్మెంట్ ప్రకటించిన బూన్ త్వరలోనే క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) డైరెక్టర్‌గా మరో ఇన్నింగ్స్ ప్రారంభించనున్నాడు. "ప్రతి రోజూ సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఏదో ఒకటి నేర్చుకోవచ్చు కూడా. మ్యాచ్ రిఫరీగా కెరీర్ ప్రారంభించినప్పుడు బాల్ ట్యాంపరింగ్ ఇబ్బందికరంగా అనిపించింది. సరైన పని చేయట్లేదంటూ ఒక వ్యక్తిని నిందించాల్సి ఉంటుంది. భద్రత సమస్య కూడా అతిపెద్ద సవాల్. ఒకసారి ఢాకా, మరోసారి క్రైస్ట్‌చర్చ్‌లో విచారకర సంఘటనలు జరిగాయి. దీర్ఘంగా శ్వాస తీసుకుని ముందుకు వెళ్లాల్సి ఉంటుంది" అని బూన్ పేర్కొన్నాడు.

భారత మహిళలకు మరో ఓటమి

పెర్త్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల హాకీ జట్టుకు మరో పరాజయం ఎదురైంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 0-2తో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. ఆస్ట్రేలియా తరఫున కోర్ట్నీ షోనెల్ (9వ), గ్రేస్ స్టీవర్ట్ (52వ) చెరో గోల్ కొట్టారు. తొలి నిమిషం నుంచే దాడి మొదలెట్టిన ఆసీస్.. భారత డిఫెన్స్‌ను పరీక్షించింది. భారత జట్టు గట్టిగానే ప్రయత్నించినా గోల్స్ కొట్టలేకపోయింది. ఆ జట్టు తన తొలి రెండు మ్యాచ్‌ల్లో 3-5, 2-3తో ఆస్ట్రేలియా 'ఎ' చేతిలో ఓటమి చవిచూసిన సంగతి తెలిసిందే. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో శనివారం మళ్లీ ఆస్ట్రేలియా ప్రధాన జట్టుతోనే తలపడుతుంది.

నదీమ్ ఇన్‌స్టా ఖాతా బ్లాక్

దిల్లీ: పాకిస్థాన్ జావెలియన్ త్రోయర్, ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా బ్లాక్ అయింది. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత చట్టపరమైన చర్యల్లో భాగంగా భారత్‌లో అతని ఖాతాను నిషేధించారు. "భారత్‌లో నదీమ్ ఖాతా అందుబాటులో లేదు. ఖాతాలోని సమాచారాన్ని నియంత్రించాలన్న చట్టపరమైన అభ్యర్థనను పాటిస్తున్నాం" అని భారత్‌లో నదీమ్ ఇన్‌స్టా ఖాతా తెరిచిన వాళ్లకు ఈ సందేశం కనిపిస్తోంది. ఇంతకుముందు పాక్‌కు చెందిన యూట్యూబ్ ఛానెళ్లపై భారత్ నిషేధం విధించింది. పాక్ మాజీ ఆటగాళ్లు షోయబ్ అక్తర్, బాసిత్ అలీ, షాహిద్ అఫ్రిది ఛానెళ్లు కూడా అందులో ఉన్నాయి.

అత్యుత్తమ బౌలింగ్ చేయాలనుకున్నా



చాహల్

చెన్నై: పేసర్ల స్లో బంతులు ప్రభావవంతంగా ఉండడంతో తాను లైన్స్ మారుస్తూ బౌలింగ్ చేశానని చెన్నైపై హ్యాట్రిక్ సాధించిన పంజాబ్ బౌలర్ చాహల్ అన్నాడు. 19వ ఓవర్లో 9 పరుగులే ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. రెండో బంతికి ధోనీని ఔట్ చేసిన అతడు.. చివరి మూడు బంతుల్లో వరుసగా హుడా, అన్షుల్ కాంబోజ్, నూర్ అహ్మద్‌లను ఔట్ చేశాడు. "క్రీజులో ధోని ఉన్నాడని తెలుసు. అలాగే దూబె కూడా. కానీ ఆ ఓవర్లో వికెట్ లభిస్తుందని అనిపించింది. వాళ్లు సిక్స్ కొడతారా లేదా అని ఆలోచించలేదు. నా అత్యుత్తమ బౌలింగ్ చేయాలనుకున్నా. లైన్స్ మారుస్తూ బంతులేశా. పేసర్లు వాళ్ల ఓవర్లు పూర్తి చేశాక నేను 19 లేదా 20వ ఓవర్లో బౌలింగ్ చేయాల్సివస్తుందని నాకు తెలుసు. అందుకు సిద్ధమయ్యా. పేస్ బౌలర్ల స్లో బంతులు బ్యాటుపైకి సరిగా రాకపోవడం చూశా" అని చాహల్ చెప్పాడు.

భద్రతా దళాల నైతిక స్థైర్యం దెబ్బతీయాలనుకుంటున్నారా?

- పహల్గాం ఉగ్రదాడిపై దాఖలైన పిల్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడిపై విశ్రాంత న్యాయమూర్తితో దర్యాప్తు నిర్వహించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) గురువారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం పిటిషనర్లను తీవ్రంగా మందలించింది. దేశంలో ప్రతి పౌరుడు ఉగ్రవాదంపై పోరులో చేతులు కలిపిన ఈ కీలక సందర్భంలో భద్రతా బలగాల నైతికస్థైర్యం దెబ్బతీయాలనుకుంటున్నారా అని ప్రశ్నించింది. "మీరు విశ్రాంత న్యాయమూర్తితో విచారణ చేయాలని కోరుతున్నారు. ఈ విషయంలో వారు నిపుణులు కారు. దీనిపై ఉత్తర్వు జారీ చేయాలని అడక్కండి'' అని తెలిపింది. దీంతో పిటిషనర్లు.. తమ పిల్‌ను ఉపసంహరించుకున్నారు.

పహల్గాం ఉగ్రవాదుల్ని వేటాడి పట్టుకుంటాం

- వారు ప్రతిఫలం అనుభవించేలా చేస్తాం: అమిత్‌షా



దిల్లీ: పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న ప్రతి ఉగ్రవాదినీ వేటాడి పట్టుకుంటామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రతినపూనారు. ఉగ్రదాడిని హేయమైన చర్యగా అభివర్ణిస్తూ ఉగ్రవాదులు అందుకు తగిన ప్రతిఫలం అనుభవించేలా చేస్తామని గురువారమిక్కడ ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏ ఒక్క ఉగ్రవాదినీ విడిచిపెట్టబోదని ఆయన అన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. "26 మందిని హత మార్చి విజయం సాధించేశామని అనుకోవద్దు. మీరు చట్టానికి జవాబు చెప్పేలా చేస్తాం'' అని ఉగ్రవాదుల్ని ఉద్దేశించి అమిత్ షా అన్నారు.

అమెరికా ఎన్‌ఎస్‌ఏ వాల్జ్‌పై ట్రంప్ వేటు

వాషింగ్టన్: అమెరికా జాతీయ భద్రతా సలహాదారు (ఎన్‌ఎస్‌ఏ) మైక్ వాల్జ్‌పై వేటు పడింది. ఆయనను ఐక్యరాజ్య సమితి రాయబారిగా ట్రంప్ నియమించారు. వాల్జ్ స్థానంలో తాత్కాలిక జాతీయ భద్రతా సలహాదారుగా విదేశాంగశాఖ మంత్రి రుబియోను నియమిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులపై దాడులకు సంబంధించిన సమాచారం ముందుగానే సిగ్నల్ యాప్ చాట్‌ద్వారా ఓ పాత్రికేయుడికి చేరింది. తాను అధికారులతో క్రియేట్ చేసిన గ్రూపులో పొరపాటున ఆ పాత్రికేయుడిని వాల్జ్ చేర్చారు. దీనికి తనదే బాధ్యతని ఆ తర్వాత ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయనను తొలగిస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు.

మీ ప్రపంచంలో మీరు బతుకుతుంటారా!

- 'షరబత్' జిహాద్ వివాదంలో యోగా గురు రామ్‌దేవ్‌పై మండిపడిన న్యాయస్థానం

దిల్లీ: రూఅఫ్జా పానీయం తయారు చేసే హమ్‌దర్ద్ సంస్థను లక్ష్యంగా చేసుకొని యోగా గురు రామ్‌దేవ్ చేసిన 'షరబత్ జిహాద్' వీడియోపై దిల్లీ హైకోర్టు తీవ్రంగా మండిపడింది. ఈ సందర్భంగా రాందేవ్‌ను ఉద్దేశించి.. "మీరు మీ ప్రపంచంలోనే బతుకుతారా.. ఎవరి నియంత్రణలో ఉండరా'' అని ప్రశ్నించింది. రూఅఫ్జాపై వ్యాఖ్యలు చేయొద్దని గతంలో ఉత్తర్వులు ఇచ్చినా మళ్లీ వీడియో చేయడంపై జస్టిస్ అమిత్ బన్సల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రూఅఫ్జా నుంచి వచ్చిన నిధులను మదర్సాలు, మసీదులు నిర్మించడానికి వాడుతున్నారని వీడియోలో రామ్‌దేవ్ పేర్కొన్నారు. 'షరబత్ జిహాద్' అంటూ వ్యాఖ్యలు చేశారు. దీనిపై హమ్‌దర్ద్ నేషనల్ ఫౌండేషన్ సంస్థ కోర్టు ధిక్కరణ పిటిషన్ వేసింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. 24 గంటల్లో ఆ వీడియోలోని అభ్యంతరకర అంశాలను అన్ని సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని ఆదేశించింది. ఇందుకు రాందేవ్ అంగీకరించారు.

పాక్ జాతీయ భద్రతా సలహాదారుగా ఐఎస్‌ఐ చీఫ్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ జాతీయ భద్రతా సలహాదారుగా నిఘా సంస్థ ఐఎస్‌ఐ డైరెక్టర్ జనరల్ మహమ్మద్ ఆసిమ్ మాలిక్ నియమితులయ్యారు. ఆయన దేశానికి పదో జాతీయ భద్రతా సలహాదారు. అయితే ఐఎస్‌ఐ చీఫ్‌గా ఉన్న అధికారిని సలహాదారుగా నియమించడం ఇదే తొలిసారి.

దురాక్రమణకు దీటుగా బదులిస్తాం

జర్దారీ, షెహబాజ్ ఉద్ఘాటన

ఇస్లామాబాద్: భారత్‌తో సరిహద్దు ఉద్రిక్తత వేళ పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధాని షెహబాజ్ షరీఫ్ గురువారం భేటీ అయ్యారు. భద్రతపై చర్చించారు. ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వం విషయంలో ఎన్నడూ రాజీ పడబోమని, ఎలాంటి దురాక్రమణ చర్యకైనా దీటుగా బదులిస్తామని చెప్పారు. పాక్ ఐక్యంగా తమ సైనిక దళాల వెంట నిలుస్తోందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత వీరిద్దరూ భేటీ కావడం ఇదే తొలిసారి. ఖతార్ పాలకుడు షేక్ తమీమ్ బిన్ హమద్ అల్-థానీతోనూ షరీఫ్ ఫోన్లో మాట్లాడారు.

ఉద్రిక్తత సడలించుకోండి

- భారత్, పాక్‌లకు అమెరికా హితవు

దిల్లీ: భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తత సడలించుకునేలా చేయడంపై రెండు దేశాలూ దృష్టిపెట్టాలని అమెరికా హితవు పలికింది. ఇరు దేశాల మంత్రులతో అగ్రరాజ్య మంత్రులు విడివిడిగా మాట్లాడారు. భారత్‌కు ఉన్న స్వీయరక్షణ హక్కుకు, ఉగ్రవాదంపై పోరాటానికి మద్దతు ఇస్తామని వారు ప్రకటించారు. కరాచీ, లాహోర్ గగనతలాలను భద్రతాకారణాల రీత్యా ఈ నెలంతా పరిమితంగా మూసివేస్తున్నట్లు పాక్ ప్రకటించింది. పరిణామాలిలా ఉన్నా పాక్ మాత్రం వరసగా ఏడో రోజు కూడా సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ కాల్పులు కొనసాగించింది. అటారీ-వాఘా సరిహద్దును పూర్తిగా మూసివేశారు. అటూఇటూ ఎవరూ రాకపోకలు చేయడానికి వీల్లేకుండా అడ్డుకట్ట పడింది.

జైశంకర్, షరీఫ్‌లతో మాట్లాడిన రూబియో

భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్, పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌లతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఫోన్‌లో వేర్వేరుగా మాట్లాడారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేపట్టే ఎలాంటి చర్యలకైనా తాము సహకరిస్తామని హామీఇచ్చారు. దక్షిణాసియాలో శాంతి నెలకొల్పేందుకు రెండు దేశాలు కలిసి పనిచేయాలని కోరారు. భారత్‌తో ప్రత్యక్ష సంప్రదింపుల పునరుద్ధరణపై దృష్టిసారించాలని, అనాలోచిత ఉగ్రదాడిపై దర్యాప్తునకు సహకరించాలని పాక్‌కు సూచించారు. నీచమైన హింసకు పాల్పడే ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాల్సిందేనన్నారు.



మార్కో రూబియో



ఎస్.జైశంకర్

సరిహద్దులో సైన్యాన్ని మోహరిస్తున్న పాకిస్థాన్

ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్ తన సరిహద్దుల్లో భారీస్థాయిలో సైన్యాన్ని మోహరిస్తున్నట్లు తెలుస్తోంది. దంతోపాటు గగనతల రక్షణ, ఫిరంగి వ్యవస్థలను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. రాజస్థాన్‌లోని బాడ్‌మేడ్‌లోని లోంగేవాలా సెక్టారుకు అటువైపు ఉన్న ప్రాంతంలో రాడార్, గగనతల రక్షణ వ్యవస్థలను అప్రమత్తం చేసినట్లు సమాచారం. పాకిస్థాన్ వైమానిక దళం ప్రస్తుతం మూడు సైనిక విన్యాసాలను ఒకేసారి నిర్వహిస్తోంది. ఎఫ్-16, ఎఫ్-10, ఎఫ్-17 తదితర యుద్ధ విమానాలతో వీటిని కొనసాగిస్తున్నట్లు సమాచారం.

భారత్ హక్కుకు మద్దతు ఇస్తాం: హెగ్సెత్

రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కి అమెరికా రక్షణ మంత్రి హెగ్సెత్ ఫోన్ చేశారు. పహల్గాం దాడిలో అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. ఉగ్రవాదంపై పోరుకు, భారత్‌కున్న స్వీయరక్షణ హక్కుకు మద్దతు ఇస్తామని ప్రకటించారు. . పాక్ రక్షణ మంత్రితోనూ హెగ్సెత్ మాట్లాడి.. సంయమనం పాటించాలని హితవుపలికారు. ఐరోపా, పశ్చిమాసియాల్లో సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నట్లే భారత్‌తో తమకు ఉన్న ఉద్రిక్తతను సడలించడంలోనూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహకరించాలని అమెరికాలో పాక్ రాయబారి రిజ్వాన్ సయీద్ షేక్ కోరారు. కశ్మీర్ కంటే పెద్ద అంశం మరొకటి లేదన్నారు.

లక్ష్యాలపై గురిపెట్టే వీల్లేకుండా..

పాక్ సైనిక విమానాలు భారత్‌లోని లక్ష్యాలపై గురిపెట్టేందుకు వీల్లేకుండా విద్యుదయస్కాంత తరంగాలను అడ్డుకునే (ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్) వ్యవస్థల్ని పశ్చిమ సరిహద్దుల్లో భారత రక్షణశాఖ మోహరించింది. పాక్ సైన్యం వినియోగించే ఉపగ్రహ వ్యవస్థల సంకేతాలను ఇవి బలంగా అడ్డుకుంటాయి. పాక్ సైనిక విమానాలు, డ్రోన్లు, గైడెడ్ క్షిపణులు తమకు నిర్దేశించిన లక్ష్యాలను గుర్తించడంలో గందరగోళానికి గురవుతాయి. భారత్ వద్ద ఇలాంటి వ్యవస్థలు దాదాపు 50 ఉన్నాయి.



మద్యంతో తొలుత దెబ్బతినేవి పేగులే

మద్యం దుష్ప్రభావాల నుంచి తొలి అంచె రక్షణ వ్యవస్థగా పేగులు పనిచేస్తాయి. ఇక్కడ మీరు గుర్తించాల్సిన మరో ముఖ్యమైన విషయమేంటంటే- మద్యం కారణంగా శరీరంలో తొలుత దెబ్బతినేవి కూడా పేగులే. ఆల్కహాల్ వల్ల పేగు కండరాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. గొంతు, పేగుల గోడలు దెబ్బతిని.. క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. పేగుల శోషణ సామర్థ్యం క్షీణిస్తుంది. మద్యానికి ఎప్పుడూ దూరంగా ఉండండి.

– వారెన్ ఇంగ్లిష్, ఫిట్‌నెస్ కోచ్

కేంద్ర మాజీ మంత్రి గిరిజా వ్యాస్ కన్నుమూత



ఉదయ్‌పుర్: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి గిరిజా వ్యాస్ (79) కన్నుమూశారు. మార్చి 31వ తేదీన ఉదయ్‌పుర్‌లోని ఇంట్లో హారతి ఇస్తుండగా దుపట్టాకు మంటలు అంటుకోవడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆమెను స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. మరింత మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి అహ్మదాబాద్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె గురువారం సాయంత్రం కన్నుమూశారని కుటుంబ సభ్యులు వెల్లడించారు. శుక్రవారం ఉదయ్‌పుర్‌లో ఆమె అంత్యక్రియలు జరుగుతాయని తెలిపారు.

గిరిజా వ్యాస్ కాంగ్రెస్‌లో ప్రముఖ నేతగా వెలుగొందారు. కేంద్రం, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిగా పని చేశారు. పీసీసీ అధ్యక్షురాలిగానూ సేవలందించారు. జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గానూ పని చేశారు.

మరణించిన ఓటర్ల పేర్లు ఇక వెంటనే తొలగింపు

దిల్లీ: తప్పులు లేని ఓటరు జాబితాల రూపకల్పనకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నడుం కట్టింది. మరణించిన ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించాలని కుటుంబ సభ్యులు కోరేవరకూ ఆగకుండా నేరుగా భారత రిజిస్ట్రార్ జనరల్ నుంచి ఎలక్ట్రానిక్ మార్గంలో మృతుల వివరాలను తెలుసుకుని జాబితాను ఎప్పటికప్పుడు సవరించాలని నిర్ణయించింది. ఆ సమాచారాన్ని ధ్రువీకరించుకోవడానికి బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపుతారు.

ఉక్రెయిన్ అరుదైన ఖనిజాలు అమెరికాకు

- ఎట్టకేలకు ఇరుదేశాల మధ్య కుదిరిన కీలక ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్, ఉక్రెయిన్ ఉప ప్రధాని యులియా

కీవ్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో మరో కీలక మలుపు. ఓవైపు పోరును ఆపడానికి శాంతి చర్చలకు ప్రయత్నిస్తున్న అమెరికా బుధవారం ఉక్రెయిన్‌తో ఖనిజాలు ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ఆ దేశంలోని అరుదైన ఖనిజ సంపదపై అగ్రరాజ్యానికి హక్కులు ఏర్పడనున్నాయి. ప్రపంచంలో 90 శాతం అరుదైన ఖనిజాలను చైనా ఉత్పత్తి చేస్తోంది. అయితే ఆ దేశంతో సుంకాల యుద్ధం జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఒప్పందం అమెరికాకు భారీస్థాయిలో లబ్ధి చేకూర్చనుంది. గత కొంతకాలంగా యుద్ధం ఆపడానికి ప్రయత్నిస్తున్న.. ఉక్రెయిన్‌పై ఒత్తిడి తెస్తున్న డొనాల్డ్ ట్రంప్ తీరు కూడా ఇక మారే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. శాంతి చర్చలకు రానున్న రోజుల్లో అమెరికా దూరమైనా ఆశ్చర్యపోనక్కర్లేదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ట్రంప్ గద్దెనెక్కినప్పటి నుంచి ఈ అరుదైన ఖనిజాలపై కీవ్‌తో అమెరికా చర్చలు జరుపుతూనే ఉంది. అగ్రరాజ్యం షరతులు ఏకపక్షంగా ఉన్నాయంటూ వాటిని ఉక్రెయిన్ తిరస్కరిస్తూ వచ్చింది. అయితే తెరవెనక చర్చలు మాత్రం ఆగలేదు. ఇటీవల వాటికన్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ.. ట్రంప్‌తో ఏకాంతంగా సమావేశమయ్యారు. ఇది జరిగిన వారం సరిగ్గా రోజే ఈ ఒప్పందం కుదిరినట్లు వార్తలు వెలువడటం గమనార్హం.


ఇక నిరంతర సైనిక సాయం

ఒప్పందంపై సంతకాలైన తర్వాత వెలువరించిన ప్రకటనలో రష్యాకు వ్యతిరేకంగా అమెరికా కఠినమైన పదజాలం వాడింది. మాస్కోకు సైనిక పరంగా సాయం చేసిన వారికి ఉక్రెయిన్ పునర్నిర్మాణంలో చోటు ఉండదని స్పష్టం చేసింది. బుధవారం కుదిరిన ఒప్పందం... కేవలం ఖనిజాలకు సంబంధించింది మాత్రమే కాదు. ఇందులో ఉక్రెయిన్ ఇంధన, సహజవాయువులు కూడా ఉన్నాయి. ఈ ఒప్పందంతో ఉక్రెయిన్‌కు ఇక నిరంతరం అమెరికా సైనిక సాయం అందనుంది. ఇది జెలెన్‌స్కీ ప్రభుత్వానికి అతి పెద్ద ఊరట. ఉక్రెయిన్‌కు తాము అందించిన 350 బిలియన్ డాలర్ల సాయం చెల్లించాలని ఇటీవల ట్రంప్ డిమాండ్ చేశారు. ఇప్పుడిక ఆ మొత్తం పైనా వాషింగ్టన్ పట్టువిడుపును ప్రదర్శించవచ్చు. తాము అందించిన సాయం కంటే ఖనిజాల రూపంలోనే అమెరికాకు భారీగా ఆదాయం రానుందని ట్రంప్ యంత్రాంగం చెబుతోంది.

■ ఉక్రెయిన్ చేసిన డ్రోన్ దాడిలో ఏడుగురు చనిపోయారని ఖెర్సన్ ప్రాంత రష్యా అధికారులు గురువారం తెలిపారు. ఉక్రెయిన్‌కు చెందిన ఖెర్సన్ ప్రస్తుతం మాస్కో ఆధీనంలో ఉంది. మరోవైపు రష్యా చేసిన దాడిలో ఒడెసాలో ఇద్దరు పౌరులు చనిపోయారని కీవ్ వర్గాలు తెలిపాయి.

మనీలాండరింగ్ కేసులు 2014 తర్వాతే పెరిగాయి

- ఈడీ డైరెక్టర్ రాహుల్ నవీన్



దిల్లీ: మనీలాండరింగ్ వ్యతిరేక చట్టం 2014కు పూర్వం పెద్దగా ప్రభావవంతంగా అమలు కాలేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) డైరెక్టర్ రాహుల్ నవీన్ గురువారం వెల్లడించారు. ఈడీ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దర్యాప్తులో అంతర్లీనంగా ఉండే సంక్లిష్టతలు, మన న్యాయ వ్యవస్థలో నెలకొన్న సాధారణ ఆలస్యం మనీలాండరింగ్ కేసుల పరిష్కారంలో జాప్యానికి కారణాలని ఆయన విశ్లేషించారు. ఇప్పటి వరకూ కోర్టుల్లో పరిష్కారమైన 47 కేసుల్లో మూడింటిలో మాత్రమే నిందితులు నిర్దోషులుగా తేలారని, ఆ లెక్కన 93.6 శాతం కేసుల్లో శిక్ష ఖరారైనట్టేనని ఆయన అన్నారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) కింద నమోదైన కేసులు చాలా ఎక్కువ కాలం పెండింగులో ఉన్న విషయం వాస్తవమేనని ఆయన అంగీకరించారు. ఈ సంవత్సరం దర్యాప్తును పూర్తి చేసి తుది ఛార్జిషీట్లు సత్వరం దాఖలు చేసే ప్రయత్నాలపై తమ దృష్టి నిలుపుతామని ఆయన అన్నారు.

2003లో రూపొందిన పీఎంఎల్‌ఏ చట్టం, 2005, జులై 1న అమలులోకి వచ్చిందని, రాహుల్ నవీన్ పేర్కొన్నారు. తొలి సంవత్సరాల్లో ఈ చట్టం పెద్దగా ప్రభావవంతంగా అమలు కాలేదని, అప్పట్లో ఏటా కేవలం 200 కేసులు నమోదయ్యేవని ఆయన అన్నారు. 2014 మార్చి వరకూ ఈడీ రూ.5,171 కోట్ల విలువైన నేర సంబంధ ఆస్తుల్ని జప్తు చేసిందని పేర్కొన్నారు. పీఎంఎల్‌ఏ చట్టం కింద తొలి ఛార్జిషీటు 2012 వరకూ దాఖలు కాలేదన్నారు. "2014 అనంతరం చట్టం అమలులో గణనీయమైన పురోగతి సంభవించింది. 2014 నుంచి 2024 వరకూ కొత్తగా 5,113 పీఎంఎల్‌ఏ దర్యాప్తులు ప్రారంభమయ్యాయి, వార్షిక సరాసరి 500 దాటింది'' అని రాహుల్ నవీన్ తెలిపారు. "2024-25 ఆర్థిక సంవత్సరంలో పీఎంఎల్‌ఏ కింద కొత్తగా 775 దర్యాప్తులు ప్రారంభించామని, 333 ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు అందాయి, 34 మంది నిందితులకు శిక్ష ఖరారైంది' ' అని ఆయన అన్నారు. 2025 మార్చి 31 వరకూ రూ.1,54,594 కోట్ల విలువైన ఆస్తులు తాత్కాలికంగా జప్తు అయ్యాయన్నారు. 1,739 కేసులపై వివిధ స్థాయిల్లో విచారణ జరుగుతోందని, 333 కేసుల్లో ఛార్జిషీట్లు దాఖలయ్యాయన్నారు.

కులగణన ఖ్యాతి కాంగ్రెస్‌దే

- ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ వ్యాఖ్య
- కేంద్ర నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని వెల్లడి
- అమలు గడువు వెల్లడించాలని డిమాండ్

దిల్లీ: తదుపరి జనగణనలో భాగంగా కులగణన నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం "ఆకస్మికంగా" తీసుకున్న నిర్ణయాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ స్వాగతించారు. దిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణనను కేంద్రం 11 సంవత్సరాలుగా వ్యతిరేకిస్తూ వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. కులగణనపై కాంగ్రెస్ నిరంతర ప్రచారం నిర్వహించిందని, ప్రభుత్వ నిర్ణయానికి అదే కారణమని అన్నారు. అందుకే కులగణన ఖ్యాతి కాంగ్రెస్‌కే దక్కుతుందని అన్నారు. అయితే కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం కూడా మహిళా బిల్లు మాదిరిగానే మరుగున పడిపోతుందన్నది తనకున్న తక్షణ అనుమానమని రాహుల్ అన్నారు. కులగణన నిర్ణయాన్ని ఏ తేదీ నాటికి అమలులోకి తెస్తారో స్పష్టంగా వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.

'రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని చెరిపేస్తాం'



దేశంలో రిజర్వేషన్లు 50 శాతం వరకే ఉండాలన్న పరిమితిని కాంగ్రెస్ చెరిపేస్తుందని రాహుల్ హామీ ఇచ్చారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో రిజర్వేషన్లకు వీలు కల్పిస్తున్న 15(5)వ రాజ్యాంగ అధికరణాన్ని అమలు పరచాలని ఆయన కేంద్రాన్ని కోరారు. కులగణన దేశంలో ఒక కొత్త అభివృద్ధి నమూనాకు బాటలు వేస్తుందని కాంగ్రెస్ పూర్తిగా విశ్వసిస్తోందన్నారు. "భాజపా ఈ విషయంపై ఏం ఆలోచిస్తోందన్నది అప్రస్తుతం. అయితే మేం ఆ పార్టీపై కులగణన చేపట్టేలా ఒత్తిడి తేగలిగామని నిరూపించాం" అని రాహుల్ అన్నారు.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు జైరాం రమేశ్, కె.సి.వేణుగోపాల్, పార్టీ మీడియా, ప్రచార విభాగం అధినేత పవన్ ఖేడా తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

'దృష్టి మరల్చేందుకే..'

దిల్లీ: మీడియా దృష్టిని ఆకర్షించి ఎప్పుడూ పతాక శీర్షికల్లో నిలిచి ఉండటంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఎవరూ సాటిరారని కాంగ్రెస్ గురువారం ఆరోపించింది. చేస్తానన్న పనికి ఎప్పటిలోగా కార్యరూపమిస్తారన్నది మాత్రం ఆయన చెప్పరని విమర్శించింది. డెడ్‌లైన్ (పనిపూర్తికి గడువు) చెప్పకుండా హెడ్‌లైన్ (మీడియా శీర్షికలు)లో నిలవడంలో ఆయన దిట్ట అని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై గట్టి చర్యలు చేపట్టాలన్న డిమాండు ఊపందుకున్న నేపథ్యంలో కులగణన నిర్వహిస్తామంటూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజల దృష్టిని మరల్చేందుకు మాత్రమే ఉద్దేశించిందని ఆయన అన్నారు. కులగణనకు అంగీకరించడం భాజపా ప్రభుత్వ రాజకీయ, నైతిక ఓటమిని ప్రతిబింబిస్తోందని అన్నారు.

కులగణనపై ప్రణాళిక వెల్లడించండి

పహల్గాం ఉగ్రదాడిపై చర్చకు పార్లమెంటు సమావేశం నిర్వహించాలి: సీపీఎం

దిల్లీ: కులగణన చేపట్టే విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికను ప్రకటించాలని, ఇందుకోసం అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరపాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.బేబి అన్నారు. పహల్గాం ఉగ్రదాడిపై, ఆ తరువాత తలెత్తిన పరిణామాలపై చర్చ జరిపేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. మే డే సందర్భంగా దిల్లీలోని తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రసంగించారు. "కులగణన ఎప్పుడు చేపడతామన్న స్పష్టమైన ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు రావాలి. పార్లమెంటులోని వివిధ పార్టీల శాసనసభాపక్ష నేతలతో ఈ విషయంపై సంప్రదింపులు జరపాలి" అని ఆయన అన్నారు. కుల గణన దేశంలో ఎన్ని కులాలు ఉన్నాయో తెలుసు కోవడానికి మాత్రమే ఉద్దేశించింది కాదు. . ఆయా కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితుల్ని అంచనా వేయడమే దీని లక్ష్యం అని బేబి అన్నారు.

ఆ ఖ్యాతి మోదీదే: చిరాగ్

దిల్లీ: జనగణనలో భాగంగా కులగణనకు ఆమోదం తెలుపుతూ తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ హర్షం వ్యక్తం చేశారు. ఆ ఖ్యాతి పూర్తిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి తామే కారణమంటూ ప్రతిపక్షాలు చేస్తున్న వాదనను ఆయన తిరస్కరించారు.

ఆటను మార్చే నిర్ణయం: ప్రధాన్

దిల్లీ: తదుపరి జనగణనలో భాగంగా కులగణన కూడా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నిజ సంకల్పాలకూ, ఉత్తుత్తి నినాదాలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తెలియజేసిందని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గురువారం అన్నారు. భాజపా కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం ఆటను మార్చేస్తుంది (గేమ్ చేంజర్) అని ఆయన అన్నారు.

ఇజ్రాయెల్‌లో భీకర కార్చిచ్చు

- జెరూసలెంలో అలముకున్న పొగ
- విదేశాల నుంచి అగ్నిమాపక విమానాలు



జెరూసలెం: ఇజ్రాయెల్‌లో భీకర కార్చిచ్చు రేగింది. జెరూసలెం శివారులోని అడవుల్లో మంటలు ఎగసిపడుతున్నాయి. ఆ నగరంపై దట్టమైన పొగ అలముకుంది. దీంతో దేశంలో అత్యవసర పరిస్థితి తలెత్తింది. 24 గంటల్లో వేల మంది స్థానికులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దేశ చరిత్రలో అతి పెద్ద అగ్ని ప్రమాదాల్లో ఒకటిగా దీనిని అధికారులు అభివర్ణిస్తున్నారు. కార్చిచ్చు కారణంగా 13 మంది గాయపడ్డారు. ప్రాణ నష్టం వివరాలు తెలియరాలేదు. మంటలను ఆర్పడానికి విదేశాల నుంచి అగ్నిమాపక విమానాలు ఇజ్రాయెల్‌కు వచ్చాయి.

వాతావరణం పొడిగా ఉండటం, బలమైన గాలులవల్ల మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. ఈ అగ్ని కీలలు జెరూసలెం నగరానికి చేరుకోవచ్చని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరించారు. ఇది జాతీయ అత్యవసర పరిస్థితని పేర్కొన్నారు. జెరూసలెంను రక్షించుకోవడం ప్రస్తుత ప్రాధాన్యాంశమని తెలిపారు. టెల్ అవీవ్, జెరూసలెంను కలిపే రోడ్డును అధికారులు మూసివేశారు. రహదారులపై దట్టమైన పొగ కమ్ముకుంది. రోడ్డు మార్గంలో మంటలు చుట్టుముట్టడంతో, పలువురు తమ వాహనాలు విడిచిపెట్టి పరిగెడుతున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. సహాయక చర్యల కోసం సైన్యం రంగంలోకి దిగింది.

బందీలు కాదు.. హమాస్‌పై నెగ్గడమే కీలకం: నెతన్యాహు

టెల్ అవీవ్: హమాస్ చెరలోని బందీలను సురక్షితంగా స్వదేశానికి రప్పించడం కంటే యుద్ధంలో విజయం సాధించడమే తమకు కీలకం అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు. "ఈ యుద్ధంలో చాలా లక్ష్యాలు ఉన్నాయి. బందీలందరినీ ఇంటికి తీసుకురావాలి. ఇప్పటివరకు 147 మందిని సురక్షితంగా తెచ్చాం. ఇంకో 59 మంది వారి దగ్గర ఉన్నారు. అందులో 24 మంది సజీవంగా ఉన్నారు. అయితే మా అత్యున్నత లక్ష్యం మాత్రం శత్రువులపై విజయం సాధించడమే. దాన్ని మేం సాధిస్తాం" అని నెతన్యాహు తెలిపారు.

■ గడిచిన 24 గంటల్లో ఇజ్రాయెల్ దాడుల్లో 18 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ గురువారం తెలిపింది.

సరిహద్దులో ఉగ్రకుట్ర భగ్నం.. శ్రీనగర్‌లో పోలీసు సోదాలు

దిల్లీ: అమృత్‌సర్ సమీపంలోని పాక్ సరిహద్దులో ఉగ్ర కుట్రను మన బలగాలు భగ్నం చేశాయి. బీఎస్ఎఫ్, పంజాబ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీగా ఆయుధాలు పట్టుబడ్డాయి. వాటిలో తుపాకులు, గ్రనేడ్లు ఉన్నాయి. బీఎస్ఎఫ్ నిఘా విభాగ సమాచారం మేరకు బుధవారం రాత్రి ఈ ఆపరేషన్ నిర్వహించారు. శ్రీనగర్‌లో 21 ప్రాంతాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. అల్-ఉమర్ ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు ముస్తాక్ అహ్మద్ జర్గార్ అలియాస్ లాత్రమ్ (ఐసీ-814 విమాన హైజాక్ నిందితుడు) నివాసంలోనూ తనిఖీలు చేపట్టారు. వాస్తవాధీన రేఖ వెంబడి పాక్ సైన్యం వరసగా ఏడోరోజు కూడా కాల్పులు జరిపింది. మూడు జిల్లాల్లోని ఏడు సెక్టార్లలో జరిగిన దాడుల్ని మన సైన్యం దీటుగా తిప్పికొట్టింది. పాకిస్థాన్ నటులు- మహీరా ఖాన్, హనియా ఆమిర్, అలీ జాఫర్‌ల ఇన్‌స్టాగ్రాం ఖాతాలను భారత్‌లో స్తంభింపజేశారు.



జమ్మూ-కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో గురువారం పహరా కాస్తున్న భద్రతా సిబ్బంది

వారికీ, ఉగ్రవాదుల మనస్తత్వానికి తేడా లేదు

- సమాజ్‌వాదీ ఎంపీ అఫ్జల్ వ్యాఖ్య

బలియా: పహల్గాంలో ఉగ్ర దాడి తర్వాత దేశంలో పలుచోట్ల ముస్లింలపైనా, కశ్మీరీ విద్యార్థులపైనా దాడులు జరుగుతున్నాయని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఫ్జల్ అన్సారీ ఆరోపించారు. స్వదేశంలో మైనారిటీలపై హింసకు, బెదిరింపులకు పాల్పడుతున్న మితవాద శక్తుల మనస్తత్వానికీ, ఉగ్రవాదుల మనస్తత్వానికీ తేడా లేదని ఆయన వ్యాఖ్యానించారు. పంజాబ్‌లోని పటియాలాలో కశ్మీరీ విద్యార్థులపై ఈ శక్తులు దాడి చేశాయని, హరియాణాలో ముస్లింల దుకాణాలను కొందరు ధ్వంసం చేశారని, దళిత ఎంపీ రాంజీలాల్ సుమన్‌నూ బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. 'పాక్ సరిహద్దుకు 150 కిలోమీటర్ల దూరంలోని పహల్గాం వరకూ ఉగ్రవాదులు ఎలా రాగలిగారు.. వారి దురాగతానికి ప్రతిగా భారత్ ఎదురు దాడికి దిగి పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను (పీవోకే) మళ్లీ విలీనం చేసుకోవాలి' అని అన్సారీ పిలుపునిచ్చారు.

బంగ్లా సరిహద్దుల్లో ఐఎస్‌ఐ!

ఇంటర్నెట్ డెస్క్: బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ అధికారం చేపట్టాక.. పాక్‌తో సంబంధాలు నెరపుతున్నారు. దీంతో పాక్ నిఘా సంస్థ ఐఎస్‌ఐ, మిలిటరీ అధికారులు బంగ్లాదేశ్‌లోని భారత్ సరిహద్దుల వైపునకు రావడం పెరిగింది. ఆ దేశంలోని రాడికల్ గ్రూప్స్‌తోనూ పాక్ సంబంధాలు పెట్టుకొంటోంది. ఈ నేపథ్యంలో బంగ్లా-భారత రాడికల్ గ్రూపులను పాకిస్థాన్ వాడుకునే అవకాశాలున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి.

రోజూ 4 గంటలపాటు కరాచీ, లాహోర్ గగనతలాల మూసివేత

ఇస్లామాబాద్: భద్రతపరమైన ఆందోళనతో ఈ నెలంతా కరాచీ, లాహోర్ గగనతలాలను రోజూ తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 8 గంటల వరకు మూసివేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. ఆ సమయంలో వాణిజ్య విమానాలను ప్రత్యామ్నాయ మార్గాల్లో పంపిస్తామని, దానివల్ల వాటి రాకపోకలు పెద్దగా ప్రభావితం కావని తెలిపింది.

దుస్సాహసానికి ఒడిగడితే ఊరుకోం: మునీర్

భారత సైన్యం తమపై ఎలాంటి దుస్సాహసానికి ఒడిగట్టినా సహించబోమని, తగిన రీతిలో సమాధానం ఇస్తామని పాక్ రక్షణమంత్రి జనరల్ అసీం మునీర్ హెచ్చరించారు. సైనిక బలగాల క్షేత్రస్థాయి శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రాంతీయ శాంతికి కట్టుబడి ఉన్నామని, దేశ ప్రయోజనాలను కాపాడుకుంటామని చెప్పుకొచ్చారు.

వాయిదా పడిన అమెరికా-ఇరాన్ అణు చర్చలు

దుబాయ్: అమెరికా, ఇరాన్ మధ్య రోమ్‌లో శనివారం ప్రారంభం కావాల్సిన నాలుగో రౌండు అణు ఒప్పంద చర్చలు వాయిదా పడ్డాయి. ఈ విషయాన్ని చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న ఒమన్ గురువారం తెలిపింది. కొత్త తేదీలను త్వరలో వెల్లడిస్తామని ప్రకటించింది. చర్చలు వాయిదాపడిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ నుంచి చమురును కొనుగోలుచేసే వారిపై ఆంక్షలు తప్పవని హెచ్చరించారు.

పునర్నిర్మాణ క్రతువుకు ముస్తాబైన అమరావతి

రాష్ట్రం నలుమూలల నుంచి తరలిరానున్న ప్రజలు

- 5 లక్షల మంది వరకు వస్తారని అంచనా
- 6,500 మంది పోలీసులతో భారీగా బందోబస్తు
- 7 మంది ఐపీఎస్‌లు, ట్రైనీ ఐపీఎస్‌ల పర్యవేక్షణ

ఈనాడు, అమరావతి: పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి రాజధాని అమరావతి ముస్తాబైంది. 'అమరావతి పునఃప్రారంభం' పేరుతో ప్రభుత్వం భారీ ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తోంది. వెలగపూడిలో దాదాపు 276 ఎకరాల్లో అట్టహాసంగా సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభా ప్రాంగణం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రాష్ట్రం నలుమూలల నుంచి దాదాపు 5 లక్షలమంది తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం 35 గ్యాలరీలను, ఎక్కడా తోపులాటలకు తావులేకుండా బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. ప్రతి గ్యాలరీలో అందరికీ వేదిక కనిపించేలా ఎల్‌ఈడీ తెరలను సిద్ధం చేశారు. వర్షం పడినా ఇబ్బంది లేకుండా వాటర్ ప్రూఫ్ పైకప్పుతో మూడు షెడ్లు వేశారు. ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం కూలర్లు పెట్టారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి గ్యాలరీలో తాగునీరు, మజ్జిగ అందించనున్నారు. ఎంపీలు, వీవీఐపీలు, వీఐపీలు, అమరావతి రైతుల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలు పెట్టారు. మిగిలిన ప్రాంతాన్ని సాధారణ ప్రజల కోసం కేటాయించారు. 6,500 మంది భద్రతా సిబ్బందిని, పర్యవేక్షణకు 37 మంది ఐపీఎస్ అధికారులను నియమించారు. వారికి సహాయంగా ట్రైనీ ఐపీఎస్‌లను కేటాయించారు.

11 మార్గాలు.. పార్కింగ్ ప్రదేశాలు

సుమారు 256 ఎకరాలను వాహనాల పార్కింగ్ కోసం కేటాయించారు. ప్రముఖుల వాహనాలను నిలిపేందుకు వేదిక పక్కనే పార్కింగ్ పెట్టారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే వారు సభా ప్రాంగణానికి చేరుకునేందుకు 11 మార్గాలను నిర్దేశించారు. వాటికి సమీపంలోనే వాహనాలు నిలిపేందుకు స్థలాలను కేటాయించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వారు సభా ప్రాంగణం వద్దకు రాలేకపోతే వారు హోల్డింగ్ ఏరియాల్లో ఉండేలా ఏర్పాట్లు చేశారు. అక్కడ వారికి భోజనం, తాగునీటి సదుపాయం కల్పించనున్నారు. కరకట్ట మార్గంతో పాటు ఉండవల్లి మీదుగా సచివాలయానికి వెళ్లే రెండు మార్గాలను పూర్తిగా ఎంపీల కోసం కేటాయించారు.



అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి సిద్ధమైన వేదిక

కలల రాజధాని త్వరలో సాకారం

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: 'ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా శుక్రవారం అమరావతి ప్రజా రాజధాని పునఃప్రారంభం శుభ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. రాష్ట్ర ప్రజల చిరకాల కోరిక.. వారి కలల రాజధాని త్వరలోనే సాకారమవుతుందని ఆశిస్తున్నా' అని గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.



ప్రధాని పాల్గొననున్న సభ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రులు కొల్లు రవీంద్ర, నారాయణ, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్

భద్రతా దళాల గుప్పిట్లోకి..

ప్రధాన వేదికపై ప్రధాని మోదీ సహా 19 మంది ఆసీనులవుతారు. వారిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్రమంత్రులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్‌నాయుడు, సీఎస్ విజయానంద్ తదితర ముఖ్యులు ఉంటారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌కు చెందిన సిబ్బంది ఇప్పటికే వేదికతో పాటు, ప్రాంగణాన్ని క్షుణ్నంగా తనిఖీ చేసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

సౌండ్, లైట్‌షోకు ఎస్పీజీ అభ్యంతరం

అమరావతి పనుల పునఃప్రారంభానికి సూచికగా నిర్మిస్తున్న పైలాన్‌ను ప్రధాని మోదీ ఆవిష్కరించనున్నారు. దీనికి అట్టహాసంగా సౌండ్ అండ్ లైట్ షోతో సీఆర్డీఏ అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా ఎస్పీజీ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు.



సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆసుపత్రి



సభా మార్గం తెలిపే క్యూఆర్ కోడ్‌తో ఉండవల్లి వద్ద ఏర్పాటు చేసిన బోర్డు. మొబైల్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తేసరి దారి చూపిస్తుంది



సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాలు పర్యవేక్షిస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రధాని పర్యటన నేపథ్యంలో నోఫ్లై జోన్

- వేదిక నుంచి 5 కి.మీ. పరిధిలో అమలు
- కనీసం డ్రోన్ వినియోగించినా చర్యలు

ఈనాడు-అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో సభ జరిగే ప్రాంతానికి 5 కి.మీ. పరిధిని నోఫ్లై జోన్‌గా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాని పర్యటన పూర్తయ్యే వరకు డ్రోన్ ఎగురవేయడానికి కూడా అనుమతి ఉండబోదని డ్రోన్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. గన్నవరం విమానాశ్రయం చుట్టుపక్కలా ఇవే నిబంధనలు అమలవుతాయి. పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధాని పర్యటనకు భారీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన తిరువనంతపురం నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టులో దిగుతారు. అక్కడ ఆయనకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్వాగతం పలుకుతారు. విమానాశ్రయం నుంచి ప్రధాని హెలికాప్టర్‌లో అమరావతికి చేరుకుంటారు. ఇప్పటికే 4 హెలికాప్టర్లు విమానాశ్రయానికి చేరుకున్నాయి. వాతావరణం అనుకూలించకపోతే రోడ్డు మార్గాన వెళ్లేలా రెండు మార్గాలను ఎంపిక చేశారు. విమానాశ్రయం నుంచి చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపైకి వచ్చి కేసరపల్లి - గూడవల్లి - ఎనికేపాడు - రామవరప్పాడు మీదుగా విజయవాడ నగరంలోకి ప్రవేశిస్తారు. బెంజిసర్కిల్, ప్రకాశం బ్యారేజి, ఉండవల్లి కరకట్ట మీదుగా రాజధానికి వెళ్తారు. ఈ మార్గంలో కాన్వాయ్ ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. ఇదికాకుండా మరో మార్గాన్ని కూడా సిద్ధం చేశారు. ఆ సమయంలో రోడ్డు షో నిర్వహించే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. రోడ్డు షో ఉంటే.. ఆ ప్రాంతం కూడా నోఫ్లై జోన్ పరిధిలోకి వస్తుంది. ఎక్కడా బెలూన్లు కూడా ఎగరేయకూడదని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ప్రజలకు సూచించారు.

100 మంది ఆర్డీఓలకు పర్యవేక్షణ బాధ్యతలు

సభకు తరలివచ్చే లక్షల మందికి అవసరమైన ఏర్పాట్ల పర్యవేక్షణ బాధ్యతలను రెవెన్యూ శాఖ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 మంది ఆర్డీఓలు, 200 మంది తహసీల్దార్లు, 200 మంది సర్వేయర్లకు అప్పగించింది. వీరు సభకు వచ్చిన వారికి సౌకర్యాల కల్పన, వాహనాల పార్కింగ్ పరంగా సమస్యలు తలెత్తకుండా చూడడం వంటి విధులు నిర్వర్తిస్తారు.

అత్యవసర వైద్యానికి 30 బృందాలు : సభాస్థలి వద్ద ముందు జాగ్రత్తగా అత్యవసర వైద్యానికి వీలుగా 30 వైద్య బృందాలను ఏర్పాటు చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. సభాస్థలి పరిసర ప్రాంతాల్లో మూడుచోట్ల పదేసి పడకలతో తాత్కాలిక ఆసుపత్రులు ఏర్పాటు చేశారు. 21 అంబులెన్సులు సిద్ధంగా ఉంటాయి. మంగళగిరి ఎయిమ్స్, మరో కార్పొరేట్ ఆసుపత్రిలోనూ ప్రత్యేక వార్డులను సిద్ధంచేశారు.

మంత్రుల పర్యటన.. పర్యవేక్షణ : సభకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశామని, సభకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యం ఉండదని మంత్రుల బృందం పేర్కొంది. ఈ బృందంలో సభ్యులైన పయ్యావుల కేశవ్, నారాయణ, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర గురువారం సభా ప్రాంగణంలో పర్యటించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరావతి పనుల పునఃప్రారంభోత్సవంతో రాష్ట్ర ప్రజల్లో ఉత్సాహం కనిపిస్తోందన్నారు.

రాష్ట్ర సచివాలయ ఉద్యోగులంతా ప్రధాని సభకు రావాలి: సీఎస్

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల్ని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించనున్న నేపథ్యంలో రాష్ట్ర సచివాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది ఆ కార్యక్రమానికి హాజరుకావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. ఉద్యోగులంతా మధ్యాహ్నం రెండు గంటలకల్లా సభావేదిక వద్దకు చేరుకోవాలని కోరారు.

మోదీ రాకతో పునర్వికాసం

భాజపా నేత, మంత్రి సత్యకుమార్

ఈనాడు-అమరావతి: ప్రధాని మోదీ అమరావతి రాక రాష్ట్ర పునర్వికాసానికి శంఖారావమని భాజపా సీనియర్ నేత, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. 'ఆత్మగౌరవ రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా 2015లో పీఎం మోదీ శంకుస్థాపన చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం విధ్వంస పాలన సాగించి అమరావతి అభివృద్ధిని అడ్డుకుంది. ఈ క్రమంలో మళ్లీ రాజధానికి అండగా ఉండాలన్న లక్ష్యంతో ప్రధాని శుక్రవారం అమరావతికి వస్తున్నారు. పాక్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ఉన్నత స్థాయి సమావేశాల్లో తీరికలేకుండా ఉన్నప్పటికీ అమరావతి పునర్నిర్మాణానికి కట్టుబడి ఉన్నందున మోదీ ఇక్కడికి వస్తున్నారు. సీఎం చంద్రబాబు రాజధాని నిర్మాణానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు' అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాజధాని నిర్మాణానికి బేషరతుగా రూ.1.50 లక్షల కోట్లు ప్రకటించాలి

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణం కోసం కేంద్రం బేషరతుగా రూ.1.50 లక్షల కోట్లు ప్రకటించి మాటేలతో ఇవ్వాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. రాష్ట్ర పర్యటనకు శుక్రవారం వస్తున్న ప్రధాని మోదీ ఈ మేరకు ప్రకటన చేయాలని ఆమె ఓ ప్రకటనలో కోరారు. 'రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలి. అమలుకు నోచుకోని విభజన హామీలపై స్పష్టత ఇవ్వాలి. మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేయబోమని ప్రమాణం చేయాలి' అని షర్మిల పేర్కొన్నారు.

ప్రధాని పర్యటనను స్వాగతిస్తున్నాం

అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనటానికి ప్రధాని మోదీ రాకను స్వాగతిస్తున్నామని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య పేర్కొన్నారు. విభజన చట్టం ప్రకారం రాజధాని అమరావతికి కేంద్రం నిధులు ఇచ్చి నిర్మించాలని ప్రధానిని కోరారు. అమరావతికి ఊపిరినిచ్చే భరోసాను రాజధాని రైతులు కోరుతున్నారని బాలకోటయ్య పేర్కొన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించాలని గురువారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

కులగణనతో సామాజిక న్యాయం


మంత్రి లోకేశ్



ఈనాడు, అమరావతి: దేశంలో జనాభా లెక్కలతో పాటు కులగణన కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు విద్యా శాఖ మంత్రి లోకేశ్ తెలిపారు. సామాజిక న్యాయానికి కులగణన బాటలు వేస్తుందని అన్నారు. ఈ విషయంలో ప్రధాని మోదీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని 'ఎక్స్'లో లోకేశ్ గురువారం పేర్కొన్నారు.

రాక్షస రాజ్యంలో ఉన్నాం

వైకాపా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమావేశంలో జగన్



ఈనాడు, అమరావతి: 'మనమంతా రాక్షస రాజ్యంలో ఉన్నామని రాష్ట్రంలో చంద్రబాబు 11 నెలల పాలనను చూస్తే అర్థమవుతుంది' అని వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ విమర్శించారు. కుప్పం, పిఠాపురం మున్సిపాలిటీలతో పాటు పలు మండల పరిషత్తులకు చెందిన వైకాపా ప్రజాప్రతినిధులతో తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం జగన్ సమావేశమై మాట్లాడారు. 'ప్రలోభాలు, పోలీసుల దౌర్జన్యానికి కుప్పం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికే నిదర్శనం. 25 మంది కౌన్సిలర్లలో వైకాపాకు 16 మంది ఉంటే తెదేపా వారు ఆరుగురే. ఆ బలంతో మున్సిపల్ ఛైర్మన్ పదవిని ఎలా తీసుకోగలిగారు? ఒక్కొక్కరికీ రూ.50 లక్షలిచ్చి ప్రలోభపెట్టారు. రాజ్యాంగానికి లోబడి ఉంటానని ప్రమాణం చేసి, అధికారం చేపట్టాక ప్రజాస్వామ్యాన్ని తగలబెడతారా?' అని ప్రశ్నించారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

కులగణనను నిర్వహించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని వైకాపా అధినేత, మాజీ సీఎం జగన్ అన్నారు. ఈ ప్రక్రియ వెనుకబడిన వర్గాలకు మరింత సంక్షేమాన్ని అందిస్తుందంటూ 'ఎక్స్'లో గురువారం పోస్టు చేశారు.

సింహాచలం దుర్ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి

శాసనమండలిలో విపక్షనేత బొత్స

విశాఖపట్నం (ఎం.వి.పి.కాలనీ), న్యూస్‌టుడే: చందనోత్సవం రోజున సింహాచలంలో గోడకూలి భక్తులు మృతి చెందడంపై ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించాలని ఎమ్మెల్సీ, శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం విశాఖ క్యాంప్ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు తదితరులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఉత్సవాల ఏర్పాట్లను సమీక్షించిన మంత్రుల బాధ్యతారాహిత్యం వల్లే ఈ దుర్ఘటన చోటు చేసుకుందన్నారు. ప్రచారంలో చూపించిన ఆర్భాటం, భక్తుల భద్రతపై చూపించలేదని విమర్శించారు. ఘటనా స్థలాన్ని తాము పరిశీలించామని.. గోడ నిర్మాణంలో నాణ్యత పాటించలేదని స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

'ఉపాధి' శ్రామికులకు ప్రమాద పరిహారం పెంపు

- మృతి చెందినా, తీవ్ర అంగవైకల్యానికి గురైనా రూ.2 లక్షల సాయం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటన

ఈనాడు, అమరావతి: పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన, తీవ్ర అంగవైకల్యానికి గురైన ఉపాధి శ్రామికులకు ఇస్తున్న రూ.50 వేల పరిహారాన్ని రూ.2 లక్షలకు పెంచుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. 2006 తర్వాత ఇప్పటి వరకు పరిహారం పెంచలేదని ఆయన అన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద మరో రూ.2 లక్షలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇందుకోసం ఒకే రోజు కోటి మంది శ్రామికుల పేర్లు బీమా పథకాల్లో నమోదు చేయించినట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం మంగళగిరిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఉపాధి శ్రామికుల ఆత్మీయ కలయిక' సభలో ఆయన ప్రసంగించారు. 'వైకాపా ప్రభుత్వం అప్పులపాలు జేసిన రాష్ట్రానికి ఉపాధి హామీ పథకం వెన్నెముకగా నిలిచింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.10,660 కోట్లు ఖర్చు చేశాం. ఇందులో రూ.6,194 కోట్లు వేతనాలకు, మరో రూ.4,023 కోట్లు మెటీరియల్ కింద వెచ్చించాం. వీటితో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, గోకులాలు, పశువులకు నీటితొట్టెలు, నీటి కుంటలు నిర్మించాం. పెద్ద ఎత్తున పండ్ల తోటలు పెంచాం. ఈ ఏడాది కూడా 4 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, 500 కి.మీ. పొడవున సిమెంట్ కాలువలు నిర్మించబోతున్నాం. శ్రామికులంటే నాకు అత్యంత గౌరవం. నా దృష్టిలో వారు కూడా శాస్త్రవేత్తలే. అందుకే ఉపాధి పథకంలో కూలీలు అనే పదాన్ని తొలగించి, శ్రామికులు అని చేర్చాం. కేంద్రం ప్రకటించిన కనీస వేతనం రూ.307 వచ్చేలా తగు చర్యలు తీసుకుంటున్నాం.

వ్యవసాయాన్ని అనుసంధానించేలా కృషి

వ్యవసాయ రంగాన్ని ఉపాధి పథకానికి అనుసంధానించే విషయమై కేంద్ర ప్రణాళిక సంఘం, 16వ ఆర్థిక సంఘం కేంద్రానికి సిఫార్సు చేయాలి. జల్‌జీవన్ మిషన్‌లో రూ.87 వేల కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. ఇందులో రూ.29 వేల కోట్లతో పనులు చేయిస్తున్నాం. మిగతా నిధులు కూడా కేంద్రం ఇస్తుందని ఆశిస్తున్నా' అని పవన్ అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ, ఉపాధి డైరెక్టర్ షణ్ముఖరావు తదితరులు మాట్లాడారు. జిల్లాకు 10 మంది చొప్పున ఉపాధి శ్రామికులు కార్యక్రమానికి హాజరయ్యారు. పవన్‌తో మాట్లాడించి, జిల్లాల వారీగా గ్రూప్ ఫొటో దిగారు.



ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో ఉపాధి శ్రామికులు

ఉపాధిలో యువతకు 'ఇంటర్న్‌షిప్'

నేటి యువతకు శ్రామికుల కష్టం తెలియాలనే ఉద్దేశంతో ఉపాధి హామీ పథకంలో వారికి ఇంటర్న్‌షిప్ కోసం ప్రణాళిక రూపొందిస్తున్నాం. దీనివల్ల యువతకు కొంత ఆదాయంతోపాటు శారీరక శ్రమ తెలుస్తుంది. చాలా మంది మొబైల్, టీవీకి అతుక్కుపోయి విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారు. శారీరక శ్రమ ఉంటే మానసిక సమస్యలు ఎందుకొస్తాయి? మా పిల్లలు ఎప్పుడైనా డిప్రెషన్ అంటే భోజనం చేయొద్దని, శ్రమ పడాలని చెబుతా. ఉపాధిలో నీటి సంరక్షణ వంటి కీలక బాధ్యతలు యువతకు అప్పగిస్తే ఎలా ఉంటుందో పరిశీలించాలని అధికారులను ఆదేశించా. తాగునీటి విలువ, వర్షపు నీటి సంరక్షణతో లాభాలను యువత తెలుసుకోవాలి. నేను స్వయంగా దుక్కి దున్నాను. తోటలో గుంతలు తీశా.

పవన్‌తో ఓ ఫొటో!

'ఉపాధి శ్రామికుల ఆత్మీయ కలయికలో పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం అంచులవారిపాలెం నుంచి వచ్చిన దివ్యాంగురాలు లక్ష్మి అందర్నీ ఆకట్టుకున్నారు. వంద రోజుల పని సరిపోవడం లేదని 150 రోజులపాటు ఉపాధి కల్పించాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. ఓ సారి మా ఊరు రావాలని అభ్యర్థించారు. వస్తానని పవన్ కల్యాణ్ చెప్పడంతో ఆ ఆనందంలో లక్ష్మి సెల్ఫీ కోరారు. దీంతో ఆమెను వేదికపైకి పిలిచి ఫొటో దిగారు. - ఈనాడు, అమరావతి



ఆనందబాష్పాలతో పవన్ కల్యాణ్‌ను సెల్ఫీ అడుగుతున్న లక్ష్మి



డిప్యూటీ సీఎంతో ఫొటో తీయించుకుంటున్న లక్ష్మి

మంచి పని చేసేటప్పుడు రాజకీయాలు ప్రస్తావించం

- కులగణనకు రూ.575 కోట్లు సరిపోవు
- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

ఈనాడు, బెంగళూరు: జనాభా లెక్కలతో పాటు కులగణన కూడా చేపడతామంటూ కేంద్రం తీసుకున్న నిర్ణయం బిహార్ ఎన్నికల కోసమే అంటూ వస్తున్న అభిప్రాయాలను తాను సమర్థించనని, మంచి పని చేసే సమయంలో రాజకీయాలు ప్రస్తావించటం తనకు ఇష్టముండదని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు(ఏఐసీసీ) మల్లికార్జున ఖర్గే అన్నారు. అయితే జనాభా లెక్కలకు కేటాయించిన రూ.575 కోట్లు ఇప్పుడు సరిపోవని పేర్కొన్నారు. గురువారం ఆయన బెంగళూరులో మాట్లాడారు. కాంగ్రెస్ రెండేళ్లుగా కులగణన కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తుంటే అది ఇప్పుడు స్పందించిందని, నిజంగా దీనిపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తాజా బడ్జెట్‌లోనే అందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి ఉండేదని చెప్పారు. ఈ చాలీచాలని నిధులతో ఒక్క ఉత్తర్‌ప్రదేశ్ గణన కూడా చేయలేమని విమర్శించారు. పదేళ్ల కిందట కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారు 165 కోట్లను ఈ పనికి కేటాయించినట్లు గుర్తు చేశారు. అలాగే రిజర్వేషన్ పరిమితిని సైతం 50 శాతానికి మించి సవరించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్ కల్పించేలా రాజ్యాంగాన్ని సవరించే అవకాశాన్ని కాంగ్రెస్ గతంలో కల్పించినట్లు ఖర్గే గుర్తు చేశారు.

రాజధాని అమరావతేనని చట్టం తెచ్చే యోచన

కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

ఈనాడు-అమరావతి: రాజధాని రైతుల కోరిక మేరకు ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతేనంటూ పార్లమెంటులో చట్టం తెచ్చే యోచన చేస్తామని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. 'గత వైకాపా ప్రభుత్వ దుర్మార్గపు పాలన కారణంగానే రాజధాని రైతుల్లో అభద్రతాభావం ఏర్పడింది. అందుకే వారు అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటిస్తూ పార్లమెంటులో చట్టం చేయాలని కోరుతున్నారు. గతంలో ఏ విభజిత రాష్ట్రానికీ ఇలాంటి చట్టం చేయలేదు' అని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ సభకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అమరావతి ఉద్యమంలో భాజపా కూడా భాగస్వామేనని వివరించారు. 'రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులతోపాటు అమరావతి, పోలవరం, స్టీల్‌ప్లాంట్లకు కేంద్రం నిధులిచ్చింది. ప్రభుత్వ, ప్రైవేటు ప్రాజెక్టులు కలిపితే ఈ మొత్తం రూ.3 లక్షల కోట్లకు సమానం. ఎన్డీయే కూటమి 2029 నాటికి అమరావతికి ఒక రూపు తెస్తుంది. అందులో అనుమానం లేదు' అని చెప్పారు. భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ఉద్యోగులకు రూ.30 లక్షల వరకు ప్రమాద బీమా

ఎస్‌బీఐతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఒప్పందం

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న 10 వేల మంది నిర్దేశిత కాలపరిమితి ఉద్యోగుల (ఎఫ్‌టీఈ)కు రూ.3 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ప్రమాద బీమా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లోని ఉపాధి ఉద్యోగుల బ్యాంకు పొదుపు ఖాతాలను కార్పొరేట్ శాలరీ ఎకౌంట్ల పరిధిలోకి మార్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఇలాంటి ఖాతాలకు ఎస్‌బీఐ అమలు చేస్తున్న ప్రమాద బీమా.. ఇక నుంచి ఉపాధి ఉద్యోగులకూ వర్తించనుంది. వీరి జీతాల ఆధారంగా బీమా పరిహారం మొత్తం ఉంటుందని అధికారులు తెలిపారు. అందుకు సంబంధించి ఎస్‌బీఐ-రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది.

మంత్రిముగ్ధం.. శ్రమైక సౌందర్యం!

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మేడే సందర్భంగా గురువారం రిక్షా తొక్కి.. శ్రమ విలువను చాటిచెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలో వందల మంది రిక్షా కార్మికులతో కలిసి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రిక్షా తొక్కి మేడే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాలకొల్లు నియోజకవర్గానికి పెద్ద శ్రామికుడిని తానేనన్నారు. రిక్షా కార్మికులకు భోజనాలు ఏర్పాటు చేసి టవళ్లు, టీషర్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏఎంసీ ఛైర్మన్ కోడి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు　　- న్యూస్‌టుడే,పాలకొల్లు



కార్మికులతో కలిసి రిక్షా తొక్కుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

వసుంధర

vasundhara@eenadu.in

మీకు తెలుసా?



మండే ఎండల్లో ఓ కప్పు ఐస్‌క్రీమ్ తింటే ఉండే సంతృప్తే వేరు కదా! అయితే, మొట్ట మొదట హ్యాండ్– ఆపరేటెడ్ ఐస్‌క్రీమ్ మేకర్‌ను తయారుచేసింది యూఎస్‌కు చెందిన నాన్సీ జాన్సన్ అనే మహిళ అట.

ఏడాదిలో 175 ఆన్‌లైన్ కోర్సులు...



ప్రవల్లిక

పదిహేనేళ్ల వయసు. ఆడుతూ పాడుతూ గడిపేస్తారు అనుకుంటారంతా. కానీ బండారు ప్రవల్లిక ఈ ఆలోచనలను తారుమారు చేసింది. ఏడాదిలో 175 ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్ని పూర్తిచేసింది. అవేవో సాధారణమైనవి అనుకునేరు. బీటెక్, ఎంటెక్ వాళ్లు ఆసక్తి చూపేవి. ఆ విషయమై ఆమెతో ముచ్చటిస్తే...

'మాది నిరుపేద కుటుంబం. అయినా చదువుకు ఏనాడూ అడ్డు చెప్పలేదు నా తల్లిదండ్రులు. చిన్నప్పట్నుంచీ చదువుల్లో చురుకే. కానీ కొవిడ్ మా జీవితాల్ని తారుమారు చేసింది. విశాఖపట్నంలోని అచ్యుతాపురం మాది. నాన్న దాలిబాబు కరోనాతో చనిపోవడంతో కుటుంబ భారమంతా అమ్మ పాప మీదే పడింది. తను ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తుంది. 6వ తరగతి వరకూ ప్రైవేట్ స్కూళ్లో చదివా. తర్వాత ఆర్థికంగా కష్టమై నన్ను భీమిలి కస్తూర్బా గాంధీ విద్యాలయలో చేర్పించింది. ఇక్కడ తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు మా పాఠశాలకు కొందరు అధికారులు వచ్చారు. వృత్తి నైపుణ్యం క్లాసులు చెప్పారు. వాళ్లే ఇన్ఫోసిస్ వెబ్‌సైట్‌ను మాకు పరిచయం చేశారు. మెయిల్ ఐడీ క్రియేట్ చేయడం దగ్గర్నుంచీ ప్రతిదీ నేర్పారు. వాళ్ల ప్రోత్సాహంతోనే 20 మందిమి ఆన్‌లైన్ కోర్సులు చేయడానికి చేరాం. కానీ అందరికన్నా నేనే ఎక్కువ పూర్తిచేశా. స్కూల్ అయిపోయిన వెంటనే అందరూ ఆడుకోవడానికి వెళ్లిపోయేవాళ్లు. నేను మాత్రం రోజూ 2-3 గంటలు దీనికి కేటాయించేదాన్ని. రోజుకో కోర్సు వీడియో చూసేదాన్ని. అదైన వెంటనే పరీక్ష పెట్టేవాళ్లు. అలా సంవత్సరంలో 175 సర్టిఫికెట్ కోర్సులు చేశా. మా స్కూల్లో కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ వంటి అన్ని సదుపాయాలూ ఉన్నాయి. టీచర్లు కూడా ఎప్పటికప్పుడు గైడ్ చేస్తూ, మమ్మల్ని ప్రోత్సహిస్తూ ఉంటారు' అనే ప్రవల్లిక గ్రాడ్యుయేట్లకూ కష్టమైన రోబోటిక్స్, హార్డ్‌వేర్, డ్రోన్ టెక్నాలజీ, కృత్రిమ మేధ లాంటి చాలా కోర్సులు పూర్తిచేసింది. ఇన్ఫోసిస్ వాళ్లతో శభాష్ అనిపించుకుంది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం డిస్నీప్లస్ హాట్‌స్టార్ దృష్టినీ ఆకర్షించి వార్తల్లో నిలిచింది. అలాగని చదువులోనూ వెనకబడలేదు. పదో తరగతి 567 మార్కులతో పాసైంది. ఐఏఎస్ అవ్వడమే తన లక్ష్యమంటోన్న ప్రవల్లికకు ఆల్ ద బెస్ట్ చెప్పేద్దామా?.

సాయో సరుటా... జపాన్, అమెరికాల్లో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. 'న్యూ డిప్లమసీ ఇనిషియేటివ్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థకు ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తూ అనేక దేశాలు పర్యటిస్తున్నారు. తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానంపై హైదరాబాద్‌లో జరిగిన 'భారత్ సమ్మిట్'కు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళల జీవన పరిస్థితులు, హక్కులు, ఆర్థిక స్వేచ్ఛ... వంటి విషయాలపై 'వసుంధర'తో ఏం చెప్పారంటే...

ఆర్థిక స్వాతంత్ర్యమే అతివలకు రక్ష



సరుటా

నేను ఇప్పటివరకూ 52 దేశాలు తిరిగాను. వెళ్లిన ప్రతిచోట 'మీ ఇళ్లలో ఎలాంటి పరిస్థితులుంటాయి' అని చాలామంది మహిళలను అడిగాను. వారి సమాధానం విన్నాక... అన్ని దేశాల్లో దాదాపు ఒకేలాంటి పరిస్థితి అని అర్థమైంది. ముఖ్యంగా గృహహింస బాధితులే వీరిలో అధికమన్న విషయం మనసుకి ఎంతో బాధ కలిగించింది. జపాన్‌తో సహా ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ ఇదే తీరు. జపాన్ ఎంత అభివృద్ధి చెందిన దేశమైనా ఇక్కడ ఇంట్లో హింసను భరించే స్త్రీల సంఖ్య ఎక్కువే. కొన్ని ప్రాంతాల్లో ఆత్యాచారం జరిగినా పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికీ భయపడుతుంటారు. సమానత్వం కోసం మహిళలు పోరాడుతున్నా ఇంకా చాలా అంశాల్లో వారికి అది అందని ద్రాక్షగానే ఉంది. మా దేశంలోనే కాదు... ప్రపంచ వ్యాప్తంగానూ ఇదే తీరు. ఉద్యోగాలు, ఇతర వృత్తుల్లో రాణిస్తున్నా ఇంటి చాకిరీ మొత్తం ఆమె చేయాల్సిందే. దీంతో ఈ భారాన్ని మోయలేక, భర్త వేధింపులు భరించలేక 'లివ్ ఇట్ ఆర్ లీవ్ ఇట్' అనే నినాదంతో ఎక్కువ మంది విడాకుల బాట పడుతున్నారు. ఆ తర్వాత కూడా పిల్లల పోషణ భారమూ ఆ ఒంటరి తల్లి మీదే పడుతోంది. అందువల్లే ఈ మధ్య జపాన్‌తోపాటు అమెరికాలో ఎక్కువమంది మహిళలు పిల్లలను కనడానికీ, పెళ్లి చేసుకోవడానికీ ఆసక్తి చూపడం లేదు. అందుకే ఈ దేశాల్లో జనాభా పెరగకపోవడానికి ఇదే కారణం. అంతేకాదు... బాగా అభివృద్ధి చెందిన దేశాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలిస్తే... జనాభా వృద్ధి పతనమే అన్నింటిలో కామన్‌గా కనిపించే సమస్య.

అక్కడ స్వేచ్ఛ ఎక్కువ...

అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కువమంది మహిళలు... ఆర్థిక స్వాతంత్ర్యమే తమకు స్వతంత్రంగా బతికే స్వేచ్ఛనిస్తుందని నమ్ముతున్నారు. హింసను ఎదుర్కోవడానికి ఇదీ ఒక మార్గమే మరి. కానీ, అంతగా అభివృద్ధి చెందని దేశాల్లో మాత్రం మహిళలు సొంతంగా ఎదగాలంటే ఎన్నో అవరోధాలను అధిగమించాలి. ఇతర దేశాలతో పోలిస్తే మహిళలకు అమెరికాలో స్వేచ్ఛ ఎక్కువ. కోరుకున్నట్లు బతకడానికి అవకాశాలూ పుష్కలం. అందుకే ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల నుంచి యువత అక్కడికి వెళ్తున్నారు.

పనులు పంచుకోవాలి...

మహిళలపై పని భారం తగ్గాలన్నా, వేధింపులు ఆగాలన్నా... భర్త సహకారం ఎంతో అవసరం. నేను, నా భర్త టోక్యోలో న్యాయవాదులుగా పనిచేస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. ఇంటిపనులు సమానంగా పంచుకుంటాం. అలా చేస్తేనే కలిసి ఉండగలం. అయితే, భారత్‌లో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. కుటుంబ వ్యవస్థకు బలమైన పునాది ఉంది. అందుకే, ఇంటా, బయటా బాధ్యతలన్నీ ఆమే మోస్తున్నా... కుటుంబాన్ని వదులుకోవడానికి ఇష్టపడటం లేదు. ఇది ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది ఏది ఏమైనా సొంత ఆలోచనలతో ఎదగాలనుకునే ఆడవాళ్లకు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని అందిపుచ్చుకుంటే హింసను ఎదుర్కోవచ్చు. స్వేచ్ఛగానూ జీవించొచ్చు.



సొంత కంపెనీ పెట్టినప్పుడు పాప చాలా చిన్నది. ఆ టైమ్‌లో సూపర్ ఉమెన్‌ని అన్నీ చేసుకోగలను అనుకోలేదు. అడిగి మరీ కుటుంబ సాయం తీసుకున్నాను. అదే సమయంలో కంపెనీ విషయంలో శక్తిసామర్థ్యాల్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ ముందుకు సాగాను.

- వాణీ కోల, వ్యవస్థాపకులు, కలారీ క్యాపిటల్



అలసినప్పుడు 'న్యాపుచీనో'

మధ్యాహ్నం ఓ చిన్న కునుకు తీస్తే... రెట్టింపు ఉత్సాహంతో పనులు పూర్తిచేస్తాం. ఇంట్లో ఉండే వాళ్లకైతే ఇది సాధ్యం. మరి ఉద్యోగాల్లో ఉన్నవారికి ఎలా? అలా అని ముంచుకొస్తున్న నిద్రను నియంత్రిస్తే... చేసే పని మీద ధ్యాస లేక, ఒత్తిడి ఎక్కువై... పనిలో నాణ్యత తగ్గిపోతుంది. కొన్నిసార్లైతే అనుకున్న సమయానికి పూర్తి చేయలేం కూడా. అందుకే ఓ 'న్యాపుచీనో' వేస్తే మంచిదంటున్నారు నిపుణులు. అంటే కాఫీ, నిద్ర...

నిద్రొచ్చేటప్పుడు కాఫీ తాగండి. తర్వాత 15-20 నిమిషాలు నిద్రపోండి. దీన్నే న్యాపుచీనో అంటారు. ఇది కూడా పవర్ న్యాప్ లాంటిదే. కాకపోతే కాఫీ అదనం. మన శరీరంలోని అడెనోసిన్ అలసటకు కారణం. నిద్ర దీని స్థాయుల్ని తగ్గిస్తుంది. మెదడుకు విశ్రాంతీ దొరుకుతుంది. అయితే నిద్రకు ముందే కాఫీ తాగుతాం... కాబట్టి, లేచాక దీనిలో ఉండే కెఫిన్ పనిచేయడం మొదలవుతుంది. ఇది తాజాదనాన్నిచ్చి... పని మరింత చురుగ్గా చేసేందుకు తోడ్పడుతుందట. దాంతో మీరు అలర్ట్, ఫోకస్ మోడ్‌లోకి వెళ్లిపోవచ్చు. మధ్యాహ్నం వేళ, చదువుకుని అలసిపోయినప్పుడు, డ్రైవింగ్‌కి ముందు ఓ న్యాపుచీనో వేస్తే... మరింత ఉత్సాహంతో పని చేయొచ్చట. నచ్చితే ప్రయత్నించేయండి.

ప్రేమ విషయం చెప్పొద్దట!

ఇంజినీరింగ్ తొలి ఏడాది చదువుతున్నా. నేనేం పెద్ద అందంగా ఉండను. అందుకే ఓ అబ్బాయి ప్రేమిస్తున్నా అంటే మొదట నమ్మలేదు. తను నాకు అన్నింట్లో సాయపడటం, తోడుగా ఉండటం చూసి చివరకు సరేనన్నా. సమస్యల్లా తను మా ప్రేమ ఎవరికీ తెలియొద్దు అంటాడు. కాలేజీలో నేమో మమ్మల్ని అందరూ అన్నాచెల్లెళ్లు అనుకుంటున్నారు. అదే చెబితే వాళ్లేం అనుకుంటే నీకేమంటాడు. ఫ్రెండ్స్ పెళ్లి విషయంలో జోక్ చేసినా నా గురించి మాట మాత్రమైనా చెప్పడు. నేను చెబుదామంటే తనెలా తీసుకుంటాడోనని భయం. ఏం చేయను? – ఓ సోదరి

నువ్వు ఇంకా కెరియర్ ప్రారంభంలోనే ఉన్నావు. మంచి జీవితానికి సోపానాలు వేసుకుని, చక్కగా స్థిరపడటానికి ప్రయత్నం చేసే సమయమిది. ప్రేమ సంగతి పక్కనపెట్టి... మనుషులు, వారి స్వభావాలను అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీకు జీవితం విలువ బోధపడుతుంది. నిజమైన ప్రేమ అబద్ధాల ముసుగు వేసుకోదు. నువ్వంటే ఇష్టముంటే... ఆ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దు అనడం, అందరి ముందూ అన్నాచెల్లెళ్లేమో అన్నట్టుగా ప్రవర్తించడం సబబుగా అనిపించడంలేదు. ఆ అబ్బాయితో మాట్లాడి క్లారిటీ తెచ్చుకో. ఇద్దరూ బాగా చదువుకుని, జీవితంలో నిలదొక్కుకొన్నాక, ప్రేమ, పెళ్లి గురించి సీరియస్‌గా ఆలోచించు. అప్పటివరకూ మంచి స్నేహితుడిగానే భావించు. ఆ అబ్బాయి ప్రేమలో నిజాయతీ ఉంటే, అతనూ నీ కోసం నిరీక్షిస్తాడు.

డియర్ వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

నాన్న పెళ్లి చేసుకుంటున్నారు!

అక్క పుట్టిన ఎనిమిదేళ్లకు నేను పుట్టా. ఇంట్లో గారాలపట్టిని. మా కుటుంబానికి దిష్టి కొట్టిందేమో అమ్మ అకస్మాత్తుగా చనిపోయింది. అక్క పెళ్లయ్యి అమెరికాలో ఉంది. అమ్మ పోయి ఏడాదైనా కాలేదు నాన్న పెళ్లి చేసుకుంటున్నారు. ఆమె అక్క కంటే కొంచెమే పెద్ద. అందుకే నేను ఒప్పుకోను అంటే నాన్న నాతో మాట్లాడటం మానేస్తున్నారు. ఆమేమో తన జీవితం మేం పాడుచేస్తున్నామంటూ నన్ను కోప్పడుతోంది. ఇదంతా అక్క చెప్పినా నాన్న వినడం లేదు. అందుకే నన్నూ తన దగ్గరికి వచ్చేయమంటోంది. అమ్మతో ప్రేమగా మెలిగిన ఇంటిని ఇంకెవరికో అప్పజెప్పడం నాకు ఇష్టం లేదు. ఆమె ఇంట్లోకి అడుగుపెట్టాక నా పరిస్థితికేమో భయం వేస్తోంది. ఏం చేయను? – ఓ సోదరి

తల్లిని కోల్పోవడం చాలా బాధాకరమైన విషయం, ముఖ్యంగా నీ విషయంలో. అక్క పెళ్లై మీకు దూరంగా ఉంది. అమ్మని కోల్పోయి ఒంటరయ్యావు. ఇలాంటి సమయంలో మీ నాన్న మళ్లీ పెళ్లి చేసుకోవాలి అనుకోవడం, మీ అమ్మ స్థానంలో మరొకరు వస్తుండటం, దానివల్ల నీ మనసుకు కలిగే బాధ నాకు అర్థమవుతోంది. నువ్వు బాధని వ్యక్తం చేసినా... మీ అక్క ప్రస్తుత పరిస్థితి గురించి చెప్పినా వినకుండా మీ నాన్నగారు పెళ్లి చేసుకుంటే అది ఇక ఆయన వ్యక్తిగతం. దాని గురించి ఎక్కువగా ఆలోచించి నీ మనసు పాడు చేసుకోకు. కొత్తగా వచ్చే ఆవిడ తల్లిలా నిన్ను ఆదరించి, నీ భయాలను పోగొట్టే ప్రయత్నం చేస్తే బాగుంటుంది. కానీ, ఆవిడకు ఆ ఆలోచన కానీ, అంత పెద్ద మనసు కానీ ఉన్నట్టు అనిపించట్లేదు. ఇటువంటి సందర్భంలో, నీకు సహకరిస్తానంటున్న అక్క దగ్గరికి వెళ్లడమే మంచిదేమో ఆలోచించు. అమెరికాలో నువ్వు చదువుకోవడమో, ఉద్యోగం చేసుకోవడమో చెయ్యవచ్చు. అక్కకి భారం అవ్వకూడదు అనుకుంటే నువ్వు సెటిల్ అయ్యాక అక్కకి డబ్బులు తిరిగి ఇచ్చేయొచ్చు. ఇప్పుడు నిర్ణయం నీ చేతిలోనే ఉంది. దాన్ని సరైన దారిలో మళ్లించుకోవాల్సింది నువ్వే.

అమ్మ కోసమే ఈ ప్రయాణం...

నచ్చిన, పరిచయమున్న వృత్తిని వదులుకుని... అసలేం తెలియని పని ఎంపిక చేసుకోవాలని ఎవరైనా అనుకుంటారా? అర్చనా ధావన్ అలాంటిదాన్నే ఎంచుకున్నారు. తనదైన శైలిలో రాణిస్తున్నారు కూడా. దీనంతటికీ అమ్మే కారణం అంటారీమె. అసలెవరీమె? ఏం చేస్తున్నారో తెలియాలంటే...



అర్చన

'షెఫ్ అంటే అబ్బాయిలే కనిపిస్తారు... అమ్మాయిలు చాలా అరుదు. వేడిని తట్టుకోలేరు. పెద్ద రెస్టరంట్లలో వంటలు చేయాలంటే శారీరకంగానూ దృఢంగా ఉండాలి. అందుకే మహిళలు ఈ రంగంపై ఎక్కువ ఆసక్తి చూపించరేమో అనుకునేదాన్ని. అలాంటిది షెఫ్‌గా నా ప్రయాణం యాదృచ్ఛికంగా మొదలైంది' అంటారు అర్చన. ఈమెది కశ్మీర్. టెక్స్‌టైల్ వ్యాపారి. 28 ఏళ్లుగా ఫ్యాషన్ డిజైనర్‌గా ఎన్నో బ్రాండ్లకు పనిచేశారు. కానీ కొవిడ్ ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. '2020లో అమ్మ మాకు దూరమైంది. ఆమె లేదన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోయాను. ఎప్పుడు ఇంటికి వెళ్లినా వంటగదిలోనే కనిపించేది. బంధువులూ, స్నేహితులూ అందరికీ వండి వార్చి అందులోనే సంతోషం వెతుక్కునేది. వాళ్లు ప్రశంసిస్తే మురిసిపోయేది. ఆమె జ్ఞాపకాల్ని తలుచుకుంటూ నేనూ వంట చేయడం మొదలుపెట్టా. మాది చాలా పెద్ద కుటుంబం. ఇప్పుడంతా విదేశాల్లో స్థిరపడ్డారు. అయినా సామాజిక మాధ్యమాల ద్వారా మేమంతా టచ్‌లోనే ఉన్నాం. ఎవరు ఫోన్ చేసి ఫలానా వాళ్లకి మా తరపున ఫుడ్ ఇవ్వమని చెప్పినా... ఠక్కున రెడీ చేసి పంపేదాన్ని. నిజానికి ఇలా అమ్మ చేస్తుండేది. ఆమె తర్వాత నేను మొదలుపెట్టాను. ఇందుకోసం దిల్లీ నుంచి గుడ్‌గావ్‌కి మకాం మార్చాం' అనే అర్చన కుకింగ్‌ను మొదట్లో థెరపీలా భావించారు. దీనిద్వారా బాధను మరచిపోవడానికి ప్రయత్నించేవారట. అదే తనకి గుర్తింపును తెచ్చిపెడుతుందని ఎప్పుడూ అనుకోలేదట.

వారాంతాల్లో...

'అమ్మ రెసిపీలనే ఎక్కువగా వండేదాన్ని. టొమాటో, ఉల్లి, వెల్లుల్లి వాడకుండా వంటలు చేయడం నా ప్రత్యేకత. తిన్నవారంతా మెచ్చుకుని... దీన్ని వ్యాపారంగా మలుచుకోవచ్చుగా అని సలహా ఇచ్చేవారు. కానీ నాకు అది ఇష్టం లేదు. మావారు అమిత్ నేవీ అధికారి. ఆయన ప్రోత్సాహంతోనే ప్రాంతీయ కుకింగ్ షోల్లో పాల్గొన్నా. 'షెఫ్‌పిన్' కూడా అందులో భాగమే. అక్కడ్నుంచి వచ్చాక 'వీకెండ్ కిచెన్' నిర్వహించా. వారాంతాల్లో మూడు నాలుగు ఆర్డర్లు తీసుకునేదాన్ని. తర్వాత డెస్టినేషన్ పెళ్లిళ్లలో షెఫ్‌గా పనిచేయడం మొదలుపెట్టా. అయితే ఏం చేసినా అది మానసిక ప్రశాంతతను దూరం చేసేదిగా ఉండకూడదని నిశ్చయించుకున్నా. ఈ రంగంలోకి రావాలనుకునే అమ్మాయిలకు అదే చెప్తుంటా. ఏం చేసినా ఇష్టంగా చేయమని. షెఫ్‌పిన్ షోలో ఎలిమినేట్ అయినా... అక్కడ ఏర్పడిన పరిచయాలు కశ్మీరీ రుచుల్ని వివిధ రాష్ట్రాల్లో అందించడానికి ఉపయోగపడ్డాయి. ఇప్పుడు హైదరాబాద్‌లో వచ్చిన అవకాశమూ అలాంటిదే. ఈ మధ్యే ఇక్కడ జరిగిన ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్నా' అంటారు 53 ఏళ్ల అర్చన.

బంగారం-వెండి



1న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	96,090	88,150	96,716
విజయవాడ	93,310	87,750	96,300
ప్రొద్దుటూరు	95,700	88,040	96,800
రాజమహేంద్రవరం	96,000	87,360	96,500
విశాఖపట్నం	95,380	87,750	99,000
తమిళనాడు	-----	87,750	1,09,000

ట్రిప్‌కి ఏం వేద్దాం?



వేసవి అనగానే గుర్తొచ్చేది విహారాలే! ఎక్కడికి వెళ్లాలి అని ఎంచుకోవడం కష్టమేమీ కాదేమో కానీ... ఏం వేసుకోవాలి? ఏ దుస్తులు తీసుకెళ్లాలి అన్నదే మనకు ప్రధాన సమస్యగా కనిపిస్తుంది కదూ! అవును మరి... సౌకర్యంగా ఉండాలి, స్టైలిష్‌గానూ కనిపించాలంటే దుస్తుల ఎంపిక కాస్త కష్టమే. అందుకే ఒక డ్రెస్ సూట్‌కేస్‌లోకి వెళితే రెండింటిని బయటికి తీస్తుంటాం. ఈ కష్టాన్ని గమనించారు డిజైనర్లు. కాబట్టే 'ట్రిప్ వేర్', 'వెకే వేర్' అంటూ బోలెడు డిజైన్లు తీసుకొచ్చేశారు. ఒకటో రెండో రకాలు కాదు... మ్యాక్సీ డ్రెస్‌లు, ఫ్రాక్‌లు, స్కర్ట్‌లు, ప్యాంట్ సూట్‌లు... ప్రయత్నించాలే కానీ ఎన్నో రకాలు. ఎండలు కదా... తేలికగా ఉండటమూ తప్పనిసరి. అందుకే వాళ్ల ఎంపికా కాటన్, రేయాన్, మల్‌మల్ రకాలే! సన్నని షోల్డర్ స్ట్రాప్ నుంచి ఫుల్ లెంత్ హ్యాండ్ వరకూ ప్రతిదీ ప్రత్యేకమే! బ్యాగ్, పర్స్ బాదరబందీలు వద్దు బాబూ అనుకుంటే పాకెట్ రకాలైనా ఎంచుకోవచ్చు. నీటితో నిండిన బీచ్‌లైనా... పచ్చని మొక్కలతో కూడిన పర్వత ప్రాంతాలైనా... చారిత్రక కట్టడాలున్న ప్రదేశాలైనా... ఏ చోటకైనా నప్పేలా ఉంటాయివి. వాటిలో మీ స్టైల్‌కి సరిపోయేవేంటో ఎంచుకోవడమే మీ వంతు. తీసుకెళ్లడానికి తేలికగా, శరీరానికి హాయిగా, ఫొటోలకు అనువుగా... స్టైల్‌ని హైలైట్ చేస్తూ భలేగున్నాయి కదూ! జీన్స్, టీ షర్ట్‌లను పక్కన పెట్టి వెకే వేర్‌లకు ఓటేయండి మరి!





మీ పిల్లాడు అబద్ధం చెబుతున్నాడా?

పిల్లలు అబద్ధాలు చెప్పడం సర్వసాధారణం. అందుకు కారణాలూ చాలానే ఉండొచ్చు. వాటిని గుర్తించడమే కాదు... వారిని సరిగా డీల్ చేయడమూ చాలా ముఖ్యం. అప్పుడే వారిలో మార్పు సాధ్యమవుతుంది.



కారణం గుర్తించండి: పిల్లలు ఒత్తిడి, ఆందోళన, ఆత్మవిశ్వాసం లేకపోవడం వల్ల అబద్ధం చెప్పి ఉండొచ్చు. ముందు సమస్యని గుర్తించండి. తగిన మానసిక భరోసాను అందించండి. అబద్ధం చెప్పినందుకు దండించడం, కఠిన శిక్షలు విధించడం కంటే ఎందుకు అబద్ధం చెప్పారో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఒకవేళ అబద్ధం చెప్పినా, ముందే వారిని ప్రశ్నించాలనుకున్నా... 'నువ్వు గోడపై రాసినట్లు నాకు తెలుసు... దాన్ని ఎలా శుభ్రం చేయాలో ఆలోచిద్దాం' అని చెప్పండి. వారి ఐడియాలనూ ఆహ్వానించండి.

భావోద్వేగ రక్షణ: తప్పులు చేసినప్పుడే పిల్లలు అబద్ధాలు చెబుతారనుకోవడం పొరపాటు. కొన్నిసార్లు మనసుకి నచ్చినవారు, సన్నిహితులు, స్నేహితుల... మనోభావాలను దెబ్బతీయకుండా ఉండటానికి కూడా కొందరు ఈ పనిచేస్తారు. దీనికి కారణం వారికి అసలు నిజం, అబద్ధం మధ్య తేడా పూర్తిగా అర్థం కాకపోవచ్చు.


ఆకర్షించడానికి: స్నేహితుల మధ్య గొప్పగా కనిపించడానికి లేదా అందరి దృష్టిని ఆకర్షించడానికీ అబద్ధం చెప్పి ఉండొచ్చు. పిల్లలు నిజం చెప్పడానికి భయపడకుండా వారికి సురక్షితమైన, ప్రేమతో కూడిన వాతావరణం కల్పించాలి. 'నిజం చెబితే నీకు నేను తోడుగా ఉంటా. సాయం చేస్తా' అని చెప్పడం ద్వారా వారిలో నమ్మకాన్ని పెంచొచ్చు.

ఊహాశక్తితో కథగా: 3-5 సంవత్సరాల వయసు పిల్లలు తమ ఊహాశక్తికి పదును పెట్టి మరీ కథలు చెబుతుంటారు. కొన్నిసార్లు ఇవి అబద్ధాలుగా కనిపిస్తాయి. చిన్న పిల్లల కథలు చెప్పడం వారి ఊహాశక్తిలో భాగం కావొచ్చు. దాన్ని గుర్తించినప్పుడు 'ఇది ఇంట్రెస్టింగ్ స్టోరీ' దీన్ని మనం ఓ పుస్తకంలో రాద్దాం అంటూ వారి సృజనాత్మకతను ప్రోత్సహించండి.

నిజాయతీని ప్రోత్సహించండి: పిల్లలు నిజం చెప్పినప్పుడు వారిని ప్రశంసించండి. 'నువ్వు నిజం చెప్పడం నాకు సంతోషం కలిగించింది' అంటూ అబద్ధం కంటే నిజాయతీ ఎంత విలువైనదో చెప్పే ప్రయత్నం చేయండి. సాధారణంగా పిల్లలు తల్లిదండ్రులనే అనుకరిస్తారు. చిన్న తప్పులను ఒప్పుకోవడం, మరోసారి ఆ పొరపాటు చేయకుండా సరిదిద్దుకోవడం వంటివి వారికి చూపించండి. ఇవన్నీ వారిలో మార్పు తెస్తాయి.

అయినా పిల్లల్లో తరచూ తీవ్రమైన అబద్ధాలు కనిపిస్తుంటే ఇతర ప్రవర్తనాపరమైన లోపాలు(చోరీ,హింస) వంటివీ ఉన్నాయేమో మానసిక నిపుణులకు చూపించండి.

అరవై దాటినా.. కావాలోయ్ వ్యాక్సిన్!



మీ పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయిస్తున్నారు కదా... మరి ఇంట్లో పెద్దవారికి..? రోగ నిరోధక శక్తి సన్నగిల్లే పెద్ద వయసులో టీకా రక్షణ తప్పనిసరి అంటున్నారు వైద్య నిపుణులు. 60 ఏళ్లు పైబడిన వారికి టీకాలు చాలా ముఖ్యమంటున్నారు..

ఇప్పుడు 60 ఏళ్లు దాటిన పెద్దలకు కూడా టీకాల అవసరం ఉంది. అవగాహన లేకపోవడం వల్ల చాలామంది వాటికి దూరంగా ఉంటున్నారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ పెద్దల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో రకరకాల వ్యాధులు దాడి చేస్తుంటాయి. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులు ఎదుర్కొనే వారికి ఇవి ప్రాణాంతకంగా మారతాయి. ఈ నేపథ్యంలో టీకాలు చాలా కీలకమని నిపుణులు చెబుతున్నారు. 60 ఏళ్లు దాటిన వారిలో వివిధ రకాల టీకాలు అందించడం చాలా ముఖ్యమని చెబుతున్నారు.

'ది అసోషియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఇన్ ఇండియా(ఏపీఐ)' చేసిన అధ్యయనంలో దేశంలో 16 శాతం మంది మాత్రమే పెద్దలు టీకాలు తీసుకుంటున్నట్లు వెల్లడైంది. హైదరాబాద్‌లాంటి మహానగరంలో అది 4 శాతమే ఉన్నట్లు తేలింది. చిన్న పిల్లలకు సకాలంలో టీకాలు అందిస్తున్నప్పటికీ పెద్దలు మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారని... వారి సంరక్షకులు కూడా పట్టించుకోవడం లేదని అధ్యయనం పేర్కొంది.

- ఈనాడు, హైదరాబాద్

ఈ బాధలు లేకుండా...

• ఫ్లూ: వాన, చలి కాలాల్లో తరచూ వేధించేది ఫ్లూ. దీన్ని ఇన్‌ఫ్లూయెంజా అంటారు. ఇందులో పలు రకాలు ఉన్నాయి. జ్వరం, దగ్గు, ఆయాసం, జలుబుతో మొదలయ్యే ఫ్లూ వృద్ధులకు కొన్నిసార్లు ప్రాణాంతకమవుతుంది. క్యాన్సర్, ఆస్తమా, సీఓపీడీ, కిడ్నీ సమస్యలు, మధుమేహం తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు ఈ వైరస్ కారణంగా మృత్యువాతపడుతుంటారు. 60 ఏళ్లు దాటిన వృద్ధులు ఏటా ఒక డోసు ఫ్లూ టీకా తీసుకోవడం అవసరం.

• షింగిల్స్(సర్పి): పెద్దల్లో ఎక్కువగా సర్పి దాడి చేస్తుంది. అప్పటికే శరీరంలో ఉన్న చికెన్ పాక్స్ వైరస్ మనలో వ్యాధి నిరోధక శక్తి తగ్గినప్పుడు తిరిగి దాడి చేస్తుంది. చర్మంపై నీటి బుగ్గలు వచ్చి అవి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. రెండు, మూడు వారాల వరకు వేధిస్తాయి. 60 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి 10 ఏళ్లకు దీనిని బూస్టర్‌డోసుగా తీసుకోవాలి.

• హెపటైటిస్ బి: హెపటైటిస్ బి కాలేయాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. శరీరక ద్రవాలతో ఇతరులకూ సోకుతుంది. కాలేయ క్యాన్సర్‌కు కారణం అవుతుంది. చిన్నపిల్లలకే కాదు.. పెద్దలకూ ఈ వ్యాక్సిన్ అవసరమని సూచిస్తున్నారు. 60 ఏళ్లు దాటిన వారు నెల రోజుల విరామంతో మూడు డోసులు తీసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పుడు హెపటైటిస్ ఎ, బి వ్యాక్సిన్లు కలిపి కూడా వస్తున్నాయి. అలా కూడా తీసుకోవచ్చు.

• ధనుర్వాతం, డిఫ్తీరియా, పెర్టుసిస్ (టీడ్యాప్): ఈ టీకాలు చిన్నప్పుడే ఇస్తారు. అయితే 30-40 ఏళ్ల తర్వాత వీటి నిరోధకత తగ్గుతుంది. దీంతో ధనుర్వాతం, డిఫ్తీరియా తిరిగి దాడి చేసే ప్రమాదం ఉంది. ప్రస్తుతం టీడాప్ పేరుతో ఈ మూడూ కలిపి టీకా అందుబాటులో ఉంది. కాబట్టి 60 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి 10 ఏళ్లకు ఒకసారి టీడాప్ బూస్టర్ డోసును తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

• న్యూమోకాకల్: దీనివల్ల న్యూమోనియా, మెనింజైటిస్ (మెదడు పొరల వాపు), రక్త ఇన్‌ఫెక్షన్ల ముప్పు ఉంది. ముఖ్యంగా ఈ వైరస్ ఊపిరితిత్తులపై దాడి చేస్తుంది. తీవ్ర జ్వరం, ఆయాసం, దగ్గు, శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. వృద్ధుల్లో ఎక్కువ ప్రభావం చూపుతుంది. దీన్ని తట్టుకోడానికి న్యూమోకాకల్ కాంజుగేట్ వ్యాక్సిన్(పీవీసీ), న్యూమోకాకల్ పాలీశాక్రైడ్ వ్యాక్సిన్(పీపీఎస్‌వీ) వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. పీవీసీ జీవితంలో ఒకసారి తీసుకుంటే సరిపోతుంది. దీని తర్వాత రెండు నెలలకు పీపీఎస్‌వీ తీసుకోవాలి. ఆ తర్వాత ప్రతి అయిదేళ్లకు పీపీఎస్‌వీ బూస్టర్ డోసు తీసుకుంటే సరిపోతుంది.

రోగాల దాడికి టీకాతో చెక్



మనిషి ఆయుర్దాయం పెరుగుతోంది. మరోవైపు వ్యాధులు దాడి చేస్తున్నాయి. చిన్నప్పుడు తీసుకున్న టీకాల నిరోధకత 50-60 ఏళ్లు దాటిన తర్వాత తగ్గుతోంది. అందుకే పెద్దలకు కొన్ని ప్రధానమైన టీకాలు అవసరం. అయితే పిల్లల్లో రోగ నిరోధక శక్తి ఆవశ్యకత భావనను తల్లిదండ్రులు అర్థం చేసుకొని నిర్ణీత సమయంలో వారికి టీకాలు అందిస్తున్నా.. పెద్దలకు టీకాల అవసరంపై అవగాహన ఉండటం లేదు. కేవలం విదేశాలకు ప్రయాణమైనప్పుడు మాత్రమే కొన్ని టీకాలు తీసుకుంటున్నారు. కానీ వారిలో వివిధ ఇన్‌ఫెక్షన్ల నివారణకు టీకాలు తప్పనిసరి. వ్యాధి సోకిన తర్వాత పెట్టిన ఖర్చుతో పోల్చితే టీకాకయ్యే ఖర్చు చాలా తక్కువ.

– డాక్టర్ రాజారావు, ప్రిన్సిపల్, ఉస్మానియా మెడికల్ కళాశాల

పది ఫలితాల్లో ప్రతిభావంతులకు విమాన ప్రయాణం

మాట ఇచ్చి నిలబెట్టుకున్న ఎంఈఓ



అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఎంఈఓ మల్లారెడ్డి, విద్యార్థినులు

బెళుగుప్ప, న్యూస్‌టుడే: మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 550 మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను విమాన ప్రయాణం చేయిస్తానని అనంతపురం జిల్లా బెళుగుప్ప మండల విద్యాధికారి (ఎంఈఓ) మల్లారెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయన ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో ఈశ్వరి, మధుశ్రీ, అర్చన, జంద, లావణ్య అనే విద్యార్థినులు 550కిపైగా మార్కులు సాధించారు. గురువారం ఎంఈఓ విద్యార్థినులతో వెళ్లి కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారులను కలిసి అనుమతి తీసుకున్నారు. అనంతరం బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. అక్కడి నుంచి విమానంలో హైదరాబాద్‌కు వెళతారు. అక్కడ పర్యాటక ప్రదేశాలను విద్యార్థులకు చూపించి తీసుకువస్తానని ఎంఈఓ తెలిపారు. ఆయనను ఉన్నతాధికారులు అభినందించారని చెప్పారు.

చంద్రబాబు, పవన్ ప్రత్యేక శ్రద్ధతో క్షిపణి పరీక్ష కేంద్రం: బుద్ధప్రసాద్



అవనిగడ్డ, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా నాగాయలంక మండలం గుల్లలమోదలో ఏర్పాటు చేయనున్న క్షిపణి పరీక్ష కేంద్రంతో ఈ ప్రాంత ఆర్థిక పరిస్థితులు గణనీయంగా మెరుగవుతాయని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్ని వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. గురువారం అవనిగడ్డలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రాభివృద్ధికి మైలురాయి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ప్రత్యేక శ్రద్ధతో కృషి చేసి ఈ ప్రాజెక్టును సాధించారని, వారికి కృతజ్ఞతలని బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. సుమారు రూ.20 వేల కోట్ల అంచనా వ్యయంతో ఈ క్షిపణి పరీక్షా కేంద్రాన్ని డీఆర్‌డీవో నిర్మించనుందని చెప్పారు. క్షిపణి కేంద్రం పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయడంతోపాటు, అమరావతి నిర్మాణ పనుల పునః ప్రారంభోత్సవానికి వస్తున్న ప్రధాని మోదీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

శృంగేరి పీఠం దొడ్డమనసు

పహల్గాం మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున సాయం

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: పహల్గాం ఘటనలో తీవ్రవాదుల తూటాలకు బలైన ఇద్దరు కన్నడిగులతో కలిపి మొత్తం 26 మంది కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఇస్తామని కర్ణాటకలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక వేదిక- శృంగేరి శారదా పీఠం ప్రకటించింది. కష్ట సమయంలో హిందువులకు హిందువులే మద్దతుగా నిలవాలని స్వామి విధుశేఖర భారతి విజ్ఞప్తి చేశారు. మఠం పాలనా అధికారి ఆధ్వర్యంలోనే ఆ నగదును 'ప్రసాదం'గా మృతుల కుటుంబ సభ్యులకు చేర్చుతారని గురువారం ఆయన ప్రకటించారు.

పాకిస్థాన్‌కు టమాటాల ఎగుమతి నిలిపివేత

కోలారు, న్యూస్‌టుడే: కర్ణాటకలోని కోలారు టమాటా విపణి నుంచి పాకిస్థాన్‌కు నిత్యం 900 టన్నుల సరకు ఎగుమతి చేస్తుంటారు. మే, జూన్ నెలల్లో ఎగుమతులు మరింత ఎక్కువగా ఉంటాయి. పహల్గాం ఉగ్రఘటన నేపథ్యంలో పాకిస్థాన్‌కు టమాటాలను ఎగుమతి చేయకూడదని స్థానిక రైతులు, వ్యాపారులు తీర్మానించారు. తీవ్రవాదుల దాడులను ఖండిస్తూ రైతులు, వ్యాపారులు ఒక్కతాటిపైకి వచ్చి ఈ నిర్ణయం తీసుకున్నారు. ధర పడిపోయినా సరే, తాము పాక్‌కు టమాటాలను ఎగుమతి చేయబోమని వ్యాపారులు గురువారం వెల్లడించారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సీసీ కెమెరాలు

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

ఈనాడు, అమరావతి: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. వసతి గృహాల్లో మరుగుదొడ్లను పెంచాలని, గిరిశిఖర గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టిసారించాలన్నారు. సచివాలయంలో ఆమె గురువారం గిరిజన ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. డోలీల రహిత గ్రామాలు ప్రభుత్వ లక్ష్యమని, దీనికి అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు.

తోపుదుర్తిపై కేసులో వివరాలు సమర్పించండి: హైకోర్టు

ఈనాడు, అమరావతి: రాప్తాడు నియోజకవర్గం వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్‌లో వివరాలు సమర్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను సోమవారానికి వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఈ మేరకు గురువారం ఉత్తర్వులిచ్చారు. వైకాపా అధినేత జగన్ పర్యటన సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా పాపిరెడ్డిపల్లెలో హెలిప్యాడ్ వద్ద చోటు చేసుకున్న పరిణామాలకు సంబంధించి పలువురిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో తోపుదుర్తి పిటిషన్ వేశారు. న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఇదే కేసులో ఇతర నిందితులకు నోటీసులిచ్చి వివరణ తీసుకుంటామని ప్రాసిక్యూషన్ కోర్టుకు తెలిపిందన్నారు. పిటిషనర్‌ను అరెస్ట్ చేసే ప్రమాదం ఉందని, ఆయన ఇంటికెళ్లి పోలీసులు ఆరా తీశారన్నారు. త్వరగా విచారణ జరపాలని కోరారు.

ఒత్తిడి మీ దరిచేరకూడదంటే..



మీరు ఎదుర్కొంటున్న ఒత్తిడిలో అత్యధిక భాగం.. మీకు పని ఎక్కువగా ఉండటం వల్ల వచ్చింది కాదు. మీకు పనికొచ్చే పనులను మీరు సరైన సమయంలో చేయకపోవడం వల్ల పేరుకుపోయిన భారమది. సరైన సమయంలో సరైన పనులను చేస్తే ఒత్తిడి మీ దరిచేరకుండా ఉంటుంది.

– మార్క్ మాన్సన్, రచయిత

డిజైన్, ప్లాన్ లేకుండానే గోడ కట్టేశారు!

- అప్పన్న ఆలయంలో పునాదులు ఎంత లోతు తవ్వాలో నిర్ధారించలేదు
- అయినా గోడ నిర్మించాలని గుత్తేదారుపై ఒత్తిడి తెచ్చారు
- ఏడుగురు భక్తుల ప్రాణాలు పణంగా పెట్టారు





ఐదు రోజుల్లో మెట్ల పక్కనే నిర్మించిన రిటెయినింగ్ వాల్ ★ ప్రమాదంలో మెట్ల వైపు కూలిన గోడ శిథిలాలు

ఈనాడు, విశాఖపట్నం: గోడ కట్టాలంటే అక్కడ నేల స్వభావమేంటో తెలుసుకోవాలి. ఎంత లోతు పునాది తవ్వాలో నిర్ధారించాలి.. దానికి అనుగుణంగా డిజైన్లు సిద్ధం చేయాలి.. ఇవేవీ లేకుండానే సింహాచల అప్పన్న ఆలయంలో హడావుడిగా గోడ నిర్మించేశారు. బుధవారం చందనోత్సవ క్యూలైన్‌లో నిల్చున్న భక్తులపై ఆ గోడ కూలి ఏడుగురు బలయ్యారు. ఇంతకంటే ఘోరం ఇంకేమైనా ఉంటుందా? ఇంతటి విపత్తుకు కారకులైన అక్కడి దేవాదాయ, పర్యాటకశాఖ ఇంజినీర్లను ఏం చేయాలి? 'ఆ గోడ కట్టమన్నది ఎవరు? నాణ్యత పర్యవేక్షించింది ఎవరు? ఒత్తిడి చేసి, ఆఘమేఘాలపై నిర్మాణం పూర్తి చేయించింది ఎవరు?' అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేవాదాయశాఖ ఇంజినీర్లు, ప్రసాద్ పథకం పర్యవేక్షించే పర్యాటక శాఖ ఇంజినీర్లు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటున్నారు.

నేలస్వభావం కూడా పరిశీలించకుండానే..

రిటెయినింగ్ వాల్ నిర్మాణం చేపట్టిన చోట నేల మెత్తగా (లూజ్ సాయిల్) ఉంది. అలాంటి ప్రాంతంలో గోడ నిర్మించాలంటే గట్టి నేల తగిలే వరకు పునాది తవ్వాలి. అది తేల్చాలంటే మట్టి నమూనాలు తీయించి, సాయిల్ బేరింగ్ కెపాసిటీ టెస్ట్ చేయాలి. దానికి అనుగుణంగా ఇంజినీర్లు నిర్ధారించాలి. గోడకు మధ్యలో పిల్లర్లు కూడా నిర్మించాలి. సింహాచలంలో ఎంత లోతులో పునాదులు తీసి గోడ నిర్మించాలో వారం రోజుల్లో నివేదిక ఇస్తానని స్ట్రక్చరల్ ఇంజినీర్ చెప్పినా అప్పటి వరకు కూడా ఆగకుండానే నిర్మాణం ప్రారంభించేశారు. చందనోత్సవం నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లో గోడ నిర్మించాల్సిందేనని.. తాత్కాలికంగా పూర్తి చేయాలని ఆలయ ఈవోతోపాటు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పట్టుబట్టారు. ప్రసాద్ పథకాన్ని పర్యవేక్షించే పర్యాటకశాఖ ఇంజినీర్ దానికి 'ఊ' కొట్టడంతో గుత్తేదారు డిజైన్ కూడా లేకుండానే రిటెయినింగ్ వాల్ కట్టేశారని స్పష్టమవుతోంది.

సమయం చాలదని పనులు ఆపేశాను..

'గోడ కట్టడానికి సమయం లేదని పనులు ఆపేశాను. చందనోత్సవం కదా.. అడ్డంకిగా మారుతుంది ఆ పనులు చేయాలంటూ దేవాదాయ, పర్యాటకశాఖ ఇంజినీర్లు కోరారు. నేను కూడా దేవుడి కార్యక్రమం కదా అని డ్రాయింగ్ లేకపోయినా ఐదు రోజుల్లో గోడ కట్టించాను. ప్రారంభ సమయంలో ఏ ఇంజినీరూ పర్యవేక్షించలేదు. ఆ తర్వాత డీఈ, ఈఈలు వచ్చి చూసి వెళ్లారు' అని గుత్తేదారు లక్ష్మణరావు చెప్పడం గమనార్హం. ప్రసాద్ పథకంలో పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించాలి. నమూనాలను గుత్తేదారు ల్యాబ్‌లో పరీక్షించి నాణ్యత నిర్ధారించాలి. ఈ గోడ నమూనాలు తీసి ఎక్కడ పరీక్షించారంటే ఒక్కరి నుంచీ సమాధానం లేదు.

వైకాపా సిఫార్సులతోనే తిష్ఠ

ప్రసాద్ పథకం పనులను వైకాపా హయాంలోనే ఇద్దరు గుత్తేదారులకు అప్పగించారు. సింహాచలం కొండపైన 'కె.అనంతరావు అండ్ కో' కంపెనీ రూ.26.60 కోట్ల పనులకు పర్యాటక శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ గుత్తేదారు వైకాపా హయాంలో వైద్యశాఖకు చెందిన పలు ప్రాజెక్టు టెండర్లు దక్కించుకున్నారు. కొండ దిగువన రూ.11.20 కోట్ల పనులు దక్కించుకున్న 'మెహర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్'.. మాజీ మంత్రి, వైకాపా నేత ధర్మాన ప్రసాదరావు తాలూకా అని తెలుస్తోంది. గోడ నిర్మాణానికి ఒత్తిడి తెచ్చిన ఆలయ ఇంజినీర్ శ్రీనివాసరాజు వైకాపా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సిఫార్సులతో 12 ఏళ్లుగా సింహాచలంలోనే తిష్ఠ వేశారు. పర్యాటకశాఖ ఈఈ రమణపై రుషికొండ గ్రావెల్ తరలింపు, హరిత రిసార్ట్స్ ఫర్నిచర్ పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నాయి. ఈ ఇంజినీర్లే ఇప్పుడు గోడ నిర్మాణం నాసిరకంగా సాగుతున్నా నిద్ర నటించి, ఇంతటి ఘోరానికి కారకులయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పోలవరానికి మూడో కట్టర్

- ఈ నెల 7 నుంచి రంగంలోకి
- అప్పుడే లక్ష్యానికి తగ్గట్టుగా డయాఫ్రం వాల్ పనులు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణానికి ఏప్రిల్ నుంచి రావాల్సిన మూడో కట్టర్ ప్రాజెక్టు వద్దకు చేరుకుంటోంది. మొత్తం 1,396.60 మీటర్ల మేర ఈ వాల్ నిర్మించాల్సి ఉంది. ఈ ఏడాది డిసెంబరు చివరి నాటికే పూర్తి చేయాలి. లక్ష్యం మేరకు పనులు పూర్తి కావాలంటే ఏప్రిల్ నుంచి మూడో కట్టర్, గ్రాబర్‌లతో బావర్ కంపెనీ పనులు ప్రారంభించాల్సి ఉంది. అలాంటిది ఒక నెల ఆలస్యంగా ఆ యంత్రం పోలవరానికి చేరుతోంది. ఈ కట్టర్‌లో కొన్ని పరికరాలు గురువారం పోలవరం చేరుకున్నాయి. మిగిలినవి త్వరలో రానున్నాయి. వీటన్నింటినీ బిగించి ఈ నెల 7 నుంచి మూడు కట్టర్లతో పనులు చేపట్టనున్నారు. కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణ పురోగతిని బట్టే ప్రధాన డ్యాం నిర్మాణం, గడువులోగా ప్రాజెక్టు పూర్తి చేయడమూ ఆధారపడి ఉన్నాయి. డి వాల్‌తో పాటు నవంబరు నుంచే సమాంతరంగా ప్రధాన డ్యాం రెండో భాగం పనులూ చేయాలనేది ఆలోచన. విదేశీ నిపుణుల బృందం ఈ నెల 4 నుంచి ప్రాజెక్టు వద్దకు వస్తున్న నేపథ్యంలో ఆకృతులపైనా కీలక చర్చలు జరగనున్నాయి. పోలవరంలో డి వాల్ మొత్తం 1,396.60 మీటర్లకు ప్రస్తుతం 230 మీటర్ల వరకు పనులు జరిగాయి. డయాఫ్రం వాల్ నిర్మాణంలో గోదావరి గర్భంలో కొన్నిచోట్ల 20 మీటర్ల లోతు వరకు, మరికొన్ని చోట్ల 90 మీటర్ల లోతు వరకు వెళ్లవలసి ఉంటుంది. ఎక్కడ రాయి తగులుతుందో అక్కడి వరకు ప్యానెల్‌ను పంపి అక్కడ నుంచి ప్లాస్టిక్ కాంక్రీటు నింపి ఈ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో లక్ష్యం ప్రకారం డి వాల్ పనులు పూర్తయినా మూడో కట్టర్ రానందున ఏప్రిల్ నెలలో పురోగతి తక్కువగా ఉంది. మూడో కట్టర్ రంగప్రవేశం తర్వాత పనులు వేగం పుంజుకుంటాయని అధికారులు పేర్కొంటున్నారు.

ఎలాంటి రాయి తగిలే వరకు పరిగణనలోకి తీసుకోవాలి?

నదీ గర్భంలో రాయి తగిలిన తర్వాత కొన్ని చోట్ల 2 మీటర్లు, మరికొన్ని చోట్ల 3.5 మీటర్ల వరకు కూడా ప్యానెల్ పంపి ప్లాస్టిక్ కాంక్రీటుతో నింపాల్సి ఉంటుంది. మేఘా కంపెనీ పోలవరం పనులు చేస్తుండగా, డి వాల్ వరకు నైపుణ్యం ఉన్న జర్మనీ కంపెనీకి పనులు అప్పగించారు. వారిద్దరి మధ్య.. పనులకు సంబంధించిన ఒప్పందాలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో మెత్తని రాయి తగిలినా అక్కడి నుంచి 2 మీటర్ల లోతుకే పని చేస్తున్నారనే అంశం చర్చనీయాంశమవుతోంది. అది మెత్తని రాయి అని, గట్టి రాయి తగిలే వరకు పరిగణనలోకి తీసుకోకూడదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ అంశాన్ని నిర్ధారించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ నుంచి నిపుణులను నియమించారు. వారి అభిప్రాయం తీసుకున్నా దానిపై గుత్తేదారు కంపెనీ ప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ అంశాన్ని పోలవరం అధికారులు కేంద్ర జలసంఘానికి నివేదించారు. ఎలాంటి రాయి తగిలే వరకు పరిగణనలోకి తీసుకోవాలి? రాయి తగిలిన తర్వాత ఎంత లోతు వరకు ప్యానెల్ దింపాలనే అంశాలు తేల్చి చెప్పాలని కోరారు.

రిమాండ్ ఉత్తర్వులను సవాలు చేసిన పీఎస్ఆర్

- వివరాలు సమర్పించాలని సీఐడీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: సినీనటి కాదంబరీ జెత్వానీ కేసులో విజయవాడ సీఐడీ కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించడాన్ని సవాలు చేస్తూ సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు వేసిన వ్యాజ్యంలో వివరాలు సమర్పించాలని సీఐడీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఈమేరకు ఉత్తర్వులిచ్చారు. అంతకుముందు సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ వ్యక్తిగత స్వేచ్ఛతో ముడిపడిన వ్యవహారం కాబట్టి సాధ్యమైనంత త్వరగా విచారణ జరపాలన్నారు. కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదు ఆధారంగా జెత్వానీపై నమోదైన కేసు పెండింగ్‌లో ఉండగా.. ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో కేసు పెట్టడానికి వీల్లేదన్నారు. సీఐడీ తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. పిటిషన్ మొదటిసారి విచారణకు వచ్చిన నేపథ్యంలో పూర్తి వివరాలు సమర్పించేందుకు సమయం కావాలని కోరారు.

ఐపీఎస్‌ల పిటిషన్లపై విచారణ 8కి వాయిదా: జెత్వానీ ఫిర్యాదుతో తమపై నమోదైన కేసును కొట్టేయాలంటూ ఐపీఎస్ అధికారులు కాంతిరాణా తాతా, విశాల్ గున్ని, మరో ఇద్దరు పోలీసు అధికారులు హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యాలపై విచారణ ఈ నెల 8కి వాయిదా పడింది.

పీఎస్ఆర్ బెయిల్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా: కాదంబరీ జెత్వానీ కేసులో అరెస్టైన సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు బెయిల్ పిటిషన్‌పై విజయవాడ కోర్టులో విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. గురువారం పీఎస్ఆర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించేందుకు విచారణను వాయిదా వేశారు.

ఏపీపీఎస్సీ కార్యాలయంలో పోలీసు విచారణ

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు అక్రమాలకు సంబంధించి ఏపీపీఎస్సీ కార్యాలయంలో పోలీసులు గురువారం విచారణ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పోలీసు బృందం కార్యాలయంలోనే ఉండి పలు రికార్డులను పరిశీలించింది. నిబంధనలను ఉల్లంఘించి, క్యామ్‌సైన్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చేసిన రూ.1.14 కోట్ల చెల్లింపులపై పోలీసు బృందం దృష్టిపెట్టింది. గ్రూపు-1 ప్రధాన పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం కోసం ఆ సంస్థకు పీఎస్ఆర్ ఆంజనేయులు చెల్లింపులు చేయడంపై సంబంధిత సెక్షన్ ఉద్యోగులు, అధికారుల నుంచి అవసరమైన సమాచారాన్ని సేకరించింది. మరోవంక.. హాయ్‌ల్యాండ్ రిసార్ట్సులో జవాబుపత్రాలను మూల్యాంకనం చేయకుండానే ఓఎంఆర్ షీట్లు ఎందుకు ఉపయోగించారన్న దానిపైనా ఆరాతీస్తోంది. ఏపీపీఎస్సీ ఛైర్మన్ అనురాధ, కార్యదర్శి రాజబాబులతో పోలీసు బృందం సమావేశమైంది.

తాగునీటి ఎద్దడి ప్రాంతాలను మ్యాపింగ్ చేయండి

అధికారులకు పవన్‌కల్యాణ్ ఆదేశం

ఈనాడు, అమరావతి: గ్రామాల్లో వేసవి నీటి ఎద్దడి సమస్యలను అధిగమించేందుకు నీటి కొరత ఉన్న ప్రాంతాలను మ్యాపింగ్ చేయాలని అధికారులను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. వాటిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక కేంద్రాలు (వార్ రూంలు) ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు తాగునీటి సమస్యలపై గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఇంజినీర్లతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. 'వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు వర్షపు నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలి. చుక్క వర్షపు నీరు కూడా వృథా కాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలి. భవిష్యత్ అవసరాలకు నీటి నిల్వలను పెంచుకునేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి గ్రామంలోనూ ఫిల్టర్ బెడ్లు పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయాలి. నీటి పరిరక్షణపై పాఠశాల, కళాశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి' అని పేర్కొన్నారు.

ప్రకాశం జిల్లాలో సీబీజీ ప్లాంటు ఏర్పాటుకు ఆర్వెన్సిస్ గ్రూప్ ఆసక్తి

మంత్రి గొట్టిపాటిని కలిసిన సంస్థ ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: ప్రకాశం జిల్లాలో కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంటు ఏర్పాటుకు ఆస్ట్రేలియాకు చెందిన ఆర్వెన్సిస్ గ్రూప్ ఆసక్తి వ్యక్తం చేసింది. ఆ సంస్థ ప్రతినిధులు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం కలిశారు. ఈ ప్లాంటు ఏర్పాటుకు రూ.150 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు సంస్థ అంగీకరించింది. ప్రకాశం జిల్లాలో ప్లాంటు ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ప్లాంటు ఏర్పాటుకు అవసరమైన భూముల కేటాయింపు వేగంగా పూర్తి చేస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

విశాఖలో ఈ-గవర్నెన్స్‌పై జూన్ 9, 10 తేదీల్లో సదస్సు

విశాఖపట్నం (వన్‌టౌన్), న్యూస్‌టుడే: విశాఖ కేంద్రంగా జూన్ 9, 10 తేదీల్లో 'ఈ-గవర్నెన్స్'పై జాతీయ సదస్సు (ఎన్‌సీఈజీ) నిర్వహించనున్నారు. వికసిత్ భారత్, సివిల్ సర్వీస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ పేరిట నిర్వహించే ఈ సదస్సులో ఆరు ప్లీనరీ, ఆరు బ్రేక్ అవుట్ సెషన్లు జరగనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు దీన్ని ప్రారంభించి, 'ఐటీ హబ్‌గా వైజాగ్' అనే అంశంపై జరిగే ప్లీనరీ సమావేశానికి అధ్యక్షత వహించనున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేశ్ కీలక ఉపన్యాసాలు చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది.

నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో చోరీలు

బిట్రగుంట, న్యూస్‌టుడే: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి- బిట్రగుంట రైల్వేస్టేషన్ల మధ్య శ్రీవెంకటేశ్వరపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో సిగ్నల్ వద్ద గురువారం తెల్లవారుజామున ఆగి ఉన్న నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ (12734) రైలులో దొంగతనాలు జరిగాయి. ఎస్-3, ఎస్-4 బోగీల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ప్రయాణికుల కథనం మేరకు.. హైదరాబాద్‌లోని లింగంపల్లి నుంచి తిరుపతి వెళ్లే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ శ్రీవెంకటేశ్వరపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో ఆగింది. అదే సమయంలో ఎస్-3లో నిద్రిస్తున్న హైదరాబాద్‌కు చెందిన వి.మౌనిక మెడలోని మూడు తులాలకు పైగా బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారు. గమనించిన ప్రయాణికులు కేకలు వేశారు. ఎస్-4లో హైదరాబాద్‌కు చెందిన కె.ధనలక్ష్మి మెడలోంచి బంగారు గొలుసు లాక్కోబోగా ఆమె ప్రతిఘటించారు. ఆమె మెడకు గాయమైంది. నాలుగు గ్రాముల మంగళసూత్రం కనిపించకుండా పోయిందని వెల్లడించారు. బాధితులు టీటీఈకి ఫిర్యాదు చేశారు. నెల్లూరు రైల్వేస్టేషన్‌లో పోలీసులకు సమాచారమిచ్చారు.


జేఈఈలో 77.68 పర్సంటైల్ వచ్చినా ఐదో సబ్జెక్టు సమస్య

రెండో భాష మినహాయింపుతో దివ్యాంగ విద్యార్థికి ఇబ్బందులు

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్‌లో ఒక సబ్జెక్టు మినహాయింపు కారణంగా జేఈఈ మెయిన్స్‌లో మంచి ర్యాంకు సాధించిన దివ్యాంగ విద్యార్థులకు ఈ ఏడాది కూడా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఈ విభాగం విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో రెండో భాష సబ్జెక్టు మినహాయింపు ఉంది. ఎంపీసీ తీసుకుంటే ఆంగ్ల భాష సబ్జెక్టుతోపాటు గణితం-ఏ, బీ, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం సబ్జెక్టులు రాస్తే సరిపోతుంది. అయితే ఎన్ఐటీ, ఐఐటీల్లో ప్రవేశాలకు గణితం-ఏ, బీని ఒకే సబ్జెక్టుగా పరిగణిస్తున్నారు. దీంతో ఆంగ్లం, గణితం, భౌతిక, రసాయన శాస్త్రాల సబ్జెక్టులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈ సంస్థల్లో ప్రవేశాలకు నిబంధనల ప్రకారం ఇంటర్మీడియట్‌లో ఐదు సబ్జెక్టులు చదవడం తప్పనిసరి. దీంతో ఇంటర్మీడియట్ బోర్డు వారు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో మినహాయించిన రెండో భాష సబ్జెక్టును రాసుకునేందుకు అవకాశం కల్పించినా ఒకేసారి రెండు సబ్జెక్టులు రాయాల్సి రావడంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు. ఉదాహరణకు నెల్లూరుకు చెందిన గుల్లపల్లి వీరాంచ్ హష్మీకి జేఈఈ మెయిన్స్‌లో 77.68 పర్సంటైల్ వచ్చింది. సీటు వచ్చే అవకాశమున్నప్పటికీ ఐదు సబ్జెక్టుల నిబంధన ఉందని తెలిసి ఒత్తిడికి గురవుతున్నారు. గత ఏడాది ఇదే సమస్య సుమారు 25 మంది విద్యార్థులకు రావడంతో ప్రభుత్వం ప్రత్యేకంగా జీఓ ఇచ్చింది. అది ఒక్కసారికే అని అందులో పేర్కొంటూ నాలుగు సబ్జెక్టుల సరాసరి మార్కులను ఐదో సబ్జెక్టు మార్కులుగా ఇచ్చింది.

EENADU Vol: 51, Issue: 262 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

సరిహద్దులో పెరిగిన ఎలక్ట్రానిక్ వేడి



ఈడబ్ల్యూ వ్యవస్థలను దించిన భారత్, పాక్

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు చెలరేగిన నేపథ్యంలో రెండు దేశాలూ రక్షణాత్మక చర్యలు ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా నియంత్రణ రేఖ వెంబడి ఎలక్ట్రానిక్ యుద్ధ (ఈడబ్ల్యూ) వ్యవస్థలను పోటాపోటీగా రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి కదలికలపై కన్నేసి ఉంచడం, జీపీఎస్ వంటి ఉపగ్రహ ఆధారిత దిక్సూచి వ్యవస్థల సేవలను అందకుండా చేయడమే దీని ప్రధాన ఉద్దేశం.

భారత్‌దే పైచేయి..

ఈడబ్ల్యూ వ్యవస్థలపై భారత్ భారీగా పెట్టుబడులు పెట్టింది. దేశీయంగా, అంతర్జాతీయ భాగస్వామ్యాలతో భిన్న రకాల సాధనాలను అభివృద్ధి చేసింది. ఫలితంగా పాకిస్థాన్‌తో పోలిస్తే భారత్ వద్ద సంఖ్య, నాణ్యతపరంగా మెరుగైన ఈడబ్ల్యూ వ్యవస్థలు ఉన్నాయి.

ఏమిటీ ఈడబ్ల్యూ వ్యవస్థ?

విద్యుదయస్కాంత తరంగాల సాయంతో శత్రువుల ఎలక్ట్రానిక్ సంకేతాలకు అవరోధం కలిగించడం, ఏమార్చడం, సమాచారం సేకరించడం, స్వీయ సాధనసంపత్తిని రక్షించుకోవడం వంటి చర్యలకు ఉపయోగించే వ్యవస్థలు, పరిజ్ఞానాన్ని ఎలక్ట్రానిక్ యుద్ధ (ఈడబ్ల్యూ) వ్యవస్థగా పేర్కొంటారు. వీటిని విమానాలు, నౌకలు, వాహనాలపై ఏర్పాటు చేయవచ్చు. వీటిలో రాడార్లు, ట్రాన్స్‌మిటర్లు, యాంటెన్నాలు, సెన్సర్లు, కమ్యూనికేషన్ సాధనాలు ఉంటాయి. శత్రువుల కదలికలను గుర్తించడంలో ఇవి కళ్లు, చెవుల్లా వ్యవహరిస్తాయి.

ఏం చేస్తాయి?

● **రాడార్ హెచ్చరిక రిసీవర్:** శత్రు వ్యవస్థల నుంచి వచ్చే రాడార్ సంకేతాలను గుర్తించడం, వాటి ఆధారంగా ముప్పులపై హెచ్చరికలు చేయడం.

● **క్షిపణి దాడి హెచ్చరిక:** మన భూభాగం, ఆయుధ వ్యవస్థల దిశగా వస్తున్న శత్రు క్షిపణులను గుర్తించి, హెచ్చరించడం.

● **జామింగ్:** శత్రు రాడార్లు, కమ్యూనికేషన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వ్యవస్థల పనితీరును దెబ్బతీసేలా వాటిని జామ్ చేస్తాయి. జీపీఎస్, గ్లోనాస్, భారత నావిక్ వంటి ఉపగ్రహ ఆధారిత నేవిగేషన్ వ్యవస్థ (జీఎన్ఎస్ఎస్) నుంచి అందే సంకేతాలను అడ్డుకోవడం కూడా ఇందులో భాగమే.

● **కౌంటర్ మెజర్ డిస్పెన్సింగ్ వ్యవస్థ:** శత్రు క్షిపణులు, రాడార్ వ్యవస్థలను ఏమార్చడానికి యుద్ధవిమానాల్లోని ఈడబ్ల్యూ వ్యవస్థలు అల్యూమినియం లేదా జింక్ లోహపు భాగాలను వెదజల్లుతాయి. వాటిని ఒక విమానంలా భ్రమింపచేస్తాయి. తద్వారా క్షిపణులు, రాడార్లను దారిమళ్లిస్తాయి. అలాగే.. విమానాల నుంచి వెలువడే వేడి ఆధారంగా వాటిని వేటాడే హీట్ సీకింగ్ క్షిపణులను ఏమార్చేందుకు ఈ వ్యవస్థలు జ్వాలలను వెదజల్లుతాయి. తద్వారా ఆ క్షిపణులను విమానాలకు దూరంగా వెళ్లిపోయేలా చేస్తాయి.

● **స్పూఫింగ్:** నకిలీ రాడార్ సంకేతాలు, కమ్యూనికేషన్లను వెలువరించడం ద్వారా శత్రువును బోల్తా కొట్టించడం.

● **ఎలక్ట్రానిక్ తోడ్పాటు చర్యలు:** శత్రువుల ఎలక్ట్రానిక్ సంకేతాలను విశ్లేషించి, నిఘా సమాచారాన్ని సేకరించడం.



సంయుక్త: రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) దీన్ని రూపొందించింది. ఇది సంచార, సమీకృత ఈడబ్ల్యూ వ్యవస్థ. 1.5 మెగాహెర్ట్జ్ నుంచి 40 మెగాహెర్ట్జ్ మధ్య ఉన్న పౌనఃపున్య శ్రేణిలో శత్రువుల సంకేతాలను అడ్డుకోవడం, వాటి దిశను కనుగొనడం వంటివి చేయగలదు. దీని పరిధి 150-200 కిలోమీటర్లు.

హిమశక్తి: ఇది భారత సైన్యం కోసం అభివృద్ధి చేసిన ఆధునిక వ్యవస్థ. జామింగ్, ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాలు ఇందులో ఉన్నాయి. పర్వత ప్రాంతాల్లో పనిచేసేలా దీన్ని తీర్చిదిద్దారు.



స్పెక్ట్రా: భారత వైమానిక దళంలోని రఫేల్ యుద్ధవిమానాల్లో వీటిని అమర్చారు. ఇవి గగనతలంలో ఈడబ్ల్యూ సేవలను అందిస్తాయి.

నౌకాదళ ఈడబ్ల్యూ వ్యవస్థలు: ఐఎన్ఎస్ సూరత్ వంటి భారత యుద్ధనౌకల్లో 'శక్తి' వంటి అధునాతన ఈడబ్ల్యూ వ్యవస్థలను ఏర్పాటుచేశారు. ఇవి సముద్రంలో క్షిపణికి మార్గనిర్దేశం చేసే వ్యవస్థలను అడ్డుకోగలవు.



కాళీ-5000: శత్రువుల నేవిగేషన్ రిసీవర్లు సహా ఎలక్ట్రానిక్స్ వ్యవస్థలను నాశనం చేసేందుకు కాళీ-5000 వంటి డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్స్ (డీఈడబ్ల్యూ)ను భారత్ అభివృద్ధి చేస్తోంది. ఇది శక్తిమంతమైన ఎలక్ట్రాన్ పుంజాలను వెదజల్లుతుంది.

శత్రువుకు దిక్కుతోచకుండా..

ఆధునిక కాలంలో జీపీఎస్, గ్లోనాస్, భారత నావిక్ వంటి ఉపగ్రహ ఆధారిత నేవిగేషన్ వ్యవస్థలు అందుబాటులో ఉంటున్నాయి. ఇవి లేకుండా కొత్త ప్రాంతాలకు చేరుకోలేని పరిస్థితి. ఆయుధ వ్యవస్థలకు ఇవే కీలకం. ఆధునిక క్షిపణులు, బాంబులు ఈ దిక్సూచి వ్యవస్థల సంకేతాల ఆధారంగా లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదిస్తున్నాయి. ఈడబ్ల్యూ వ్యవస్థల ద్వారా నిర్దిష్ట ప్రాంతంలోని ఈ నేవిగేషన్ సంకేతాలను అడ్డుకుంటే ఆయుధాలకు సరైన మార్గనిర్దేశం జరగదు.

■ ఈడబ్ల్యూ వ్యవస్థలు ఉద్దేశపూర్వకంగా రేడియో ఫ్రీక్వెన్సీ సంకేతాలను ప్రసారం చేసి.. నిర్దిష్ట ప్రాంతంలో జీపీఎస్ సంకేతాలకు అవరోధం కలిగిస్తాయి. అలాగే శత్రు ఆయుధాలను తప్పుదోవ పట్టించేలా నేవిగేషన్ సంకేతాల్లో తేడాలను సృష్టిస్తాయి.

■ సరిహద్దుల్లో విమానాలు, డ్రోన్లు నిఘా సమాచార సేకరణకు గగనవిహారం చేస్తుంటాయి. తాము ప్రదేశాన్ని తెలుసుకోవడానికి ఇవి నేవిగేషన్ సంకేతాలపై ఆధారపడుతుంటాయి. జామింగ్ వల్ల నిఘా సమాచార సేకరణకు ఇబ్బంది ఏర్పడుతుంది.

పాక్‌కు చైనాయే ఆధారం..

ఈడబ్ల్యూ వ్యవస్థల్లో భారత ఆధిపత్యాన్ని ఎదుర్కొనేందుకు పాక్.. చైనా, పలు పశ్చిమ దేశాల నుంచి ఈ సాధన సంపత్తిని సమకూర్చుకుంది. అందులో డీడబ్ల్యూఎల్-002, జర్బ్, కేవీజే-7 వంటివి ఉన్నాయి. డీడబ్ల్యూఎల్-002ను నియంత్రణ రేఖకు చేరువలో, రావల్పిండి వంటి కీలక వైమానిక స్థావరాల్లో మోహరించింది. జర్బ్‌ను సముద్ర రక్షణ కోసం వాడుతోంది. కేవీజే-7ని జేఎఫ్-17 వంటి యుద్ధవిమానాల్లో ఉపయోగిస్తోంది. భారత స్పెక్ట్రాతో పోలిస్తే దీని సామర్థ్యం అంతంతమాత్రమే.

- ఈనాడు ప్రత్యేక విభాగం

పహల్గాం ఉగ్రదాడి మృతులకు అమరవీరుల హోదా ఇవ్వండి

● ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ విజ్ఞప్తి

దిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించిన వారికి అమరవీరుల హోదా ఇచ్చి, వారి కుటుంబాల మనోభావాలను గౌరవించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. కాన్పూర్‌లో బుధవారం ఓ బాధితుడి కుటుంబాన్ని కలిసినప్పుడు వారు తనను ప్రధాని మోదీకి ఈ సందేశం పంపమని కోరారని చెప్పారు. ఈ మేరకు బాధితులకు అమరవీరుల హోదా ఇవ్వాలనే వారి డిమాండ్‌కు మద్దతు ఇస్తున్నానని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూసేందుకు ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

భారత్‌కు రూ.11వేల కోట్ల సైనిక హార్డ్‌వేర్

● సరఫరాకు అమెరికా పచ్చజెండా

దిల్లీ: భారత్‌కు కీలకమైన సైనిక హార్డ్‌వేర్‌తో పాటు లాజిస్టిక్ తోడ్పాటు వ్యవస్థల సరఫరాకు అమెరికా ఆమోదం తెలిపింది. సుమారు రూ.11 వేల కోట్ల (131 మిలియన్ డాలర్లు) విలువైన ప్రతిపాదనకు పచ్చజెండా ఊపింది. అమెరికా రక్షణ శాఖ 'పెంటగాన్' పరిధిలోని డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ (డీఎస్‌సీఏ) ఇందుకు అనుమతులు మంజూరు చేసింది. దీనిపై అమెరికా కాంగ్రెస్‌కు కూడా సమాచారాన్ని అందజేసింది. ఇరుదేశాల మధ్యనున్న బలమైన ద్వైపాక్షిక సంబంధాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఎస్‌సీఏ వెల్లడించింది. అమెరికా నుంచి సైనిక కొనుగోళ్లను మరింత పెంచాలని దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై ఒత్తిడి పెంచుతున్న వేళ ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించడం గమనార్హం. భారత్‌కు అందనున్న సైనిక హార్డ్‌వేర్‌ల జాబితాలో సీ విజన్ సాఫ్ట్‌వేర్, రిమోట్ సాఫ్ట్‌వేర్, అనలిటిక్ సపోర్ట్ వంటివి ఉన్నట్లు తెలుస్తోంది.

'ధ్రువ్' హెలికాప్టర్లకు లైన్ క్లియర్

దిల్లీ: కొన్ని నెలల క్రితం నిలిపివేసిన ఆధునాతన తేలికపాటి హెలికాప్టర్ ధ్రువ్ కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సైన్యం, వైమానికదళంలో ఉన్న వాటికి పచ్చజెండా ఊపినప్పటికీ.. నౌకాదళంలో ఉన్న ఈ హెలికాప్టర్లకు మాత్రం అనుమతివ్వలేదని తెలిసింది. ఈ ఏడాది జనవరి 5న గుజరాత్‌లోని పోరుబందర్‌లో కోస్టుగార్డుకు చెందిన ధ్రువ్ హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో ఇద్దరు పైలట్లు సహా మరో డైవర్ ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ధ్రువ్ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. దేశీయంగా రూపొందించిన ఈ హెలికాప్టర్‌లో రెండు ఇంజిన్లు ఉంటాయి. దీని బరువు 5.5 టన్నులు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తయారు చేస్తోంది.

కన్నుమూసిన ప్రపంచ పెద్దావిడ

● 116 ఏళ్ల వయసులో మృతి



సావోపాలో (బ్రెజిల్): ప్రపంచంలోనే అత్యధిక వయసు కలిగిన వ్యక్తిగా ప్రసిద్ధి పొందిన సిస్టర్ ఇనా కనబారో లుకాస్ బుధవారం 116 సంవత్సరాల వయసులో మరణించారు. మరికొన్ని వారాల్లో 117 సంవత్సరాలకు చేరనున్న దశలో ఆమె కన్నుమూశారు. దక్షిణ బ్రెజిల్‌లోని రియో గ్రాండ్ దు సుల్ రాష్ట్రంలో 1908, మే 27న జన్మించిన ఇనా తన 20వ ఏట కేథలిక్ నన్ (సన్యాసిని)గా మారారు. శతాధిక వయసులోనూ ఆమె ఫుట్‌బాల్ క్రీడ పట్ల ఆసక్తి చూపేవారు. ఇనాకు 106వ ఏట కంటి శుక్లాలు తొలగించారు. అంతకు మించి ఆమెకు మరేలాంటి శస్త్ర చికిత్సలూ జరగలేదు. ఆమె ప్రతిరోజూ తన ఆహార, ప్రార్థన, నిద్రా సమయాలను క్రమం తప్పకుండా పాటించేవారు. వినమ్రత, కృతజ్ఞతాభావం, స్నేహ స్వభావం కలిగిన సిస్టర్ ఇనా దేని గురించీ ఫిర్యాదు చేసేవారు కాదని ఆమె సహచర నన్ ఒకరు తెలిపారు. ''ఆమె చేసే పనిలో, జీవితంలో క్రమశిక్షణే ఊపిరిగా బతికారు. కష్టించి పనిచేసేవారు. కలివిడిగా ఉండేవారు. అందరినీ ఆదరించేవారు'' అని ఆమె వివరించారు. 110వ జన్మదినాన పోప్ ఫ్రాన్సిస్ సిస్టర్ ఇనాను సత్కరించారు.

పాక్ ఎఫ్ఎం రేడియోల్లో భారత్ పాటల నిలిపివేత

లాహోర్: సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ ఎఫ్.ఎం. రేడియో కేంద్రాలు గురువారం నుంచి భారతదేశ పాటల ప్రసారాన్ని నిలిపివేశాయి. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా తక్షణం అమల్లోకి వచ్చిందని పాకిస్థాన్ ప్రసారకుల సంఘం (పీబీఏ) సెక్రటరీ జనరల్ షకీల్ మసూద్ తెలిపారు. ప్రఖ్యాత గాయకులు లతా మంగేష్కర్, మహమ్మద్ రఫీ, కిశోర్‌కుమార్, ముకేశ్ తదితరుల పాటలకు పాక్‌లో మంచి ఆదరణ ఉంది. భారత్ పాటల ప్రసారాన్ని నిలిపివేయాల్సిందిగా సర్కారే సూచించిందనే ఊహాగానాల నేపథ్యంలో పీబీఏ నిర్ణయాన్ని పాక్ సమాచార శాఖ మంత్రి అతావుల్లా తరార్ కొనియాడారు. ''మీ దేశభక్తిపూర్వక చర్య అభినందనీయం. పాక్ ఉమ్మడి భావనను ఇది ప్రతిబింబిస్తోంది. ఈ పరీక్షా సమయంలో అందరం ఐక్యంగా ఉన్నామని మీరు చాటారు'' అని పీబీఏకు లేఖ రాశారు.

నేడు సీడబ్ల్యూసీ భేటీ

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడితోపాటు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కులగణనపై చర్చించడానికి శుక్రవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం కానుంది. అత్యంత కీలకమైన ఈ రెండు అంశాలపై చర్చించేందుకు యావత్ సీడబ్ల్యూసీ పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం అవుతుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు.



దిల్లీలో గురువారం మిలిటరీ నర్సింగ్ సర్వీసెస్ అదనపు డీజీగా బాధ్యతలు చేపట్టిన మేజర్ జనరల్ లిసమ్మా

అభివృద్ధిలో శ్రామికులే అసలైన భాగస్వాములు

మంత్రి లోకేశ్



ఈనాడు, అమరావతి: కార్మికులు, కర్షకుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ తెలిపారు. ఎక్స్‌లో కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ''శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములు. వారికి అండగా నిలుస్తున్నాం'' అని వెల్లడించారు.

✦ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ప్రభుత్వ సలహాదారు ఎన్ఎండీ షరీఫ్, మాజీ ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, అశోక్‌బాబు, నిర్మాణ రంగ కార్మికుల బోర్డు ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకానికి రూ.19.12 కోట్లు

ఈనాడు, అమరావతి: అనాథ చిన్నారులకు నెలకు రూ.4 వేల చొప్పున అందించే మిషన్ వాత్సల్య పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.19.12 కోట్లు విడుదల చేసింది. 2025-26 మొదటి త్రైమాసికం చెల్లింపుల కోసం ఈ నిధులు విడుదల చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

వడగాలులపై ఏపీ, తెలంగాణలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ లేఖ

● దుర్బలవర్గాల రక్షణకు చర్యలు తీసుకోవాలని మొత్తం 11 రాష్ట్రాలకు ఆదేశం

ఈనాడు, దిల్లీ: వడగాలుల నుంచి నిరుపేదలు, ఎండలో పనిచేసే కార్మికులు, వృద్ధులు, పిల్లలు, ఇల్లులేని వారిని రక్షించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఏపీ, తెలంగాణ సహా మొత్తం 11 రాష్ట్రాలను కోరింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతోపాటు పంజాబ్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, మహారాష్ట్ర, రాజస్థాన్‌ల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాసింది. ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారం 2018 నుంచి 2022 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా వడగాలులకు 3,798 మంది చనిపోయిన విషయాన్ని గుర్తుచేస్తూ ప్రభుత్వాలు ముందస్తుగా అప్రమత్తం కావాలంది. ''ఎండవేడిమి కారణంగా తలెత్తే అనారోగ్య సమస్యలు, అందుకందించే చికిత్సకు సంబంధించిన ప్రొటోకాల్స్ విషయంలో ప్రామాణిక నిబంధనలను అమలు చేయాలి. జాతీయ ప్రకృతి వైపరీత్య నిర్వహణ ప్రాధికార సంస్థ జారీచేసిన ప్రామాణిక నిర్వహణ నిబంధనలు(ఎస్ఓపీ)లకు అనుగుణంగా దుర్బలవర్గాలను వడగాలుల నుంచి రక్షించడానికి తీసుకున్న ముందస్తు చర్యలపై కార్యాచరణ నివేదికను సమర్పించాలి'' అని కేంద్రం ఆదేశించింది.

మదర్సాల్లో నవీన విద్యా బోధనకు విద్యావాలంటీర్లు

● 'చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకం' అమలు
● వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి
● మైనారిటీ సంక్షేమశాఖ ప్రతిపాదనలు

ఈనాడు, అమరావతి: ముస్లిం విద్యార్థులకు మేలు చేకూరేలా మైనారిటీ సంక్షేమశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మదర్సాల్లో అభ్యసిస్తున్న విద్యార్థులకు నవీన విద్యను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు విద్యా వాలంటీర్లను నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనికి 'చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకం'గా నామకరణం చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేలా అధికారులు కసరత్తు ప్రారంభించారు. విద్యా శాఖ పరిధిలో నమోదైన మదర్సాల్లో మైనారిటీ, విద్యా శాఖ సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేయనున్నాయి. ఏడాదికి రూ.14.61 కోట్లు అవసరమవుతుందని అధికారుల అంచనా.

ఒక్కో మదర్సాకు ముగ్గురు విద్యావాలంటీర్లు..

2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం మదర్సాల్లో నవీన విద్యా బోధనకు విద్యా వాలంటీర్లను నియమించింది. వైకాపా ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేసింది. మైనారిటీ సంఘాల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు మైనారిటీ సంక్షేమశాఖ ఈ విధానాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా యూడైస్ కోడ్ ఉండి రిజిస్టర్ అయిన మదర్సాలు 174 ఉన్నాయి. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు వీటిలో బోధన ఉంటుంది. మొత్తం 12,686 విద్యార్థులున్నారు. వీరికి ఆంగ్లం, గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం బోధనకు విద్యా వాలంటీర్లను నియమించనున్నారు. ఒక్కో మదర్సాకు ముగ్గురు చొప్పున విద్యావాలంటీర్లను నియమించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. వీరికి నెలకు రూ.12 వేల చొప్పున వేతనంగా ఇవ్వనున్నారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 525 మంది అవసరమవుతారని అంచనా. డీఈడీ, బీఈడీ పూర్తి చేసిన వారిని ఎంపిక చేస్తారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం అమలు

మదర్సాల్లోని విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమల్లోకి తీసుకురానున్నారు. పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్, షూలతో కూడిన స్టూడెంట్ కిట్‌ను(సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర) ఉచితంగా అందిస్తారు.

✦ ప్రతి మదర్సాలోనూ డిజిటల్ క్లాస్ రూంను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కంప్యూటర్లను అందిస్తారు. సైన్స్, గణితం కిట్స్, స్పోర్ట్స్ మెటీరియల్‌ను అందిస్తారు.

✦ గణిత క్లబ్బులు, స్పోర్ట్స్ ఈవెంట్స్, లాంగ్వేజ్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తారు.

✦ గ్రంథాలయ నిర్వహణకు గ్రాంటు ఇస్తారు.

కోర్ బ్రాంచీల్లో 'కృత్రిమ మేధ'

● బీబీఏ, బీసీఏల్లో కూడా అమలు
● ప్రత్యేక పాఠాలు కాకుండా అవసరమైన చోట ఏఐ అనుసంధానం
● ఏఐసీటీఈ నిర్ణయం... నిపుణుల కమిటీ నియామకం

ఈనాడు, హైదరాబాద్: భవిష్యత్తులో కృత్రిమమేధ ప్రవేశించని రంగం ఉండబోదని ప్రపంచవ్యాప్తంగా నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తమ సంస్థలో రానున్న 18 నెలల్లో కోడింగ్ మొత్తం ఏఐ రాయనుందని మెటా సీఈవో జుకర్‌బర్గ్ సైతం ప్రకటించడం సంచలనం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో అన్ని రంగాల వారు ఏఐపై అవగాహన, నైపుణ్యం కలిగి ఉండాల్సిన అవసరం ఎంతో దూరంలో లేదు. ప్రస్తుతం కోర్ బ్రాంచీల విద్యార్థులు మైనర్ సబ్జెక్టుగా ఏఐని చదువుకునే అవకాశం అనేక కళాశాలల్లో ఉంది. ఇలా విడిగా కంటే తాము ఎంచుకున్న సబ్జెక్టు/రంగంలో ఏఐని కలిపి నేర్చుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఇందుకనుగుణంగా అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) ఇంజినీరింగ్ విద్యను మార్చేందుకు సమాయత్తమవుతోంది. దీంతోపాటు మరిన్ని మార్పులు తేనుంది.

2026-27 విద్యా సంవత్సరమే లక్ష్యంగా...

ఇంజినీరింగ్‌లో కోర్ బ్రాంచీలైన మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, కెమికల్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, టెక్స్‌టైల్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ తదితర బ్రాంచీలతోపాటు బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బీబీఏ), బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(బీసీఏ)లోనూ ఏఐ పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలని ఏఐసీటీఈ నిర్ణయించింది. ప్రత్యేకంగా ఏఐ పాఠాలను కాకుండా... కోర్ బ్రాంచీల్లోని సిలబస్‌లో అవసరమైన చోట కృత్రిమమేధ పాఠ్యాంశాలను అనుసంధానం చేయనుంది. ఈ మేరకు కొత్త పాఠ్య ప్రణాళికను పూర్తిచేసి 2026-27 విద్యా సంవత్సరంలో అమల్లోకి తీసుకురానుంది. ఇందుకోసం ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర ప్రముఖ విద్యా సంస్థల్లోని ఏఐ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసింది. విద్యార్థులు ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్, సంబంధిత బ్రాంచీల్లోనే ఏఐ పాఠ్యాంశాలను చదువుకోగలుగుతున్నారు. కొత్త సిలబస్ అమల్లోకి వస్తే ఇతర బ్రాంచీల వారికి కూడా భవిష్యత్తులో ప్రయోజనం ఉంటుంది. కొత్త కోర్సుల పరిచయంలో భాగంగా ఇప్పటికే బీటెక్‌లో మైనర్ కోర్సుగా క్వాంటమ్ టెక్నాలజీని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

పరిశ్రమల్లో పనిచేయనున్న అధ్యాపకులు

ఇంజినీరింగ్ అధ్యాపకులు సైతం పరిశ్రమల్లో రియల్‌టైమ్ అనుభవం పొందేందుకు, తదనంతరం విద్యార్థులకు బోధించేందుకు ఏఐసీటీఈ ఏడాదిపాటు ఫెలోషిప్ అందించనుంది. అంటే అధ్యాపకులు పరిశ్రమల్లో ఏడాదిపాటు పనిచేస్తూ నేర్చుకోవాల్సి ఉంటుంది. అందుకు గౌరవ వేతనంగా రూ.75 వేలు ఇస్తుంది. ఆయా కంపెనీలు మరో రూ.25 వేలు అందజేస్తాయి. ఇలా 45 ఏళ్ల లోపున్న 300 మందికి అవకాశం కల్పిస్తుంది. దరఖాస్తు చేసుకున్న వారిని ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేస్తుంది. దీనిపై మార్గదర్శకాలను రూపొందిస్తోంది.

47 ఏరోవిజన్ డ్రోన్ ల్యాబ్‌లు

◆ ఏఐసీటీఈ దేశవ్యాప్తంగా ఏవీపీఎల్ అనే కంపెనీతో కలిసి 47 ఏరోవిజన్ డ్రోన్ ల్యాబ్‌లను నెలకొల్పనుంది. వీటిని ఎంపిక చేసిన కళాశాలల్లో ఏర్పాటు చేసి, డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది.

◆ మొత్తం 22 భాషల్లో ఇంజినీరింగ్ పాఠ్య పుస్తకాలను అందించాలని మూడేళ్ల క్రితమే నిర్ణయించింది. తాజాగా 2026 నాటికి 12 భాషల్లో పూర్తి చేస్తామని ప్రకటించింది. ఇప్పటికే బీటెక్‌ను ప్రాంతీయ భాషల్లో చదువుకునే అవకాశం ఇచ్చింది.



అనలాగ్ మిషన్ కేంద్రంలో మోహనసాయి

అనలాగ్ వ్యోమగామి శిక్షణకు మోహనసాయి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: తెలంగాణలోని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన యువ శాస్త్రవేత్త ఆకుల మోహనసాయి ఈ నెల 5-9 తేదీల మధ్య అమెరికాలోని అరిజోనాలో నిర్వహించనున్న అనలాగ్ వ్యోమగామి శిక్షణకు ఎంపికయ్యారు. అంగారక గ్రహం(మార్స్) ఉపరితలంలో పరిస్థితులు, అక్కడ జీవనం, పనిచేయడం ఎలా ఉంటుందనే అంశాలపై శాస్త్రీయ అధ్యయనం చేసేందుకు ప్రత్యేకంగా ఈ భారీ శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించారు. ఎంపిక ప్రక్రియకు 2024 ఫిబ్రవరిలో శ్రీకారం చుట్టగా ప్రపంచవ్యాప్తంగా 2,200 దరఖాస్తులు అందాయి. దాదాపు ఏడాదిపాటు బహుళ దశల్లో నిర్వహించిన పరీక్షల్లో 18 మంది ఎంపికయ్యారు. అందులో మోహనసాయి ఒకరు. ఆయన ప్రస్తుతం ముంబయిలోని అమిటీ యూనివర్సిటీలో ఆస్ట్రోబయాలజీ స్పేస్ సైన్స్ కోర్సును అభ్యసిస్తున్నారు. మాస్టర్స్ థీసిస్ ప్రాజెక్టుగా చంద్రునిపై పంటలు సాగుచేసే విధానంపై ప్రయోగాత్మక పరిశోధన చేస్తున్నారు. చంద్రునిపై స్థిర నివాసాల కోసం ఈ ప్రయోగ ఫలితం కీలకమవుతుందన్నది ఆయన విశ్వాసం. మోహనసాయి 2023, 2024 సంవత్సరాల్లో ఐరోపాలో నిర్వహించిన రెండు అంతర్జాతీయ లూనార్ అనలాగ్ మిషన్లను పూర్తిచేశారు. వాటిలో ప్రతిభను గుర్తించి లునారెస్ రీసెర్చ్ స్టేషన్(యూరప్) వారు మోహనసాయిని 2024 అక్టోబరులో భారత అంతరిక్ష దౌత్య ప్రతినిధిగా ప్రకటించారు.

ఐటీ పాలసీ అమలుకు విధానాలు ఖరారు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ)పాలసీ-4.0 అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024-29 మధ్య ఇవి అమల్లో ఉంటాయని పేర్కొంది. ఈ రంగంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం.. యువతకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా పాలసీని రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది. పెద్ద ఎత్తున కో-వర్కింగ్ స్పేస్‌లు, నైబర్‌హుడ్ వర్క్‌స్పేస్‌లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించాలన్నదే లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. ఐటీ క్యాంపస్‌లు, పార్కుల డెవలప్‌మెంట్‌కు సంబంధించిన మార్గదర్శకాలను పాలసీలో చేర్చింది. ఈ రంగంలో ఏర్పాటు చేసే మెగా పరిశ్రమలకు టైలర్ మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు అందించేందుకు నిర్ణయించింది. పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన వారికి అవసరమైన అనుమతులను సింగిల్ డెస్క్ పోర్టల్‌లో అందిస్తామని, కో-వర్కింగ్ స్పేస్, నైబర్‌హుడ్ వర్క్‌స్టేషన్లు, ఐటీ క్యాంపస్‌ల అభివృద్ధికి అవసరమైన అనుమతులు, లైసెన్సులు సంబంధిత వర్గాలు వేగంగా జారీ చేస్తాయని తెలిపింది. ప్రోత్సాహకాలకు సంబంధించిన ప్రతిపాదనలను దాఖలు చేసేందుకు ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేశామని, క్యాపిటల్ సబ్సిడీతోపాటు.. విద్యుత్ రాయితీ, ఇతర ప్రోత్సాహకాలను ఇవ్వనున్నట్లు పేర్కొంది.

సెమీకండక్టర్ పాలసీని ఖరారు చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: సెమీకండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ-4.0ను అమలు చేసేందుకు మార్గదర్శకాలను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024-29 మధ్య ఈ పాలసీ అమలవుతుందని పేర్కొంది. రాష్ట్రంలో సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం కల్పించే లక్ష్యంతో ఈ విధానాన్ని రూపొందించినట్లు పేర్కొంది. ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో కన్సల్టేటివ్ కమిటీని పునర్‌నిర్మించినట్లు పేర్కొంది. ఐటీ, ఎలక్ట్రానిక్స్, అంకుర సంస్థలకు సంబంధించిన అంశాలను కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపింది. సెమీకండక్టర్లు/సిలికాన్ ఫొటోనిక్స్/సెన్సర్స్ ఫ్యాబ్/సెమీకండక్టర్ అసెంబ్లింగ్, టెస్టింగ్, మార్కెటింగ్, ప్యాకింగ్ వంటి సదుపాయాలను కల్పించే సంస్థల నుంచి పెట్టుబడులను ఆకర్షించేలా విధానాలు ఉంటాయని పేర్కొంది. ఈ రంగంలో ఏర్పాటు చేసే పరిశ్రమల పెట్టుబడుల ఆధారంగా టైలర్ మేడ్ ఇన్సెంటివ్‌లను ఇవ్వనున్నట్లు తెలిపింది.

జగన్‌కు ధైర్యముంటే ప్రధాని సభకు రావాలి

మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు సవాలు



ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్‌కు ధైర్యముంటే శుక్రవారం జరిగే ప్రధాని నరేంద్ర మోదీ సభకు వచ్చి రాజధాని పునర్నిర్మాణంలో భాగస్వామి కావాలని మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు సవాలు చేశారు. వచ్చి తన పరిపాలనలో చేసిన తప్పుల్ని సరిదిద్దుకోవాలని సూచించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాజధానిని శ్మశానం అని, వరదొస్తే మునిగిపోతుందని, కట్టడాలు పనికిరావని అన్నారు. ఓ కులానికి అంటగట్టారు. కానీ ప్రజలు వైకాపా నేతల దుష్ప్రచారాన్ని నమ్మలేదు. రైతుల పోరాటం ఫలించింది. అమరావతి నిర్మాణానికి కేంద్రం సహాయం చేస్తోంది. రాజధాని పునర్నిర్మాణ పనుల ప్రారంభం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే సమయం' అని అశోక్‌బాబు అన్నారు.

అమరావతిపై జగన్‌కు అదే అక్కసు: యామిని శర్మ




ఈనాడు, అమరావతి: ప్రధాని మోదీ సహకారంతో కూటమి ప్రభుత్వ హయాంలో అమరావతి సహా రాష్ట్రం మొత్తం సమగ్రంగా అభివృద్ధి చెందనుందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ పేర్కొన్నారు. 'పీఎం మోదీ శుక్రవారం రూ.లక్ష కోట్ల విలువైన ప్రాజెక్టు పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కోసం అమరావతి వస్తున్నారు. గత ఐదేళ్లలో జగన్ పాలనలో రాజధాని లేకుండా చేశారు. ఇప్పుడు జరుగుతున్న కార్యక్రమం మీద కూడా ఆయన అక్కసు వెళ్లగక్కుతున్నారు' అని ఒక ప్రకటనలో మండిపడ్డారు.

గృహరుణం బీమాతో భరోసా

ఇల్లు కొనేందుకు గృహరుణం తీసుకుంటాం. అన్నీ సరిగ్గా సాగుతుంటే.. రుణం తీర్చడంలో ఏ ఇబ్బందీ లేదు. కానీ, అనుకోని పరిస్థితుల్లో సంపాదించే వ్యక్తికి ఏదైనా జరిగితే? ఆ అప్పు తీర్చడం ఎలా? ఇంటిని అమ్మేయాల్సిందేనా? కుటుంబ సభ్యులను ఇబ్బందుల్లోకి నెట్టే ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే ఏం చేయాలి?

అప్పు చేసినప్పుడు దాన్ని తీర్చడమూ మన బాధ్యతగానే భావించాలి. అన్ని సందర్భాలూ ఒకేలా ఉండవనేది వాస్తవం. అనుకోని సందర్భాలు వచ్చినప్పుడు ఈ రుణాన్ని తీర్చడానికి అనుబంధంగా ఒక బీమా పాలసీ ఉండాలి. ఆ మాటకొస్తే గృహరుణమే కాదు.. ప్రతి రుణానికీ తోడుగా ఒక పాలసీ ఉండాల్సిందే. ఆర్థిక ప్రణాళికలో ఇది ఎంతో కీలకం. రుణగ్రహీత కుటుంబానికి దూరమైనప్పుడు అప్పులను తీర్చడంలో ఈ పాలసీలు ఆదుకుంటాయి. ప్రస్తుతం బ్యాంకులు రుణం ఇచ్చేటప్పుడే తమకు అనుబంధంగా ఉన్న బీమా సంస్థల నుంచి లోన్ కవర్ టర్మ్ పాలసీలను ఇప్పిస్తున్నాయి. దీనికి అవే రుణమూ ఇస్తున్నాయి. రుణం తీసుకునేటప్పుడు దానికి రక్షణగా ఎలాంటి పాలసీలు తీసుకోవాలనే విషయంలో కొన్ని సందేహాలు ఉంటాయి. వాటికి సమాధానాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.



బ్యాంకు నుంచే తీసుకుంటే...

సొంతిల్లు కోసం తీసుకునే గృహరుణం సాధారణంగా 20 ఏళ్లపాటు కొనసాగే ఒక దీర్ఘకాలిక ఒప్పందం. నెల సంపాదనలో 25-40 శాతం వరకూ ఈ రుణాన్ని తీర్చేందుకే వెళ్తుంది. దీర్ఘకాలంలో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులూ రాకుండా చూసుకోవాలి.

గృహరుణానికి రక్షణగా హోమ్ లోన్ ప్రొటెక్షన్ ప్లాన్‌లను తీసుకోవాల్సిందిగా బ్యాంకులు సూచిస్తుంటాయి. రుణ వ్యవధి, మొత్తానికి సమానంగా ఉండేలా ఈ పాలసీలను తీసుకోవచ్చు.

■ రుణ మొత్తం తగ్గుతూ ఉంటే బీమా విలువా ఆ మేరకు పడిపోతుంటుంది. దీన్ని రెడ్యూసింగ్ కవర్ అని అంటారు. కొన్ని బీమా సంస్థలు పాలసీ విలువను తగ్గించకపోవచ్చు. దీన్ని లెవల్ కవర్‌గా చెప్పొచ్చు. గృహరుణానికి సంబంధించిన బీమా పాలసీ అయినప్పటికీ సాధారణ టర్మ్ ఇన్సూరెన్స్ నిబంధనలే వర్తిస్తాయని మర్చిపోవద్దు. రుణగ్రహీత వయసు, ఆరోగ్యం, బీమా మొత్తం.. ఇతర అంశాల ఆధారంగా ప్రీమియం ఉంటుంది.

■ ప్రమాదవశాత్తూ ఏదైనా వైకల్యం సంభవించినా కొన్ని బీమా సంస్థలు పరిహారాన్ని ఇస్తాయి. కొన్ని సంస్థలు రుణగ్రహీత మరణిస్తేనే పరిహారం చెల్లిస్తాయి. తీవ్రవ్యాధుల బారిన పడినప్పుడూ రుణాన్ని తీర్చే విధంగానూ పాలసీలను ఎంచుకోవచ్చు. ఉద్యోగం కోల్పోవడం, ఆదాయం ఆగిపోవడం లాంటి సందర్భాల్లో పరిమిత కాలంపాటు వాయిదాలను చెల్లించే పాలసీలూ ఉన్నాయి. ఇవన్నీ ప్రాథమిక లోన్ కవర్ పాలసీకి అనుబంధ రైడర్లుగా తీసుకోవాల్సి వస్తుంది.

■ తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే.. గృహరుణానికి రక్షణగా ఉండేలా బీమా పాలసీ తీసుకోవాలి. అయితే, తప్పనిసరిగా బ్యాంకు చెప్పిన సంస్థ నుంచే తీసుకోవాల్సిన అవసరం లేదు. ఇది గృహరుణగ్రహీత విచక్షణ మీద ఆధారపడి ఉంటుంది.

బ్యాంకు మారితే: ఈ లోన్ కవర్ టర్మ్ పాలసీలు బ్యాంకులు అందించే బృంద బీమాలో భాగంగా ఉంటాయి. ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు గృహరుణం మార్చుకున్నారనుకోండి. పాత రుణం కోసం తీసుకున్న బీమా రద్దవుతుంది. కొత్త బ్యాంకుకు మారినప్పుడు అక్కడ మళ్లీ మరో పాలసీ తీసుకోవాల్సి రావచ్చు. ఇది ఒక ప్రతికూలత. అయితే, ఈ బీమా పాలసీని వ్యక్తిగత టర్మ్ పాలసీగా మార్చాల్సిందిగా బ్యాంకును కోరవచ్చు. అలా మారిన తర్వాత కొత్త బ్యాంకు నుంచి తీసుకున్న రుణానికి ఆ బీమా పాలసీని అనుసంధానం చేయొచ్చు.

రుణానికి రక్షణగా టర్మ్ పాలసీ తీసుకోవడం తప్పనిసరి. దీంతోపాటు కుటుంబ ఆర్థిక బాధ్యతలు తీర్చేలా మరో టర్మ్ పాలసీ ఉండేలా చూసుకోవాల్సిన అవసరమూ ఉంది. అప్పుడే మీపై ఆధారపడిన వారికి ఆర్థికంగా ఏ ఇబ్బందీ ఉండదు.

భారం అవుతుందా?

గృహరుణం ఇచ్చిన బ్యాంకుకు అనుబంధంగా ఉన్న బీమా సంస్థల నుంచి లోన్ కవర్ టర్మ్ పాలసీ తీసుకున్నప్పుడు బ్యాంకు ఆ ప్రీమియానికి సంబంధించిన రుణాన్నీ ఇస్తుంది. దీన్ని మనం గృహ రుణ వాయిదాతో కలిపి చెల్లించాల్సి వస్తుంది.

■ ఉదాహరణకు 35 ఏళ్ల వెంకట్ ఫ్లాట్ కొనేందుకు రూ. కోటి బ్యాంకు రుణం తీసుకున్నారు. దీనికి ఆయన బీమా పాలసీ తీసుకోవాలని అనుకున్నారు. బ్యాంకు నుంచి బృంద టర్మ్ పాలసీ తీసుకుంటే ప్రీమియం దాదాపు రూ.3,00,000 వరకూ (లెవల్ కవర్) చెల్లించాల్సి వస్తుంది. బ్యాంకు ఈ మేరకు రుణం ఇచ్చిందనుకుందాం. వర్తించే వడ్డీ రేటు 8.85 శాతం అనుకుంటే.. నెలవారీ వాయిదా రూ.2,670 ఉంటుంది. 20 ఏళ్లలో వడ్డీతో రూ.6,40,873 చెల్లించాల్సి వస్తుంది.

■ దీనికి బదులుగా రూ.కోటి టర్మ్ పాలసీని సొంతంగా తీసుకున్నారనుకుందాం. అప్పుడు ఏడాదికి ప్రీమియం రూ.19వేల వరకూ ఉంటుంది. అంటే. . 20 ఏళ్లకు కలిపి చెల్లించేది రూ.3,80,000. చూశారుగా ఎంత తేడానో. (గమనిక: ఈ ప్రీమియం వివరాలు అంచనాలు మాత్రమే. పూర్తి వివరాలు మీ బ్యాంకు, బీమా సంస్థను సంప్రదించి తెలుసుకోవాలి. వయసు, ఆరోగ్య పరిస్థితి, అలవాట్లను బట్టి ప్రీమియం మొత్తం మారుతుంది) కాబట్టి, ఏ పాలసీ తీసుకోవాలన్నది ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయించుకోవాలి.

siri@eenadu.net

ఏటీఎం రుసుము పెరిగింది

అనుమతించిన పరిమితికి మించి ఏటీఎం లావాదేవీలు చేసినప్పుడు రుసుముల భారం తప్పదు. గతంలో రూ.21గా ఉన్న ఈ ఛార్జీ ఇప్పుడు రూ.23కు పెరిగింది. అన్ని బ్యాంకుల ఏటీఎంలకూ ఇది వర్తించనుంది.

ప్రస్తుత నిబంధనల ప్రకారం మెట్రో నగరాల్లోని ఖాతాదారుడు నెలకు తన సొంత బ్యాంకు ఏటీఎం నుంచి 5, ఇతర బ్యాంకుల ఏటీఎం నుంచి 3 పర్యాయాల వరకూ నగదు (నగదు తీసుకోవడం, జమ చేయడం), ఆర్థికేతర లావాదేవీలు (నగదు నిల్వ తెలుసుకోవడం, పిన్ మార్పు లాంటివి) చేసేందుకు వీలుంది. ఇతర ప్రాంతాల్లో సొంత బ్యాంకు నుంచి 5, ఇతర బ్యాంకుల నుంచి 5సార్లు ఈ లావాదేవీలు చేయొచ్చు. ఆ తర్వాత నుంచి ప్రతి లావాదేవీకి రూ.23 చొప్పున చెల్లించాల్సి వస్తుంది. ఈ పెరిగిన రేట్లు మే 1 నుంచి అమల్లోకి వచ్చాయి.

రిటర్నులకు వేళాయె



ఆదాయపు పన్ను రిటర్నులకు సంబంధించి కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) కీలక ప్రకటన చేసింది. ఐటీఆర్-1 (సహజ్), ఐటీఆర్-4లను నోటిఫై చేసింది. దీంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి (అసెస్‌మెంట్ ఇయర్ 2025-26)గాను ఆదాయపు పన్ను రిటర్నులకు వీటిని ఉపయోగించేందుకు వీలవుతుంది. ఎక్స్ఛేంజీల్లో నమోదైన ఈక్విటీ షేర్లు, ఈక్విటీ-ఆధారిత మ్యూచువల్ ఫండ్లను విక్రయించడం ద్వారా రూ.1.25 లక్షల వరకూ దీర్ఘకాలిక మూలధన లాభాలు ఉన్న పన్ను చెల్లింపుదారులూ ఐటీఆర్-1, ఐటీఆర్-4లను ఉపయోగించవచ్చు.

▲ **ఐటీఆర్-1:** దేశంలో నివసించే వ్యక్తి ఆదాయం రూ.50లక్షలున్న వారు, వేతనం, ఒక ఇంటి ద్వారా ఆదాయం, సెక్షన్ 11ఏ ప్రకారం రూ.1.25 లక్షల లోపు దీర్ఘకాలిక మూలధన లాభాలు, రూ.5,000 వరకూ వ్యవసాయ ఆదాయం ఉన్న వారికి వర్తిస్తుంది.

▲ **ఐటీఆర్-4:** మొత్తం ఆదాయం రూ.50 లక్షల వరకూ ఉన్నవారు, వృత్తి, ఆదాయం ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తున్న వారు, దీర్ఘకాలిక మూలధన లాభాలు రూ.1.25 లక్షల లోపు ఉన్నప్పుడు, సెక్షన్ 44ఏడీ, సెక్షన్ 44ఏడీఏ, సెక్షన్ 44ఏఈ కింద ఆదాయాలను గణించే వారు ఈ ఫారాన్ని వినియోగించాల్సి ఉంటుంది.

ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి చివరి తేదీ జులై 31. వేతనాలు పొందే వారికి జూన్ 15 తర్వాతే ఫారం-16 అందే అవకాశం ఉంటుంది. వీరు అప్పుడే రిటర్నులు దాఖలు చేయడానికి వీలవుతుంది.

కొత్త పథకం

అన్ని విభాగాల షేర్లలో

యూటీఐ మ్యూచువల్ ఫండ్ కొత్తగా **యూటీఐ మల్టీక్యాప్ ఫండ్‌**ను ఆవిష్కరించింది. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ తరగతులకు చెందిన షేర్లలో ఈ పథకం పెట్టుబడి పెడుతుంది. ఇది మల్టీక్యాప్ పథకం కాబట్టి, ఒక్కో తరగతికి చెందిన షేర్లకు కనీసం 25 శాతం చొప్పున నిధులు కేటాయిస్తుంది.. పోర్ట్‌ఫోలియో నిర్మాణం, నిర్వహణకు 'బాటమ్-అప్ ఇన్వెస్ట్‌మెంట్' విధానాన్ని అనుసరిస్తారు. మార్కెట్ హెచ్చుతగ్గులను తట్టుకొని లాభాలు ఆర్జించే విధంగా దీనికి రూపకల్పన చేసినట్లు యూటీఐ మ్యూచువల్ ఫండ్ పేర్కొంది. ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 13. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.1,000 పెట్టుబడి పెట్టాలి. 'నిఫ్టీ 500 మల్టీక్యాప్ 50:25:25 టీఆర్ఐ' సూచీ ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంటుంది. రెగ్యులర్, డైరెక్ట్ ప్లాన్, గ్రోత్ ఆప్షన్ ఉన్నాయి. **ఫండ్ మేనేజర్ కార్తీక్ రాజ్ లక్ష్మణన్.**

వెండి కొనాలంటే

వెండి, బంగారం ధరలు మండిపోతున్నాయి. ఏడాది కాలంలో ఈ లోహాలపై పెట్టిన పెట్టిన పెట్టుబడి లాభాలు పండించింది. వెండి, బంగారం ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందనే అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో వెండిపై పెట్టుబడి పెట్టే అవకాశాన్ని కల్పిస్తూ డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఒక ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్)ను తీసుకొచ్చింది. **డీఎస్‌పీ సిల్వర్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్** అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 9. కనీసం రూ.100 పెట్టుబడి పెట్టాలి. ఈ పథకం కింద సేకరించిన నిధులను డీఎస్‌పీ సిల్వర్ ఈటీఎఫ్ యూనిట్లలో పెట్టుబడి పెడతారు.

ఇంటర్నెట్ వ్యవస్థలో...

ఎడిల్‌వైజ్ మ్యూచువల్ ఫండ్ ఒక ఆసక్తికరమైన పథకాన్ని రూపొందించింది. అదే **ఎడిల్‌వైజ్ బీఎస్ఈ ఇంటర్నెట్ ఎకానమీ ఇండెక్స్ ఫండ్.** దాదాపు 11 విభాగాలకు చెందిన కంపెనీలపై ఈ పథకం పెట్టుబడి పెడుతుంది. ఇ-రిటైల్, ఇంటర్నెట్, ఇ-లెర్నింగ్, డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్, ఫైనాన్షియల్ టెక్నాలజీస్ తదితర విభాగాలకు చెందిన కంపెనీలు ఇందులో ఉంటాయి. బీఎస్ఈ ఇంటర్నెట్ ఎకానమీ ఇండెక్స్ ఆధారిత తొలి పథకం ఇదే కావడం గమనార్హం. ఈ నెల 9 వరకూ ఎన్ఎఫ్ఓ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.100. ఎంతో వేగంగా మారుతూ ఉండే ఇంటర్నెట్ టెక్నాలజీకి చెందిన కంపెనీలపై పెట్టుబడి పెట్టే పథకం కాబట్టి, ఇందులో నష్టభయం కాస్త అధికంగానే ఉంటుంది. అదే సమయంలో ప్రతిఫలమూ ఎక్కువే ఉండొచ్చు. **ఈ పథకానికి ఫండ్ మేనేజర్లు భవేష్ జైన్, భరత్ లాహోటి.**

బ్యాంకుకు వెళ్లండి

ఆర్‌బీఐ రెపో రేటును రెండు సార్లు 0.25 శాతం చొప్పున తగ్గించింది. దీన్ని బ్యాంకులు రుణగ్రహీతలకు బదిలీ చేయాల్సి ఉంటుంది. కొన్ని బ్యాంకులు తమ రెపో ఆధారిత వడ్డీ రేటును తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. మరికొన్ని ఈ విషయంలో ఎలాంటి ప్రకటనా చేయలేదు. అర శాతం వడ్డీ తగ్గిన నేపథ్యంలో మీ గృహరుణాన్ని ఒకసారి పరిశీలించండి. బ్యాంకు వడ్డీ రేటును తగ్గించిందా తెలుసుకోండి. మీ రుణం ఆన్‌లైన్ ఖాతాలోకి వెళ్తే వివరాలు తెలిసిపోతాయి. గతంలో ఉన్న వడ్డీ, ప్రస్తుతం ఎంత వర్తిస్తోందో చూడొచ్చు. ఒకవేళ వివరాలు తెలియకపోతే మీ బ్యాంకును సంప్రదించండి. కొన్నిసార్లు మీ క్రెడిట్ స్కోరు కారణంగా వడ్డీ తగ్గకపోవచ్చు. లేదా కొంత రుసుము చెల్లించాల్సి రావచ్చు. సాధ్యమైనంత తొందరగా వడ్డీ రేటును తగ్గించుకునే ప్రయత్నం చేయండి.

భవిష్యత్తు సురక్షితంగా

మార్గదర్శి

మాకు ఇటీవలే వివాహం అయ్యింది. ఇద్దరమూ ఉద్యోగులమే. అన్ని ఖర్చులూ పోను నెలకు రూ.30వేల వరకూ పెట్టుబడి పెట్టాలనే ఆలోచనతో ఉన్నాం. భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ఎలాంటి ఆర్థిక ప్రణాళిక ఉండాలి? - నరేందర్

మీరు కొత్త జంట కాబట్టి, ఆర్థిక విషయాల్లో ఇద్దరూ జాగ్రత్తగా ఉండాలి. ముందుగా ఇంటి బడ్జెట్‌పైన దృష్టి పెట్టండి. రాబోయే రెండేళ్లలోపు వచ్చే ఖర్చులను అంచనా వేయండి. వార్షిక సంపాదనకు కనీసం 10 రెట్ల వరకూ టర్మ్ పాలసీ తీసుకోండి. మీ యాజమాన్యాలు అందిస్తున్న ఆరోగ్య బీమా ఉన్నప్పటికీ.. సొంతంగా రూ.5లక్షల ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీని ఎంచుకోండి. కొన్ని కారణాల వల్ల ఒకరు కొన్నాళ్లు ఉద్యోగం మానేయాల్సి వచ్చినా ఇబ్బంది లేకుండా ఆర్థిక ప్రణాళిక రచించుకోవాలి. రెండు మూడేళ్లలోపు అవసరాలకు సురక్షితమైన పెట్టుబడి పథకాల్లో మదుపు చేయండి. నాలుగైదేళ్లకు మించిన లక్ష్యాల కోసం డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానం ద్వారా మదుపు చేయండి. డబ్బు విషయంలో ఏదైనా నిర్ణయం తీసుకునేటప్పుడు ముందుగా మీరిద్దరూ మాట్లాడుకోండి. దీనివల్ల బాధ్యత పెరుగుతుంది. అప్పుడే మీ భవిష్యత్తు ఆనందంగా, సురక్షితంగా ఉంటుంది.

నేను కెనడాలో ఉంటున్నాను. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నప్పుడు సిప్ ద్వారా కొన్ని ఫండ్ పథకాల్లో మదుపు చేశాను. మూడేళ్ల క్రితం వాటిలో పెట్టుబడులు ఆపేశాను. ఇప్పుడు వాటిని తిరిగి కొనసాగించొచ్చా? - జగదీశ్

హైదరాబాద్‌లో ఉన్నప్పుడు రెసిడెంట్ ఇండియన్‌గా కేవైసీ పూర్తి చేసి ఉంటారు. ఇప్పుడు ఎన్ఆర్ఐ కాబట్టి, కేవైసీని మళ్లీ పూర్తి చేయాలి. పొదుపు ఖాతానూ ఎన్ఆర్ఓ ఖాతాగా మార్చుకోవాలి. మ్యూచువల్ ఫండ్ సంస్థల దగ్గరా బ్యాంకు ఖాతాను మార్చుకోండి. అమెరికా, కెనడా దేశాల్లో ఉన్న వారికి అన్ని మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసే అవకాశం ఉండదు. కేవలం 8-10 సంస్థలు మాత్రమే ఈ అవకాశాన్ని కల్పిస్తున్నాయి. మీ ఫండ్లను ఒకసారి పరిశీలించి, అందులో పెట్టుబడి పెట్టేందుకు వీలుందా చూసుకోండి. లేకపోతే యూనిట్లను విక్రయించి, అనుమతించే ఫండ్లలో మదుపు చేయండి.

- తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

ఆర్థిక విషయాల్లో మీ సందేహాలను siri@eenadu.net కు మెయిల్ చేయండి.

క్రెడిట్ స్కోరు కాపాడుకోండి

వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో కాస్త తక్కువ వడ్డీ రేటుకే రుణాలు తీసుకోవాలంటే.. 750కి మించి క్రెడిట్ స్కోరు ఉండాల్సిందే. మనకు రుణం ఇచ్చే బ్యాంకు మన ఆర్థిక విషయాల గురించి వీలైనంత ఎక్కువగా తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తుంది. ఇందుకు ఉపయోగపడేదే క్రెడిట్ స్కోరు. రుణాల చెల్లింపుల చరిత్ర సరిగా లేకపోవడం, క్రెడిట్ స్కోరు తగ్గడంలాంటి వాటి వల్ల రుణాలు రావడం కష్టం అవుతుంది. కాబట్టి, ఎట్టి పరిస్థితుల్లోనూ మన స్కోరు పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.



★ అవసరానికి డబ్బు చేతిలో లేనప్పుడు అప్పు తీసుకోవడం తప్పదు. గృహ, వాహన రుణాలు మన జీవన ప్రమాణాలు పెంచుతాయి. గృహోపకరణాల కొనుగోలు, విహార యాత్రలు, ఆరోగ్య అత్యవసరంలోనూ కొన్నిసార్లు రుణం తీసుకోవడం సర్వసాధారణమే. మితి మీరితే ఏదైనా అనర్థమే. అప్పుల విషయంలోనూ ఇదే సూత్రం వర్తిస్తుంది.

★ కొత్తగా అప్పు తీసుకునే వారికి బ్యాంకుతో ఎలాంటి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామనే విషయంలో అంతగా అవగాహన ఉండదు. కేవలం 10 నిమిషాల్లోనే రుణం, ఏదైనా వస్తువుల కొనుగోలుకు క్షణాల్లోనే రుణం మంజూరు ఇలాంటివి చాలామందిని ఆకర్షిస్తుంటాయి. ఇది రుణం తీసుకున్నట్లు కాదని అనుకుంటారు కొందరు. కానీ, బ్యాంకులు మీకు ఒక రూపాయి ఇచ్చినా అది రుణమేనని మర్చిపోవద్దు. దీని గురించి క్రెడిట్ బ్యూరోలకు చెబుతాయని గుర్తుంచుకోండి. ఇప్పటి వరకూ ఎలాంటి రుణాలూ తీసుకోని వారికి స్కోరు ఉండకపోవచ్చు. కానీ, ఒకసారి అప్పు చేశాక దాన్ని సరిగా చెల్లించలేదనుకోండి.. అప్పుడు క్రెడిట్ స్కోరు తగ్గడమే కాకుండా.. ఆ వివరాలన్నీ మీ రుణ నివేదికలో ఉండిపోతాయి. గతంలో బ్యాంకులు నెలకోసారి రుణగ్రహీల వివరాలను క్రెడిట్ బ్యూరోలకు ఇచ్చేవి. ఇప్పుడు 15 రోజులకోసారి తాజా వివరాలను అందిస్తున్నాయి. రుణగ్రహీతలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని ఇది కల్పిస్తోంది. మీ ఆర్థిక క్రమశిక్షణ గురించి బ్యాంకులు అంచనా వేసేందుకు ఈ స్కోరు ఉపయోగపడుతుందనే విషయంలో ఎలాంటి సందేహాలూ వద్దు.

★ చేతిలో డబ్బు లేకున్నా ఒక వస్తువును కొనేందుకు సిద్ధం అవుతుంటారు చాలామంది. రుణం సులభంగా రావడమే ఇందుకు కారణం. ఇలాంటి అప్పు చేస్తున్నప్పుడు గుర్తు పెట్టుకోవాల్సింది ఒకటే.. తీసుకున్న అప్పును సకాలంలో తీర్చగలరా? లేదా? ఇబ్బందేమీ లేదు అనుకున్నప్పుడే రుణంతో వస్తువును కొనండి.

★ కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి వెంటనే అప్పులు ఇచ్చేందుకు బ్యాంకులు/ఆర్థిక సంస్థలు సిద్ధంగా ఉంటాయి. కానీ, తొందరపడకూడదు. సంపాదిస్తున్నాం అంటే అప్పులు చేయమని అర్థం కాదు. రుణం తీసుకొని, ఖర్చు చేసి, ఆ తర్వాత దానికి వాయిదాలు చెల్లిస్తూ ఉంటే ఎప్పటికీ ఆర్థిక స్వేచ్ఛ సాధ్యం కాదు. అనివార్య పరిస్థితులు ఎదురై, ఈఎంఐ చెల్లించలేకపోతే.. స్కోరు తగ్గిపోతుంది. కొత్త రుణం తీసుకోవాలంటే అధిక వడ్డీ తప్పదు.

★ రుణం తీసుకునేటప్పుడు ఎంత ఆసక్తి చూపిస్తామో.. దాన్ని తీర్చే విషయంలోనూ అంతే బాధ్యతగా ఉండాలి. వాయిదా చెల్లించాల్సిన తేదీకి ఒక్క రోజు మించినా రుణ నివేదికలో అది నమోదవుతుంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

★ ఒకసారి రుణం తీసుకున్న తర్వాత క్రెడిట్ స్కోరు, నివేదికను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ మీ స్కోరు 750కి తగ్గకుండా కాపాడుకోవాలి. మీ స్కోరు విషయంలో ఏదైనా తేడా వచ్చినట్లు గమనిస్తే వెంటనే ఆ విషయాన్ని క్రెడిట్ బ్యూరోలతోపాటు, బ్యాంకు దృష్టికీ తీసుకెళ్లాలి.

ఆదాయానికి మించిన ఖర్చులుంటే అప్పులు చేయాల్సి వస్తుంది. క్రెడిట్ కార్డు వినియోగం ఎప్పుడూ పరిమితిలో 30-40 శాతానికి మించి ఉండొద్దు. అప్పుడే స్కోరు పెరిగేందుకు వీలవుతుంది.

పొదుపు సరిపోదు.. పెట్టుబడులు కావాలి

జీవితంలో ప్రతి అవసరమూ డబ్బుతోనే ముడిపడి ఉంటుంది. ఉద్యోగం, వ్యాపారం ద్వారా ఆర్జిస్తున్నన్ని రోజులు ఎలాగో అలా అవసరాలు తీర్చుకుంటున్నా.. ఆ క్రమం తప్పని ఆదాయం ఆగిపోయిన రోజున ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితి రాకుండా ముందు నుంచే జాగ్రత్తగా ఉంటే మేలు కదా! భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని పెట్టుబడి ప్రణాళికలను రూపొందించుకోవడం ఎప్పుడూ అవసరమే. ఆ పెట్టుబడులను ఎంత తొందరగా ప్రారంభించామన్నదీ ముఖ్యం. ఇలా దాచిన సొమ్ముతో క్రమం తప్పని ఆదాయానికి బాటలు వేసుకోవాలి. అది ఎలాగో చూద్దాం.

ఎంత పొదుపు?

సంపాదించిన డబ్బులో నుంచి ఎంత పొదుపు చేయాలనే సందేహం చాలామందిలో ఉంటుంది. దీనికి ఒక ప్రామాణిక సూత్రాన్ని చెబుతుంటారు ఆర్థిక నిపుణులు. మీరు సంపాదించిన మొత్తంలో కచ్చితంగా 30 శాతం పొదుపు చేయాలి. పొదుపు చేసిన మొత్తాన్ని బ్యాంకు ఖాతాలోనే ఉంచుకుంటే నష్టమే. ఈ మొత్తాన్ని పెట్టుబడులకు కేటాయించాలి. ఇప్పుడిప్పుడే సంపాదన ప్రారంభించిన వారికి ఆదాయం అంతగా ఉండకపోవచ్చు. కాబట్టి, వారికి కొంత మినహాయింపు ఉంటుంది. ఇలాంటి వారు తమ సంపాదనలో కొన్నాళ్లపాటు ఎంత మిగులుతుందో చూసుకోవాలి. అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. అవసరమైన బీమా పాలసీలను తీసుకోవాలి. ఉద్యోగంలో చేరిన రోజు నుంచీ కనీసం 10 శాతమైనా పెట్టుబడులకు మళ్లించడం మంచిది.

వైవిధ్యంగా.. నష్టపోకుండా

మొత్తం పెట్టుబడిని ఒకే పథకంలో పెట్టడం ఆర్థికంగా సురక్షితం కాదు. పెట్టుబడులు ఎప్పుడూ వైవిధ్యంగా ఉండాలి. నష్టభయం ఉన్న పథకాలతోపాటు.. తక్కువ రాబడినిచ్చినా కష్టార్జితానికి కాస్త రక్షణ ఇచ్చేవీ మన జాబితాలో ఉండాలి. ఉదాహరణకు ఒక షేరులో మదుపు చేసినప్పుడు రెండేళ్లలో రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. మొత్తం నష్టపోయే ప్రమాదమూ ఉంటుంది. అదే డెట్ ఫండ్లలో రాబడి తక్కువగా ఉంటుంది. వార్షిక సగటు రాబడి 8 శాతం వరకూ అంచనా వేయొచ్చు. వైవిధ్యంగా పెట్టుబడి పథకాల ఎంపిక ఉండాలనేది ఇందుకే. ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే.. మరీ ఎక్కువ వైవిధ్యమూ నష్టాన్ని కలిగిస్తుంది. ఒకే సమయంలో ఆరేడు పథకాలకు మించి ఎంపిక చేసుకోవద్దు. ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు, ప్రభుత్వ, కార్పొరేట్ బాండ్లు, స్థిరాస్తి, బంగారం ఇలా వైవిధ్యమైన పథకాల్లో పెట్టుబడులు ఉండాలి. ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ లేని పథకాల్లో అధిక వడ్డీ ఆశతో మదుపు చేయొద్దు. ఇలాంటి వాటిల్లో మోసపోయే అవకాశాలే ఎక్కువ. వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

రాబడి పెరిగేలా..

గతంతో పోలిస్తే ఇప్పుడు పెట్టుబడి విధానాల్లో చాలా మార్పులు వస్తున్నాయి. సాంకేతికత సహాయం తీసుకొని, పెట్టుబడులు పెట్టేందుకు వీలుంటోంది. దీంతోపాటు పలు సంస్థలూ పూర్తి డిజిటల్ విధానంలోనే ఆర్థిక సేవలను అందిస్తున్నాయి. వీటన్నింటిపైనా అవగాహన పెంచుకోవాలి. పథకాలను అర్థం చేసుకునేందుకూ ప్రయత్నం చేయాలి. అప్పుడే మంచి రాబడి అందుకునేలా పెట్టుబడులు పెట్టేందుకు సాధ్యమవుతుంది.

లక్ష్య సాధనలో..

పిల్లల చదువులు, పదవీ విరమణ తర్వాత అవసరాల కోసం స్థిరంగా ఆదాయం ఉండాలని చాలామంది కోరుకుంటారు. అదే సమయంలో కొన్ని స్వల్పకాలిక అవసరాలకూ డబ్బు అవసరం ఉంటుంది. కారు కొనడం, విహార యాత్రలకు వెళ్లడం, ఇల్లు కొనడంలాంటి కోరికలూ ఉంటాయి. కాబట్టి, పెట్టుబడులు ఎప్పుడూ దీర్ఘకాలం కోసమే అనుకోవద్దు. 3-5 ఏళ్ల వ్యవధి కోసమూ మదుపు చేయాలి. ఇలాంటప్పుడు డెట్ పథకాలను పరిశీలించాలి. 7-10 ఏళ్లకు మించి వ్యవధి ఉన్నప్పుడే ఈక్విటీ పథకాల వైపు దృష్టి సారించాలి.

కష్టమేమీ కాదు..

చిన్న మదుపరులు క్రమం తప్పకుండా క్రమశిక్షణతో మదుపు చేసేందుకు ఉన్న మార్గాల్లో మ్యూచువల్ ఫండ్లు ఒకటి. ఇందులోనూ క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా పెట్టుబడి పెట్టడం దీర్ఘకాలంలో ప్రయోజనం చేకూరుస్తుంది. కరోనా తర్వాత నుంచి భారతీయ స్టాక్ మార్కెట్లు ఆకర్షణీయమైన లాభాలను అందించినట్లు మనం చూడొచ్చు. మధ్యలో కొన్ని హెచ్చుతగ్గులు వచ్చినా వాటి ప్రభావం దీర్ఘకాలిక మదుపరులపై తక్కువగానే ఉంది. పూర్తి సురక్షిత పథకాల్లో ఇప్పుడు వడ్డీ తక్కువగా అందుతోంది. ద్రవ్యోల్బణాన్ని తట్టుకోవాలంటే వీటితో సాధ్యం కాదు. దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకూ ఇవి అంతగా తోడ్పడవు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని, అందుకు అనువైన మొత్తాన్ని క్రమానుగత పెట్టుబడి విధానంలో మదుపు చేస్తూ వెళ్లమే సరైన వ్యూహం.

రాబోయే రోజుల్లోనూ ఈక్విటీ ఫండ్ల నుంచి సగటున 12-15 శాతం వరకూ వార్షిక రాబడిని అంచనా వేయొచ్చు. ఇప్పటి నుంచి ఒక వ్యక్తి నెలకు రూ.10వేల చొప్పున మ్యూచువల్ ఫండ్‌లో క్రమానుగత పెట్టుబడి విధానంలో 20 ఏళ్లపాటు మదుపు చేస్తారని అంచనా వేసుకుందాం. 20 ఏళ్లలో మొత్తం పెట్టుబడి రూ.24 లక్షలు అవుతుంది. దీనిపై సగటు వార్షిక రాబడి 15 శాతం అంచనా వేసుకుంటే.. రూ.1.5 కోట్ల నిధి జమ అయ్యేందుకు అవకాశం ఉంది. పెట్టుబడిని 20 ఏళ్లకు బదులుగా 25 ఏళ్లకు పొడిగిస్తే.. రూ.3.3 కోట్లు జమ కావచ్చు.

మ్యూచువల్ ఫండ్లలో సిప్ ఒక్కటే కాకుండా.. ఏక మొత్తంలోనూ అప్పుడప్పుడూ పెట్టుబడి పెట్టే విషయాన్ని పరిశీలించాలి. అనిశ్చితి అధికంగా ఉండే ఈక్విటీ మార్కెట్లో ఇలా చేయడం వల్ల కాస్త నష్టభయం ఉండే అవకాశం ఉంది. కానీ, మార్కెట్ తగ్గినప్పుడల్లా కొంత పెట్టుబడి పెట్టడం వల్ల మంచి ఫలితాలే వస్తాయి. ఒకేసారి పెట్టుబడి కోసం హైబ్రిడ్ ఫండ్లు, బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లను పరిశీలించవచ్చు.



ఈనాడు బిజినెస్

ఎవ్రెన్‌కు 100 మి.డాలర్ల పెట్టుబడి

ఈనాడు, హైదరాబాద్: పునరుత్పాదక ఇంధన వనరుల విభాగానికి చెందిన ఎవ్రెన్ అనే సంస్థ తన విస్తరణ అవసరాల కోసం 100 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.850 కోట్ల) పెట్టుబడిని దక్కించుకుంది. ఎవ్రెన్‌ను బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ ఎనర్జీ అనే సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. ఈ సంస్థ రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 11 మెగావాట్ల సామర్థ్యం కల పవన, సౌర, బ్యాటరీ స్టోరేజీ ప్రాజెక్టులు అమలు చేస్తోంది. ఇప్పుడు సమీకరించిన 100 మిలియన్ డాలర్ల నిధులను ఈ ప్రాజెక్టుల కోసం కేటాయించనున్నట్లు ఎవ్రెన్ వెల్లడించింది.

కాగ్నిజెంట్‌లో 20,000 నియామకాలు

దిల్లీ: ప్రస్తుత సంవత్సరంలో 20,000 మంది ఫ్రెషర్లను నియమించుకోవాలని భావిస్తున్నట్లు కాగ్నిజెంట్ సీఈఓ రవి కుమార్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువని వెల్లడించారు. అలాగే 14,000 మంది మాజీ ఉద్యోగులు తిరిగి కంపెనీలో చేరినట్లు కాగ్నిజెంట్ తెలిపింది. మరో 10,000 మంది కూడా చేరే అవకాశం ఉందని పేర్కొంది.

2025 ఆదాయ వృద్ధి అంచనాలు పెంపు: జనవరి-మార్చి త్రైమాసికానికి కాగ్నిజెంట్ 5.1 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ప్రకటించింది. 2024 ఇదే సమయంలోని 4.7 బి.డాలర్లతో పోలిస్తే 7.45% పెరిగింది. కాగ్నిజెంట్ జనవరి-డిసెంబరు ఆర్థిక సంవత్సరాన్ని పాటిస్తుంది. 2025 సంవత్సరానికి ఆదాయ వృద్ధి అంచనాలను 3.9-6.4 శాతానికి పెంచింది. ఇంతకుముందు 2.6-5.1% వృద్ధిని అంచనా వేసింది. 2025లో 20.5-21 బి.డాలర్ల ఆదాయం నమోదయ్యే అవకాశం ఉందని కాగ్నిజెంట్ తెలిపింది.

అవాంటెల్ రైట్స్ షేరు ధర రూ.40

ప్రతి 121 షేర్లకు 10 రైట్స్ షేర్లు

ఈనాడు, హైదరాబాద్: అవాంటెల్ లిమిటెడ్ రైట్స్ ఇష్యూ ప్రణాళికను ఖరారు చేసింది. ఈ సంస్థ రైట్స్ ఇష్యూ ద్వారా రూ.80.90 కోట్లు సమీకరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 2,02,26,100 షేర్లు జారీ చేస్తారు. ప్రస్తుత వాటాదార్లకు ప్రతి 121 షేర్లకు, 10 రైట్స్ షేర్లు లభిస్తాయి. అర్హత గల వాటాదార్లను నిర్ణయించడం కోసం ఈ నెల 7ను రికార్డు తేదీగా ప్రకటించారు. రైట్స్ షేరుకు రూ.40 ధర (రూ.2 ముఖ విలువ, రూ.38 ప్రీమియం) నిర్ణయించారు. రైట్స్ ఇష్యూ ఈ నెల 15న ప్రారంభమై 22న ముగుస్తుందని కంపెనీ వెల్లడించింది.

వాణిజ్య సిలిండర్ ధర తగ్గింది

హైదరాబాద్: హోటళ్లు, రెస్టారెంట్లు వినియోగించే వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర తగ్గింది. దీంతో హైదరాబాద్‌లో 19 కిలోల వాణిజ్య సిలిండరు ధర రూ.18 తగ్గి రూ.1,987 నుంచి రూ.1,969కు చేరింది. ముంబయిలో రూ.1747.50కి, దిల్లీలో రూ.1,699కి పరిమితమైంది. ఇంట్లో వాడే సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పూ లేదు.

కోడి గుడ్లు
2న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	435	గోదావరి	440
వరంగల్	437	విశాఖపట్నం	445
విజయవాడ	460	చిత్తూరు	513

రూ.8,50,000 కోట్లకు దేశీయ మీడియా, వినోద పరిశ్రమ

వచ్చే దశాబ్దకాలంలో చేరుతుంది: ముకేశ్ అంబానీ



ముంబయి: రాబోయే దశాబ్దకాలంలో భారత మీడియా, వినోద పరిశ్రమ పరిమాణం మూడింతలకు పైగా పెరిగి 100 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.8,50,000 కోట్లు) చేరగలదని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఛైర్మన్ ముకేశ్ అంబానీ తెలిపారు. లక్షల సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా.. ఈ పరిశ్రమ వృద్ధి ప్రభావం ఇతర రంగాలపై వ్యాపిస్తుందని అభిప్రాయపడ్డారు. భారత్‌లో దిగ్గజ మీడియా సంస్థల్లో ఒకటైన నెట్‌వర్క్ 18తో పాటు పలు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, వినోద చానళ్లు, కంటెంట్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఆర్ఐఎల్ గ్రూప్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రపంచ వినోద రంగానికి ముఖ్య కేంద్రంగా అవతరించేందుకు కూడా భారత్‌కు ఎంతో సమయం లేదని గురువారమిక్కడ జరిగిన 'వేవ్స్ 2025' సదస్సులో అంబానీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించాక.. దేశ మీడియా, వినోద రంగం ప్రపంచంలోనే అగ్రగామిగా అవతరించగలదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంకా ఏమన్నారంటే..


✤ ప్రస్తుత భారత మీడియా, వినోద పరిశ్రమ విలువ 28 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.2,40,000 కోట్లు) ఉంది. వచ్చే దశాబ్దంలోపే 100 బిలియన్ డాలర్లకు పైగా పెరిగే సామర్థ్యం ఈ పరిశ్రమకు ఉంది. మరింత మంది వ్యాపారాల్లోకి అడుగుపెట్టేందుకు, లక్షల ఉద్యోగాల సృష్టికి ఈ వృద్ధి దారి చూపుతుంది.

✤ డిజిటల్ రంగంలో భారత్ అగ్రగామిగా అవతరించింది. కథ సృష్టి సామర్థ్యం, డిజిటల్ సాంకేతికతల కలయిక భారత్‌కు మాత్రమే సొంతం. కృత్రిమ మేధ, డిజిటల్ సాంకేతికతలు మన కథలను మునుపెన్నడూ లేనంతగా మరింత ఆసక్తిగా మార్చగలవు. వివిధ భాషలు, దేశాలు, సంస్కృతులకు చెందిన ప్రేక్షకుల చెంతకు వేగంగా కూడా తీసుకెళ్లగలవు. ఈ కొత్త సాంకేతికతలను ఆయుధంగా మల్చుకొని మన దేశంలోని అత్యుత్తమ నైపుణ్యమున్న యువ సృజనకారులు బ్లాక్‌బస్టర్‌లతో ప్రపంచ వినోద పరిశ్రమను ఏలుతారు.

✤ 5000 ఏళ్లకు పైగా నాగరిక చరిత్ర కలిగిన మనకు రామాయణం, మహాభారతం లాంటి ఇతిహాసాల దగ్గర నుంచి డజనుకు పైగా భాషల్లో జానపద సాహిత్య సంపద ఉంది. అవి ప్రపంచంలోని ప్రజల హృదయాలను స్పృశిస్తాయి. సోదరభావం, కరుణ, ధైర్యం, ప్రేమ, సౌందర్యం, ప్రకృతి, సంరక్షణ లాంటి మానవీయ విలువలను అవి తెలియజేస్తుండటమే ఇందుకు కారణం.

✤ కథలను సృష్టించే సామర్థ్యంలో ఏ దేశమూ భారత్‌కు సాటి రాదు. అవధులు లేని విశ్వాసం, సృజనాత్మకతతో మన కథలను ప్రపంచానికి పరిచయం చేయాలి.

శత్రువులపై పోరాటానికి పూర్తి మద్దతు: పహల్గామ్ ఉగ్రదాడిపై ముకేశ్ అంబానీ స్పందిస్తూ.. 'శాంతి, న్యాయం, మానవత్వానికి శత్రువులైన వారిపై చేస్తున్న పోరాటంలో ప్రధాని మోదీకి 145 కోట్ల మంది భారతీయుల పూర్తి మద్దతు ఉంద'న్నారు.



నాట్కో ఫార్మాకు ఉత్తమ యాజమాన్య అవార్డు

ఐటీసీ, గ్రాన్యూల్స్, వీఎస్‌టీ, సుప్రీం ఇండస్ట్రీస్‌కు కూడా



దాన కిషోర్ నుంచి ఉత్తమ యాజమాన్య అవార్డు అందుకుంటున్న నాట్కో ఫార్మా మానవ వనరుల విభాగం అధిపతి లక్ష్మీనారాయణ

ఈనాడు, హైదరాబాద్: నాట్కో ఫార్మాకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ యాజమాన్య అవార్డు లభించింది. మే డే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డులు అందజేసింది. నాట్కో ఫార్మా మానవ వనరుల విభాగం అధిపతి ఎ.లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ నుంచి ఈ అవార్డు అందుకున్నారు. ఇదే విధంగా ఉత్తమ యాజమాన్య అవార్డులను తెలంగాణ ప్రభుత్వం నుంచి ఐటీసీ లిమిటెడ్ పేపర్‌బోర్డ్స్ అండ్ స్పెషాలిటీ పేపర్స్ డివిజన్, గ్రాన్యూల్స్ ఇండియా, హిందువేర్ లిమిటెడ్, వీఎస్‌టీ ఇండస్ట్రీస్, క్రియేటివ్ స్పైక్/టెక్స్‌పోర్ట్ స్ట్రక్చర్స్, సుప్రీం ఇండస్ట్రీస్.. తదితర కంపెనీలు అందుకున్నాయి. దీంతో పాటు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, భీమ్‌బాయి ఆదివాసీ మహిళా సహకార సంఘం, నిర్మల్ టాయ్స్ అండ్ ఆర్ట్స్ ఇండస్ట్రియల్ కో-ఆపరేటివ్ సొసైటీలకు కూడా ఉత్తమ యాజమాన్య అవార్డులు లభించాయి.

రికార్డు గరిష్ఠానికి జీఎస్‌టీ వసూళ్లు

ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లు



దిల్లీ: ఈ ఏడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ స్థూల వసూళ్లు జీవనకాల గరిష్ఠమైన రూ.2.37 లక్షల కోట్లకు చేరాయి. 2024 ఏప్రిల్ వసూళ్లయిన రూ.2.10 లక్షల కోట్లతో పోలిస్తే, ఇది 12.6% అధికం. జీఎస్‌టీ విధానం అమల్లోకి వచ్చాక.. ఒక నెలకు సంబంధించి అత్యధిక వసూళ్లు గత నెలలోనే నమోదయ్యాయి. 2025 మార్చిలో జీఎస్‌టీ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లుగా ఉన్నాయి.

✦ ఏప్రిల్‌లో దేశీయ లావాదేవీల ద్వారా జీఎస్‌టీ ఆదాయం 10.7% పెరిగి రూ.1.9 లక్షల కోట్లుగా నమోదైంది. వస్తువుల ఎగుమతుల ద్వారా ఆదాయం 20.8% అధికమై రూ.46,913 కోట్లకు చేరింది. స్థూలంగా వసూలైన రూ.1.9 లక్షల కోట్లలో కేంద్ర జీఎస్‌టీ రూ.48,634 కోట్లు కాగా.. రాష్ట్రాల జీఎస్‌టీ రూ.59,372 కోట్లు, సమ్మిళిత జీఎస్‌టీ రూ.69,504 కోట్లుగా నమోదైంది. సెస్సు రూపేణా రూ.12,293 కోట్లు వచ్చాయి. మొత్తం రిఫండ్‌లు 48.3% పెరిగి రూ.27,341 కోట్లకు చేరాయి. రిఫండ్‌ల సర్దుబాటు అనంతరం.. ఏప్రిల్‌లో నికర జీఎస్‌టీ ఆదాయం రూ.2.09 లక్షల కోట్లుగా తేలింది. 2024 ఇదే నెలతో పోలిస్తే ఇది 9.1% ఎక్కువ. బలమైన ఆర్థిక కార్యకలాపాలను ఏప్రిల్ వసూళ్లు ప్రతిబింబిస్తున్నాయని డెలాయిట్ ఇండియా పార్టనర్ ఎంఎస్ మణి తెలిపారు.

నిన్న మార్కెట్లు పని చేయలేదు
మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా నిన్న (గురువారం) స్టాక్, మనీ, కమొడిటీ, డెరివేటివ్స్ మార్కెట్లు పని చేయలేదు.

మారుతీ, మహీంద్రా వాహన విక్రయాలు పెరిగాయ్

డీలా పడిన టాటా మోటార్స్, హ్యుందాయ్

దిల్లీ: మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) వాహన విక్రయాలు ఏప్రిల్‌లో పెరిగాయి. టాటా మోటార్స్, హ్యుందాయ్ మోటార్ విక్రయాలు తగ్గాయి. మారుతీ తన అగ్ర స్థానాన్ని నిలబెట్టుకుంది. దేశీయంగా ప్రయాణికుల వాహనాలు, తేలికపాటి వాణిజ్య వాహనం సూపర్ క్యారీల అమ్మకాలు 1% పెరిగి 1,42,053కు చేరాయి. మొత్తం ప్రయాణికుల వాహన దేశీయ విక్రయాలు 1,37,952 నుంచి స్వల్పంగా పెరిగి 1,38,704కు చేరాయి. చిన్న కార్ల విభాగంలో ఆల్టో, ఎస్-ప్రెసోల విక్రయాలు 11,519 నుంచి 6,332కు తగ్గాయి. కాంపాక్ట్ కార్ల విభాగంలో బాలెనో, సెలెరియో, డిజైర్, ఇగ్నిస్, స్విఫ్ట్, వ్యాగన్‌ఆర్‌ల విక్రయాలు 56,953 నుంచి 61,591కు పెరిగాయి. యుటిలిటీ వాహన విభాగంలో బ్రెజా, ఎర్టిగా, గ్రాండ్ విటారా, ఎక్స్‌ఎల్6 విక్రయాలు 56,553 నుంచి 59,022కు చేరాయి.

ఏప్రిల్‌లో వివిధ కంపెనీల వాహన టోకు విక్రయాలు

కంపెనీ	2025	2024	వృద్ధి (%)
మారుతీ సుజుకీ	1,79,791	1,68,089	7
ఎం అండ్ ఎం	84,170	70,731	19
టాటా మోటార్స్	72,753	77,521	−6
హ్యుందాయ్	60,774	63,701	−5
టయోటా	27,324	20,494	33
కియా ఇండియా	23,623	19,968	18
జేఎస్‌డబ్ల్యూ ఎంజీ	5,829	4,725	23
హోండా కార్స్	3,360	4,351	−23
టీవీఎస్ మోటార్	4,43,896	3,83,615	16
సుజుకీ మోటార్‌సైకిల్	1,12,948	99,377	14
రాయల్ ఎన్‌ఫీల్డ్	86,559	82,043	6
వీఈసీవీ	6,846	5,377	27

హైదరాబాద్‌లో ఆల్ట్.ఎఫ్ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: అంకురాలు, చిన్న, మధ్య తరహా సంస్థలకు పని స్థలాన్ని అందించే ఆల్ట్.ఎఫ్ కోవర్కింగ్ హైదరాబాద్‌లో తన తొలి కేంద్రాన్ని ప్రారంభించింది. 56,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1,200 సీట్లకు పైగా సామర్థ్యంతో దీన్ని ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న అంకురాలు, చిన్న వ్యాపార సంస్థల అవసరాలు తీర్చేలా



ఇది ఉంటుందని సంస్థ వెల్లడించింది. ఈ కేంద్రాన్ని భవిష్యత్తులో లక్ష చదరపు అడుగులకు విస్తరించి, 2,400 సీట్లకు సామర్థ్యానికి చేరుకుంటామని పేర్కొంది. దీంతోపాటు 2025 చివరి నాటికి కొత్తగా మూడు కేంద్రాలను తీసుకొస్తామని ఇందులో ఒకటి హైటెక్ సిటీలో ఉంటుందని ఆల్ట్.ఎఫ్ కోవర్కింగ్ సహ వ్యవస్థాపకుడు యోగేష్ అరోరా తెలిపారు. ఇవి 2 లక్షల చదరపు అడుగుల్లో 4,000కు పైగా సీట్లతో ఉంటాయని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా ఇకపై 28 ఆర్ఆర్‌బీలే

దిల్లీ: మే 1 నుంచి దేశవ్యాప్తంగా 700 జిల్లాల వ్యాప్తంగా 22,000కు పైగా శాఖలతో 28 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు(ఆర్ఆర్‌బీ) కార్యకలాపాలు నిర్వహిస్తాయని ఆర్థిక శాఖ తెలిపింది. 'ఒక రాష్ట్రం ఒక ఆర్ఆర్‌బీ' విధానం అమల్లోకి రావడమే ఇందుకు కారణం. ఈ విధానం కింద ఒక రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఒక్కటే ఆర్ఆర్‌బీ ఉండేలా.. 11 రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 26 ఆర్ఆర్‌బీలను ఏకీకరణ చేశారు. దీంతో దేశవ్యాప్తంగా ఆర్ఆర్‌బీల సంఖ్య 28కు తగ్గింది. దీని వల్ల ఆర్ఆర్‌బీలు మరింత సమర్థంగా సేవలు అందించేందుకు, ఆర్థిక పనితీరు మెరుగుపర్చుకునేందుకు వీలుంటుందని ఆర్థిక సేవల విభాగం తెలిపింది. అలాగే ఆర్ఆర్‌బీల మూలధన స్థాయులు పెరిగేందుకూ అవకాశం ఉండటంతో వాటి రుణాల వృద్ధికి అది దోహదం చేస్తుందని పేర్కొంది.

చైనాతో చర్చలకు అమెరికానే ఎదురుచూస్తోంది

బీజింగ్ మీడియా సంస్థ వెల్లడి

టారిఫ్‌లపై విస్తృత స్థాయి చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం చైనా అధికారులను సంప్రదించింది. ఈ విషయాన్ని బీజింగ్‌కు చెందిన ఓ మీడియా సంస్థ వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా సరఫరా వ్యవస్థలు దెబ్బతినకుండా ఈ చర్యలు చేపట్టినట్లు అభివర్ణించింది. ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే చైనా వస్తువులపై 145 శాతం సుంకాలు విధించింది. దీనికి ప్రతి స్పందనగా బీజింగ్ కూడా అగ్రరాజ్య వస్తువులపై 125 శాతం సుంకాలను విధించింది. ఈ నేపథ్యంలో అమెరికా అధికారులు వివిధ మార్గాల్లో చైనాను సంప్రదించినట్లు సీసీటీవీ పేర్కొంది. సంప్రదింపుల కోసం అమెరికానే ఆత్రుతతో ఎదురు చూస్తోందని వెల్లడించింది. ట్రంప్ కార్యవర్గం తీవ్ర ఒత్తిడిలో ఉందని చెప్పింది. ఈ విషయంపై చైనా విదేశాంగశాఖ నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు.

మరోవైపు చైనానే టారిఫ్‌లపై చర్చల కోసం తీవ్ర స్థాయిలో యత్నిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. బుధవారం కూడా ఆయన మాట్లాడుతూ ఒప్పందం కుదుర్చుకోవడానికి బలమైన అవకాశాలున్నాయని చెప్పారు. 'చర్చల్లో మా నిబంధనలకు లోబడే ఒప్పందం చేసుకోనున్నాం. అదే మంచిది' అని ఆయన న్యూస్‌నేషన్ టౌన్ హాల్ కార్యక్రమంలో వెల్లడించారు. దాదాపు వారం రోజుల క్రితం ట్రంప్ ఇటువంటి ప్రకటనే చేయగా.. చైనా బహిరంగానే ఖండించింది. నాడు బీజింగ్ ప్రతినిధి గువో జియాకున్ మాట్లాడుతూ 'ఇరు దేశాల మధ్య సంప్రదింపులు ఏమీ జరగడం లేదు. వాణిజ్య ఒప్పందం కుదరలేదు' అని చెప్పారు. భవిష్యత్తులో చర్చలకు సిద్ధమే అని చెప్పడం విశేషం.

నేటి బోర్డు సమావేశాలు: మారికో, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, గోద్రేజ్ ప్రోపర్టీస్, జిందాల్ సా, సిటీ యూనియన్ బ్యాంక్, వీ-మార్ట్

భారత జీడీపీ వృద్ధి 6.5-6.7 శాతం

2025-26పై డెలాయిట్ అంచనా



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26)లో భారత జీడీపీ వృద్ధి 6.5-6.7 శాతం మధ్య ఉండొచ్చని డెలాయిట్ అంచనా వేసింది. బడ్జెట్‌లో ప్రకటించిన పన్ను ఉపశమనంతో దేశీయ గిరాకీ పుంజుకోవచ్చని, అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులను తట్టుకోవచ్చని అభిప్రాయపడింది. 2024-25లో జీడీపీ వృద్ధి 6.3-6.5 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. వాణిజ్య సంబంధాల్లో వస్తున్న మార్పులు, దేశీయ వినియోగదారు గిరాకీని పెంచడానికి ప్రభుత్వ చర్యలు కీలకం కానున్నాయని డెలాయిట్ తన 'ఇండియా ఎకానమీ ఔట్‌లుక్'లో వెల్లడించింది. వినియోగదారు వ్యయాలను పెంచడమే లక్ష్యంగా 2025 బడ్జెట్‌లో అందించిన పన్ను ప్రోత్సాహకాలు సానుకూల ప్రభావం చూపుతాయని, ఇదే సమయంలో భారత ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులు ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించింది.

✦ మధ్యతరగతికి లబ్ధి చేకూర్చే విధంగా 2025-26 బడ్జెట్‌లో రూ.1 లక్ష కోట్ల విలువైన పన్ను మినహాయింపులను ప్రభుత్వం ప్రకటించింది. ఆదాయాలు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ.. వాటిని అధిక ఆర్థిక కార్యకలాపాలతో పూడ్చుకోనుంది. యువ జనాభా చేతిలో ఉండే ఆదాయంతో వినియోగం పెరుగుతుందని డెలాయిట్ ఇండియా ఆర్థికవేత్త రుమ్కి మజుందార్ అన్నారు. అమెరికాతో వీలైనంత త్వరగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని, వాణిజ్య సుంకాల కారణంగా భారత వృద్ధి 0.1-0.3% తగ్గొచ్చని తెలిపారు.

మరో 18 నెలల్లో మా కోడింగ్ పనంతా కృత్రిమ మేధదే

జుకర్‌బర్గ్ ఆసక్తికర వ్యాఖ్యలు



మరో 18 నెలల్లో తమ కంపెనీకి చెందిన కోడింగ్ పనంతా కృత్రిమ మేధ(ఏఐ)నే చేస్తుందంటూ మెటా సీఈఓ జుకర్‌బర్గ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆయన మెటాలో కృత్రిమ మేధ పాత్ర గురించి మాట్లాడుతూ 'ఏఐ ఇప్పటికే ఓ బృందంలో సభ్యుడిగా విధులు నిర్వహిస్తోంద'న్నారు. త్వరలోనే టాప్ కోడర్ల కంటే ఏఐ మెరుగ్గా పనిచేస్తుంద'ని తెలిపారు. బగ్‌లను కనుగొంటూ, అధిక-నాణ్యత కోడ్‌ను స్వతంత్రంగా రాయగలదని జుకర్‌బర్గ్ భావిస్తున్నారు. రానున్న 12-18 నెలల్లో తమ కంపెనీకి చెందిన లామా ప్రాజెక్ట్‌కు సంబంధించి చాలా వరకు కోడింగ్‌ను ఏఐయే పూర్తిచేస్తుందని అభిప్రాయపడ్డారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల సైతం తమ కంపెనీకి సంబంధించి 20-30% కోడ్‌ను ఏఐతోనే సృష్టిస్తున్నట్లు తెలిపిన సంగతి తెలిసిందే. నాణ్యత కోసం ఏఐ ఆధారిత టూల్స్‌పై ఆధారపడటం పెరుగుతోందన్నారు. గూగుల్ తన సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రూపొందించడానికి కృత్రిమ మేధపై ఎక్కువగా ఆధారపడుతోందని కంపెనీ సీఈఓ సుందర్ పిచాయ్ ఇప్పటికే వెల్లడించారు.

వచ్చే నెల నుంచి యూపీఐ లావాదేవీలు మరింత వేగంగా..



మనం ఎవరికైనా యూపీఐ పేమెంట్ చేశామనుకుందాం. ఆ లావాదేవీ విజయవంతంగా పూర్తవ్వడానికి కొంత సమయం పడుతుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేశాక 'సక్సెస్' అని సందేశం వస్తేనే దాన్ని దుకాణదారుడికి చూపించి వెళుతుంటాం. కొన్నిసార్లు ఇందుకు ఎక్కువ సమయమే వేచి చూడాల్సి వస్తుంటుంది. ఇకపై ఆ సమయం దాదాపు 50% మేర తగ్గనుంది. జూన్ 16 నుంచి సవరించిన సమయం అమల్లోకి రానుంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) తాజాగా ఓ సర్క్యులర్ జారీ చేసింది.

✦ ఎన్‌పీసీఐ తాజా ఆదేశాల ప్రకారం క్రెడిట్/డెబిట్‌కు సంబంధించిన లావాదేవీల సమయం కేవలం 15 సెకన్లలోనే పూర్తి కానుంది. ప్రస్తుతం ఇది 30 సెకన్లుగా ఉంది. ✦ ట్రాన్సాక్షన్ స్టేటస్, ట్రాన్సాక్షన్ రివర్సల్, అడ్రస్ వ్యాలిడేషన్ సమయం కూడా 30 సెకన్ల నుంచి 10 సెకన్లకు తగ్గనుంది. యూజర్ ఎక్స్‌పీరియన్స్‌ను మెరుగుపరిచేందుకే ఈ మార్పులు చేపట్టినట్లు ఎన్‌పీసీఐ పేర్కొంది. ✦ జూన్ 16 నుంచి రెస్పాన్స్ సమయం తగ్గేందుకు చర్యలు తీసుకోవాలని పేటీఎం, ఫోన్ పే వంటి పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, బ్యాంకులకు ఎన్‌పీసీఐ సూచించింది.

ఎఫ్ అండ్ ఓ మదుపర్లకు ఆప్టిట్యూడ్ పరీక్ష ఉండదు

స్పష్టం చేసిన సెబీ చీఫ్ తుహిన్ కాంత పాండే



ముంబయి: ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగంలో ట్రేడింగ్ చేయాలనుకునే రిటైల్ ట్రేడర్లకు ఆప్టిట్యూడ్ పరీక్ష నిర్వహిస్తారనే వార్తలను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అధిపతి తుహిన్ కాంత పాండే కొట్టిపారేశారు. ఇది అసాధ్యమని, నియంత్రణ సంస్థ పరిధికి మించిన విషయమని అన్నారు. డెరివేటివ్స్‌లో ఊహాగానాలకు అడ్డుకట్ట వేసేందుకు గతేడాది నవంబరులో సెబీ పలు నిబంధనలను తీసుకొచ్చింది. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో ప్రతి 10లో 9 మంది రిటైల్ మదుపర్లు నష్టపోతున్నారనే సెబీ అధ్యయనం నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది. ఎక్కువ నష్టముప్పు ఉండే ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో పాల్గొనేందుకు రిటైల్ మదుపర్లకు పరీక్షలు నిర్వహించొచ్చన్న వార్తలు ఈ మధ్య వచ్చాయి. అయితే అటువంటి ఆలోచన లేదని పీటీఐ ఇంటర్వ్యూలో పాండే స్పష్టం చేశారు.

మదుపర్లదే తుది నిర్ణయం: 'ముందుగా ఇది నియంత్రణ పరిధిని దాటుతుందా అనే అంశాన్ని చూడాలి. ఎంత మెరుగ్గా వీటిని చేపట్టగలమో ఆలోచించాలి. మార్కెట్ వర్గాల కోసం ఇప్పటికే కొన్ని సర్టిఫికేషన్ ప్రక్రియలు ఉన్నాయి. మన దగ్గర ఎన్ఐఎస్ఎం సర్టిఫికేషన్ చేసిన వారు ఉన్నారు. ఇదే విధంగా నమోదిత అడ్వైజర్‌గా లేదా ఐఏ లేదా ఆర్ఏగా కూడా నమోదవుతున్నారు. ప్రస్తుతం అంతకు మించిన వ్యవస్థలు అవసరం లేదని భావిస్తున్నాం. వ్యక్తిగత సొమ్ములను నిర్వహించే వారు సరైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ట్రేడింగ్‌ను నిరుత్సాహపరిచేందుకు చాలా చర్యలు చేపట్టాం. ఇక్కడ వ్యక్తుల నిర్ణయాలే కీలకం. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల ఇష్టాలకు విలువ ఇవ్వాల్సిందే' అని పాండే అన్నారు.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభం 7.5 రెట్లు

దిల్లీ: మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.3,845 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.450.58 కోట్ల నికర లాభంతో చూస్తే ఇది 7.5 రెట్లు అధికం. అదానీ విల్మర్‌లో వాటా విక్రయంతో రూ.3,286 కోట్లు రావడం ఇందుకు దోహదపడింది. వాటా విక్రయాన్ని తీసివేస్తే, నికర లాభం రూ.1,313 కోట్లుగా ఉంది.

అదానీ పోర్ట్స్ లాభంలో 50% వృద్ధి: గత ఆర్థిక సంవత్సరం (2024-25) నాలుగో త్రైమాసికంలో అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఏపీ సెజ్) రూ.3,025 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.2,015 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 50% ఎక్కువ. సమీక్షిస్తున్న త్రైమాసికంలో 15 పోర్టుల్లో కంపెనీ నిర్వహించిన కార్గో పరిమాణం 8% పెరిగి 118 మిలియన్ టన్నులకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరం (2024-25)లో కంపెనీ నికర లాభం 37% పెరిగి రికార్డు స్థాయిలో రూ.11,061 కోట్లుగా నమోదైంది. ఆదాయం రూ.31,079 కోట్లకు, కార్గో నిర్వహణ 7% పెరిగి 450 మి.టన్నులకు చేరింది.

ఎటెర్నల్ లాభం రూ.39 కోట్లు

దిల్లీ: ఆహార పదార్థాల డెలివరీ, క్విక్ కామర్స్ సంస్థ ఎటెర్నల్ గత ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చి త్రైమాసికంలో రూ.39 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.175 కోట్లుగా ఉంది. కార్యకలాపాల ఆదాయం రూ.3,562 కోట్ల నుంచి రూ.5,833 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ.3,636 కోట్ల నుంచి రూ.6,104 కోట్లకు పెరిగాయి. జొమాటో క్విక్ అండ్ ఎవ్రీడే వ్యాపారాలను మూసివేస్తున్నట్లు ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రకటించింది. గతంలో జొమాటోగా ఉన్న కంపెనీని మార్చిలో ఎటెర్నల్‌గా రీబ్రాండ్ చేశారు. జొమాటో క్విక్ అండ్ ఎవ్రీడే వ్యాపారాల మూసివేతపై కంపెనీ వ్యవస్థాపకుడు దీపిందర్ గోయెల్ చెబుతూ ప్రస్తుత రెస్టారెంట్ల కిచెన్ మౌలిక సదుపాయాలు 10 నిమిషాల్లో ఆర్డర్లు డెలివరీ చేసే విధంగా లేవని తెలిపారు. ప్రస్తుత సీఈఓ రాకేశ్ రంజన్ రెండేళ్ల పదవీ కాలం ముగియనుండటంతో ఆ స్థానంలోకి దీపిందర్ గోయెల్ రానున్నారు.

రెవెన్యూ కార్యదర్శిగా అరవింద్ బాధ్యతల స్వీకరణ

దిల్లీ: ఆర్థిక శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా అరవింద్ శ్రీవాస్తవ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 1994 బ్యాచ్ కర్ణాటక కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ)లో సంయుక్త కార్యదర్శి, అదనపు కార్యదర్శిగా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. దీనికి ముందు ఆర్థిక మంత్రిత్వ శాఖలో బడ్జెట్ డివిజన్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనమిక్ అఫైర్స్‌లో సంయుక్త కార్యదర్శిగా, ఆసియా అభివృద్ధి బ్యాంక్‌లో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా, బెంగళూరు ఆర్థిక విభాగ కార్యదర్శిగా, బెంగళూరు పట్టణాభివృద్ధి విభాగం కార్యదర్శిగా, కర్ణాటక పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి-ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీగా పని చేశారు.

సంక్షిప్తంగా

✦ టెక్నాలజీ, బిజినెస్ కన్సల్టింగ్ సంస్థ ఎంఆర్ఈ కన్సల్టింగ్‌ను 36 మి.డాలర్ల (దాదాపు రూ.305 కోట్ల)కు కొనుగోలు చేయడాన్ని **ఇన్ఫోసిస్** పూర్తిచేసింది.

✦ 2024-25లో భారత **వస్తు, సేవల ఎగుమతులు** జీవనకాల గరిష్ఠమైన 825 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇవి 778.13 బి.డాలర్లుగా ఉన్నాయి. సేవల ఎగుమతులు 386.5 బి.డాలర్లకు చేరినట్లు వాణిజ్య శాఖ గణాంకాలు తెలిపాయి.

✦ భారత్‌లో పీసీలు, సర్వర్లను తయారుచేసేందుకు సంయుక్త సంస్థను **డిక్సన్, ఇన్వెంటెక్**‌లు ఏర్పాటు చేయనున్నాయి.

✦ హిందుస్థాన్ కోకకోలా హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 40 శాతం వాటాను కొనుగోలు చేసే ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అనుమతి ఇచ్చిందని **జుబిలెంట్ బెవరేజెస్** తెలిపింది.

✦ ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద **జింకుషాల్ ఇండస్ట్రీస్** ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది.

✦ సాల్వ్ ఫర్ టుమారో 2025 పోటీ కోసం దేశవ్యాప్తంగా 100కు పైగా కాలేజీల విద్యార్థులను చేరుకోనున్నట్లు **శామ్‌సంగ్** వెల్లడించింది.


మోహన్‌లాల్, రజనీకాంత్, హేమమాలిని, చిరంజీవి, అక్షయ్ కుమార్, మిథున్ చక్రవర్తి

వాళ్ల నటనను స్ఫూర్తిగా తీసుకునే నటుడిగా నన్ను మలుచుకున్నా

-'వేవ్స్'లో చిరంజీవి

భారతదేశాన్ని ప్రపంచ కేంద్రంగా నిలబెట్టాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం 'వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)'కి నాంది పలికింది. ఇందులో భాగంగా మొదటి రోజు చిత్రపరిశ్రమకు చెందిన రజనీకాంత్, చిరంజీవి, మిథున్ చక్రవర్తి, అనిల్ కపూర్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, ఆమిర్‌ఖాన్, రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్, దీపికా పదుకొణె, ప్రముఖ దర్శకుడు రాజమౌళితో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ సమ్మిట్‌కు హాజరై సందడి చేశారు. గురువారం పలు 'సెషన్స్' జరిగాయి. అందులో భాగంగా 'లెజెండ్స్ అండ్ లెగసీస్: ది స్టోరీస్ దట్ ఇండియాస్ సోల్' సెషన్‌లో చిరంజీవి, మోహన్‌లాల్, హేమమాలిని పాల్గొన్నారు. అక్షయ్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ "చిత్ర పరిశ్రమలోకి ఎంతో మంది సూపర్‌స్టార్ల సినిమాలు చూస్తూ... వాళ్ల నటనను పరిశీలిస్తూ నటుడిగా నన్ను నేను మలుచుకున్నా. నాకు చిన్నతనం నుంచి నటనపై మక్కువ ఉండేది. కుటుంబం, స్నేహితుల ప్రోత్సాహంతోనే నాలో ప్రతిభ ఉందని నమ్మా.. నటనను కెరీర్‌గా ఎంచుకుని మద్రాస్‌లో అడుగు పెట్టా. నిజానికి అప్పటికే ఇండస్ట్రీలో ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ లాంటి దిగ్గజ నటులున్నారు. అలాంటి స్టార్‌డమ్ మధ్య నాకు అవకాశం ఎలా వస్తుందని ఆలోచించా. ఎలాగైనా సరే విభిన్నంగా అందరి దృష్టిని ఆకర్షించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నా. మద్రాస్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి ఫైట్స్, డ్యాన్స్ విషయాల్లో మరింత శిక్షణ తీసుకున్నా. మిథున్ చక్రవర్తి 'మృగయా' చూసి మేకప్ లేకుండా సహజంగా ఎలా నటించాలో నేర్చుకున్నా. డూప్ లేకుండా స్టంట్స్ ఫైట్స్ చేసే విషయంలో అమితాబ్ బచ్చన్ ప్రేరణగా నిలిచారు. అలాగే డ్యాన్స్ విషయంలో నా సీనియర్ కమల్‌హాసన్ నాకు స్ఫూర్తినిచ్చారు. అలా అందర్నీ చూస్తూ.. పరిశీలిస్తూ నన్ను నేను మలుచుకుంటూ ఈ స్థాయికి వచ్చా" అన్నారు. అనంతరం మోహన్‌లాల్ మాట్లాడుతూ.. కళాత్మక, వాణిజ్య చిత్రాల విషయంలో మలయాళ చిత్ర సీమ సమతౌల్యత ఎలా సాధించిందనేది వివరించారు. "మొదటి నుంచి మలయాళ సినిమాలో వాణిజ్య చిత్రాలు, కళాత్మక సినిమాల మధ్య సన్నని గీత ఉంది. నా 47ఏళ్ల సినీ ప్రయాణంలో నాకు జి.అరవిందన్, పద్మరాజన్, భరతన్ లాంటి గొప్ప దర్శకులతో పాటు ప్రియదర్శన్ వంటి వాణిజ్య దర్శకులతోనూ పనిచేసే అవకాశం లభించింది. ఆరోజుల్లో వాటిని ఆర్ట్ ఫిల్మ్స్ అని అనే వాళ్లు. కానీ, వాటిలోనూ వినోద విలువ ఉండేది. అలాగే వినోదాత్మక చిత్రాల్లోనూ కళ ఉండేది. కంటెంట్ పరంగా మలయాళ సినిమా చాలా సంపన్నమైనది. ఇప్పుడు కొత్త దర్శకుల రాకతో కంటెంట్ పరంగా మరింత బలంగా తయారైంది. అందమైన కళాఖండాలుగా మారింది" అని మోహన్‌లాల్ పేర్కొన్నారు. సీనియర్ నటి, ఎంపీ హేమమాలిని మాట్లాడుతూ.. 'వేవ్స్' సమ్మిట్ లాంటి అద్భుతమైన కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.


ఆలియా భట్, రాజమౌళి, ఆమిర్‌ఖాన్

మోదీ సంకల్పం గట్టిదని నాకు తెలుసు - రజనీకాంత్

దేశంలోని ఎంతోమంది సినీప్రముఖులను ఒకచోట చేర్చిన ఈ వేవ్స్ సమ్మిట్ నిర్వహించిన ప్రధాని మోదీని తమిళ అగ్రహీరో రజనీకాంత్ ప్రశంసించారు. "పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ఎంతో మంది పర్యాటకుల ప్రాణాల్ని పొట్టన పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ దాడి తర్వాత అందరూ ఈ సమ్మిట్ వాయిదా వేస్తారని అన్నారు. కానీ మోదీ సంకల్పం చాలా గట్టిదని నాకు కచ్చితంగా తెలుసు. ఆయన ఒక యోధుడు. ఏ సవాలునైనా ఎదుర్కొంటారు. మోదీ గత దశాబ్ద కాలంగా ఇలాంటి ఎన్నో పరిస్థితుల్ని ఎదుర్కొంటూ కశ్మీర్‌లో శాంతి భద్రతల కోసం ప్రయత్నిస్తున్నారు" అని అన్నారు.

వేవ్స్ సమ్మిట్‌లో మనోజ్ కుమార్‌కు నివాళులు..

ఈ సదస్సులో భాగంగా ప్రముఖ బాలీవుడ్ దివంగత నటుడు మనోజ్ కుమార్‌కు 'రిమెంబరింగ్ మనోజ్ కుమార్: ఏస్ ఫిల్మ్‌మేకర్, ట్రూ నేషనలిస్ట్' అనే సెషన్‌లో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు కునాల్ గోస్వామి మాట్లాడుతూ.. "మా తండ్రి విజయ సమయంలో ఎన్నో కోల్పోయారు. ఎన్నో దేశ భక్తి చిత్రాలను రూపొందించిన ఆయన భగత్‌సింగ్ జీవిత కథతో 'షహీద్' ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. మా తండ్రి ఇప్పుడు మన మధ్యలో లేకపోవచ్చు. కానీ ఆయన ప్రాణం పోసిన పాత్రలు, ప్రత్యేక కథలు జీవించే ఉన్నాయి. విజయవంతమైన కథల్ని చిత్రపరిశ్రమకు అందించారు" అని అన్నారు.

అవే నన్ను పాన్ ఇండియా స్టార్‌గా నిలబెట్టాయి : అల్లు అర్జున్



'పుష్ప' చిత్రాలు తన కెరీర్‌కు ఓ మైలురాయి అని.. అవే తనని పాన్ ఇండియా సూపర్‌స్టార్‌గా నిలబెట్టాయని కథానాయకుడు అల్లు అర్జున్ అన్నారు. ఆయన గురువారం ముంబయిలోని 'వేవ్స్' సమ్మిట్‌లో 'టాలెంట్ బియాండ్ బోర్డర్స్' అనే సెషన్‌లో పాల్గొన్నారు. 'పుష్ప' విజయాలు, భారతీయ సినిమా ప్రపంచస్థాయి ప్రభావం తదితర అంశాలపై మాట్లాడారు. తన ప్రసంగం ఆరంభించడానికి ముందు 'వేవ్స్' సమ్మిట్‌ను నిర్వహిస్తున్నందుకు ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. 'పుష్ప' సినిమాతో తెలుగు సినిమా భాషా సరిహద్దులను దాటి అంతర్జాతీయ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. కథలోని భావోద్వేగం, సాంస్కృతిక లోతు దీనికి కారణమని.. అలాగే దర్శకుడు సుకుమార్ దూరదృష్టి, అంకిత భావం వల్లే ఈ విజయం సాధ్యమైందని.. ఈ చిత్రంతోనే జాతీయ అవార్డు గెలుచుకున్న తొలి తెలుగు నటుడిగా తాను నిలిచానని చెప్పారు. ప్రస్తుతం ఓటీటీ వేదికలు.. డిజిటల్ టెక్నాలజీ సినిమా మనుగడలో తెచ్చిన విప్లవాత్మక మార్పులు మన చిత్రాలను ప్రపంచంలోని ప్రతి మూలకు చేరుస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన అల్లు అర్జున్ తన అనుభవాల్ని పంచుకున్నారు. "దక్షిణాది నటులు సిక్స్‌ప్యాక్ సాధించలేరన్న మాట ఓ నటి నుంచి విన్నా. దాన్ని నేను సవాల్‌గా తీసుకున్నా. ఒక వ్యక్తి ఆ అడ్డంకిని బద్దలు కొట్టగలడని నేను దాన్ని సాధించి చూపించా"నని చెప్పారు. నటుడిగా చిరంజీవి తనకెంతో స్ఫూర్తినిచ్చారని.. ఆయన ప్రభావం తనపై ఎంతో ఉందని చెప్పారు.

కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా 'ది జర్నీ: ఫ్రమ్ అవుట్‌సైడర్ టూ రూలర్' అనే సెషన్‌లో బాలీవుడ్ అగ్రకథానాయకుడు షారుక్ ఖాన్, దీపికా పదుకొణె పాల్గొని కెరీర్‌కు సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు.

ఇది మీ ప్రపంచమని నమ్మాలి - షారుక్

"నా సినిమాలు విఫలమైన ప్రతీసారి.. అందరి కంటే రెండింతలు ఆ బాధను అనుభవిస్తాను. ఎందుకంటే నేను చాలా మందిని నిరాశపరిచినట్లు అనిపిస్తుంది. ఒక సినిమా ఫ్లాప్ అయితే నేను బాత్రూమ్‌కు వెళ్లి ఏడుస్తాను. ఆ సమయంలో నాకు అభిమానులను అవమానించినట్లు అనిపిస్తుంది. కానీ ఓటమికి నన్ను అధిగమించే అవకాశం ఇవ్వను. దాన్ని ఎదుర్కొనే మార్గాలను కనుగొని మళ్లీ ప్రయత్నిస్తాను. ప్రపంచం ఏదైనా మీరు మీ స్థానాన్ని అక్కడ ఎలా సృష్టించుకుంటారనేదే ముఖ్యమైన విషయం. ప్రపంచం మీ గురించి పట్టించుకోదు. ఇది మీ ప్రపంచం అని మీరు నమ్మాలి. నేను చిత్రపరిశ్రమలోకి వచ్చినప్పుడు ఇది నా ప్రపంచమని నేను నమ్మాను. పరిశ్రమ కూడా నన్ను మనస్ఫూర్తిగా స్వాగతించింది. దీంతో పాటు తక్కువ ధరకు టికెట్లు అమ్మేలా మరిన్ని థియేటర్లు వస్తాయని కోరుకుంటున్నా. దేశంలోని ప్రతి మూలలోని ప్రజలకు మరిన్ని సినిమాలు చూపించగలిగేలా చౌకైన థియేటర్లు మరిన్ని అవసరమని అనుకుంటున్నా. ఈ వేవ్స్‌తో భారతీయులకు మాత్రమే కాకుండా విదేశీ సినిమాల చిత్రీకరణల ప్రక్రియలు కూడా సులభతరం అవుతాయని అనుకుంటున్నా".


షారుక్, దీపికా పదుకొణె


కొత్త జీవితం.. కొత్త ఆశలు

- దీపికా పదుకొణె

"చిత్రసీమలో అడుగుపెట్టి దాదాపు 15ఏళ్లు దాటింది. నేను కెరీర్ ప్రారంభించినప్పుడు నాకు 16ఏళ్లు మాత్రమే. మోడల్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న నన్ను ఫరాఖాన్ తన సినిమాతో నటిగా వెండితెరకు పరిచయం చేసింది. ఈ చిత్రసీమలో మంచి స్థానాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తున్న బయటి వ్యక్తిని అని ఎప్పుడూ నాకు అనిపించలేదు. నాకు దృఢ సంకల్పం, కృషి, పనిచేయాలనే పట్టుదల ఉన్నాయి. ఇవి నా నియంత్రణలో ఉన్న విషయాలే. ప్రస్తుతం నా బిడ్డతో తల్లి దశను ఆస్వాదిస్తున్నాను. ఈ కొత్త జీవితం ఇంకా నా కెరీర్‌లో ఎలాంటి మార్పులు తెస్తుందో చూడాలి".

ఈనాడు సినిమా

వెండితెరను ఫలపుష్పాలతో అభిషేకించిన సినీ ముని... కె.రాఘవేంద్రరావు. పాటకి పట్టం కట్టి.. గ్లామర్‌కి కొత్త సొగసులు అద్ది.. తనకంటూ ఓ బ్రాండ్‌ని సృష్టించుకున్నారు. పోస్టర్‌పై ఆయన పేరు చాలు... ప్రేక్షకులు థియేటర్లవైపు అడుగులు వేయడానికి! అటు అగ్ర తారలతోనూ... ఇటు కొత్తతరం నటులతోనూ సినిమాలు తీసి బాక్సాఫీసుని కళకళలాడించిన ఘనత ఆయనది. యాభయ్యేళ్ల సినీ ప్రయాణంలో... పలు భాషల్లో 125కిపైగా సినిమాలకు దర్శకత్వం వహించారు. ఎంతోమంది నటుల్ని పరిచయం చేశారు, దర్శకుల్ని తీర్చిదిద్దారు. ఆయన సినిమాలతో వెలుగులోకి వచ్చిన సాంకేతిక నిపుణులు మరెంతోమంది. కె.రాఘవేంద్రరావు తొలి చిత్రం 'బాబు' విడుదలై మే 2తో యాభయ్యేళ్లు. ఇన్నేళ్ల ప్రయాణం తర్వాత కూడా ఆయనకి సినిమాపై ప్రేమ ఇంత కూడా తగ్గలేదు. సంగీతంపై ప్రేమతో ఇప్పుడు కీ బోర్డ్ నేర్చుకుంటున్నారు. మరోవైపు కలం చేతబట్టి పాటలు రాస్తున్నారు. 'సంగీతం అంటే నాకెంతో ఇష్టం. సంగీత దర్శకుడు కీరవాణితో ఉన్న అనుబంధంతో మరిన్ని విషయాల్ని తెలుసుకున్నా. ఆ ఇష్టంతోనే కీ బోర్డ్ నేర్చుకుంటున్నా. గతంలో ఎస్వీబీసీ ఛానల్‌కి ఛైర్మన్‌గా నారా చంద్రబాబు నాయుడు అవకాశం ఇచ్చినా 9 మంది సంగీత దర్శకులతో, 1108 అన్నమయ్య కీర్తనల గానంతో ప్రత్యేకంగా ఓ కార్యక్రమం చేయించా. ఆ ప్రయత్నం ఎంతోమంది మెప్పు పొందింది. ఇలా ప్రతి పనిని ప్రేమతో, బాధ్యతతో చేయడం నాకు అలవాటు' అంటారు కె.రాఘవేంద్రరావు. యాభయ్యేళ్ల దర్శకత్వ ప్రయాణంపై ఆయనతో 'ఈనాడు సినిమా' ముచ్చటించింది. ఆ విశేషాలివీ...



ఆ మాటే నా జీవితానికి పెద్ద మలుపు

- ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు

ఇన్నేళ్ల ప్రయాణాన్ని మీరు ఊహించారా? దర్శకుడిగా ప్రయాణం మొదలు కాక ముందు మీ ఆలోచనలు ఎలా ఉండేవి?

నాన్న కె.ఎస్.ప్రకాశరావు ప్రముఖ దర్శకుడు. ఆయన తీసిన సినిమాలు అప్పటికి అడ్వాన్స్‌డ్‌గా, మరో పదేళ్ల తర్వాత రావల్సినవి అన్నట్టుగా ఉండేవి. దాంతో కొన్ని సినిమాలు సరిగ్గా ఆడక బాగా నష్టపోయారు. ఆ తర్వాత మళ్లీ పుంజుకున్నారు అది వేరే విషయం. సహాయ దర్శకుడిగా నా ప్రయాణం మొదలయ్యాక... ఒకవేళ నేను దర్శకుడిని కాకపోతే బి.ఎ చదువుకు ఏం ఉద్యోగం వస్తుందా అని ఆలోచించేవాణ్ని. ఒకవేళ ఏ ఉద్యోగం రాకపోయినా, ఎలాగో డ్రైవింగ్ తెలుసు కదా, పెద్దవాళ్ల దగ్గర డ్రైవర్‌గా చేరిపోదాం అని ధైర్యం చెప్పుకునేవాణ్ని. అలా డ్రైవర్ కావాలనుకున్నవాణ్ని దర్శకుడినై 'డ్రైవర్ రాముడు' సినిమా తీశానన్నమాట (నవ్వుతూ).

యాభయ్యేళ్ల సుదీర్ఘ ప్రయాణం పూర్తి చేశారు. ఇప్పుడు మళ్లీ మీ తొలి సినిమా రోజుల్లోకి వెళదాం పదండి...

అప్పటికి నేను సహాయ దర్శకుడిని. మా నాన్న కె.ఎస్.ప్రకాశ్‌రావు దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేస్తున్నప్పుడు కథలు, సంగీత చర్చల్లో చురుకుగా పాల్గొనేవాణ్ని. నా పనితీరు నచ్చి నిర్మాత డి.రామానాయుడు దర్శకుడిగా అవకాశం ఇవ్వాలనుకున్నారు. ఇంకొంచెం అనుభవం ఉంటే బాగుంటుందని నాన్న చెప్పేవారు. చేస్తే కొత్త రకమైన సినిమానే చేయాలని నాకు ఉండేది. నా సన్నిహిత మిత్రులు కుమార్, శ్రీధర్, గోపాలకృష్ణ బాగా డబ్బున్నవాళ్లు. నాతో వాళ్లు సినిమా చేయాలనుకున్నారు. ముందుగా ఒక ఆర్ట్ సినిమా తీద్దాం, ఓ గ్రామానికి వెళ్లి రా. లక్ష పెట్టుబడితో మొత్తం సినిమా పూర్తి చేసుకుని వచ్చేద్దాం అన్నాను. వాళ్లేమో తొలి సినిమానే భారీగా ఉండాలన్నారు. అప్పుడు మా నాన్న కథ ఇచ్చారు. ఆత్రేయ రచన, చక్రవర్తి సంగీతంతో మారుతి ప్రొడక్షన్స్ పతాకంపై 'బాబు' సినిమా మొదలైంది. కథానాయకుడు శోభన్‌బాబు బాగా బిజీగా ఉన్న రోజులవి. కానీ నాపై ఉన్న నమ్మకంతో సినిమాకి డేట్స్ ఇచ్చారు. ఓపెనింగ్ షాట్‌లోనే పైనుంచి బెలూన్స్ పడేలా ఏర్పాట్లు చేశాం. వచ్చిన అతిథులంతా ఆ సన్నివేశం చూసి అప్పట్లో ఆశ్చర్యపోయారు. జెమినీ స్టూడియోలో వంద మందితో లైవ్ ఆర్కెస్ట్రాతో పాటల రికార్డింగ్ మొదలైంది. విడుదల తర్వాత మంచి రిపోర్టే వచ్చింది. ఎబౌ యావరేజ్ సినిమా అది.

వాణిజ్య సినిమాకి కొత్త అర్థం చెప్పిన దర్శకులు మీరు. మీ సినిమాల్లో పాటలు, డ్రామా, గ్లామర్, హాస్యం అన్నీ ప్రత్యేకమే. ఈ శైలికి స్ఫూర్తి ఏమిటి?

చెబితే నమ్మరు కానీ... ఆరంభంలో నా ఆలోచనలన్నీ ఆర్ట్ సినిమా చుట్టూనే తిరిగేవి (నవ్వుతూ). 'అడవి రాముడు' సినిమానే నన్ను కమర్షియల్ దర్శకుడిగా మార్చేసింది. అప్పటికే ఒకొక్క దర్శకుడికీ ఒక్కో శైలి, బ్రాండ్ ఉండేది. ఆదుర్తి సుబ్బారావు పాటలు చాలా బాగా తీసేవారు. ఆయన పాటలంటే నాకు ఎంత ఇష్టమో. నా పాటలకి, వాటిలో గ్లామర్‌కీ ఆయనే స్ఫూర్తి అనుకోవచ్చు. కె.విశ్వనాథ్, కె.బాలచందర్ అన్నా నాకు ఎంతో ఇష్టం. వస్తున్న సినిమాలు ఎలా ఉన్నాయి? మనం కొత్తగా ఏం చేయగలం అనుకున్నప్పుడు వచ్చిన ఆలోచనలే నన్ను ఇటువైపు తీసుకొచ్చాయని నమ్ముతుంటా. సినిమాకి సంగీతం, డ్రామా ముఖ్యం అని భావిస్తా. ఒకవైపు పాటలు, మరోవైపు డ్రామా, రావు గోపాలరావు, రామలింగయ్యల కామెడీ, వీటికితోడు కొన్ని హృదయాన్ని హత్తుకునే అంశాల్ని జోడిస్తూనే మరోవైపు కథ చెప్పడం నా శైలి. కానీ నా సినిమాల్లో ఎంత డ్రామా ఉన్నా, పాటలే హైలెట్ అవుతుంటాయి (నవ్వుతూ).

బ్లాక్ అండ్ వైట్ కాలంలో ప్రయాణం మొదలు పెట్టిన మీరు... నేటి ఓటీటీ యుగంలోనూ అంతే ఉత్సాహంతో పని చేస్తున్నారు. మీరు ఎలా అప్‌డేట్ అవుతుంటారు?

సినిమానే నాకు ప్రపంచం. మంచి సినిమా ఎవరు తీసినా వాళ్లకు ఫోన్ చేసి అభినందిస్తూ, అందులో ఏ సన్నివేశాన్ని ఎలా తీశారో తెలుసుకుంటుంటా. ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటా. ఆ ప్రయాణమే నన్ను అప్‌డేట్ చేస్తూ ఉంటుంది. ఇంత ఇచ్చిన పరిశ్రమకు ఏదైనా తిరిగి చేయాలనే ఆలోచన ఎప్పుడూ ఉంటుంది. కొత్తతరం వస్తున్నప్పుడు వాళ్లకు సరైన అవకాశాలు ఇవ్వాలి కల్పించాలనేది నా అభిమతం. అందులో భాగంగానే ధారావాహికలు మొదలైనప్పుడు 'శాంతినివాసం'తో రాజమౌళిని దర్శకుడిగా పరిచయం చేశా. ఇది ఓటీటీ యుగం. కొత్తతరం దర్శకుల్ని ప్రోత్సహించడంలో భాగంగా ఈటీవీ కథాసుధ కోసం కొన్ని చిత్రాల్ని తెరకెక్కిస్తున్నాం. మాధ్యమం ఏదైనా సినిమాతో ప్రయాణం చేసినట్టే ఉంటుంది. కొత్తతరం కోసం ఉచితంగా దర్శకత్వ పాఠాలూ చెబుతున్నా.

ఎన్టీఆర్ లాంటి దిగ్గజ కథానాయకుడితోపాటు... నవతరంతోనూ సినిమాలు చేశారు. ఇన్ని తరాల కథానాయకుల్ని చూసిన అనుభవంతో ఓ దర్శకుడిగా మీరేం చెబుతారు?

నేను దర్శకత్వం చేస్తానంటే ఏ కథానాయకుడూ ఇప్పటిదాకా వద్దు అనలేదు. నాపైన వాళ్లకు ఉన్న నమ్మకం అది. ఇప్పుడంటే ట్రెండ్ మారడంతో మరీ ఎక్కువగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు కానీ... అప్పట్లో కథానాయకులు 30 నిమిషాలకి మించి కథ వినేవాళ్లు కాదు. ఎన్టీఆర్‌తో 12 సినిమాలు చేశాను కదా, మామధ్య 20 నిమిషాలే కథా చర్చలు సాగేవి. 'అడవి రాముడు' సినిమా ఆడకపోతే మళ్లీ అవకాశం వస్తుందో లేదో అని ఆ సినిమాలో నేను ఆయనతో ఏకలవ్యుడు, వాల్మీకితోపాటు రకరకాల గెటప్‌లు వేయించి తెరపై చూపించే ప్రయత్నం చేశా. ఆయన్ని రాముడిగా పోస్టర్స్‌లో చూడటమే తప్ప, ఎప్పుడూ కళ్లారా చూడలేదు కదా అని చివరి సన్నివేశం కోసం ఆయనతో రాముడి గెటప్ వేయించి చిత్రీకరణ చేశా. ఆ షాట్ పూర్తయ్యాక ఆయన పాదాలకి నమస్కారం చేశా. కారెక్కి వెళ్లిపోతూ 'నా జీవితంలో గుర్తుండిపోయే క్షణాలివి. తెరపై నన్నెలా చూపించాలో, నన్నెలా వాడుకోవాలో నీకు తెలిసినట్టు మరెవ్వరికీ తెలియదు' అన్నారు. చిరంజీవి, శోభన్‌బాబు, కృష్ణ... ఇలా అందరితో ప్రయాణం ఎంతో బాగుండేది. నేటితరం కథానాయకులతో సినిమాలు చేస్తున్నప్పుడు మరో రకమైన బాధ్యత. వాళ్లంతా ప్రముఖుల కుటుంబాల నుంచి వచ్చినవాళ్లు. వాళ్లు తెరకు పరిచయం అవుతున్నప్పుడు ప్రేక్షకులు అన్ని రకాల అంశాల్ని ఆశిస్తారు. అవి దృష్టిలో ఉంచుకుని సినిమాలు చేశా. వెంకటేశ్ మొదలుకొని, మహేశ్ బాబు, ఎన్టీఆర్, అల్లు అర్జున్... ఇలా అందరితోనూ ప్రయాణం గుర్తుండిపోతుంది.

రక్తి కట్టించిన వాణిజ్య కథలు మొదలుకొని భక్తి, ఫాంటసీ... ఇలా భిన్న రకాల సినిమాలు చేశారు. ఇంకా మీరు చేయాలనుకుని చేయలేకపోయిన సినిమాలేమైనా ఉన్నాయా?

దాదాపు అన్ని రకాల జానర్లు స్పృశించాననే తృప్తి ఉంది. అయితే కొన్ని సినిమాలు చూసినప్పుడు మాత్రం ఇలాంటివి మనమెందుకు చేయలేదని బాధపడిన సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా రిచర్డ్ అటెన్‌బరో తీసిన 'గాంధీ' సినిమా చూశాక వైరాగ్యం వచ్చింది. అప్పటికి నేను 'అడవి రాముడు', 'వేటగాడు' చేశాను. మన గాంధీ మహాత్ముడు గురించి బ్రిటిష్‌వాళ్లు ఇంత గొప్ప సినిమా చేశారు, మనం చేయలేకపోయామే అనిపించింది. 'భాగ్ మిల్కా భాగ్' సినిమా చూసినప్పుడు కూడా ఇలాంటి సినిమా చేయాల్సిందనే భావన కలిగింది. 'బాహుబలి' సినిమాల్ని నాకు రాజమౌళి కానుకగా ఇవ్వడం ఎంతో తృప్తినిచ్చింది.

మీ కెరీర్ మలుపు తిరిగింది 'అడవి రాముడు' సినిమాతోనే కదా!

తొలి సినిమా 70 రోజులు ఆడింది. ఆ తర్వాత 'జ్యోతి', 'రాజా' సినిమాలు చేశా. పేరు, పురస్కారాల్ని తీసుకొచ్చాయి. అయితే ఆ తర్వాత కూడా ఇలాంటి కథలే చేయండని అడుగుతుంటే... ఆర్ట్ సినిమాల దర్శకుడిగా ముద్ర పడుతుందేమో అనుకునేవాణ్ని. ఆ సమయంలోనే నా పనితీరు నచ్చిన నిర్మాతలు సత్యనారాయణ, సూర్యనారాయణ వచ్చి 'ఎన్టీఆర్ డేట్స్ ఇచ్చారు. మీరు దర్శకత్వం వహిస్తారని చెప్పాం. ఆయన ఒప్పుకున్నారు' అన్నారు. ఆ మాటే నా జీవితానికి ఓ పెద్ద మలుపు. అలా 'అడవి రాముడు' చేసే అవకాశం వచ్చింది. 1963లో 'పాండవ వనవాసము' సినిమాకి కమలాకర కామేశ్వరరావు దగ్గర సహాయ దర్శకుడిగా చేరాను. నేను మొట్టమొదట క్లాప్ కొట్టింది ఎన్టీఆర్‌పైనే. అలా క్లాప్ కొట్టాక ఆయన పద్యాలు చెబుతుంటే నన్ను నేను మరిచిపోయి అలా చూస్తూ నిలబడిపోయా. ఆరాధ్య దైవంగా భావించే ఆయన నా దర్శకత్వంలో సినిమాకి ఒప్పుకోవడంతో ఎంత ఉత్సాహం కలిగిందో, అంత భయం మొదలైంది. ఎన్టీఆర్ ఆ సినిమా కోసం ఊరు దాటి బయటికొచ్చి చిత్రీకరణలో పాల్గొన్నారు. 38 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేశాం. విడుదల తర్వాత తెలుగు సినిమా సత్తా ఏమిటో భారతీయ చలన చిత్ర రంగానికి చాటి చెప్పింది. 1977 ఏప్రిల్ 28న విడుదలైన ఆ సినిమా రూ. 4 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఆ వసూళ్లని ఇప్పటి లెక్కలతో పోల్చి చూస్తే రూ. 5 వేల కోట్లు అని తేలింది. ఆ సినిమా తర్వాత వెనక్కి తిరిగి చూసే అవసరమే రాలేదు.


'పాండవ వనవాసము' చిత్రానికి సహాయ దర్శకుడిగా ఎన్టీఆర్‌పై క్లాపనిస్తున్న కె.రాఘవేంద్రరావు

సినిమా, ప్రేక్షకుల అభిరుచులు ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటాయి. ఆ మార్పుకు అనుగుణంగా సినిమాలు చేయడం పెద్ద సవాల్ కదా...

సవాళ్లని స్వీకరించడంలోనే అసలైన తృప్తి ఉంటుంది. 'జగదేక వీరుడు అతిలోక సుందరి' సినిమాకి ముందు నాకు కొన్ని పరాజయాలు ఉన్నాయి. అలాంటి సమయంలో ఫాంటసీ కథతో ఆ సినిమా తీసి విజయాన్ని అందుకున్నాం. అలాగే 'అన్నమయ్య', 'శ్రీరామదాసు', 'శ్రీమంజునాథ', 'శిరిడిసాయి' సినిమాలు ప్రణాళికలు వేసుకుని తీసినవి కాదు. రొమాంటిక్ కామెడీ సినిమాలు తీసే కె.రాఘవేంద్రరావు.. నాగార్జునతో 'అన్నమయ్య' తీయడమా అని మాట్లాడుకున్నారు. కానీ ఏఎన్నార్ 'విప్రనారాయణ'గా చేసి ఒప్పించారు కదా అని, నాగార్జునకి 'అన్నమయ్య' కథని చెప్పా. ఆయన అంతే ధైర్యంగా ఆ సినిమా చేయడానికి ముందుకొచ్చారు. వైష్ణవమే కాకుండా, శైవాన్నీ స్పృశించాలని 'శ్రీమంజునాథ' సినిమాని తీశా. 'శిరిడిసాయి', 'నమో వెంకటేశాయ' సినిమాలు కూడా ఎంతో తృప్తినిచ్చాయి.

నేను కరెక్ట్ అని ప్రేక్షకులు మళ్లీ నిరూపించారు: నాని


నాని, శైలేశ్

'హిట్: ది థర్డ్ కేస్'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు కథానాయకుడు నాని. ఆయన.. శ్రీనిధి శెట్టి జంటగా శైలేశ్ కొలను తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. ఇది గురువారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్ మీట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా కథానాయకుడు నాని మాట్లాడుతూ.. "బుకింగ్స్ అదిరిపోయాయి. ఓపెనింగ్స్ బాగున్నాయి. ప్రేక్షకులు, పరిశ్రమ వర్గాల నుంచి మంచి టాక్ వస్తోంది. ఇది కేవలం ఆరంభం మాత్రమే.. రాబోయే రోజుల్లో ఇదెంత దూరం వెళ్లి ఆగుతుందన్నది మా అంచనాలకీ అందట్లేదు. ఇది ఈ నెలంతా ఓ వేడుకలా కొనసాగుతుందని నమ్ముతున్నా. 'నేను, మీరు ఒకటే'నని నేను నమ్మిన ప్రతిసారీ 'నేను కరెక్ట్' అని మీరు నిరూపించినందుకు ప్రతిఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు" అన్నారు. "నన్ను నమ్మినందుకు నానికి థ్యాంక్స్. నాపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాననుకుంటున్నా. ఈ చిత్రం కోసం మేమంతా చాలా కష్టపడ్డాం" అన్నారు దర్శకుడు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. "ఈ రోజు తెలుగు చిత్ర పరిశ్రమ మళ్లీ ఊపిరి పీల్చుకుంది. సినిమాలొస్తున్నాయి.. కానీ, జనాలు థియేటర్లకు రావట్లేదు.. వేసవి అంతా అయిపోతోంది.. ఏపీ, తెలంగాణల్లో చాలా చోట్ల సింగిల్ స్క్రీన్లు మూసేశారు అనుకుంటున్నాం. ఇలాంటి తరుణంలో మేమంతా 'హిట్ 3'పై నమ్మకం పెట్టుకున్నాం. దీనికి ప్రేక్షకులొస్తారా? ఏస్థాయిలో థియేటర్లు నిండుతాయని ఊపిరి బిగబట్టుకుని చూశాం. అలాంటిది మూడు నాలుగు రోజుల ముందు నుంచే ఆన్‌లైన్ బుకింగ్స్‌తో నమ్మకం వచ్చింది. నాని నిర్మాతగా ఇప్పటికే ఓ విజయాన్నిచ్చాడు. ఇప్పుడు హీరోగా.. నిర్మాతగా మరో సూపర్ హిట్ ఇచ్చాడు. ఇలా ప్రేక్షకులకు ఎప్పటికప్పుడు కొత్తదనమున్న సినిమాలిచ్చి.. వాళ్లను థియేటర్‌కు తీసుకొచ్చే బాధ్యత మాపై ఉంది. దానిపై ఆలోచిస్తున్నాం" అన్నారు.

ఆశిష్.. దేత్తడి



ఆశిష్ హీరోగా ఆదిత్యరావు గంగసాని దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. దీన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 60వ సినిమాగా దిల్ రాజు, శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'దేత్తడి' అనే పేరును ఖరారు చేశారు. ఈ మేరకు గురువారం ఈ చిత్ర టైటిల్ లుక్‌ను విడుదల చేశారు. అందులో ఆశిష్ హుషారుగా డప్పు కొడుతూ చిందేయడం కనిపించింది. "హైదరాబాద్ నేపథ్యంగా సాగే రొమాంటిక్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. సంగీతానికి చాలా ప్రాధాన్యముంది. బలమైన భావోద్వేగాలతో నిండిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. దీంట్లో ఆశిష్ మాస్ లుక్‌లో కనిపించడంతో పాటు హైదరాబాదీ యాసలో సంభాషణలు పలకనున్నారు" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

రాజభవనం కోసం వారసుల యుద్ధం



రెడీ ఇన్ ఓటీటీ

కథాంశం: బంధాలు, బంధుత్వాలను లెక్కచేయకుండా అధికారం కోసం పోరాటం చేస్తున్న వ్యక్తులు ఈ సమాజంలో చాలా మందే ఉన్నారు. అలాంటి ఓ కథనే ఇప్పుడు సిరీస్ రూపంలో మనకు చూపించడానికి సిద్ధమైంది 'కుల్: ది లెగసీ ఆఫ్ రైజింగ్స్'. బాలీవుడ్ నటి నిమ్రత్ కౌర్, రిధి డోగ్రా, అమోల్ పరాశర్ తదితరులు ఈ సిరీస్‌లో కీలక పాత్రలు పోషించారు. ఈ రాయల్ డ్రామాకు సాహిర్ రజా దర్శకత్వం వహించారు. ఇందులో నిమ్రత్ కౌర్.. ఇంద్రాణి పాత్రలో కనిపించనున్నారు. తన తండ్రి రాజ చంద్రప్రతాప్ సింగ్‌ను కొందరు హత్య చేస్తారు. దీంతో ఆయన మరణం తర్వాత తన తండ్రి ఉంటున్న రాజభవనం మీద అధికారం కోసం ఆ వారసుల మధ్య జరిగిన యుద్ధమేంటి? అనేదే ఈ సిరీస్ కథాంశం. ఏక్తా కపూర్ ఈ సిరీస్‌ను నిర్మించారు.

సిరీస్: 'కుల్'
నటీనటులు: నిమ్రత్ కౌర్, రిధి డోగ్రా
విడుదల ఎప్పుడు: శుక్రవారం
ప్లాట్‌ఫామ్: జియో హాట్‌స్టార్

మోనోమర్ నుంచి పాలిమర్ ఏర్పడే విధానాన్నే పాలిమరీకరణం అంటారు. నిత్య జీవితంలో పాలిమర్లను ఏదో ఒక రూపంలో వినియోగిస్తూనే ఉంటాం. పాలిమర్లు వాటి అనువర్తనాల ఆధారంగా అనేక రకాలుగా ఉంటాయి. వీటిని విద్యుత్ తీగల బంధకాలు, పెయింట్‌లు, పైపులు ఇలా అనేక వస్తువుల తయారీలో ఉపయోగిస్తారు. పోటీపరీక్షార్థులు పాలిఎమైడ్‌లు, పాలిఎస్టర్లు, బేకలైట్, ఫార్మాల్డిహైడ్ లాంటి పాలిమర్లు, వాటి అనువర్తనాలు - రకాలు తదితరాలపై అవగాహన పెంచుకోవాలి.



పోటీ పరీక్షల ప్రత్యేకం
కెమిస్ట్రీ

ఆ పాలిమర్‌తోనే.. విరిగిపోని పింగాణి పాత్రలు!

పాలిమర్లు - అనువర్తనాలు

పాలిఎమైడ్‌లు

ఎమైడ్ $\left(-\overset{O}{\overset{||}{C}}-NH_2\right)$ లింకేజీ ఉన్న పాలిమర్‌లను 'పాలిఎమైడ్‌లు' అంటారు.

✦ నైలాన్‌లు అని పిలిచే కృత్రిమ పోగులు పాలిఎమైడ్‌లకు మంచి ఉదాహరణలు.

✦ నైలాన్‌లను సంఖ్యాపరంగా వివరిస్తారు. ఈ సంఖ్యలు మోనోమర్ శృంఖలంలోని కార్బన్ పరమాణువుల సంఖ్యను సూచిస్తాయి.

ఉదా: నైలాన్ - 6, నైలాన్ - 6, 6

నైలాన్ – 6, 6: ఎడిపిక్ ఆమ్లం, హెక్సామిథలీన్ డైఎమీన్‌లను అధిక పీడనం, అధిక ఉష్ణోగ్రతల వద్ద సంఘనన పాలిమరీకరణం జరిపి నైలాన్ - 6, 6 పోగులను తయారుచేస్తారు. వీటికి అరుగుదల స్వభావం చాలా తక్కువ.

- ఇవి ఎక్కువగా సాగవు, తక్కువ తేమను శోషించుకుంటాయి. కాబట్టి వీటిని వస్త్రపరిశ్రమలో ఉపయోగిస్తారు.
- గ్రీజు, బూజు నిరోధకత, ఎండ వాతావరణాన్ని తట్టుకునే స్వభావాన్ని కలిగి ఉంటాయి.
- ఈ పోగులు అధిక తన్యతను కలిగి ఉండటంతో టూత్‌బ్రష్‌లు, షీట్లు, తాళ్ల తయారీలో విరివిగా ఉపయోగిస్తారు.

నైలాన్ – 6: ఇది ఒక సజాతీయ సంఘనన పాలిమర్.

- కాప్రొలాక్టమ్ అనే మోనోమర్‌ను నీటి సమక్షంలో అధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేసి నైలాన్ - 6ను తయారు చేస్తారు. దీన్ని పెర్లాన్-L అని కూడా పిలుస్తారు.
- నైలాన్ - 6 పోగులకు అరుగుదల స్వభావం తక్కువ.
- వీటిని వస్త్రాలు, తాళ్లు, టైర్‌కార్డ్‌ల తయారీలో ఉపయోగిస్తారు.

పాలిఎస్టర్‌లు

ఎస్టర్ $\left(-\overset{O}{\overset{||}{C}}-OR\right)$ లింకేజీ కలిగి ఉన్న పాలిమర్లను పాలిఎస్టర్‌లు అంటారు.

ఉదా: టెరిలీన్, పాలికార్బొనేట్

టెరిలీన్: ఇథిలీన్ గ్లైకాల్, టెర్‌ప్తాలిక్ ఆమ్లం మిశ్రమాన్ని ఉత్ప్రేరకం సమక్షంలో అధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేసి టెరిలీన్‌ను తయారు చేస్తారు. దీన్ని పాలిఇథిలీన్ టెర్‌ప్తాలేట్ (PET) లేదా డైక్రాన్ (Dacron) అని కూడా అంటారు.

◆ టెరిలీన్ పోగులు తడిని పీల్చుకోవు, గ్రీజు నిరోధకతను కలిగి ఉంటాయి. వస్త్ర పరిశ్రమల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. వీటితో తయారుచేసిన వస్త్రాలు ముడతలు పడవు, ష్రింక్ అవవు. వీటికి అంటుకున్న మురికి, గ్రీజును సులభంగా తొలగించవచ్చు. ◆ టెరిలీన్‌ను సురక్షిత బెల్ట్‌లు, హెల్మెట్‌ల తయారీలో వినియోగిస్తారు.

పాలికార్బొనేట్: ఇది ఒక పారదర్శక పాలిమర్.

◆ బిస్-ఫినాల్-A, డైఫినైల్ కార్బొనేట్ అనే మోనోమర్లను సంఘననం చెందించి పాలికార్బొనేట్‌లను తయారు చేస్తారు.
◆ వీటిని సురక్షిత కళ్లజోళ్లు, సురక్షిత కవచాలు, టెలిఫోన్ భాగాల తయారీలో ఉపయోగిస్తారు.

బేకలైట్

ఫినాల్, ఫార్మాల్డిహైడ్‌లను ఆమ్ల లేదా క్షార ఉత్ప్రేరకాల సమక్షంలో సంఘననం చెందించి బేకలైట్‌ను తయారుచేస్తారు.

■ ఫినాల్, ఫార్మాల్డిహైడ్ రేఖీయ ఉత్పన్నాన్ని నొవొలాక్ (Novolac) అంటారు. దీన్ని పెయింట్లలో ఉపయోగిస్తారు.

■ నొవొలాక్‌ను ఫార్మాల్డిహైడ్‌తో వేడిచేస్తే వ్యత్యస్థ బంధాలు ఏర్పడి. బేకలైట్ అనే పాలిమర్ ఏర్పడుతుంది. ■ దీన్ని దువ్వెనలు, పాత్రల చేతిపిడులు, విద్యుత్ స్విచ్‌ల తయారీలో, లామినేషన్ చేసేందుకు వినియోగిస్తారు.

మెలమైన్ - ఫార్మాల్డిహైడ్ పాలిమర్

మెలమైన్, ఫార్మాల్డిహైడ్ మోనోమర్‌ల సంఘనన పాలిమరీకరణం ద్వారా మెలమైన్-ఫార్మాల్డిహైడ్ ఏర్పడుతుంది.

● విరిగిపోని పింగాణి పాత్రల తయారీలో దీన్ని ఉపయోగిస్తారు.

యూరియా - ఫార్మాల్డిహైడ్ రెజిన్

యూరియా, ఫార్మాల్డిహైడ్‌లు సంఘనన పాలిమరీకరణం చెంది యూరియా-ఫార్మాల్డిహైడ్ రెజిన్ ఏర్పడుతుంది.

● విరిగిపోని కప్పులు, లామినేటెడ్ పలకలు, సంసంజనాల (Adhesives) తయారీలో దీన్ని ఉపయోగిస్తారు.

గ్లిప్టాల్

గ్లిప్టాల్ పాలిమర్ ఒక పాలిఎస్టర్.

▲ ఇథిలీన్ గ్లైకాల్, ప్తాలిక్ ఆమ్లం (Pthalic Acid) మిశ్రమాన్ని ఉత్ప్రేరకం సమక్షంలో అధిక ఉష్ణోగ్రత వద్ద సంఘనన పాలిమరీకరణం చెందించి గ్లిప్టాల్‌ను తయారు చేస్తారు.

▲ దీన్ని పెయింట్లు, వార్నిష్‌ల తయారీలో వాడతారు.



రచయిత
డా. పి. భానుప్రకాష్
అసిస్టెంట్ ప్రొఫెసర్

సిలికోన్లు (Silicones)

బలమైన Si - O - Si బంధాలను కలిగిన కార్బనిక - సిలికాన్ అణుపుంజాలను సిలికోన్లు అంటారు.

సాధారణ రసాయన ఫార్ములా: $-\!(R_2SiO)\!-_n$.

ఇక్కడ R అంటే వివిధ రకాల ఆల్కైల్ సమూహాలు.

✦ సిలనోల్‌లను పాలిమరీకరణం చెందించి సిలికోన్‌లను తయారుచేస్తారు.

✦ తక్కువ శృంఖల పొడవు ఉండే సిలికోన్‌లు నూనె లాంటి ద్రవాలుగా, మధ్యస్థ శృంఖలం ఉండేవి గ్రీజులుగా, అధిక శృంఖలం ఉండేవి రెజిన్, రబ్బరు లాంటి ఘన పదార్థాలుగా ఉంటాయి.

✦ ఇవి అధిక ఉష్ణ స్థిరత్వం, రసాయనిక జడత్వం, జలవిరోధ స్వభావాన్ని కలిగి ఉంటాయి.

✦ సిలికోన్ నూనెలను పెయింట్, ఎనామిల్ తయారీలో వినియోగిస్తారు. అదేవిధంగా బ్రేక్‌ల్లో హైడ్రాలిక్ ద్రవంగా, ట్రాన్స్‌ఫార్మర్ల నూనెలుగా, అధిక ఉష్ణోగ్రతను ఇచ్చే తైలతాపకంగా, నిర్వాత పంపుల్లో ఉపయోగిస్తారు.

✦ సిలికోన్ ఎమల్షన్లను వస్త్రాలు, కాగితం, పూతవేసి జలజితం చేయడంలో వాడతారు.

✦ దీని నూనెలను కారు పాలిష్, షూ పాలిష్‌లలో వాడతారు.

✦ సిలికోన్ రబ్బర్‌ను ఉష్ణ నిరోధకాలుగా, విద్యుత్ ఉపకరణాల్లో విద్యుత్ బంధకాలుగా, విమానాల్లో సీల్ వేసే పదార్థాలుగా, గాస్కెట్లుగా, వ్యోమగాములు ఉపయోగించే బూట్ల తయారీలో వాడతారు. దీని గ్రీజులను కందెనలుగా వినియోగిస్తారు.

✦ సిలికోన్ రెజిన్లను లామినేషలో, లోహ-ఉపరితలంపై నాన్-స్టిక్ పూత వేయడానికి, విద్యుత్ బంధక పదార్థాలుగా ఉపయోగిస్తారు.

637 Word of the Day

Nauseous

Telugu meaning: వికారం, వాంతితెప్పించే

English meaning: The word nauseous (నాషెఅస్) is an adjective that describes a feeling like you are about to vomit or something that causes disgust.

Synonyms: Sick, Queasy

Antonyms: Comfortable, Healthy

Usage: **1.** She felt nauseous after eating the spoiled food.

2. The nauseous smell from the garbage made it hard to breathe.

నోటిఫికేషన్స్

ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్

ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్) వివిధ విభాగాల్లో మేనేజర్, ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 44. అర్హులైన అభ్యర్థులు 2025 మే 9 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

సైంటిస్ట్ పోస్టులు

ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) సైంటిస్ట్/ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 63. దరఖాస్తు ఫీజు రూ.250. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 2025 మే 19.

ఇంజినీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) ఫిక్స్‌డ్‌టర్మ్/ కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 14. దరఖాస్తు ఫీజు రూ.600. ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ 19 మే 2025.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ ప్రవేశాలకు నేడే (మే 2) చివరి తేదీ

☛ జిప్‌మర్‌లో ప్రాజెక్ట్ పోస్టులు. డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

☛ ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో మేనేజర్ పోస్టులు. ఎల్ఎల్‌బీలో ఉత్తీర్ణులు అర్హులు.

☛ డిఫెన్స్ ల్యాబొరేటరీ స్కూల్‌లో టీచింగ్ పోస్టులు. డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

☛ జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (అడ్వాన్స్‌డ్) 2025

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

మే 2 చరిత్రలో ఈనాడు

వరల్డ్ ట్యూనా డే



'వరల్డ్ ట్యూనా డే'ను ప్రపంచవ్యాప్తంగా ఏటా మే 2న నిర్వహిస్తారు. ట్యూనా అనేది ఒక రకమైన సముద్ర చేప జాతి. దీన్ని ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వాటి సంరక్షణ గురించి చైతన్యపరచడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

- ప్రపంచవ్యాప్తంగా అత్యంత విస్తృతంగా వినియోగించే చేప జాతుల్లో ట్యూనా ఒకటి. సుమారు 96 దేశాల ఆర్థిక వ్యవస్థలు, ఆహార భద్రతలో ఇది ముఖ్య భాగంగా ఉంది. ఐక్యరాజ్య సమితి (యూఎన్ఓ) అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు ఏడు మిలియన్ టన్నుల ట్యూనా చేపలను వేటాడుతున్నారు. అమెరికా, జపాన్ ప్రపంచంలోనే అతిపెద్ద ట్యూనా మార్కెట్‌లు. ఇక్కడి ప్రజలు ఏటా మిలియన్ టన్నులకు పైగా ట్యూనా చేపలు తింటారు.
- ట్యూనా చేపలు గంటకు 43 మైళ్ల వేగంతో ఈదగలవు. వీటిలో ఒమేగా-3, విటమిన్ బి-12, ఇతర ఖనిజాలు, ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి.
- ట్యూనాలో మొత్తం 15 రకాలు ఉన్నాయని అంచనా. సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) ప్రకారం, భారత సముద్ర జలాల్లో కేరా, కవాకవా, ఫ్రిగేట్ ట్యూనా, డాగ్‌టూత్ ట్యూనా, బుల్లెట్ ట్యూనా, ఓరియంటల్ బోనిటో, స్కిప్‌జాక్, అల్బాకోర్, ఎల్లోఫిన్ ట్యూనా అనే తొమ్మిది రకాలు ట్యూనాలు నివసిస్తున్నాయి.


చారిత్రక నేపథ్యం:

ప్రపంచవ్యాప్తంగా ట్యూనా చేపలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా వాటిని అతిగా వేటాడేవారు. దీంతో సముద్ర జాలాల్లో వాటి సంఖ్య క్రమేణా తగ్గుతూ వచ్చింది. ట్యూనా సంరక్షణ, స్థిరమైన వేట పద్ధతులను ప్రోత్సహించే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి 2016, డిసెంబరులో మే 2న 'వరల్డ్ ట్యూనా డే'గా నిర్వహించాలని తీర్మానించింది. 2017 నుంచి దీన్ని ఏటా నిర్వహిస్తున్నారు.

☛ యూఎన్ఓ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 14వది అయిన 'సముద్రాలు, జలవనరుల సంరక్షణ'లో భాగంగా ఈ రోజును రూపొందించారు.

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

ఒక దేశం తన పౌరులు లేదా సంస్థలు లేదా ఇతర దేశాల నుంచి తీసుకున్న రుణాన్ని 'ప్రభుత్వ రుణం' అంటారు. కేంద్ర ప్రభుత్వం వ్యయానికి/ ఖర్చుకి సేకరించిన ఆదాయ వనరులు చాలనప్పుడు రుణాల ద్వారా వనరులను సమకూర్చుకుంటుంది. అది బ్యాంకులు, వ్యాపార సంస్థలు, కార్పొరేట్ రంగం, వ్యక్తుల నుంచి రుణం తీసుకుంటుంది. ఇక్కడ ప్రభుత్వం అంటే కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాలు. సాధారణంగా ప్రభుత్వ రుణాలు బాండ్లు, ట్రెజరీ బిల్లుల రూపంలో ఉంటాయి. వీటిని కొనుగోలు చేసినవారికి నిర్దిష్ట/ నిశ్చిత వడ్డీతో సహా చెల్లింపులకు ప్రభుత్వం హామీ ఇస్తుంది.



కేంద్ర ప్రభుత్వ రుణాలు

ప్రభుత్వ రుణానికి ఆధారాలు

ప్రభుత్వ రుణానికి ప్రధాన ఆధారాలు నాలుగు. అవి:

1. వ్యక్తుల నుంచి రుణ సేకరణ
2. బ్యాంకేతర విత్త సంస్థల నుంచి రుణ సేకరణ
3. వాణిజ్య బ్యాంకుల నుంచి రుణ సేకరణ
4. బహిర్గత ఆధారాలు

ప్రభుత్వ రుణాలు – రకాలు

- అంతర్గత రుణం/ దేశీయ రుణం
- బహిర్గత రుణం/ విదేశీ రుణం
- స్వల్ప - మధ్య - దీర్ఘకాలిక రుణాలు
- ఉత్పాదక రుణం
- అనుత్పాదక రుణం
- విమోచిత రుణం
- అవిమోచిత రుణాలు
- నిధీకృత రుణం
- అనిధీకృత రుణం
- నిర్బంధ రుణం
- స్వచ్ఛంద రుణం

కేంద్ర ప్రభుత్వ రుణ బాధ్యతలు

కేంద్ర ప్రభుత్వ రుణ బాధ్యతలను మూడు రకాలుగా వర్గీకరించారు. అవి: ఎ) అంతర్గత రుణం బి) బహిర్గత రుణం (విదేశీ రుణం) సి) ఇతర రుణాలు (ఇతర రుణాలను అంతర్గత రుణాల్లో చేర్చారు)

రుణ భార అంచనా పద్ధతులు, రుణ విమోచన పద్ధతులు, ప్రభుత్వ రుణం ప్రాముఖ్యత, రాష్ట్ర ప్రభుత్వాల రుణ బాధ్యతలు, ప్రభుత్వ రుణం అనుకూలతలు – ప్రతికూలతలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

సంఖ్యా వ్యవస్థ

మెగా డీఎస్సీ 2025 ప్రత్యేకం

మ్యాథమెటిక్స్

1. A: క్రమ భిన్నం వ్యుత్క్రమ క్రమ భిన్నం అవుతుంది.
B: అపక్రమ భిన్నం వ్యుత్క్రమ క్రమ భిన్నం అవుతుంది.
1) A సత్యం, B అసత్యం 2) A అసత్యం, B సత్యం
3) A, B అసత్యం 4) A, B సత్యం

2. ఒక దీర్ఘచతురస్రాకార కాగితం పొడవు $4\frac{2}{3}$ సెం.మీ., వెడల్పు $3\frac{2}{5}$ సెం.మీ. అయితే దాని చుట్టుకొలత ఎంత?
1) $\left(17+\frac{11}{15}\right)$ సెం.మీ. 2) $\left(16+\frac{2}{15}\right)$ సెం.మీ
3) $\left(16+\frac{2}{15}\right)$ సెం.మీ. 4) ఏదీకాదు

3. కార్తీక్ ఒక ఇంటికి ఒక రోజులో $\frac{2}{5}$వ భాగం రంగు వేయగలడు. ఇదే వేగంతో పనిచేస్తే ఆ ఇంటికి పూర్తిగా రంగు వేయడానికి ఎన్ని రోజులు పడుతుంది?
1) $5\frac{1}{2}$ 2) $4\frac{1}{2}$ 3) $2\frac{1}{2}$ 4) ఏదీకాదు

4. $-\frac{9}{4}, \frac{5}{27}$ల వ్యుత్క్రమాల లబ్ధానికి $-\frac{12}{5}$ సంకలన విలోమం కూడితే వచ్చే ఫలితం ఎంత?
1) 7 2) −1 3) 0 4) 10

5. ప్రతీక 6వ తరగతి చదువుతోంది. ఆమె వయసు 12 ఏళ్లు. ఆమె తండ్రి వయసు ఆమె వయసుకు 5 రెట్లు. అయితే ఆమె తండ్రి వయసు ఎంత?
1) 60 2) 40 3) 36 4) ఏదీకాదు

6. కింది వాటిలో రామానుజన్ సంఖ్య ఏది?
1) 1729 2) 1829 3) 1789 3) 1879

7. కింది వాటిలో సరైంది?
A) 1 గూగుల్ ప్లేక్స్ = $10^{10^{100}}$
B) 1 గూగుల్ $=10^{100}$
C) గూగుల్ = ఒకటి పక్కన వంద సున్నాలు
1) A, B, C 2) B, C
3) A, C 4) ఏదీకాదు

8. కింది వాటిలో హిందూ సంఖ్యామానం ఉపయోగిస్తున్న దేశాలు ఏవి?
A) శ్రీలంక B) భారతదేశం
C) పాకిస్థాన్ D) బంగ్లాదేశ్
1) A, B, C 2) B, A, D
3) C, D, A 4) పైవన్నీ

9. 857065723 అనే సంఖ్యలో 5ల స్థాన విలువల భేదాన్ని కనుక్కోండి?
1) 49995000 2) 48995000
3) 499980000 4) ఏదీకాదు

10. భూమి ఒకసారి భ్రమణం చేయడానికి 24 గంటలు పడుతుంది. అయితే 216 గంటల్లో భూమి ఎన్ని భ్రమణాలు చేస్తుంది?
1) 18 2) 9 3) 24 4) 12

11. పవన్ అనే వ్యక్తి తన ఇంటి గృహ ప్రవేశానికి 1827 మంది అతిథులను ఆహ్వానించాలని నిర్ణయించాడు. ఆహ్వాన పత్రాలు ముద్రించడానికి ఒక్కో కార్డు వెల రూ.9. అయితే ప్రింటింగ్ ప్రెస్ యజమానికి చెల్లించాల్సిన మొత్తం ఎంత?
1) రూ.16443 2) రూ.16641
3) రూ.16761 4) రూ.16146

12. ఒక చిన్నతరహా పరిశ్రమ ఒక వారంలో 958 పెన్నులు తయారు చేస్తుంది. ఒక్కొక్క ప్యాకెట్‌లో 14 పెన్నులు ఉంటే మొత్తం ఎన్ని ప్యాకెట్లు తయారు అవుతాయి? ఎన్ని పెన్నులు మిగిలిపోతాయి?
1) 68, 6 2) 64, 7
3) 60, 6 4) ఏదీకాదు

13. కింది వాటిలో శకుంతలాదేవికి సంబంధించి సరైంది?
A) ఈమె ఒక భారతీయ రచయిత, ప్రముఖ గణిత మేధావి.
B) అతి వేగంగా గణనలు చేయడంలో గిన్నిస్ రికార్డును సొంతం చేసుకున్నారు.
C) ఈమెను మానవ గణన యంత్రంగా పిలుస్తారు.
D) ఆమె రెండు 13 అంకెల సంఖ్యను గుణించి, 28 సెకన్లలో జవాబు చెప్పారు.
1) A, D, C 2) B, D, A
3) B, D 4) పైవన్నీ

14. 17^{200} ను 18తో భాగిస్తే వచ్చే శేషం?
1) 2 2) 1 3) 16 4) 17

15. $47^{43} + 43^{43} + 47^{47} + 43^{47}$ లకు ఉమ్మడి కారణాంకం?
1) $(47^{43}+43^{43})$ 2) $(47+43)$
3) $(47 - 43)$ 4) ఏదీకాదు

16. కింది వాటిలో ఏ సంఖ్య $4^{61} + 4^{62} + 4^{63} + 4^{64}$ కు భాజకం?
1) 11 2) 13 3) 10 4) 3

17. $2(476+424)^2 - (4\times476\times424) =$
1) 2704 2) 2904
3) 3116 4) 2906

18. 481*673 అనే సంఖ్య 9తో నిశ్శేషంగా భాగితమైతే * బదులుగా వచ్చే కనిష్ఠ సంఖ్య?
1) 5 2) 7 3) 2 4) 6

19. ఒక సంఖ్యను 4తో భాగిస్తే దాని విలువ 12 తగ్గింది. అయితే ఆ సంఖ్య ఏది?
1) 14 2) 18 3) 16 4) 20

20. రెండు సంఖ్యల మొత్తం 48. భేదం 12. అయితే ఆ సంఖ్యల మధ్య నిష్పత్తి ఎంత?
1) 3 : 5 2) 5 : 3
3) 4 : 3 4) ఏదీకాదు

21. ఒక పాల వ్యాపారి ప్రతిరోజు ఉదయం 35 లీటర్లు, సాయంత్రం 20 లీటర్ల చొప్పున ఒక హాస్టల్‌కు పాలు సరఫరా చేస్తున్నాడు. ఒక లీటరు పాల ధర రూ.70. అయితే పది రోజులకు అతడికి ఎంత ఆదాయం వస్తుంది?
1) రూ.38,500 2) రూ.39,500
3) రూ.41,500 4) రూ.30,500

22. 972102111 అనే సంఖ్యలో 2ల స్థాన విలువల భేదాన్ని కనుక్కోండి.
1) 1898000 2) 1234500
3) 1998000 4) ఏదీకాదు

23. ఒక రైతు తాను పండించిన మిరప పంటను మార్కెట్‌కు తీసుకువెళ్లాడు. ఇందుకోసం అతడు ఒక్కో బస్తాలో 25 కిలోల మిరపకాయలు నింపాడు. ఈ విధంగా 60 సంచులు తీసుకు వెళ్తే, ఒక్కొక్క మిరప బస్తా రూ.25 ధర పలికింది. అయితే రైతు చేతికి అందిన మొత్తం ఎంత?
1) రూ.42,500 2) రూ.37,500
3) రూ.40,500 4) రూ.38,500

24. 430 ని 35 తో భాగిస్తే భాగఫలం 12. అయితే శేషం ఎంత?
1) 12 2) 15 3) 10 4) 18

25. ఒక సంఖ్యను 117తో భాగిస్తే శేషం 30 వస్తుంది. అదే సంఖ్యను 13తో భాగిస్తే వచ్చే శేషం ఎంత?
1) 4 2) 7 3) 5 4) 3

26. 40 నుంచి 180 వరకు ఉన్న సంఖ్యల్లో 7తో భాగితమయ్యే సంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
1) 20 2) 15 3) 51 4) 18

27. 60 నుంచి 150 వరకు ఉన్న సంఖ్యల్లో 12తో భాగితమయ్యే సంఖ్యలు ఎన్ని?
1) 14 2) 18 3) 8 4) 12

28. విభాజకం భాగఫలానికి రెట్టింపు, భాగఫలం శేషానికి 3 రెట్లు. శేషం 5. అయితే విభాజ్యం ఎంత?
1) 455 2) 181
3) 611 4) 122

సమాధానాల కోసం క్యూఆర్ స్కాన్ చేయండి

రచయిత: బూసర గణేశ్

కరెంట్ అఫైర్స్

■ 2025 ఆసియా స్నూకర్ ఛాంపియన్‌షిప్ పురుషుల టైటిల్ విజేతగా ఎవరు నిలిచారు? (స్నూకర్, బిలియర్డ్స్ ఈవెంట్స్‌లో ఇది ఇతడికి 14వ ఆసియా టైటిల్ కావడం విశేషం.)

జ: పంకజ్ అద్వాణీ (భారత్)



మాదిరి ప్రశ్నలు

■ ఏ నగరంలోని పద్మజా నాయుడు హిమాలయన్ జూలాజికల్ పార్కులో దేశంలోనే తొలిసారిగా జూ ఆధారిత బయోబ్యాంకు, జంతు మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు? (సీసీఎంబీ సహకారంతో వీటిని ఏర్పాటు చేశారు.)

జ: డార్జీలింగ్ (పశ్చిమ బెంగాల్)

■ ప్రపంచంలో ఏ దేశాల్లో అత్యధికంగా రొమ్ము క్యాన్సర్‌లు సంభవిస్తున్నట్లు ఇటీవలి అధ్యయనం వెల్లడించింది? (185 దేశాల్లో రొమ్ము క్యాన్సర్‌లు, సంబంధిత మరణాలపై ఆస్ట్రేలియా, కెనడా పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు.)

జ: ఆస్ట్రేలియా, న్యూజిలాండ్

■ ఇటీవల ఏ రాష్ట్ర ప్రభుత్వం 'బథౌయిజం'ను దరఖాస్తు ఫారాల్లో అధికారిక మత పరమైన ఎంపికగా ప్రకటించింది?

జ: అస్సాం (బథౌయిజం అనేది అస్సాంలోని అతిపెద్ద మైదాన తెగ అయిన బోడోల మత విశ్వాసంగా ఉంది.)

మరింత సమాచారం

ప్రకృతిని పూజించి.. నగరాలను నిర్మించి!

మానవుడు అభివృద్ధి క్రమంలో సంచారజీవి నుంచి స్థిరజీవిగా మారిన తర్వాత వ్యవసాయం, పశుపోషణ, కళలు వృద్ధి చెంది జనసాంద్రత కేంద్రీకృతమైంది. సామూహిక నడవడిక, కట్టుబాట్లు, లిపి- భాషతో కూడిన సమాచార మార్పిడి, సాంకేతిక పురోగతిలాంటివన్నీ పట్టణాభివృద్ధికి దారితీశాయి. క్రమంగా పాలకుడి ఆధిపత్యం, చట్టాలు అమల్లోకి వచ్చాయి. ఈ పరిణామాన్నే నాగరికత అని, ఆ సమాజాన్నే నాగరిక సమాజం అని పేర్కొన్నారు. వ్యవసాయ అనుకూలతఉండే నదీలోయ ప్రాంతాల్లో తొలి నాగరికతలు ఏర్పడ్డాయి. భారత్ ఉపఖండంలో వెలుగు చూసిన సింధు, ఆర్య నాగరికతలు ఆ కోవలోనివే. నాటి సామాజిక, మత పరిస్థితులు, ప్రజల జీవనవిధానం గురించి పరీక్షార్థులకు సమగ్ర అవగాహన ఉండాలి.


2025 మెగా డీఎస్సీ
కంటెంట్ - సోషల్ స్టడీస్ - చరిత్ర

తొలి నాగరికతలు

భారత నాగరికత ఆర్యులదేనని, ఆర్య నాగరికతే మొదటిదని 19వ శతాబ్దానికి ముందు వరకు భావించేవారు. 1920లో 'సర్ జాన్ మార్షల్' హరప్పాలో మొదటిసారిగా తవ్వకాలు జరిపాడు. దీంతోనే భారతదేశానికి పూర్వం ఒక విశిష్ట నాగరికత ఉన్నట్లు ప్రపంచానికి తెలిసింది. హరప్పా తవ్వకాల తర్వాత అంటే 19వ శతాబ్దం నుంచి సింధు నాగరికతను తొలి నాగరికతగా పరిగణిస్తున్నారు. అయితే 1850లోనే కరాచీ నుంచి లాహోర్‌కు రైల్వేలైన్లు వేస్తున్న సందర్భంలో 5000 సంవత్సరాల నాటి పురాతన రాళ్లు కూడా లభించాయి.

సింధు నాగరికతకు సమకాలీన నాగరికతలు: సింధు నాగరికతది ప్రపంచంలోని పురాతన నాగరికతల్లో 3వ స్థానం. మెసపటోమియా, ఈజిప్ట్, చైనా నాగరికతలు సింధు నాగరికతకు సమకాలీన నాగరికతలు.

మెసపటోమియా నాగరికత: ప్రపంచంలోనే మొదటిది మెసపటోమియా నాగరికత. వీరి లిపి 'క్యూనిఫామ్'. ఈ నాగరికతకు సహజసిద్ధమైన అవరోధాలు లేవు. యూఫ్రటీస్, టైగ్రీస్ నదుల మధ్య ఈ నాగరికత పుట్టింది.


హరప్పా

ఈజిప్ట్ నాగరికత: ఈ నాగరికతది ప్రపంచంలో 2వ స్థానం. ఇది నైలు నది ఒడ్డున ఉంది. ఈ నదికి వచ్చే వరదలను ఊహించవచ్చు. ఈజిప్టు నాగరికత లిపి 'హోరియో గ్లైఫిక్'. ఈజిప్టును పరిపాలించిన రాజులు 'ఫారోలు'. వీరి సమాధులనే 'పిరమిడ్స్' అంటారు.

చైనా నాగరికత: చైనా నాగరికత హొయాంగ్ హో నది (పసుపు నది) ఒడ్డున విస్తరించింది. ఈ నాగరికతది ప్రపంచంలో 4వ స్థానం. చైనీయుల లిపి ఒరాకిల్‌బోన్ (మాండరిన్ భాష). ఈ నాగరికతలో పేపర్ వాడకంతో పాటు కరెన్సీ కూడా ఉంది.

సంహిత: శ్లోకాలు

బ్రాహ్మణాలు: వేదాల్లోని శ్లోకాలు లేదా యజ్ఞయాగాది క్రతువుల్లో పాటించాల్సిన విధానాల గురించి గద్య రూపంలో తెలియజేస్తాయి.

అరణ్యకాలు: విద్యావాదం, క్రతువుల గురించి వివరిస్తాయి.

ఉపనిషత్తులు: ఉపనిషత్ అంటే చేరువుగా వచ్చి కూర్చోవడం అని అర్థం. గురుశిష్యుల మధ్య జరిగే తాత్విక చర్చలనే ఉపనిషత్తులు అంటారు. ఆత్మ, పరమాత్మ, మరణం తర్వాత ఏం జరుగుతుంది. విశ్వ ఆవిర్భావం ఎలా జరిగిందనే ప్రశ్నలకు ఉపనిషత్తులు సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశాయి. రుగ్వేదంలోని నసదీయసూక్తంలో విశ్వ ఆవిర్భావం గురించి చర్చ ఉంది. ✍ రుగ్వేదంలోని 10వ మండలం పురుష సూక్తంలో కుల వ్యవస్థ ప్రస్తావన ఉంది. ✍ కఠోపనిషత్తులో నచికేతుడు, యముడికి మధ్య మరణం తర్వాత ఏం జరుగుతుందనే అంశంపై చర్చ ఉంది.

సింధు నాగరికత

క్రీస్తు పూర్వం 2500-1700 కాలంలో సింధు, గగ్గర్, హక్రా నదుల ప్రాంతాల్లో ఈ నాగరికత విస్తరించింది.

పట్టణ ప్రణాళిక: సింధు ప్రజలకు పట్టణ ప్రణాళిక పాటించారు. వీరు పట్టణాలను గ్రిడ్ విధానంలో రూపొందించారు. ఈ పట్టణాల్లో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ ఉంది. దీనిప్రకారం వీరు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని తెలుస్తోంది. వీరి పట్టణాల్లో విశాలమైన రహదారులు, బావులు లాంటివి ఉన్నాయి.

గృహాలు: సింధు ప్రజలు ఇళ్లను కాల్చిన ఇటుకలు, ఎండబెట్టిన ఇటుకలతో నిర్మించారు. వీరు రెండంతస్తుల గృహాల్లో కూడా నివసించారు. ప్రతి ఇంట్లో ఒక బావి, స్నానాల గది ఉండేవి. మురుగునీటిని బయటకు పంపడానికి టెర్రాకోట పైపులు ఉపయోగించేవారు.

సామాజిక పరిస్థితులు: సింధు ప్రజలు అలంకరణ ప్రియులు. పురుషులు, స్త్రీలు అలంకరణకు ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చారు. వీరికి అలంకరణ సామగ్రి, పరిమళ ద్రవ్యాల గురించి తెలుసు. సింధు ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. సింధు ప్రజలు పత్తిని మొదటిసారిగా పండించారు. సింధు ప్రజలు వస్త్రాలు నేయడం, ఇటుకలు తయారుచేయడాన్ని మరొక ముఖ్యమైన వృత్తిగా భావించేవారు. ఈ ప్రజల ప్రధాన వినోదం ఎద్దుల పోటీలు. పాచికలు (జూదం), చదరంగం, నాట్యం, సంగీతం ఇతర వినోదాలు.

మత వ్యవస్థ: సింధు ప్రజలు ప్రకృతి దేవతలను (గాలి, నీరు, ఆకాశం, భూమి) పూజించారు. వీరి ప్రధాన దైవం 'అమ్మ తల్లి'. ప్రధాన పురుష దైవం పశుపతి (శివుడు). పూజించిన వృక్షాలు రావి చెట్టు, వేప చెట్టు. సింధు ప్రజలు స్వస్తిక్ గుర్తును పవిత్రంగా భావించేవారు.


మొహంజోదారో

తూనికలు - కొలతలు: సింధు నాగరికత ప్రజలు నిర్దిష్ట/ప్రామాణికమైన తూనికలు, కొలతలను పాటించారు. వీరి తూనికలను మధ్య ఆసియా, పర్షియా లాంటి దేశాల్లో ఉపయోగించేవారు. సింధు ప్రజల తూనికలు ఏ పట్టణంలో చూసినా ఒకేలా ఉండేవి.

ఉదా: సింధు ప్రాంతంలోని ఇటుకలు ఎక్కడ చూసినా ఒకే పరిమాణంలో కనిపించాయి.

లిపి: ఈ ప్రజల లిపి బొమ్మలు బొమ్మలుగా ఉండటంతో బొమ్మల లిపి (పిక్టోగ్రఫీ) అంటారు.

సింధు నాగరికత - ముఖ్యమైన పట్టణాలు:

హరప్పా: సింధు నాగరికతను హరప్పా నాగరికత అని కూడా అంటారు. ఈ ప్రాంతంలో ఆరు ధాన్యాగారాలు బయటపడ్డాయి. పనివారి నివాస గృహాలు ఈ ప్రాంతంలో లభించాయి.

మొహంజోదారో: హరప్పా తర్వాత తవ్వకాలు జరిపిన రెండో ప్రదేశం - మొహంజోదారో. దీన్నే మృతుల దిబ్బ అంటారు. మొహంజోదారోలో మహాస్నానవాటిక బయల్పడింది. దీన్ని మతపరమైన కార్యక్రమాలు జరిగినప్పుడు స్నానాల నిమిత్తం ఉపయోగించేవారు. ఈ స్నానవాటికకు నాలుగు వైపులా గదులు నిర్మించారు. మొహంజోదారోలో పశుపతి మహాదేవుడి ముద్రిక లభించింది. పశుపతి మహాదేవుడి చుట్టూ పులి, ఖడ్గమృగం, ఏనుగు, గేదె, రెండు జింకలు ఉన్నాయి. ఈయన ధ్యాన స్థితిలో, తలపై రెండు కొమ్ములతో ఉన్నాడు. ఇక్కడే కాంస్యంతో చేసిన నాట్య బాలిక, గడ్డం ఉన్న పూజారి రాతి విగ్రహం లభించాయి.

మరిన్ని వివరాలు

లోథాల్: ఈ పట్టణం గుజరాత్‌లో ఉంది. లోథాల్ సింధు ప్రజల ప్రధాన ఓడరేవు. దీన్ని ఇటుకలతో నిర్మించారు. ఈ ఓడరేవు నుంచి మెసపటోమియా, ఈజిప్ట్, ఇరాన్ (ప్రష్యా) మొదలైన సుదూర ప్రాంతాలతో వర్తక వ్యాపారాలు చేసేవారు.

కాళీభంగన్: ఇది రాజస్థాన్‌లో ఉంది. కాళీభంగన్, లోథాల్‌ల్లో హోమగుండాలు లాంటి నిర్మాణాలు (అగ్నివేదికలు) లభించాయి.

సింధు నాగరికత - పతనం:

1) ఆర్యుల దండయాత్ర. ఈ అభిప్రాయాన్ని మార్టిమన్ వీలర్ అనే చరిత్రకారుడు అంగీకరించలేదు. 2) వరదలకు గురికావడం. 3) అడవులు నరికివేయడంతో గగ్గర్, హక్రా నదులు ఎండిపోవడం. 4) భూకంపాలు లాంటివి.

ఆర్య నాగరికత/వేద నాగరికత

ఆర్యుల పుట్టుపూర్వోత్తరాల మీద అనేక అభిప్రాయాలున్నాయి. ఆర్యులు మధ్యఆసియా ప్రాంతానికి చెందినవారని కొందరు భావించారు. ఆర్కిటిక్ ప్రాంతానికి చెందిన వారని, ఆల్ప్స్ పర్వత ప్రాంతాలకు చెందిన వారని కొంతమంది అభిప్రాయం. ఆర్యులు ఇండో - యూరోపియన్ భాషా సమూహానికి చెందిన వారని మరికొంతమంది చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. ఆర్యుల స్థానం భారత దేశమేనని కొందరి వాదన.

ఆర్యుల చరిత్రకు ఆధారాలు: లిఖిత/వాఙ్మయ ఆధారాలైన వేదాలు, రామాయణం, మహాభారతం ఇతిహాసాలు. పురావస్తు ఆధారాలైన ఇనుము, కుండలు.

వేద సాహిత్యం: వేదాలను శ్రుతులు అంటారు. భారతీయ జ్ఞానానికి భారతీయ యోగాకు వేదాలే ఆధారాలు. స్వామి దయానంద సరస్వతి 'గో బ్యాక్ టు వేదాస్' అనే నినాదాన్నిచ్చారు. వేదాలు 4 అవి-

1) **రుగ్వేదం:** దేవుళ్ల ప్రార్థనలు, శ్లోకాల సమూహం.
2) **యజుర్వేదం:** యజ్ఞయాగాది క్రతువులు.
3) **సామవేదం:** భారత సంగీతానికి మూలం. ప్రార్థనల శ్లోకాలకు రాగయుక్త వివరణ ఉంటుంది.
4) **అథర్వణ వేదం:** దుష్టశక్తులకు సంబంధించిన లేదా భూతప్రేతాలకు సంబంధించిన (విషయాలు) మంత్రాలతో కూడిన వేదం.



రచయిత: కాకులూరు వెంకటేశ్వర్లు

గమ్యాలకు చేర్చే బోధనాభ్యసన మార్గం!

జాతీయ విద్యా ప్రణాళిక చట్రం

అధ్యయనం చేయాల్సిన అంశాల వరుస క్రమమే విద్యా ప్రణాళిక - టెల్లిగ్రామ్ (అమెరికా). ❖ విద్యార్థుల సమగ్ర మూర్తిమత్వ సాధనకు పాఠశాల కల్పించే అనుభవాల సముదాయాన్ని 'విద్యా ప్రణాళిక' అంటారు. ❖ Curriculum (విద్యా ప్రణాళిక) అనే ఆంగ్ల భాష పదం Currere అనే లాటిన్ పదం నుంచి ఉద్భవించింది. ❖ Currere అనే లాటిన్ పదానికి 'పరుగెత్తే దారి' అని అర్థం. ❖ విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ గమ్యాలను చేరుకోవడం కోసం బోధనాభ్యసన కార్యక్రమం ద్వారా అనుసరించే మార్గమే విద్యా ప్రణాళిక. ❖ కరికులం మార్గమైతే, మార్గదర్శి ఉపాధ్యాయుడు - విలియం జె. బెన్నెట్ ❖ పాఠ్య విషయాలు, సహపాఠ్య విషయాల సమ్మేళనమే విద్యా ప్రణాళిక.


మెథడాలజీ - గణితం

కరికులంతో సంబంధం ఉన్న అంశాలు: ❖ ఉపాధ్యాయుడు బోధించాల్సిన అంశాలు ❖ బోధనాభ్యసన లక్ష్యాలు ❖ పాఠ్యాంశాలు, వ్యాసక్తులు ❖ విద్యార్థి అభ్యసించాల్సిన అంశాలు❖ బోధనాభ్యసన ఉపకరణాలు ❖ మూల్యాంకనం

జాతీయ విద్యా ప్రణాళిక చట్రం (NCF) - చరిత్ర: కొఠారీ కమిషన్ (1964-66) సిఫార్సుల మేరకు దేశంలో ప్రప్రథమంగా జాతీయ విద్యా విధానం-1968 రూపొందించారు. దాని ఆధారంగా 1975లో తొలిసారిగా జాతీయ విద్యా ప్రణాళిక చట్రాన్ని అమలు చేశారు. తర్వాత 1986లో మరో జాతీయ విద్యా విధానం వచ్చింది. దాన్ని అనుసరిస్తూ 1988లో రెండో జాతీయ ప్రణాళిక చట్రాన్ని ఏర్పాటు చేశారు. 2000వ సంవత్సరంలో మూడో జాతీయ ప్రణాళిక చట్రాన్ని అందించారు. దేశ విద్యా చరిత్రలో ఇదొక మైలురాయిగా నిలిచిపోయింది. కాలానుగుణంగా విద్యలోని మార్పుల ప్రకారం 2005లో మరో జాతీయ ప్రణాళిక చట్రం వచ్చింది.

జాతీయ విద్యా ప్రణాళిక చట్రం- 2005 మార్గదర్శక సూత్రాలు: ❖ కంఠస్థం చేసే విధానాన్ని మార్చాలి. ❖ బోధనను బయటి జీవితంతో అనుసంధానం చేయాలి. ❖ విద్యార్థి సమగ్ర అభివృద్ధికి తోడ్పడేలా పాఠ్యాంశాలను రూపొందించాలి. ❖ తరగతిలో సమైక్యం అయ్యేలా పరీక్షలు సరళీకరించాలి.

గణిత విద్యా ప్రణాళిక: ❖ 70వ దశకంలో సెకండరీ స్థాయిలో జనరల్ మ్యాథ్స్, కాంపోజిట్ మ్యాథ్స్ అనే రెండు రకాల ప్రణాళికలు ఉండేవి. ❖ విద్యార్థులందరికీ ఉపయోగపడేలా జనరల్ మ్యాథ్స్ ఉండేది. ఇందులో గణితానికి సంబంధించిన ప్రాథమిక అంశాలు ఉండేవి. ఇవి నిత్య జీవితంలో తప్పనిసరిగా ఉపయోగపడే అంశాలు. ❖ ఉన్నత స్థాయి అంశాలను అధ్యయనం చేసే వారి కోసం కాంపోజిట్ మ్యాథ్స్ ఉండేది. ఇందులో ఉన్నత స్థాయి అంశాలైన త్రికోణమితి, మాత్రికలు, ప్రమేయాలు లాంటి అంశాలు ఉండేవి. ❖ 80వ దశకంలో ఈ రెండు విద్య ప్రణాళికల స్థానంలో ఒకే విద్యా ప్రణాళికను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు.

మరిన్ని వివరాలు



రచయిత: విక్రమ్ గణేష్

రసాయనశాస్త్ర అధ్యయనానికి ప్రామాణిక ఆధారం!


మూలకాలను వాటి పరమాణు సంఖ్యలు, ఎలక్ట్రాన్ విన్యాసాలు, రసాయన ధర్మాల ఆధారంగా వర్గీకరించి చేసిన ప్రామాణిక అమరికే ఆవర్తన పట్టిక. నిలువు, అడ్డ వరుసలుగా నిర్మితమైన ఈ పట్టిక రసాయనశాస్త్ర అధ్యయనానికి అవసరమైన ప్రాథమిక అంశం. ఇందులోని పీరియడ్లు, గ్రూపుల వారీగా ఉండే మూలకాలు, అవి ప్రదర్శించే ధర్మాలు, వాటి కుటుంబాల గురించి పోటీ పరీక్షార్థులకు కనీస అవగాహన ఉండాలి. ఆవర్తన పట్టిక రూపొందిన తీరు, పరిణామ క్రమం, వివిధ శాస్త్రవేత్తల కృషితో పాటు ముఖ్యమైన మూలకాల ఎలక్ట్రాన్ విన్యాసం, రుణవిద్యుదాత్మకత లాంటి అంశాలపై శాస్త్రీయ పరిజ్ఞానం పెంచుకోవాలి.

మూలకాల వర్గీకరణ - ఆవర్తన పట్టిక

1. 'భౌతిక రసాయన మార్పుల ద్వారా ఒక పదార్థాన్ని అంత కంటే సూక్ష్మపదార్థంగా విభజించలేకపోతే దాన్ని మూలకం అంటారు.' అని నిర్వచించిన శాస్త్రవేత్త?
   1) లెవోయిజర్ 2) రాబర్ట్ బాయిల్ 3) బెర్జిలియస్ 4) డాబర్‌నీర్
2. 18వ శతాబ్దం చివరకు (లెవోయిజర్ కాలానికి) తెలిసిన మూలకాల సంఖ్య?
   1) 18 2) 20 3) 24 4) 63
3. 'హైడ్రోజన్ పరమాణువు ఒక నిర్మాణాత్మక ప్రమాణం, మిగిలిన అన్ని మూలకాల పరమాణువులు హైడ్రోజన్ పరమాణువుల కలయిక వల్ల ఏర్పడ్డాయి.' అని ప్రతిపాదించినవారు?
   1) లెవోయిజర్ 2) రాబర్ట్ బాయిల్ 3) ప్రౌస్ట్ 4) బెర్జిలియస్
4. త్రిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
   1) న్యూలాండ్స్ 2) మెండలీఫ్ 3) డాబర్‌నీర్ 4) మోస్లే
5. మొదటిసారిగా మూలకాలకు పరమాణు సంఖ్యలు కేటాయించిన వ్యక్తి?
   1) న్యూలాండ్స్ 2) డాబర్‌నీర్ 3) మెండలీఫ్ 4) మోస్లే
6. మూలకాలకు అష్టక నియమాన్ని రూపొందించిన వ్యక్తి?
   1) లూథర్ మేయర్ 2) మోస్లే 3) మెండలీఫ్ 4) న్యూలాండ్స్
7. మొదటి ఆవర్తన నియమాన్ని ప్రతిపాదించినవారు?
   1) మెండలీఫ్ 2) న్యూలాండ్స్ 3) మోస్లే 4) లూథర్ మేయర్
8. మెండలీఫ్ ఆవర్తన నియమం ప్రకారం మూలకాల భౌతిక, రసాయన ధర్మాలు వాటి.....ల ఆవర్తన ప్రమేయాలు.
   1) పరమాణు సంఖ్య 2) న్యూట్రాన్ల సంఖ్య 3) పరమాణు భారం 4) ఎలక్ట్రాన్ విన్యాసం
9. మెండలీవియం మూలకపు పరమాణు సంఖ్య?
   1) 100 2) 102 3) 103 4) 101
10. నవీన ఆవర్తన నియమం ప్రకారం మూలకాల భౌతిక, రసాయన ధర్మాలు వాటి ....ల ఆవర్తన ప్రమేయాలు.
    1) పరమాణు సంఖ్య 2) న్యూట్రాన్‌ల సంఖ్య 3) పరమాణు భారం 4) ఎలక్ట్రాన్ విన్యాసం
11. కింది వాటిలో అర్ధ లోహం కానిది గుర్తించండి.
    1) B 2) Si 3) Ge 4) Sn
12. లాంథనైడ్, ఆక్టినైడ్ శ్రేణి మూలకాలు ఏ గ్రూపునకు చెందుతాయి?
    1) IB 2) IIB 3) IIIB 4) IVB
13. కింది వాటిలో పరమాణు వ్యాసార్ధాన్ని కొలిచే సాధారణ ప్రమాణం కానిది?
    1) A° 2) Pm 3) nm 4) Wb
14. పాలింగ్ ఏ మూలక రుణవిద్యుదాత్మకత విలువల ఆధారంగా మిగిలిన మూలకాల రుణవిద్యుదాత్మకతలు నిర్ణయించాడు?





    1) F 2) H 3) Cs 4) C
15. ఒక మూలక ఎలక్ట్రాన్ విన్యాసం $1s^2$ అయితే దాని ఆక్సీకరణ స్థితి?
    1) +2 2) –6 3) –2 4) 0
16. గ్రూపులో పైనుంచి కిందకు పెరిగే ధర్మం?
    1) పరమాణు వ్యాసార్ధం, అలోహ స్వభావం
    2) ధనవిద్యుదాత్మకత, ఎలక్ట్రాన్ ఎఫినిటి
    3) అయనీకరణ శక్తి, లోహ స్వభావం
    4) పరమాణు వ్యాసార్ధం, లోహ స్వభావం
17. పీరియడ్‌లో ఎడమ నుంచి కుడికి పెరిగే ఆవర్తన ధర్మం?
    1) అయనీకరణ శక్తి, లోహ స్వభావం
    2) ఎలక్ట్రాన్ ఎఫినిటి, అలోహ స్వభావం
    3) రుణవిద్యుదాత్మకత, అయానిక వ్యాసార్ధం
    4) పరమాణు వ్యాసార్ధం, వేలన్సీ
18. ఒకే ఎలక్ట్రాన్ విన్యాసం ఉన్న అయాన్‌ల జత?
    1) Se^{+3}, Cr^{+3} 2) Fe^{3+}, Mn^{2+} 3) Fe^{3+}, Co^{3+} 4) Cr^{+3}, Fe^{3+}
19. **N, O, F, C** లను వాటి రుణవిద్యుదాత్మకత అవరోహణ క్రమంలో అమరిస్తే?
    1) F > C > O > N 2) F > C > N > O 3) C > F > O > N 4) F > O > N > C
20. **A, B, C, D, E** మూలకాల పరమాణు సంఖ్యలు వరుసగా 2, 3, 7, 10, 30. ఇందులో ఒకే పీరియడ్‌కు చెందిన మూలకాలు?
    1) B, D, E 2) A, D, E 3) B, C, D 4) A, B, C
21. కింది వాటిలో మొదటి అయనీకరణ శక్మం అవరోహణ క్రమం సూచించేది?
    1) Be > Mg > Ca 2) Ge > Si > C 3) B > C > N 4) K > Na > Li
22. సమాన రుణవిద్యుదాత్మకత విలువలున్న మూలకాలు?
    1) కార్బన్, సిలికాన్, జెర్మేనియం
    2) కార్బన్, టిన్, సిలికాన్
    3) సిలికాన్, జెర్మేనియం, టిన్
    4) కార్బన్, జెర్మేనియం, టిన్
23. 4వ కక్ష్యలోని ఆర్బిటాళ్ల చొచ్చుకుపోయే స్వభావాల సరైన క్రమం?
    1) 4f > 4d > 4p > 4s 2) 4f > 4p > 4d > 4s 3) 4s > 4d > 4p > 4f 4) 4s > 4p > 4d > 4f
24. కింది వాటిలో పరిమాణం పెరిగే క్రమం?
    1) $Mg^{+2} < Na^{+1} < F^- < Al$
    2) $F^- < Al < Na^{+1} < Mg^{2+}$
    3) $Al < Mg^{+2} < F^- < Na^+$
    4) $Na^+ < Al < F^- < Mg^{2+}$



కెమిస్ట్రీ

25. అత్యధిక, అత్యల్ప రుణవిద్యుదాత్మకత ఉన్న మూలకాల జత?
    1) Cl, H 2) F, Cs 3) F, H 4) Cl, Cs
26. ఎకా అల్యూమినియం ద్రవీభవన స్థానం?
    1) 35 °C 2) 39 °C 3) 30.2 °C 4) 42 °C
27. ఛాల్కోజన్స్ అంటే...
    1) మొక్కల బూడిద 2) ఖనిజ ఉత్పత్తులు 3) సముద్ర లవణం 4) ఇంధన ఉత్పత్తులు
28. మొదటిసారిగా మూలకాలకు పరమాణు సంఖ్యలను కేటాయించినవారు?
    1) న్యూలాండ్స్ 2) మెండలీఫ్ 3) డాబర్‌నీర్ 4) మోస్లే


జాన్ న్యూలాండ్స్


రాబర్ట్ బాయిల్

29. న్యూలాండ్స్ పట్టిక ఎన్ని మూలకాలకు పరిమితమైంది?
    1) 24 2) 92 3) 56 4) 108
30. కింది వారిలో ఎవరి ఆవర్తన పట్టిక ఒక చెల్లాచెదురుగా ఉన్న వంటశాల లాంటి రసాయన శాస్త్ర అధ్యయనానికి ఒక శాస్త్రీయ ఆధారాన్ని అందించింది?
    1) న్యూలాండ్స్ 2) మోస్లే 3) డాబర్‌నీర్ 4) మెండలీఫ్
31. కింది వాటిలో దేన్ని 'విస్తృత ఆవర్తన పట్టిక లేదా మెండలీఫ్ ఆవర్తన పట్టిక కొనసాగింపు'గా పిలుస్తారు?
    1) డాబర్‌నీర్ త్రిక సిద్ధాంతం
    2) ఆధునిక ఆవర్తన పట్టిక
    3) న్యూలాండ్స్ ఆవర్తన నియమం
    4) ఏదీకాదు
32. నవీన ఆవర్తన పట్టికలో – గ్రూపులు, పీరియడ్లు ఎన్ని ఉన్నాయి?
    1) 7, 18 2) 6, 7 3) 18, 7 4) 7, 8
33. ఏ గ్రూపు మూలకాలను 'ఛాల్కోజన్స్' అని పిలుస్తారు?
    1) 16వ (VIA) 2) 13వ (IIIA) 3) 15వ (VA) 4) 17వ (VIIA)
34. 18వ (VIIIA) గ్రూపు మూలకాలను ఏ విధంగా పిలుస్తారు?
    1) ఆక్సిజన్ కుటుంబం 2) బోరాన్ కుటుంబం 3) నైట్రోజన్ కుటుంబం 4) ఉత్కృష్ట వాయువుల కుటుంబం
35. కింది వాటిలో s బ్లాకు మూలకాలుగా పరిగణించే వాటిని గుర్తించండి.
    1) IIIA గ్రూపు 2) VA గ్రూపు 3) VII A గ్రూపు 4) IA & IIA గ్రూపు
36. ఏ బ్లాకు మూలకాలను లాంథనైడ్లు, ఆక్టినైడ్లు అని పిలుస్తారు?
    1) p బ్లాకు 2) s బ్లాకు 3) f బ్లాకు 4) d బ్లాకు
37. మూడో పీరియడ్‌లోని మొత్తం మూలకాల సంఖ్య?
    1) 18 2) 8 3) 32 4) 16
38. బాహ్య కక్ష్యలో మూడు లేదా అంతకంటే తక్కువ ఎలక్ట్రాన్లు ఉన్న మూలకాలను ఏమని పిలుస్తారు?
    1) లోహాలు 2) అలోహాలు 3) అర్ధ లోహాలు 4) జడవాయువులు
39. కింది వాటిలో అర్ధ లోహం కానిదాన్ని గుర్తించండి.
    1) B 2) Si 3) As 4) I
40. కింది వారిలో రుణవిద్యుదాత్మకత విలువను బంధ శక్తుల ఆధారంగా లెక్కగట్టే కొలమానాన్ని ప్రతిపాదించినవారు?
    1) లైనస్ పాలింగ్ 2) మిల్లికన్ 3) లెవోయిజర్ 4) సిడ్జివిక్
41. ఆధునిక రసాయన శాస్త్ర పితామహుడు ఎవరు?
    1) నీల్స్‌బోర్ 2) రాబర్ట్ బాయిల్ 3) ఐన్‌స్టీన్ 4) లెవోయిజర్
42. కింది వాటిలో ఛాల్కోజన్ మూలకం ఏది?
    1) నైట్రోజన్ 2) ఫ్లోరిన్ 3) సల్ఫర్ 4) ఫాస్ఫరస్
43. అత్యధిక ఎలక్ట్రాన్ ఎఫినిటీ ఉన్న మూలకం?
    1) ఫ్లోరిన్ 2) నియాన్ 3) ఆక్సిజన్ 4) క్లోరిన్
44. కింది వాటిలో నోబుల్ గ్యాస్ కానిదేది?
    1) జింక్ 2) నియాన్ 3) హీలియం 4) గ్జినాల్
45. మూలకాల రసాయన ధర్మాల్లో ఆవర్తన క్రమాన్ని సంగీత స్వరాల్లో ఉన్న ఆవర్తనంతో పోల్చిన శాస్త్రవేత్త?
    1) డాబర్‌నీర్ 2) మోస్లే 3) న్యూలాండ్స్ 4) మెండలీఫ్

సమాధానాలు

1-2; 2-3; 3-3; 4-3; 5-1; 6-4; 7-1; 8-3; 9-4; 10-1; 11-4; 12-3; 13-4; 14-2; 15-1; 16-4; 17-2; 18-2; 19-4; 20-3; 21-1; 22-3; 23-4; 24-1; 25-1; 26-3; 27-2; 28-1; 29-3; 30-4; 31-2; 32-3; 33-1; 34-4; 35-4; 36-3; 37-2; 38-1; 39-4; 40-1; 41-4; 42-3; 43-4; 44-1; 45-3.

భారత్‌తో యుద్ధమంటే పాక్ వెనుకంజే

• 1993 నాటి సీఐఏ పత్రంలో వెల్లడి

ఇంటర్నెట్ డెస్క్: పహల్గాం ఉగ్ర దాడి తర్వాత భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో 1993లో అమెరికా నిఘా సంస్థ సీఐఏ ప్రచురించిన రహస్య పత్రాలు మరోసారి తెరపైకి వచ్చాయి. పాకిస్థాన్‌కు భారత్ అంటే లోలోపల ఉన్న భయాల గురించి ఇందులో సీఐఏ ప్రస్తావించింది. ఒకవేళ రెండు దేశాల మధ్య యుద్ధం మొదలైతే.. దానికి కశ్మీర్ కారణంగా ఉంటుందని, పాకిస్థాన్ ఆ సమయంలో కచ్చితంగా వెనుకంజ వేస్తుందని తెలిపింది. సీఐఏ అంచనా ప్రకారం.. ఇరు దేశాల మధ్య పూర్తి స్థాయి యుద్ధం జరగడానికి 20 శాతం అవకాశం ఉంది. దీనికి తప్పుడు అంచనాలు, కవ్వింపు చర్యలు, ప్రతి చర్య, పెద్ద ఉగ్ర దాడి, సైనిక విన్యాసాలపై అపోహలు, హఠాత్తుగా చెలరేగే మత విద్వేషాలు వంటివి కారణం కావచ్చు.

డ్రోన్లతో నిఘా!

• పహల్గాం దాడితో హఫీజ్ సయీద్‌కు నాలుగింతల భద్రత



పహల్గాం దాడి తర్వాత నుంచి లష్కరే చీఫ్, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది హఫీజ్ సయీద్‌కు పాక్ ప్రభుత్వం భద్రత పెంచినట్లు తెలిసింది. గతంతో పోలిస్తే అతడి భద్రతను నాలుగింతలు చేసినట్లు సమాచారం. లాహోర్‌లోని అత్యంత రద్దీగా ఉండే నివాస సముదాయాల నడుమ హఫీజ్ సయీద్ నివసిస్తున్నాడు. అతడి ఇంటి చుట్టూ పాక్ సైన్యం, ఐఎస్ఐ, లష్కరే ముఠా నిరంతరం పహారా కాస్తున్నట్లు తాజా సమాచారం. దీంతోపాటు కాంపౌండ్ చుట్టూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా డ్రోన్లతో నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. హఫీజ్ ఇంటికి నలువైపులా 4 కిలోమీటర్ల పరిధిలో అత్యాధునిక సీసీటీవీ కెమెరాలను అమర్చారని సమాచారం.



పహల్గాంలో కొన్ని రోజుల ముందు నుంచే పాగా.. నాలుగు చోట్ల రెక్కీలు

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు కొన్ని రోజుల ముందు నుంచే పాగా వేసి.. పక్కా ప్రణాళికతో దాడి చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఏప్రిల్ 22 ఘటన అనంతరం దర్యాప్తు బృందాలు ఉగ్రవాదులకు క్షేత్ర స్థాయిలో సహకరించిన ఓవర్ గ్రౌండ్ వర్కర్స్‌ను పెద్ద సంఖ్యలో అరెస్టు చేశాయి. వీరిలో ఒకరు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. దర్యాప్తు బృందంలో భాగమైన సీనియర్ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఉగ్రవాదులు ఏప్రిల్ 15వ తేదీనే పహల్గాంకు చేరుకున్నారు. నాలుగుచోట్ల రెక్కీలు నిర్వహించారు. వీటిలో బైసరన్ వ్యాలీ, అరు వ్యాలీ, స్థానిక అమ్యూజ్‌మెంట్ పార్క్, బేతాబ్ వ్యాలీ ఉన్నాయి. వీటిలో చాలాచోట్ల భద్రతా ఏర్పాట్లు ఉండటంతో వారు దాడులు చేయడానికి వెనుకంజ వేశారు. ఉగ్రవాదులకు క్షేత్ర స్థాయిలో దాదాపు 20 మంది సహకరించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గుర్తించింది. వీరిలో చాలామందిని ఇప్పటికే అరెస్టు చేసింది. మిగిలిన వారు నిఘా నీడలో ఉన్నారు.

పహల్గాం చేరుకున్న ఎన్ఐఏ చీఫ్

ఉగ్ర దాడి దర్యాప్తును పర్యవేక్షించడానికి ఎన్ఐఏ చీఫ్ సదానంద దాటే పహల్గాం చేరుకున్నారు. ఆయనతోపాటు పలువురు ఐజీలు, డీఐజీలున్నారు. బైసరన్ లోయకు వెళ్లి అక్కడి పరిస్థితులను ఆయన స్వయంగా చూడనున్నారు.

ఉగ్రవాదులు ఇంకా దక్షిణ కశ్మీర్‌లోనే..

పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఇంకా దక్షిణ కశ్మీర్‌లోనే ఉన్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ వర్గాలు చెబుతున్నాయి. ఆ ప్రదేశంలో వారితోపాటు మరికొందరు ఉగ్రవాదులు ఉండొచ్చని పేర్కొన్నాయి. ఒకవేళ భద్రతా దళాలు వారిపై దాడి చేస్తే.. మిగిలిన ఉగ్రవాదులు వారికి రక్షణగా వచ్చే అవకాశం ఉన్నట్లు వెల్లడించాయి. ఇక పహల్గాం దాడిలో పాల్గొన్నవారు.. ఆహారం, ఔషధాల వంటి వాటిని తమ వెంటే పెద్ద మొత్తంలో తీసుకెళ్లడంతో ఎక్కువ కాలం అడవిలో ఉండగలుగుతున్నారని తెలిపాయి.

93వేల మంది పాక్ సైనికుల లొంగుబాటు గుర్తులేదా?

• అఫ్రీదీకి గట్టిగా బదులిచ్చిన బాక్సర్


జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ పరిణామాల వేళ భారత సైన్యాన్ని ఉద్దేశిస్తూ.. పాక్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రీదీ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీనికి భారత్ బాక్సింగ్ ఛాంపియన్ గౌరవ్ బిధూరి గట్టిగా బదులిచ్చారు. 'పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడితో దేశం మొత్తం దిగ్భ్రాంతికి గురైంది. ఈ ఘటనతో భారత ప్రభుత్వం తీసుకున్న చర్యలు పాకిస్థానీలను పిచ్చివాళ్లను చేశాయి. 8 లక్షల మంది భారత సైనికులు దాడిని ఆపడానికి ఏమీ చేయలేకపోయారని అఫ్రీదీ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. 1971లో 93వేల మంది పాకిస్థానీ సైనికులు మా సైన్యం ముందు లొంగిపోయారు. మా సామర్థ్యం గురించి మాకు పాఠాలు చెప్పొద్దు. ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ మద్దతిస్తుందని ప్రపంచం మొత్తానికి తెలుసు. నిషేధిత లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ఈ దాడికి బాధ్యత ప్రకటించుకుంది' అని ఘాటుగా విమర్శించారు.

'ఇక మీరు క్రీడా దౌత్యం గురించి మాట్లాడుతున్నారు. ఇటీవల నీరజ్ చోప్రా స్వయంగా మీ ఒలింపిక్ ఛాంపియన్ నదీమ్‌ను ఆహ్వానించిన విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నా. క్రీడా స్ఫూర్తి గురించి మీరు మాకు చెప్పకండి. మీకు పీఎస్ఎల్ ఉంది. మాకు ఐపీఎల్ ఉంది. కానీ ప్రపంచ క్రీడాకారులు ఎక్కడ ఆడుతున్నారో చూడండి. మీరు భారత్‌కు వచ్చినప్పుడు బెదిరింపులు వచ్చాయని చెప్పారు. కానీ ప్రపంచ క్రీడాకారులు వస్తున్నది మా దేశానికి.. మీ దగ్గరికి కాదని గ్రహించండి. పాక్ అంటే ఏంటో ప్రపంచానికి తెలుసు' అని బిధూరి చురకలు అంటించారు.

యుద్ధం జరగొచ్చు

• ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యలు

దిల్లీ: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్- పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగే అవకాశం లేకపోలేదని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. ఉగ్రవాదుల చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు.



పాకిస్థాన్ ఈ ప్రాంతాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. 'రేపటి రోజు ఎలా ఉండబోతోందో ఎవరికీ తెలియదు. ఇరు దేశాలు యుద్ధానికి సిద్ధమవుతున్నాయి. అలా జరగకుండా ఉండాలంటే పహల్గాం ఉగ్ర దాడి జరగడానికి కారణమైన ఉగ్రవాదులు, దాని వెనక ఉన్న వారిని వీలైనంత తొందరగా పట్టుకోవాలి. యుద్ధాన్ని నివారించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. భద్రత, నిఘా లోపాలు ఉగ్ర దాడి జరిగేందుకు కారణమని అనడంలో సందేహం లేదు' అని ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు.

త్వరలో అయోధ్య రామాలయ శిఖరంపై స్వర్ణ కలశం


• రామదర్బార్‌లో బంగారు తలుపులు కూడా..
• జూన్ నాటికి సంపూర్ణ కోవెల నిర్మాణం

అయోధ్య: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయ శిఖరంపై బంగారు తాపడంతో చేసిన కలశాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నారు. దానిపై ఎటువంటి మలినాలు అంటుకుండా రసాయనాలు, ఆమ్లాలతో పూర్తిస్థాయిలో శుభ్రం చేస్తారు. ఈ మేరకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యుడు డాక్టర్ అనిల్ మిశ్ర తెలిపారు.

శరవేగంగా రామాలయ నిర్మాణ పనులు


మరోవైపు, రామ దర్బార్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. రామ దర్బార్‌లో బంగారు తలుపులను త్వరలో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రామాలయం దిగువలో ఏడు మండపాల నిర్మాణం త్వరలోనే పూర్తికానున్నట్లు వెల్లడించారు. రామ్ దర్బార్‌లోని విగ్రహాలు ఈ నెలలో వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది జూన్ నాటికి అయోధ్య రామాలయం సంపూర్ణ నిర్మాణ పనులు పూర్తవుతాయని ఆలయ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్ర తెలిపారు.

అక్రమ కట్టడాలపై కఠినంగా వ్యవహరించాలి



• న్యాయస్థానాలకు సుప్రీంకోర్టు సూచన

దిల్లీ: అక్రమ నిర్మాణాల పట్ల కఠినంగా వ్యవహరించాలని, అలాంటి నిర్మాణాల క్రమబద్ధీకరణకు వెసులుబాటు కల్పించరాదని దేశంలోని న్యాయస్థానాలకు సుప్రీంకోర్టు సూచించింది. ఈ మేరకు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం గురువారం తెలిపింది. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని కాపాడేందుకు న్యాయస్థానాలు ఉపయోగించుకునే తత్వం తమనెవరూ శిక్షించలేరన్న భావనతో కూడుకున్న సంస్కృతికి దారితీస్తుందని హెచ్చరించింది. 'అందుకే న్యాయస్థానాలు అక్రమ కట్టడాల విషయంలో కఠినంగా వ్యవహరించాలి. అధికారిక అనుమతిలేకుండా నిర్మించిన కట్టడాల చట్టవిరుద్ధమైన క్రమబద్ధీకరణను ప్రోత్సహించకూడదు' అని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. చట్ట పాలనను పరిరక్షించాల్సిన బాధ్యత న్యాయస్థానాలది, ఆ బాధ్యత ఉల్లంఘించడానికి వీల్లేదని, ప్రజల మేలు కోసం చట్టాన్ని ఉపయోగించినప్పుడు దాని శక్తి ఇనుమడిస్తుందని పేర్కొంది. అక్రమ కట్టడాలకు సంబంధించి కోల్‌కతా హైకోర్టు వెలువరించిన ఆదేశాలను సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. అక్రమ కట్టడాల కూల్చివేతకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు కోల్‌కతా పురపాలక సంస్థను ఆదేశించడాన్ని సమర్థించింది. తన కక్షిదారు భవన క్రమబద్ధీకరణకు అభ్యర్థించడానికి అవకాశం కల్పించాలంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది చేసిన వాదనను తిరస్కరించింది.



దేశంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే చార్‌ధామ్ యాత్రలో భాగంగా శుక్రవారం ఉదయం కేదార్‌నాథ్ ఆలయాన్ని తెరవనున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన 108 క్వింటాళ్ల 54 రకాల పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

సుంకాలపై డెమోక్రాట్ల తీర్మానాన్ని ఓడించిన రిపబ్లికన్లు

వాషింగ్టన్: ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలను అడ్డుకునేందుకు సెనెట్‌లో డెమోక్రాట్లు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని స్వల్ప తేడాతో రిపబ్లికన్లు ఓడించారు. బుధవారం జరిగిన ఓటింగ్‌లో అనుకూలంగా, వ్యతిరేకంగా 49 చొప్పున ఓట్లు వచ్చాయి. సమానంగా వచ్చినా అది ఓడిపోయినట్లే భావిస్తారు. సుంకాల పిచ్చితనాన్ని సెనెట్ చూస్తూ ఊరుకోదని తీర్మానానికి నాయకత్వం వహించిన ఓరెగాన్ సెనేటర్ రాన్ వైడెన్ పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదం నుంచి కాపాడేందుకు బిడ్డను మూడో అంతస్తు నుంచి విసిరేసిన తల్లి

• అజ్మేర్‌లో ఘటన.. ప్రమాదంలో నలుగురి మృతి

జైపుర్: రాజస్థాన్‌లోని ప్రసిద్ధ దర్శనీయ ప్రదేశాల్లో ఒకటైన అజ్మేర్ పట్టణంలో ఒక హోటల్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో నాలుగేళ్ల బిడ్డతో సహా నలుగురు మరణించారు. ఏడుగురు గాయపడ్డారు. ప్రమాదానికి గురైన నాజ్ హోటల్ అతి ఇరుకైన వీధులు కలిగిన డిగ్గి బజార్‌లో ఉంది. హోటల్‌లో ఉన్న ఏసీ పేలడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని ప్రత్యక్ష సాక్షి ఒకరు మీడియాకు తెలిపారు. అగ్ని ప్రమాద బాధితుల్ని కాపాడేందుకు జరిగిన ప్రయత్నాలు పలు హృదయ విదారక దృశ్యాలను ఆవిష్కరించాయి. ఒక తల్లి తన బిడ్డను మూడో అంతస్తు నుంచి కిందకు విసిరేయగా కింద ఉన్నవారు ఆ బిడ్డను కాపాడారు. అనంతరం ఆ తల్లి కూడా కిందికి దూకేందుకు ప్రయత్నించినా మధ్యలోనే చిక్కుకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్వల్ప గాయాలతో బిడ్డ సురక్షితంగా బయటపడినా తల్లికి ఏమైందీ వెంటనే తెలియరాలేదు.

2 గంటల్లోనే కోటీశ్వరుడయ్యాడు

• పంజాబ్‌లో కూరగాయల వ్యాపారిని వరించిన రూ.6 కోట్ల జాక్‌పాట్

హోశియార్‌పుర్: పంజాబ్‌కు చెందిన ఓ కూరగాయల వ్యాపారి లాటరీ టికెట్ కొన్న రెండు గంటల్లోనే కోటీశ్వరుడైపోయాడు. బైశాఖి బంపర్ లాటరీలో ఏకంగా రూ.6 కోట్లు గెలుచుకున్నాడు. హోశియార్‌పుర్ జిల్లాలోని కక్కోన్ గ్రామానికి చెందిన తర్సేమ్ లాల్(68) కూరగాయల వ్యాపారి. బైశాఖి బంపర్ లాటరీ అతడి జీవితాన్నే మార్చేసింది. అతను కొన్న లాటరీ టికెట్‌కు రూ.6 కోట్ల జాక్‌పాట్ తగిలింది. ఈ క్రమంలో తర్సేమ్ లాల్ సహా అతని కుటుంబం ఆనందంతో ఉబ్బితబ్బిబవుతోంది. తనకు వచ్చే లాటరీ సొమ్ముతో సొంతిల్లు కొనుగోలు చేస్తానని తర్సేమ్ లాల్ అంటున్నాడు. అలాగే తన పిల్లలు బ్యాంకు రుణాలన్నీ తీర్చేస్తానని చెబుతున్నాడు. ఏప్రిల్ 19న లాటరీ విజేతలను ప్రకటించడానికి రెండు గంటల ముందే రూ.500తో లాటరీ టికెట్‌ను కొన్నానని తర్సేమ్ లాల్ చెప్పాడు. ఆపై 2 గంటల్లోనే విజేతలను ప్రకటించారని తెలిపాడు. తండ్రికి లాటరీ తగిలిందని తెలియగానే కెనడాలో ఉండే అతని కుమారుడు ఆగమేఘాలపై భారత్‌కు చేరుకున్నాడు.

మహిళా స్పేస్‌వాక్

కేప్ కెనావెరాల్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న మహిళా వ్యోమగాములు ఆనీ మెక్ కెయిన్, నికోల్ అయర్స్‌లు స్పేస్‌వాక్ కోసం వెలుపలికి వచ్చారు. పూర్తిగా మహిళలతో కూడిన తొలి స్పేస్‌వాక్ 2019లో జరిగింది. అందులోనే అనీ మెక్ కెయిన్ పాల్గొనాల్సింది. అయితే ఆమెకు సరిపోయే స్పేస్‌సూట్ అందుబాటులో లేకపోవడం వల్ల నాడు అవకాశాన్ని కోల్పోయారు. ఆరేళ్ల తర్వాత ఇప్పుడు ఆమె స్పేస్‌వాక్‌కు వీలు కలిగింది. ఇది కూడా పూర్తిగా మహిళలతో కూడిన బృందం కావడం విశేషం. రోదసిలో అతివలు ఈ సాహసానికి పూనుకోవడం ఇది ఐదోసారి. తాజా స్పేస్‌వాక్ సందర్భంగా వ్యోమగాములు.. ఐఎస్ఎస్‌కు కొత్త సౌరఫలకాలను అమర్చేందుకు ఏర్పాట్లు చేస్తారు. యాంటెన్నానూ పక్కకు జరుపుతారు.

ప్రపంచవ్యాప్తంగా ఘనంగా మే డే వేడుకలు

• ట్రంప్ విధానాలపై వ్యక్తమైన భయాందోళనలు

టోక్యో: ప్రపంచవ్యాప్తంగా శ్రామిక వర్గాలు గురువారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో పలువురు వక్తలు ప్రపంచ కార్మికోద్యమం సాధించిన విజయాలను ప్రస్తావించారు. అమెరికాలోని షికాగో, లాస్‌ఏంజెలెస్, న్యూయార్క్, ఫిలడెల్ఫియాలో జరిగిన ర్యాలీల్లో వేల మంది కార్మికులు పాల్గొన్నారు. అనేక దేశాల్లో ప్రపంచ ఆర్థికంపై ట్రంప్ ఎజెండా చూపుతున్న దుష్ప్రభావంపై ఆందోళన వ్యక్తమైంది. అమెరికాలో కార్మిక నేతలు ట్రంప్ విధానాలపై పోరాటం సాగిస్తామని ప్రతినపూనారు. జపాన్ రాజధాని టోక్యోలో పాల్గొన్న ప్రదర్శనకారులు వేతనాలు పెంచాలని, లింగ సమానత్వాన్ని సాధించాలని, కార్మికులకు ఆరోగ్య సంరక్షణ కల్పించాలని, సైనిక వ్యయాన్ని తగ్గించాలని, భూకంప బాధితులకు సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో వేలమంది కార్మికులు దేశాధ్యక్షుని అధికార నివాసం వైపు చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ఇండొనేసియాలో అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో జకార్తాలోని నేషనల్ మాన్యుమెంట్ పార్క్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో కార్మికులు ప్రతిపక్ష పార్టీకి చెందిన నగర మేయర్ ఎక్రెమ్ ఇమామోగ్లును ప్రభుత్వం నిర్బంధించడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు.

దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు హన్ రాజీనామా

సియోల్: దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడిగా, ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న హన్ డక్ సూ తన పదవులకు గురువారం రాజీనామా చేశారు. వచ్చే నెల జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గతేడాది డిసెంబరులో అత్యయిక పరిస్థితి ప్రకటించి అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ఉద్వాసనకు గురైన నేపథ్యంలో అధికార పీపుల్ పవర్ పార్టీ తీవ్ర సంక్షోభంలో ఉంది. ఈ పరిస్థితుల్లో జూన్ 3న జరిగే అధ్యక్ష ఎన్నికల్లో హన్ పోటీ చేయడమే సురక్షితమని ఆ పార్టీ భావిస్తోంది. హన్ స్థానంలో ఎన్నికలు ముగిసేవరకు ఉప ప్రధాని చోయ్ సంగ్ మో తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తారు.

ఆహార బ్యాంకులకు అమెరికన్ల క్యూ!



నిరుద్యోగులే కాదు.. చిరుద్యోగులూ రాక • జీవన వ్యయాల పెరుగుదలతో ఇబ్బంది • ట్రంప్ నిధుల నిలిపివేతతో సంక్షోభం

అమెరికాలో ఆహార బ్యాంకులకు అమెరికన్లు క్యూ కడుతున్నారు. దేశంలో నిరుద్యోగం అధికంగా ఉన్న సమయంలో పోటెత్తే ఈ బ్యాంకులు ఇప్పుడు చిరుద్యోగులూ వస్తుండటంతో కిక్కిరిస్తున్నాయి. మరోవైపు వీటికి అందించే సాయాన్ని అధ్యక్షుడు ట్రంప్ నిలిపేయడంతో వచ్చిన వారందరికీ ఆహారాన్ని అందించలేక సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. 1.3 మిలియన్ డాలర్ల గ్రాంట్‌ను అమెరికా ప్రభుత్వం నిలిపేసింది. అమెరికాలోని ఆహార బ్యాంకులకు కొవిడ్, అనంతరం తలెత్తిన ఆర్థిక అభద్రతతో డిమాండు పెరిగింది. ఆ తర్వాత అది కొనసాగింది. సాధారణంగా నిరుద్యోగం అధిక స్థాయిలో ఉన్నప్పుడు ఇవి కిటకిటలాడేవి. ఇప్పుడు చిన్న ఉద్యోగాలు చేసుకునే కుటుంబాలూ ఆహారం కోసం వీటి వద్దకు వస్తున్నాయి. 2022తో పోలిస్తే 2023లో 10 లక్షల కుటుంబాలు అదనంగా ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని తాజాగా విడుదలైన అమెరికా వ్యవసాయ పరిశోధన విభాగం వెల్లడించింది.

ఆదాయం పెరగకపోయినా ధరల మంట

అమెరికాలో ఆదాయం స్తంభించిపోయింది. అసలే పెరగడం లేదు. కానీ జీవన వ్యయాలు భారీగా పెరుగుతున్నాయి. దీంతో వేతనాలు అందుకునేవారూ దేశవ్యాప్తంగా ఆహార బ్యాంకులకు వెళ్తున్నారు. లక్షల మందికి పోషకాహారాన్ని అందించే సంస్థలు.. ట్రంప్ నిధుల కోతతో అల్లాడిపోతున్నాయి.

✦ నిధుల కోతతో మార్చిలో ఆహార బ్యాంకుల్లో ఆహార లభ్యత తగ్గిపోయింది.

✦ ఆహార డెలివరీలకు సంబంధించి 500 మిలియన్ డాలర్లను యూఎస్‌డీఏ నిలిపేసింది. క్షుద్బాధ తీర్చే కార్యక్రమాలకు అందించే 1 బిలియన్ డాలర్లను ఆపేసింది.

✦ మరోవైపు వలసదారులకు కోసం ఏర్పాటు చేసిన షెల్టర్లకు, వారికి ఆహారాన్ని అందించడానికి చేసే సాయంలో హోంలాండ్ భద్రతా విభాగం కోత పెట్టింది.

సంక్షోభంలో ఆహార బ్యాంకులు

దేశంలో ఆహార బ్యాంకులను నిర్వహించే అతి పెద్ద సంస్థ అయిన ఫీడింగ్ అమెరికా సంక్షోభంలో కూరుకుపోతోంది. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా 200 ఆహార బ్యాంకులున్నాయి.

✦ గ్రాంట్ల కోత కారణంగా ఈ ఏడాది 4 మిలియన్ డాలర్ల సాయాన్ని కోల్పోతున్నామని హ్యూస్టన్ ఫుడ్ బ్యాంకు సీఈవో బ్రియాన్ గ్రీన్ తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే 3 మిలియన్ డాలర్ల నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తుందని, స్థానిక ఉత్పత్తిదారులు 7 మిలియన్ డాలర్లు కోల్పోతారని వివరించారు. దీనిని విరాళాల ద్వారా సమకూర్చుకోవాలని గ్రీన్ భావిస్తున్నారు. అయితే అది అంత సులభంగా కనిపించడం లేదు.

✦ దాతృత్వ కార్యక్రమాలకు అమెరికా జీడీపీలో 2శాతం ఖర్చు చేస్తారు. దానిని నిలిపేస్తే.. ప్రైవేటుగా ఎన్ని విరాళాలొచ్చినా సరిపోదు.

ధరలను భరించలేక..

కాలిఫోర్నియాలోని అలమెడాలో ఉన్న ఆహార బ్యాంకు ఎదుట క్రిస్టియానా శాంటామారియా ప్రతి వారం క్యూలో ఉంటున్నారు. తనకు, తన భర్తకు, కుమార్తెకు ఆహారం కోసం ఆమె ఈ పని చేస్తున్నారు. పెరిగిన ధరలవల్ల ఆహార ఖర్చులను, ఇంటర్నెట్ బిల్లులను, కారు ఖర్చులను భరించలేకపోతున్నామని ఆమె చెప్పారు. తమకు నెలకు కేవలం 3,000 డాలర్లే ఆదాయం వస్తోందని వివరించారు. తన భర్త ఫుల్‌టైం ఉద్యోగం చేస్తారని, అయినా ఆదాయం రావడం లేదని తెలిపారు.

✦ 'మనం ఇప్పటికే ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నాం. ఇప్పుడు సంక్షోభంలో కూరుకుపోతున్నాం. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ ఎదురుకాలేదు' అని ద క్యాంపెయిన్ ఎగెనెస్ట్ హంగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మెలోనీ శామ్యూల్స్ పేర్కొన్నారు. గ్రాంట్లలో మరింత కోతలు విధిస్తే ఆహార బ్యాంకులను మూసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. నిధులు కోల్పోవడం వల్ల నెలకు రెండుసార్లు అందించే ఆహార కిట్లను నెలకోసారే ఇవ్వాల్సి వస్తోందని ఆమె తెలిపారు. ఫలితంగా పిల్లలను ఎత్తుకున్న తల్లులు, కార్ట్‌లను లాగేవారు, వృద్ధులు ఆహార బ్యాంకుల ముందు పడిగాపులు కాయాల్సి వస్తోందని వెల్లడించారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం



ఐఎన్ఎస్ ఉత్కర్ష్ వద్ద నిలుచున్న ఈమె లెఫ్టినెంట్ కమాండర్ దివ్యా శర్మ. డోర్నియర్ పైలట్ అయిన దివ్య భారత నౌకాదళంలో తొలి క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా చరిత్ర సృష్టించారు

నీట్(యూజీ)పై అసత్య ప్రచారం

• 122 టెలిగ్రామ్, ఇన్‌స్టా ఛానళ్లపై చర్యలు

దిల్లీ: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్(యూజీ-2025) పరీక్షపై అసత్య ప్రచారం చేస్తున్న 122 టెలిగ్రామ్, ఇన్‌స్టా ఛానళ్లను గుర్తించి, కేసులు నమోదు చేసినట్లు జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) వర్గాలు గురువారం వెల్లడించాయి. "ఈ నెల 4న జరగనున్న పరీక్షపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తిచేసే వారిపై ఫిర్యాదు చేయడానికి ఎన్‌టీఏ ఇటీవల కొత్తగా పోర్టల్‌ను విడుదల చేసింది. దీనికి విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి 1,500 ఫిర్యాదులందాయి. ఇవన్నీ 106 టెలిగ్రామ్, 16 ఇన్‌స్టా ఛానళ్లపై ఉన్నట్లు గుర్తించారు. దాంతో ఆయా ఛానళ్లపై తదుపరి చర్యలకు కేంద్ర హోంశాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ)కి కేసులను బదిలీ చేసింది. అసత్య ప్రచారాన్ని, విద్యార్థుల్లో అనవసర భయాందోళనలను నివారించేందుకు ఈ ఛానళ్లను తొలగించడంతోపాటు వాటి అడ్మిన్లు, క్రియేటర్ల పేర్లను ఇవ్వాలని టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ సంస్థలను ఎన్‌టీఏ కోరింది" అని ఎన్‌టీఏ వర్గాలు వెల్లడించాయి.

బంగారం ఆమె ఆస్తి.. విడాకుల తర్వాత తిరిగివ్వాల్సిందే

• కేరళ హైకోర్టు తీర్పు


ఇంటర్నెట్ డెస్క్: వివాహ సమయంలో వధువుకు బహుమతిగా ఇచ్చే బంగారం, నగదును ఆమెకు చెందిన ప్రత్యేక ఆస్తిగానే పరిగణించాలని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది. విడాకుల తర్వాత వాటిని ఆమెకు తిరిగివ్వాల్సిందేనని తీర్పు చెప్పింది. ఎర్నాకుళంలోని కలమస్సేరికి చెందిన ఒక మహిళకు 2010లో వివాహమైంది. ఆ సమయంలో తన కుటుంబం, బంధువుల నుంచి 71 సవర్ల (ఒక సవర అంటే 8 గ్రాములు) బంగారం అందిందని ఆమె తెలిపారు. మంగళసూత్రం, ఒక గాజు, చేతికి ఉన్న రెండు ఉంగరాలు మినహా మిగిలిన బంగారాన్నంతా భద్రపరుస్తామన్న నెపంతో అత్తింటివారే తమవద్ద దాచి పెట్టుకున్నారని చెప్పారు. అయితే అదనపు కట్నం కింద తన భర్త అడిగిన రూ.5 లక్షలు ఇవ్వకపోవడంతో తమ బంధం బీటలు వారిందని తెలిపారు. విడాకుల అనంతరం అత్తింటివారు బంగారం ఇవ్వకపోవడంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. తన తల్లిదండ్రుల ఫిక్స్‌డ్ డిపాజిట్లతో ఆ బంగారాన్ని కొనుగోలు చేసిన విషయాన్ని ఆమె కోర్టులో నిరూపించుకోగలిగారు. వాదోపవాదాలు విన్న కేరళ హైకోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పును వెలువరించింది. విడాకుల ప్రక్రియలో భాగంగా మిగిలినదిపోను 59.5 సవర్ల బంగారంగానీ, దాని ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నగదుగానీ చెల్లించాలని ఆమె భర్త కుటుంబాన్ని ఆదేశించింది.

దిల్లీ, పంజాబ్ నీటి యుద్ధం

దిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకత్వంలోని పంజాబ్ ప్రభుత్వం దిల్లీ, హరియాణాలకు తాగునీటి సరఫరాను నిలిపివేసి మురికి రాజకీయాలకు పాల్పడుతోందని దిల్లీలోని భాజపా సర్కారు గురువారం ఆరోపించింది. భాజపా అబద్ధాలు చెబుతోందని దిల్లీ ఆప్ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. పంజాబ్‌లో గంగా-యమునలు ప్రవహించడం లేదనీ, పాకిస్థాన్‌కు నిలిపేసిన సింధు జలాల్లో ఒక్క శాతాన్ని మళ్లించినా దిల్లీ దాహార్తి తీరుతుందన్నారు. తమకు భాక్రానంగల్ నీటిని విడుదల చేయడానికి పంజాబ్ ప్రభుత్వం నిరాకరిస్తోందనీ, వెంటనే ఈ తప్పును సరిదిద్దాలని కోరుతూ హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ఏప్రిల్ 26న పంజాబ్ ముఖ్యమంత్రి బల్వంత్ సింగ్ మాన్‌కు లేఖరాశారు. దిల్లీలో తాము అధికారంలో ఉన్నప్పుడు హరియాణా తమకు యమునా నీటిని బంద్ చేసేదని ఆప్ విమర్శ. హరియాణా తన వాటా జలాలను మార్చిలోనే వాడేసుకుందని, ఇంతకుమించి ఇవ్వడం సాధ్యం కాదని మాన్ చెబుతున్నారు. గురువారంవరకు కూడా దిల్లీలో తాగునీటి సరఫరా యథాతథంగానే సాగుతోందని జల్‌బోర్డు అధికారులు తెలిపారు.

పర్వతాలు..'యానా' క్రాంతం!

• 8 ఏళ్లకే 30కిపైగా ట్రెక్కింగ్‌లు
• అబ్బురపరుస్తున్న గుజరాత్ చిన్నారి



భావ్‌నగర్: పిట్ట కొంచెం..కూత ఘనం అన్నట్లు గుజరాత్‌కు చెందిన ఓ చిన్నారి పర్వతారోహణలో ఔరా అనిపిస్తోంది. భావ్‌నగర్‌లోని ఘోఘా సర్కిల్ అంబావాడి ఏరియాలో నివసించే గోపాల్‌భాయ్ లంగాలియా, స్మితాబెన్ కుమార్తె యానా (8). గోపాల్ భాయ్‌కు పర్వతారోహణ ఇష్టమైన వ్యాపకం. ఆయన ట్రెక్కింగ్‌కు వెళ్లినప్పుడల్లా యానా కూడా వెంట వెళ్లేది. అలా ఆమెకు ట్రెక్కింగ్ అలవాటైంది. గోపాల్ భాయ్ కుమార్తెకు పర్వతారోహణలో మెళకువలను నేర్పుతూ వచ్చారు. ఈ క్రమంలో చిన్నవయసులోనే యానా 30కిపైగా ట్రెక్కింగ్‌లను చేసి భళా అనిపించుకుంటోంది. త్వరలో హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో భృగు సరస్సు వద్ద గల 14,100 అడుగుల ఎత్తైన పర్వతశ్రేణిపై యానా ట్రెక్కింగ్ చేయనుందని గోపాల్ భాయ్ వెల్లడించారు. చిత్రలేఖనంపైనా ఆసక్తి గల యానా పలు పోటీల్లో పాల్గొని వివిధ సంస్థల నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంది.

యానా చేసిన ప్రధాన పర్వతారోహణలు

✦ 18 కిలోమీటర్ల మేర విస్తరించిన గుజరాత్‌లోని నర్మదా పర్వతాలపై ట్రెక్కింగ్ ✦ ఉత్తర్‌ప్రదేశ్‌లో 21 కిలోమీటర్ల పరిధిలోని గిరిరాజ్ పరిక్రమ (గోవర్ధన్ హిల్స్) పర్వతాలపై.. ✦ రాజస్థాన్‌లోని కోటా ప్రాంతంలో ఉన్న 7 కిలోమీటర్ల పర్వతాలపై.. ✦ మహారాష్ట్రలోని తోరన్మల్, రాజస్థాన్‌లోని మౌంట్ అబూలపైనా..